బుధవారం 24-7-2019


'ఆర్థిక అసమానతలు తొలగకపోతే రాజకీయ స్వాతంత్య్రానికి అర్థం లేదు'

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM
పేజీలు: 14+16 వెల: ₹ 5.00
సంపుటి: 12
సంచిక: 123



**38,000 దిగువకు సెన్సెక్స్**
48 పాయింట్ల నష్టంతో 37,983కు సెన్సెక్స్ - బిజినెస్‌లో



**'టాప్'లోనే కోహ్లి**
ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లో నంబర్‌వన్ స్థానంలో భారత కెప్టెన్ - స్పోర్ట్స్‌లో

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

# ఆ క్లాజు వద్దు

## మున్సిపల్ బిల్లుకు గవర్నర్ నరసింహన్ 'సవరణ'!



- ఎన్నికల షెడ్యూల్ ఖరారు అధికారం
- ప్రభుత్వం ఉంచుకోవడంపై అభ్యంతరం
- ఆ క్లాజు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని వెల్లడి
- షెడ్యూల్ ఖరారు ఈసీకే ఇస్తూ బిల్లు సవరించాలని సూచన
- సవరణతో ఆర్డినెన్స్ తీసుకొచ్చిన సర్కారు?
- అధికారికంగా స్పందించని రాష్ట్ర ప్రభుత్వం, రాజ్‌భవన్

**సాక్షి, హైదరాబాద్:** నూతన పురపాలికల బిల్లుపై గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ అభ్యంతరం వ్యక్తం చేశారు. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఉన్న ఓ క్లాజును బిల్లు నుంచి తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచనలు చేశారు. పురపాలక ఎన్నికల షెడ్యూల్ ఖరారు చేసే అధికారాన్ని రాష్ట్ర ఎన్నికల సంఘానికి కట్టబెట్టకుండా రాష్ట్ర ప్రభుత్వం తన దగ్గరే ఉంచుకోవడం సరికాదని పేర్కొన్నారు. పురపాలక ఎన్నికల షెడ్యూల్ ఖరారు చేయడం రాష్ట్ర ఎన్నికల సంఘం పరిధిలోని అంశమని, ఈ అధికారాన్ని రాష్ట్ర ప్రభుత్వం తన దగ్గరే ఉంచుకుంటే ఎన్నికల సంఘం స్వయం ప్రతిపత్తి ప్రశ్నార్థకంగా మారుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ నిబంధన రాజ్యాంగంలోని ఆర్టికల్ 243కి విరుద్ధమని తేల్చిచెప్పినట్లు తెలిసింది. ఈ బిల్లుకు గవర్నర్ ఓ సవరణ సూచించారని రాష్ట్ర ప్రభుత్వ వర్గాలు కూడా ధ్రువీకరించాయి.

**గోప్యతతో గందరగోళం**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన కొత్త పురపాలికల బిల్లును ఈనెల 19న రాష్ట్ర శాసనసభ, శాసనమండలిలో ఆమోదించిన తర్వాత గవర్నర్ ఆమోదం కోసం రాజ్‌భవన్‌కు పంపించింది. అయితే, మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ ఖరారు చేసే అధికారాలను తిరిగి రాష్ట్ర ఎన్నికల సంఘానికి

మిగతా 2వ పేజీలో ▶



సభలో కుమారస్వామి నిర్వేదం



విశ్వాస పరీక్ష అనంతరం యడ్యూరప్ప తదితరుల విజయ సంకేతం

# కుమార 'మంగళం'

## విశ్వాస పరీక్షలో ఓడిన సంకీర్ణ ప్రభుత్వం

- కుమారస్వామి రాజీనామాకు గవర్నర్ ఆమోదం
- బీజేపీలో ఆనందోత్సాహాలు; యెడ్డీకి సీఎం పగ్గాలు!

కర్ణాటక రాజకీయ చదరంగంలో సంకీర్ణ ప్రభుత్వం చతికిలపడింది. అంకెల సోపానాన్ని అధిరోహించలేక కుమారస్వామి సర్కారు కుప్పకూలింది. నాటకీయ పరిస్థితుల మధ్య మంగళవారం అసెంబ్లీలో జరిగిన విశ్వాస పరీక్షలో ఓడిపోయింది. కుమారస్వామి ప్రవేశపెట్టిన విశ్వాస తీర్మానానికి అనుకూలంగా 99 మంది సభ్యులు ఓటేయగా వ్యతిరేకంగా 105 మంది ఓటేశారు. దీంతో స్పీకర్ రమేశ్ కుమార్ విశ్వాస తీర్మానం వీగిపోయిందని ప్రకటించారు. ఈ నేపథ్యంలో కుమారస్వామి సీఎం పదవికి రాజీనామా చేశారు.

5లో

| | | |
|---|---|---|
| 225 (నామినేటెడ్ ఎమ్మెల్యేతో కలిపి) మొత్తం సీట్లు | 204 సభలో ఎమ్మెల్యేలు (స్పీకర్ మినహా) | 103 మ్యాజిక్ ఫిగర్ |
| 105 విశ్వాస తీర్మానానికి వ్యతిరేకంగా | 99 విశ్వాస తీర్మానానికి అనుకూలంగా | 20 సభకు గైర్హాజరైన సభ్యుల సంఖ్య |

## బొల్లినేని గాంధీపై ఈడీ కేసు



- ఆయన మనీ ల్యాండరింగ్‌కు పాల్పడ్డారని ఈసీఐఆర్ నమోదు
- సీబీఐ కేసు ఆధారంగా ముందుకెళ్లిన ఈడీ అధికారులు
- ఆస్తుల అటాచ్‌కు సన్నాహాలు
- సమన్లు జారీ చేయాలని నిర్ణయం!

- వివరాలు 2లో

## మోటారు వాహనాల బిల్లుకు లోక్‌సభ ఓకే

- రాష్ట్రాలు దీన్ని అమలు చేయడం తప్పనిసరేం కాదు
- కేంద్ర మంత్రి గడ్కరీ వెల్లడి



- వివరాలు 5లో

సాక్షి సెలబ్రేషన్ ఆఫర్
చదవండి ... గెలవండి

8
కూపన్



## జీడీపీ వృద్ధి రేటు 'కట్'కట!

- భారత్ ఆర్థిక వ్యవస్థపై ఐఎంఎఫ్ విశ్లేషణ
- 2019, 2020 వృద్ధి రేట్ల అంచనాలు 0.3 శాతం కోత
- ఈ రెండేళ్లలో వృద్ధి 7, 7.2 శాతాలు మాత్రమే
- అంతర్జాతీయంగానూ వృద్ధి అంతంతే - బిజినెస్‌లో

## పార్లమెంట్‌లో 'ట్రంప్' దుమారం



- కశ్మీర్ విషయంలో ట్రంప్ ప్రకటనపై పార్లమెంటులో విపక్షాల నిరసన
- ప్రధాని వచ్చి రెండు సభల్లోనూ సమాధానం చెప్పాలని డిమాండ్
- మధ్యవర్తిత్వాన్ని మోదీ కోరి ఉంటే ఆయన వెన్నుపోటు పొడిచినట్లే: రాహుల్
- ట్రంప్ చెప్పింది అబద్ధం: విదేశాంగ మంత్రి జైశంకర్
- మోదీ సమాధానం కోసం విపక్షాల పట్టు

5లో

## కొత్త సచివాలయం కోసం 8 నమూనాలు

### డిజైన్లను పరిశీలిస్తున్న టెక్నికల్ కమిటీ

- ఉత్తమమైనవి గుర్తించి మంత్రివర్గ ఉపసంఘానికి నివేదన
- మంత్రులు సూచించే మార్పుల అనంతరం సీఎంకు అందజేత
- తుది అంచనాను ముఖ్యమంత్రి ఆమోదించాక టెండర్ల ప్రక్రియ



- వివరాలు 2లో




# కాంగ్రెస్ ఒంటరి పోరు

## మున్సిపల్ ఎన్నికల్లో పొత్తులు పెట్టుకోరాదని కాంగ్రెస్ నిర్ణయం

- అవసరమైతే స్థానికంగా ఇతర పార్టీలతో సర్దుబాట్లు
- పరిషత్, ఎంపీ ఎన్నికల వ్యూహంతోనే ముందుకు...
- లెఫ్ట్, టీజేఎస్, టీడీపీతో కూడిన కూటమికి దూరమైనట్టే!
- మున్సిపల్ పీఠాల పంపకాల్లోనూ ఇదే సూత్రం



సాక్షి, హైదరాబాద్:

మున్సిపల్ ఎన్నికల్లో ఒంటరిపోరు చేయాలనే నిర్ణయానికి కాంగ్రెస్ పార్టీ వచ్చింది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో వికటించిన మహాకూటమికి స్వస్తిచెప్పి పరిషత్, లోక్‌సభ ఎన్నికల తరహాలో పొత్తుల్లేకుండానే మున్సి'పోల్స్'కు ఆ పార్టీ సిద్ధమవుతోంది. రాష్ట్రవ్యాప్తంగా ఏ పార్టీతోనూ పొత్తులు ఉండబోవని, కానీ అవసరమైన చోట్ల స్థానికంగా ఇతర పార్టీలతో సర్దుబాట్లు చేసుకుంటామని టీపీసీసీ వర్గాలు చెబుతున్నాయి. ఎన్నికలు ముగిశాక మున్సిపల్ పీఠాలు దక్కించుకునే విషయంలోనూ వీలైనంత వరకు స్వతంత్రంగానే వెళ్తామని, తప్పదనుకుంటేనే ఇతర పార్టీల సభ్యుల మద్దతు తీసుకుంటామని పేర్కొంటున్నాయి.

**ఆ పార్టీలతో దూరంగానే ఉందాం...**

మున్సిపల్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై కాంగ్రెస్ గత నెల నుంచే కసరత్తు ప్రారంభించింది. మున్సిపల్, జిల్లా స్థాయిల్లో పార్టీ నేతలతో సన్నాహక సమావేశాలు నిర్వహించి పొత్తులపై స్థానిక నాయకత్వం నుంచి అభిప్రాయాలను సేకరించింది. మరోవైపు వామపక్షాలు, టీజేఎస్, టీడీపీలతో అధికారికంగా పొత్తులు పెట్టుకోవడం వల్ల అదనపు ఉపయోగం లేదని, దూరంగా ఉండటమే మంచిదనే నిర్ణయానికి రాష్ట్ర నాయకత్వం వచ్చింది. ఈ మేరకు క్షేత్రస్థాయి నాయకత్వానికి కూడా ఇప్పటికే సమాచారం ఇచ్చి వార్డులవారీగా కసరత్తు చేయాలని నిర్దేశించింది.

**అభ్యర్థుల ఖరారు ప్రారంభం...**

మున్సిపాలిటీలు, కార్పొరేషన్లవారీగా అభ్యర్థులను ఖరారు చేసే ప్రక్రియను కూడా కాంగ్రెస్ ప్రారంభించింది. ఈ నెల 20న సంగారెడ్డిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సమావేశంలో అభ్యర్థుల ఎంపిక మార్గదర్శకాలను డీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్‌చార్జిలకు అప్పగించింది. ఇందుకు అనుగుణంగా స్థానిక నాయకత్వం మున్సిపాలిటీలు, వార్డులవారీగా అభ్యర్థులను ఖరారు చేసే పనిలో నిమగ్నమైంది. పోటీకి ఉత్సాహం చూపే నేతల నుంచి ఇప్పటికే అందిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను ప్రారంభించింది. ప్రతి వార్డుకు ఇద్దరు ఆశావహుల పేర్లను తుది దశ వరకు తీసుకురావాలని, అందులో ఒకరికి పోటీ చేసే అవకాశం కల్పించాలన్న టీపీసీసీ చీఫ్ ఆదేశాల మేరకు అభ్యర్థుల ఎంపిక జరుగుతోందని టీపీసీసీ వర్గాలు చెబుతున్నాయి.

Vencobb CHICKEN
NECC NATIONAL EGG CO-ORDINATION COMMITTEE
సూచించిన నేటి గుడ్లు & చికెన్ హైదరాబాద్ జోన్ ధరలు
గుడ్డ రిటైల్ ధర ₹ 42 డజన్
ఫారం దగ్గర లైవ్ బర్డ్ 76 కిలో
రిటైల్ లైవ్ బర్డ్ 98 కిలో
డ్రెస్డ్ స్కిన్‌తో 142 కిలో
స్కిన్‌లెస్ 162 కిలో
Conditions Apply

ఇదండీ సంగతి



## బ్రిటన్ కొత్త ప్రధానిగా బోరిస్ జాన్సన్

- పార్టీ నాయకత్వ ఎన్నికలో విజయం
- నేడు దిగిపోనున్న థెరెసా మే
- కేబినెట్‌లో ఇద్దరు భారత ఎంపీలు?



- వివరాలు 5లో

## చైనా మాజీ ప్రధాని లీపెంగ్ కన్నుమూత

- చైనా మాజీ ప్రధాని, తియానన్మెన్ స్క్వేర్‌లో వేలాది మంది ఊచకోతకు కారకుడు లీపెంగ్(90) కన్నుమూశారు. లీపెంగ్ అనారోగ్యంతో సోమవారం బీజింగ్‌లో మృతి చెందినట్లు అధికార వార్తా సంస్థ జిన్హువా వెల్లడించింది.

- 5లో



## ప్రమాద బాధితులకు నగదు రహిత చికిత్స

### కేంద్రాన్ని కోరిన ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి



**సాక్షి, న్యూఢిల్లీ:** ప్రమాదం జరిగినప్పుడు బాధితులకు నగదు రహిత చికిత్స అందించాలని టీఆర్‌ఎస్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. మోటారు వాహనాల చట్ట సవరణ బిల్లుపై మంగళవారం జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. 'దేశంలో ఏటా రోడ్డు ప్రమాదాల్లో 1.5 లక్షల మంది మృతి చెందుతున్నారు. 5 లక్షల మంది గాయపడుతున్నారు. ప్రమాద బాధితులకు సకాలంలో చికిత్స అందితే వారి ప్రాణాలు కాపాడినవారిమవుతాం. అందువల్ల ఈ సమయంలో వారికి నగదు రహిత చికిత్స అందించాల్సిన అవసరం ఉంది. అలాగే మరణాలు సంభవించిన, గాయపడిన కేసుల్లో పరిహారాన్ని గణనీయంగా పెంచాల్సిన అవసరం ఉంది. తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్న ప్రాంతాలను గుర్తించి నిర్దిష్ట కాలపరిమితిలో ఆయా రహదారులు ప్రమాదాలకు కారణం కాకుండా తగిన చర్యలు చేపట్టాలి. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వాహనాలపై విధించే పన్నులు ఒక్కో రాష్ట్రంలో ఒక్కో తీరుగా ఉన్నాయి. దీని వల్ల కొన్ని రాష్ట్రాలపై అదనపు భారం పడుతోంది. అందువల్ల ఇలాంటి వాటిపై విస్తృత చర్చ జరిపిన తర్వాతే తుది నిర్ణయానికి రావాలి. లేదంటే బిల్లు ఉద్దేశం నెరవేరదు. డ్రైవర్ల లైసెన్స్ ఆటోమెటిక్‌గా రద్దయ్యే వ్యవస్థ ఉండాలి. ఐటీఐ స్థాయి విద్యా సంస్థల ద్వారా డ్రైవర్లకు వృత్తిపరమైన శిక్షణ అందించాలి'అని పేర్కొన్నారు.

## అమిత్ షాతో వివేక్ భేటీ

### వారసత్వ భవనాల కూల్చివేతలపై ఫిర్యాదు



**సాక్షి, న్యూఢిల్లీ:** బీజేపీ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో మాజీ ఎంపీ వివేక్ మంగళవారం ఢిల్లీలో సమావేశమయ్యారు. తెలంగాణలో వారసత్వ భవనాలు, సచివాలయం కూల్చివేతలపై అమిత్ షాకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆయన ఒక వినతి పత్రాన్ని సమర్పించారు. అప్పుల్లో ఉన్న తెలంగాణలో ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారని, వాస్తు కారణాలు చూపి ముఖ్యమంత్రి కేసీఆర్ వారసత్వ భవనాలు, సచివాలయం భవనాలు కూల్చి కొత్తవి నిర్మించాలని తీసుకున్న నిర్ణయాన్ని అడ్డుకోవాల్సిందిగా కోరారు. తెలంగాణకు రూ. లక్షా 82 వేల కోట్ల అప్పులు ఉన్న నేపథ్యంలో దళితులకు మూడెకరాల భూమి, డబుల్ బెడ్రూం ఇళ్ల పథకాలను ప్రభుత్వం నిలిపేసిందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజాధనం వృథా కాకుండా చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ భేటీలో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాంమాధవ్ కూడా పాల్గొన్నారు.

## రోడ్డు విస్తరణ పనులు చేపట్టండి

### కేంద్ర మంత్రిని కోరిన ఎంపీ బండి సంజయ్



**సాక్షి, న్యూఢిల్లీ:** కరీంనగర్‌–జగిత్యాల, వేములవాడ–కోరుట్ల మార్గాల్లో రోడ్డు విస్తరణ పనులు చేపట్టాల్సిందిగా కేంద్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని ఎంపీ బండి సంజయ్ కోరారు. ఈ మేరకు బండి సంజయ్, పార్టీ నేతలు నూనె బాలరాజు, సత్యనారాయణ మంగళవారం ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. కరీంనగర్‌–జగిత్యాల మార్గంలో భారీ ట్రక్కుల కారణంగా ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారని వివరించారు. అందువల్ల ఈ రోడ్డు విస్తరణ పనులు చేపట్టి వరంగల్ మీదుగా ఎన్‌హెచ్‌–563కి అనుసంధానం చేయాల్సిందిగా కోరారు. ఇక వేములవాడ–కోరుట్ల మార్గాన్ని నాలుగు లేన్ల రహదారిగా మార్చి నిజామాబాద్ మీదుగా ఉన్న ఎన్‌హెచ్‌–63కు కలపాలని విజ్ఞప్తి చేశారు.

## రూబిక్స్ క్యూబ్స్‌లో కేటీఆర్ చిత్రపటం

### 2,100 క్యూబ్స్‌లో రూపొందించిన కౌశిక్, శరణ్‌గుప్తా




**సాక్షి, హైదరాబాద్:** టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదినం సందర్భంగా రూబిక్స్ క్యూబ్‌లతో ఆయన చిత్రపటాన్ని రూపొందించారు. బుధవారం కేటీఆర్ పుట్టిన రోజు కావడంతో కూకట్‌పల్లికి చెందిన టీఆర్‌ఎస్ పార్టీ యువ నాయకుడు పాటిమీది జగన్మోహన్ రావు కార్యాలయంలో 2,100 రూబిక్స్ క్యూబ్‌లతో ఈ చిత్రపటాన్ని (పోర్ట్రెయిట్) రూపొందించారు. ఇలా రూబిక్స్ క్యూబ్‌లతో చిత్రపటం రూపొందించడం మనదేశంలో తొలిసారని, కేటీఆర్‌కు వినూత్నంగా జన్మదిన శుభాకాంక్షలు తెలుపాలన్న ఆలోచనతో తన మేనల్లుడు కౌశిక్, అతని మిత్రుడు శరణ్ గుప్తా అనే 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు రెండు రోజులు శ్రమించి ఈ చిత్రపటాన్ని రూపొందించినట్లు జగన్మోహన్ రావు తెలిపారు.

## టిస్‌లో కోర్సులు తిరిగి ప్రారంభిస్తాం

### హైకోర్టుకు విన్నవించిన కేంద్రం

**సాక్షి, హైదరాబాద్:** టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ (టిస్) హైదరాబాద్ క్యాంపస్‌లో రద్దు చేసిన కోర్సులను తిరిగి ప్రారంభిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం హైకోర్టుకు తెలిపింది. హైదరాబాద్ క్యాంపస్‌లోని టిస్‌లో కోర్సుల్ని అర్ధాంతరంగా నిలిపివేస్తూ ముంబైలోని టిస్ యాక్టింగ్ రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వుల్ని ఎస్.అరవింద్ కార్తీక్ మరో అయిదుగురు సవాల్ చేసిన పిటిషన్లను మంగళవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డి మరోసారి విచారించారు. రద్దు చేసిన కోర్సుల్ని తిరిగి ప్రారంభిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వ న్యాయవాది చెప్పగానే, ఈ మేరకు కౌంటర్ దాఖలు చేయలేదని పిటిషనర్ న్యాయవాది న్యాయమూర్తి దృష్టికి తెచ్చారు. ఈ నెల 29న పిటిషన్లను తిరిగి విచారిస్తామని, ఈలోగా కౌంటర్ దాఖలు చేయాలని కేంద్రాన్ని హైకోర్టు ఆదేశించింది.

## విప్లవోద్యమాన్ని అంతమొందించే కుట్ర

### మావోయిస్టు పార్టీ అధికార ప్రతినిధి జగన్

**సాక్షి, కొత్తగూడెం:** 2022 నాటికి విప్లవోద్యమాన్ని పూర్తిగా అంతమొందించడమే ఎజెండాగా 'సమాధాన్'ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయని, ఇందుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో రక్షణ, పోలీసు శాఖలకు అధిక నిధులు కేటాయిస్తున్నాయని మావోయిస్టు పార్టీ అధికార ప్రతినిధి జగన్ ఆరోపించారు. ఈనెల 28 నుంచి ఆగస్టు 3వ తేదీ వరకు మావోయిస్టు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను ఘనంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం ఆయన లేఖను విడుదల చేశారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశ ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక రంగాలన్నింటిలోనూ హిందూ బ్రాహ్మణీయ ఫాసిజం రాజ్యమేలుతోందని పేర్కొన్నారు. మోదీ పాలనలో సంఘ్ పరివార్ శక్తులు పేట్రేగిపోతున్నాయని, దళితులు, ఆదివాసీలు, ముస్లింలు, మహిళలపై దాడులు చేస్తూ విధ్వంసాన్ని సృష్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గో రక్షణ పేరుతో మూకదాడులు చేస్తూ, కులాంతర, మతాంతర వివాహాలు చేసుకునే వారిని హత్య చేస్తున్నారని ఆరోపించారు. ఎన్‌కౌంటర్లు లేని ప్రజాస్వామిక తెలంగాణ కోసం దశాబ్దాలుగా పోరాడి సాధించుకున్న రాష్ట్రంలో నేడు ప్రజాస్వామిక హక్కులే కాదు.. జీవించే హక్కు కూడా కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు.

## ఇండిగో విమానానికి తప్పిన ముప్పు

**శంషాబాద్:** శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఢిల్లీకి వెళ్లాల్సిన ఓ విమానానికి త్రుటిలో ముప్పు తప్పింది. ఇండిగో ఎయిర్‌లైన్స్‌కు చెందిన 6ఈ–2513 విమానం శంషాబాద్ విమానాశ్రయం నుంచి మంగళవారం ఉదయం 6.59 గంటలకు ఢిల్లీకి బయలుదేరింది. ఇదే సమయంలో విమానంలో సాంకేతిక సమస్య ఉన్నట్లు గుర్తించిన పైలట్ వెంటనే విమానాన్ని రన్‌వేపైనే నిలిపివేశారు. దీంతో ఆ విమానానికి పెద్దముప్పు తప్పింది. సుమారు గంట పాటు ప్రయాణికులు విమానంలోనే ఉండిపోయారు. ప్రయాణికులకు ఇండిగో ఎయిర్‌లైన్స్ సంస్థ మరో విమానం ఏర్పాటు చేయడంతో శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ఉదయం 9.29 గంటలకు బయల్దేరి 11.54 గంటలకు ఢిల్లీకి చేరుకున్నట్లు విమానాశ్రయ అధికారులు వెల్లడించారు.

# బొల్లినేని గాంధీపై ఈడీ కేసు

- మనీ ల్యాండరింగ్‌కు పాల్పడ్డారని ఈసీఐఆర్ నమోదు
- సీబీఐ కేసు ఆధారంగా ముందుకెళ్లిన ఈడీ అధికారులు
- ఆస్తుల ఎటాచ్‌కు ఈడీ సన్నాహాలు



**సాక్షి, హైదరాబాద్:** 'కత్తి పట్టుకుని వీరంగం చేసినోడు అదే కత్తికి బలవుతాడు'అన్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ)లో తన పోస్టును అడ్డం పెట్టుకుని తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు ఆదేశాలు, సూచనల మేరకు ఎదుటివారిపై విరుచుకుపడిన ఈడీ మాజీ అధికారి బొల్లినేని శ్రీనివాసగాంధీపై ఆ విభాగమే కన్నేసింది. ఆయనపై మనీ ల్యాండరింగ్ కేసు నమోదు చేసింది. ఈ మేరకు మంగళవారం శ్రీనివాస గాంధీపై ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్ (ఈసీఐఆర్) దాఖలైంది. గాంధీ భారీ ఎత్తున మనీ ల్యాండరింగ్‌కు పాల్పడినట్లు అందులో పేర్కొన్నారు. ఈనెల 8న గాంధీపై అక్రమాస్తుల కేసు నమోదు చేసిన సీబీఐ అధికారులు ఆ మరుసటి రోజు హైదరాబాద్, విజయవాడల్లోని ఆయన ఆస్తులపై ఏక కాలంలో దాడులు చేశారు. ఈ నేపథ్యంలోనే దాదాపు రూ.200 కోట్ల విలువైన అక్రమాస్తుల్ని గుర్తించారు. సీబీఐ కేసు ఆధారంగా ముందుకెళ్లిన ఈడీ అధికారులు.. గాంధీపై ఈ మేరకు కేసు నమోదు చేశారు.

### 288 శాతం మేర పెరిగిన ఆస్తులు

సీబీఐ ప్రాథమిక దర్యాప్తు ప్రకారం 2010 నుంచి 2019 మధ్య శ్రీనివాస గాంధీ ఆస్తులు ఏకంగా 288 శాతం మేర పెరిగాయి. ఈడీలో బాధ్యతాయుతమైన పోస్టులో ఉంటూ తెలుగుదేశం పార్టీకి అనుకూలంగా వ్యవహరించారని గాంధీపై ఆరోపణలు వెల్లువెత్తాయి. చంద్రబాబు ఆదేశాల మేరకు పనిచేస్తూ ఆయన చెప్పిన వారిని టార్గెట్ చేయడం, అనుకూలంగా వ్యవహరించమన్నవారిని విడిచిపెట్టడం చేస్తూ భారీగా ఆర్జించినట్లు ఆయనపై ఫిర్యాదులు ఉన్నాయి. ఇలాంటి వ్యవహారాలతో లబ్ధి పొందిన నేపథ్యంలోనే 2010లో రూ.21 లక్షలుగా ఉన్న ఆయన ఆస్తులు 2019 జూన్ 26 నాటికి ప్రభుత్వ లెక్కల ప్రకారమే ఏకంగా రూ.3.74 కోట్లకు చేరాయి. బహిరంగ మార్కెట్లో వీటి విలువ దాదాపు రూ.200 కోట్ల పైమాటే. చంద్రబాబుకు సన్నిహితుడిగా ఉండి, ఆయన అండదండలతో గతంలో ఏ అధికారి పని చేయని విధంగా 2004 నుంచి 2017 వరకు బొల్లినేని శ్రీనివాస గాంధీ ఈడీలోనే విధులు నిర్వర్తించారు. కొన్ని నెలల క్రితమే ఆయన్ను బషీర్‌బాగ్‌లోని జీఎస్టీ భవన్‌లో జీఎస్టీ ఎగవేత నిరోధక విభాగం సూపరింటెండెంట్ ఆఫీసర్‌గా నియమించారు. ఇలా వరుసగా కీలక పోస్టింగులు పొందడం వెనుకా బాబు సహకారం ఉందనే ఆరోపణలు ఉన్నాయి. గాంధీపై కొంతకాలంగా ఫిర్యాదులు అందుకున్న సీబీఐ హైదరాబాద్ విభాగం.. విజయవాడతోపాటు హైదరాబాద్‌లోని హైదర్‌నగర్, కూకట్‌పల్లిలోని ఆయన నివాసాల్లో దాడులు చేసింది. ఈ దాడుల్లో పలు బ్యాంకు ఖాతాల్లో నగదు నిల్వ ఉన్నట్లు, ఆయన పేరిట హైదరాబాద్‌లో ప్లాట్లు, స్థిరాస్తులు, కుటుంబసభ్యుల పేరిట ఆస్తులు, విలువైన ఆభరణాలు ఉన్నట్లు గుర్తించారు.

### సుజనా కేసులో భారీగా లబ్ధి?

1992లో సెంట్రల్ ఎక్సైజ్ విభాగంలో ఇన్‌స్పెక్టర్‌గా చేరిన బొల్లినేని శ్రీనివాస గాంధీ 2002లో సూపరింటెండెంట్‌గా పదోన్నతి పొందారు. 2003లో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్‌లోకి డిప్యుటేషన్‌పై వెళ్లిన ఆయన ఏడాది పాటు అందులో పనిచేశారు. 2004లో ఈడీకి బదిలీపై వెళ్లి రాజకీయ అండదండలతో 2017 వరకు ఎలాంటి బదిలీలు లేకుండా అక్కడే విధులు నిర్వర్తించారు. ఇలాంటి పోస్టుల్లో పని చేసి వచ్చినవారికి జీఎస్టీలో కీలక పోస్టు ఇవ్వరు. అయితే అందుకు భిన్నంగా అందులోనూ గాంధీకి కీలక పోస్టు లభించడం వెనుక చంద్రబాబు హస్తం ఉందనే ఆరోపణలు ఉన్నాయి. రాజ్యసభ సభ్యుడు సుజనా చౌదరిపై జీఎస్టీ ఎగవేత కేసును సైతం పర్యవేక్షించిన గాంధీ ఆయనకు పూర్తి అనుకూలంగా వ్యవహరించారని, ఇందులో భారీగా లబ్ధి పొందారని ఆరోపణలు ఉన్నాయి. ఈ కారణంగానే తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొన్నప్పటికీ సుజనా చౌదరి అరెస్టు కాలేదని తెలుస్తోంది. గత పదేళ్లలో రూ.65 లక్షలు జీతంగా అందుకున్న శ్రీనివాస గాంధీ ఆయన కుమార్తె మెడికల్ సీటుకే రూ.70 లక్షలు చెల్లించారు. ఆయన కుటుంబ సభ్యుల పేరిట ఉన్న ఆస్తులు విలువ ప్రభుత్వ లెక్కల ప్రకారమే 3.74 కోట్లుగా ఉంది. కూకట్‌పల్లి హైదర్‌నగర్‌లో ఇంటిని రూ.1.20 కోట్లతో నిర్మించారు. ఏపీలోని తుళ్లూరు, గుణదల, పెద్దపులిపాక, కన్నూరు, కంకిపాడు, పొద్దుటూరు, నగరంలోని కొండాపూర్, మదీనాగూడ, కూకట్‌పల్లిల్లో స్థిరాస్తులు కూడగట్టిన గాంధీ భారీగా మనీ ల్యాండరింగ్‌కు పాల్పడినట్లు ఈడీ తన ఈసీఐఆర్‌లో ఆరోపించింది. దీన్ని దర్యాప్తు చేస్తున్న ఈడీ హైదరాబాద్ యూనిట్ అధికారులు.. గాంధీ ఆస్తుల్ని ఎటాచ్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. అలాగే ఆయనకు సమన్లు జారీ చేసి విచారించాలని నిర్ణయించారని తెలిసింది.

# ఫసల్ బీమా అసల్ రాదే..!

- ప్రీమియం గడువు ముగిసే నాటికి బ్యాంకులు ఇస్తున్న రుణాలు 30%
- లక్షలాది మంది రైతులు పంటల బీమాకు దూరమవుతున్న దుస్థితి

**సాక్షి, హైదరాబాద్:** రైతులకు ధీమాలేదు. పంటలకు బీమా రాదు. బ్యాంకులు, బీమా కంపెనీలు అన్నదాతతో ఆటాడుకుంటున్నాయి. సకాలంలో పంటరుణాలు ఇవ్వకపోవడం వల్ల గడువు ముగిసేలోగా బీమా ప్రీమియం చెల్లింపులు పూర్తిస్థాయిలో జరగడం లేదు. దీంతో పంటరుణాలు అందక ప్రీమియం సొమ్ము చెల్లించక రైతులు నష్టపోతున్నారు. బీమాప్రీమియం చెల్లింపు గడువు ముగిసేనాటికి పంట రుణాలు కేవలం 30 నుంచి 40 శాతానికి మించడం లేదని తెలంగాణ వ్యవసాయశాఖ కేంద్రానికి వివరించింది. దీంతో పంట రుణాలతో ముడిపడిన బీమా ప్రీమియం చెల్లించే రైతులసంఖ్య గణనీయంగా పడిపోతోందని వ్యవసాయశాఖ ఆందోళన వ్యక్తం చేసింది. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై) అమలులో తలెత్తుతున్న సమస్యలను రాష్ట్ర వ్యవసాయశాఖ కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చింది. పీఎంఎఫ్‌బీవై పోర్టల్‌లో రైతుల సమాచారాన్ని అప్‌లోడ్ చేయడంలోనూ సమస్యలు ఎదురవుతున్నాయని పేర్కొంది. రాష్ట్రంలో ఖరీఫ్‌లో అత్యధికంగా పత్తి, మొక్కజొన్న పంటలకు బీమా ప్రీమియం చెల్లిస్తారు. రబీలో అత్యధికంగా శనగ పంటకు బీమా ప్రీమియం చెల్లిస్తారు. గడువుతేదీ త్వరగా ముగుస్తుండటంతో అనేకమంది పత్తి రైతులు బీమాకు దూరమవుతున్నారు.

### బీమా పరిధిలోకి రాని లక్షలాది మంది..

రాష్ట్ర వ్యవసాయశాఖ వద్ద ఉన్న సమాచారం ప్రకారం 58 లక్షల మంది రైతులున్నారు. ఖరీఫ్‌లో సాధారణంగా 1.08 కోట్ల ఎకరాల భూమి సాగు అవుతుంది. ఇంతమంది రైతులున్నా, 2016–17 ఖరీఫ్, రబీ వ్యవసాయ సీజన్‌లో 9.75 లక్షలమంది రైతులు మాత్రమే బీమా పరిధిలోకి వచ్చారు. 2017–18 వ్యవసాయ సీజన్‌లో 10.64 లక్షలమంది బీమాలో చేరారు. గతేడాది వ్యవసాయ సీజన్‌లో కేవలం 7.94 లక్షల మంది మాత్రమే పంటల బీమా పరిధిలోకి వచ్చారని వ్యవసాయశాఖ కేంద్రానికి తెలిపింది. కేంద్రం 50 శాతం వ్యవసాయ భూమి బీమా పరిధిలో ఉండాలని పేర్కొంటుంటే, పరిస్థితి అత్యంత దారుణంగా ఉంది. వివిధ పంటలకు బీమా ప్రీమియం చెల్లించే గడువు తేదీలు అశాస్త్రీయంగా ఉన్నాయన్న విమర్శలు ఉన్నాయి. ఉదాహరణకు పత్తికి జూలై 15, ఇతర పంటలకు జూలై 30 గడువు తేదీలుగా ఉన్నాయి. దీంతో ఏడాదికేడాదికి బీమా పరిధిలోకి వచ్చే రైతులసంఖ్య తగ్గుతోందని వ్యవసాయశాఖ ఫిర్యాదు చేసింది. క్లెయిమ్స్‌ను కూడా కంపెనీలు పూర్తిస్థాయిలో చెల్లించడంలేదు. ఏడాదికేడాదికి ప్రీమియం ధరలను బీమా కంపెనీలు పెంచుతున్నాయి. విపత్తులు సంభవించినప్పుడు క్షేత్రస్థాయికి వెళ్లి పంటలను పరిశీలించడంలో బీమా కంపెనీలు తీవ్ర జాప్యం చేస్తున్నాయని వ్యవసాయశాఖ తన నివేదికలో తెలిపింది. అందుకు సంబంధించి టోల్‌ఫ్రీ నంబర్లు ఇచ్చినా అవి పనిచేయడం లేదని వ్యవసాయశాఖ అసంతృప్తి వ్యక్తం చేసింది. డివిజన్, మండలస్థాయిలో బీమా కంపెనీలకు సిబ్బంది లేకపోవడంతో పంటల బీమా విజయవంతం కావడంలేదు.

# ఆ క్లాజు వద్దు

▶ మొదటి పేజీ తరువాయి

అప్పగిస్తూ బిల్లుకు సవరణ చేయాలని గవర్నర్ సూచించారు. దీంతో బిల్లుకు సవరణ జరిపేందుకు మళ్లీ రాష్ట్ర శాసనసభ ఆమోదం తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. శాసనసభను ప్రొరోగ్ చేస్తూ ఇప్పటికే ప్రకటన జారీ చేసిన నేపథ్యంలో, మళ్లీ అసెంబ్లీ సమావేశాల నిర్వహణ వరకు వేచిచూడక తప్పదు. ఈ నేపథ్యంలో గవర్నర్ సూచన మేరకు మున్సిపల్ బిల్లుకు మార్పులు జరిపి అత్యవసర పరిస్థితుల రీత్యా ఆర్డినెన్స్ రూపంలో కొత్త పురపాలికల చట్టాన్ని ప్రభుత్వం తీసుకొచ్చిందనే చర్చ జరుగుతోంది. ఈ వ్యవహారంలో ప్రభుత్వం గోప్యత పాటిస్తుండటంతో కొంత గందరగోళం నెలకొంది. గవర్నర్, రాష్ట్ర ప్రభుత్వం మధ్య సంబంధాలకు సంబంధించిన సున్నిత విషయం కావడంతో దీనిపై ఇటు రాష్ట్ర ప్రభుత్వం కానీ, అటు గవర్నర్ కార్యాలయం గానీ అధికారికంగా స్పందించలేదు.

### ఆదివారమే సవరణ బిల్లుకు ఆమోదం

ఓ సవరణతో బిల్లును గవర్నర్ నరసింహన్ గత ఆదివారమే ఆమోదించారని రాష్ట్ర పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి అరవింద్‌కుమార్ 'సాక్షి'కి తెలిపారు. అయితే, కొత్త పురపాలికల బిల్లును ఆమోదించారా? లేక సవరణతో తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌కు ఆమోదముద్ర వేశారా? అన్న ప్రశ్నకు ఆయన సమాధానం ఇవ్వలేదు. వాస్తవానికి తాను కోరుకున్న సవరణతో బిల్లును నేరుగా గవర్నర్ ఆమోదించడానికి వీలు లేదు. సదరు సవరణను శాసనసభ ఆమోదించిన తర్వాతే గవర్నర్ దానికి ఆమోదం తెలపాల్సి ఉంటుంది. వచ్చేనెలలో కొత్త పురపాలికల చట్టం ద్వారానే మున్సిపల్ ఎన్నికలు నిర్వహిస్తామని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గవర్నర్ సూచించిన సవరణతో ఆర్డినెన్స్ రూపంలో కొత్త పురపాలికల చట్టాన్ని తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందనే చర్చ జరుగుతోంది. ఇప్పటికే ప్రభుత్వం గోప్యంగా ఆర్డినెన్స్ సైతం జారీ చేసిందని ఊహాగానాలు వచ్చాయి. ఈ వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా స్పందించకపోవడంతో అసలు విషయం తెలియడంలేదు.

# నర్సింగ్ విద్య.. అంతా మిథ్య

- ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసమే నడుస్తున్న అనేక ప్రైవేట్ కాలేజీలు
- కాలేజీలు.. గదులు ఏవీ లేకుండా కేవలం బోర్డులకే పరిమితం
- తరగతులు లేకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న కాలేజీలు
- శిక్షణ సరిగా లేక అవకాశాలు పొందలేని దుస్థితిలో నర్సులు
- ప్రభుత్వ నర్సింగ్ స్కూళ్లలోనూ విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు
- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్‌కు ఫిర్యాదుల వెల్లువ

**సాక్షి, హైదరాబాద్:** వైద్య రంగంలో నర్సుల పాత్ర అత్యంత కీలకమైంది. కేవలం వైద్యులతోనే రోగులకు చికిత్స జరగదు. వారికి సాయంగా అత్యంత కీలకపాత్ర పోషించేది నర్సులే. కానీ నర్సింగ్ విద్య రాష్ట్రంలో అత్యంత నాసిరకంగా తయారైంది. ముఖ్యంగా ప్రైవేటు కాలేజీల్లో నర్సింగ్ విద్య మిథ్యగా మారింది. అనేకచోట్ల కేవలం కాగితాలపైనే నర్సింగ్ స్కూళ్లు నడుస్తున్నాయి. బోగస్ అడ్రస్‌లు పెట్టి విద్యార్థులను చేర్చుకొని వారిని నిట్టనిలువునా ముంచుతున్నాయి. అసలు కాలేజీలు లేకుండా, తరగతులు నిర్వహించకుండా నడుస్తున్న నర్సింగ్ స్కూళ్లయితే మరీ ఘోరం. ఆ స్కూళ్ల విద్యార్థులు కేవలం పరీక్షల సమయంలోనే వస్తారు. వారిని ఎలాగోలా పాస్ చేయిస్తారు. అలా వారికి సర్టిఫికెట్లు ఇస్తారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, అదనపు ఫీజు, పాస్ చేయించినందుకు మరికొంత గుంజుతున్నారు. కోర్సు చివరి ఏడాదిలో ఏదో ఆస్పత్రిలో శిక్షణ ఇప్పిస్తారు. ఆ శిక్షణ సమయంలో సంబంధిత ఆస్పత్రి ఎంతోకొంత విద్యార్థులకు వేతనం చెల్లిస్తుంది. అందులో కూడా సగం మేరకు యాజమాన్యాలు తీసుకుంటున్నాయి. దీంతో నర్సింగ్ విద్య తెలియక ఆస్పత్రుల్లో రోగులకు సరైన సేవలు చేయలేక ఇక్కడ చదివిన నర్సులు ఇబ్బందులు పడుతున్నారు. ఇంత జరుగుతున్నా నర్సింగ్ కౌన్సిల్ ఏ చర్యలూ తీసుకోవడంలేదన్న ఆరోపణలున్నాయి. అనేక నర్సింగ్ స్కూళ్ల విద్యార్థుల అమాయకత్వాన్ని సొమ్ము చేసుకుంటున్నాయి.

### అడ్రస్ లేని నర్సింగ్ స్కూళ్లు..

రాష్ట్రంలో ప్రైవేటు రంగంలో 145 నర్సింగ్ స్కూళ్లు ఉన్నాయి. ఇంటర్ అర్హతతో కూడిన మూడేళ్ల జనరల్ నర్సింగ్ అండ్ మిడ్ వైఫరీ (జీఎన్‌ఎం) కోర్సు అందిస్తున్నాయి. ఈ కోర్సు చేశాక ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఉద్యోగం వస్తుందని బాలికలు చేరుతుంటారు. ఒక్కో స్కూలులో 45 నుంచి 60 సీట్ల వరకు వాటి సామర్థ్యాన్ని బట్టి ఉన్నాయి. ఈ కోర్సు కోసం ప్రభుత్వం ఏడాదికి రూ.45 వేలు ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద ఒక్కో విద్యార్థికి చెల్లిస్తుంది. దీంతోపాటు ఇతరత్రా ఖర్చులంటూ యాజమాన్యాలు విద్యార్థుల నుంచి రూ.20 వేల చొప్పున వసూలు చేస్తున్నాయి. అంటే 60 సీట్లున్న ఒక్కో కాలేజీకి కేవలం ఫీజు రీయింబర్స్‌మెంట్ నుంచే మూడేళ్ల కోర్సులకు ఏడాదికి రూ.81 లక్షలు వస్తుంటాయి. ఇవిగాక విద్యార్థుల నుంచి రూ. 20 వేల వరకు వసూలు చేస్తున్నాయి. ఇంతింత పొందుతూ కనీసం తరగతులు నిర్వహించని పరిస్థితి నెలకొంటుంది. అంతేకాదు కనీసం వాటికి సొంత భవనం కూడా లేదు. నర్సింగ్ కౌన్సిల్ జాబితాలో పేర్కొన్న అడ్రస్‌లను పట్టుకొని వెళితే దాదాపు 50 నర్సింగ్ స్కూళ్లు బోగస్ అడ్రస్‌లు ఇచ్చినట్లు సమాచారం.

### ఒకే భవనంలో 14 స్కూళ్లు..

ఇక ఒకే భవనంలో 14 నర్సింగ్ స్కూళ్లు నడుపుతున్నట్లు సమాచారం. అంటే ఒకే భవనంలో 14 నర్సింగ్ స్కూళ్లు నడుస్తున్నాయని అనుకోవద్దు. ఒక నర్సింగ్ స్కూలు యజమానే, అడ్రస్ లేకుండా కేవలం సర్టిఫికెట్లతో నడిపించే మిగిలిన 13 నర్సింగ్ స్కూళ్లతో ఒప్పందం చేసుకొని వారి విద్యార్థులకు ఇక్కడే తరగతులు చెబుతున్నారు. ఇలా నర్సింగ్ విద్యను ఒక దూరవిద్య విధానంలా ప్రైవేటు యాజమాన్యాలు నడుపుతున్నాయి. నర్సింగ్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిబంధనల ప్రకారం ఒక నర్సింగ్ స్కూలు ఏర్పాటు చేయాలంటే, తప్పనిసరిగా 20 వేల చదరపు అడుగుల వైశాల్యంలో భవనం ఉండాలి. నర్సింగ్ ల్యాబ్, పీడియాట్రిక్ ల్యాబ్, ప్రీ క్లినికల్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్, స్టాఫ్ రూం, లైబ్రరీ, ఫ్యాకల్టీ రూం, లెక్చర్ హాల్ ఇలా 11 రకాల అంశాలకు సంబంధించినవి ఉండాలి. అంతేకాదు 100 పడకల ఆస్పత్రితో ఒప్పందం చేసుకొని ఉండాలి. క్లినికల్ ప్రాక్టీస్ చేయిస్తుండాలి. ఒక్కో నర్సింగ్ కాలేజీలో 14 మంది బోధనా సిబ్బంది ఉండాలి. అందులో ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, 10 మంది ట్యూటర్లు, ఇద్దరు అదనపు ట్యూటర్లు ఉండాలి. కానీ ఏ స్కూల్‌లోనూ ఒకరిద్దరు మినహా ఉండటం లేదు.

### ప్రభుత్వ నర్సింగ్ స్కూళ్లది మరో గోల..

ప్రైవేటు స్కూళ్ల పరిస్థితి ఇలాగుంటే, ప్రభుత్వ నర్సింగ్ స్కూళ్లది మరో గోలలా ఉంది. అనేక స్కూళ్లకు పక్కా భవనాలు లేవు. మౌలిక సదుపాయాలు అంతంతే. కొన్ని ప్రభుత్వ నర్సింగ్ స్కూళ్లల్లో విద్యార్థుల నుంచే డబ్బులు వసూలు చేసి సరైన ఆహారం కూడా అందించడంలేదన్న ఆరోపణలు వస్తున్నాయి. కొన్ని చోట్లయితే విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేసి కళాశాల వర్కర్లకు జీతాలు చెల్లిస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. మరికొన్ని చోట్ల హాస్టల్ నిర్వహణ పేరుతో ప్రతీ విద్యార్థి నుంచి నెలకు రూ.50 వసూలు చేస్తున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ దృష్టికి ఇటీవల నర్సింగ్ విద్యార్థుల ప్రతినిధులు తీసుకొచ్చారు. అలాగే స్టేషనరీ ఖర్చులంటూ నెలకు రూ.200 చొప్పున వసూలు చేస్తున్నారు. ఇక ప్రతీ చిన్న విషయానికి విద్యార్థులకు జరిమానాలు విధిస్తూ డబ్బులు వసూలు చేస్తున్నారు.

### విచారించి చర్యలు చేపట్టాలి..

బోగస్ అడ్రస్‌లు పెట్టి, కాగితాలపై కోర్సులు నడుపుతున్న నర్సింగ్ స్కూళ్లను గుర్తించి.. వాటిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి. బోగస్ స్కూళ్లు స్థాపించి ఫీజు రీయింబర్స్‌మెంట్ పొందుతుండటం దారుణం. దీనివల్ల నర్సింగ్ విద్య నాణ్యత తగ్గిపోతుంది. నర్సింగ్ కౌన్సిల్ పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయి. ప్రభుత్వ నర్సింగ్ స్కూళ్లు, కాలేజీలకు పక్కా భవనాలు లేకపోవడం, మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై ఇటీవల మంత్రి ఈటల రాజేందర్‌కు ఫిర్యాదు చేశాను.

**– గోవర్ధన్, తెలంగాణ నర్సింగ్ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు**

# కొత్త సచివాలయం కోసం 8 నమూనాలు

- డిజైన్లను పరిశీలిస్తున్న టెక్నికల్ కమిటీ
- ఉత్తమమైనవి గుర్తించి మంత్రివర్గ ఉపసంఘానికి నివేదన
- మంత్రులు సూచించే మార్పుల అనంతరం సీఎంకు అందజేత
- తుది అంచనాను ముఖ్యమంత్రి ఆమోదించాక టెండర్ల ప్రక్రియ

**సాక్షి, హైదరాబాద్:** కొత్త సచివాలయ భవనం కోసం అధికారులు ఎనిమిది నమూనాలతో కుస్తీ పడుతున్నారు. తెలంగాణ సంప్రదాయం ఉట్టిపడేలా డిజైన్లు కావాలంటూ రోడ్లు భవనాలశాఖ ఇటీవలే దేశవ్యాప్తంగా పేరున్న 20 మంది ఆర్కిటెక్ట్‌లకు లేఖలు రాయడం తెలిసిందే. వారి నుంచి వచ్చిన నమూనాలను సచివాలయం, అసెంబ్లీ భవన నిర్మాణాలపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన టెక్నికల్ కమిటీ పరిశీలిస్తోంది. గతంలో తమిళనాడుకు చెందిన ఓ ఆర్కిటెక్ట్ స్వచ్ఛందంగా పంపిన నమూనా ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఆకట్టుకుంది. గుమ్మటాలతో ఉన్న ఆ నమూనాకు దగ్గరగా ఉండే డిజైన్‌ను సిద్ధం చేయాలని అప్పట్లోనే ఆయన అధికారులను ఆదేశించారు. ఆ నమూనాను జతచేస్తూ ఆ తరహాలో నూతన సచివాలయ డిజైన్ ఉండాలని అధికారులు ఆర్కిటెక్ట్‌లకు లేఖలు పంపారు. గతంలో ప్రముఖ ఆర్కిటెక్ట్ హఫీజ్ కాంట్రాక్టర్ సచివాలయానికి సంబంధించి మూడు నమూనాలు పంపారు. అందులో రెండు ప్రస్తుతం సచివాలయం ఉన్న చోటే నిర్మించాలని భావించినప్పుడు వేసినవి కాగా, మరొకటి సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ పక్కనున్న బైసన్ పోలో గ్రౌండ్‌లో నిర్మించాలని యోచించినప్పుడు వేసింది. ఈ మూడు కూడా బాగానే ఉన్నాయని ముఖ్యమంత్రి అప్పట్లో పేర్కొన్నారు. ఇప్పుడు వీటికి కొన్ని మార్పుచేర్పులు సూచిస్తూ ఆయన మరో డిజైన్‌ను సిద్ధం చేస్తున్నారు. ఈ నమూనాల్లో మెరుగ్గా ఉన్న కొన్నింటిని ఎంపిక చేసి టెక్నికల్ కమిటీ మంత్రివర్గ ఉపసంఘానికి నివేదించనుంది. వాటిని మంత్రులు పరిశీలించి మళ్లీ మార్పుచేర్పులు అవసరమైతే చేసి ముఖ్యమంత్రికి అందివ్వనున్నారు. ఆయన చెప్పే సలహాల ఆధారంగా మార్పులు అవసరమనుకుంటే చేసి తుది నమూనా ప్రకారం టెండర్లు పిలవనున్నారు. ఈ ప్రక్రియ పూర్తి కావడానికి సమయం పట్టే అవకాశం ఉంది. మరోవైపు ప్రస్తుత సచివాలయ భవనాల పటుత్వం ఎలా ఉందన్న అంశాన్ని టెక్నికల్ కమిటీ ఇటీవలే పరిశీలించింది. ఆ భవనాలు పరిశీలించిన నిట్ డైరెక్టర్ వాటి పటుత్వంపై 'అంచనా' వేశారు. అగ్నిప్రమాదాల సమయంలో ఆ భవనాలు ప్రమాదకరంగా ఉండే అవకాశం ఉందని ఇప్పటికే అధికారులు పేర్కొనగా తాజా పరిశీలనలో అధికారులు గుర్తించిన వివరాలతో నివేదిక రూపొందించి మంత్రివర్గ ఉపసంఘానికి అందివ్వనున్నారు.

## 'ఆరోగ్యశ్రీలోకి మరికొన్ని వ్యాధులు'

**సాక్షి, హైదరాబాద్:** ఆరోగ్యశ్రీ జాబితాలోకి మరికొన్ని వ్యాధులను చేర్చాలని ఆరోగ్యశ్రీ ట్రస్టు బోర్డు సూత్రప్రాయంగా నిర్ణయించింది. ఈ మేరకు ఏఏ వ్యాధులను చేర్చాలన్న దానిపై ఒక కమిటీని వేయాలని నిర్ణయించినట్లు ట్రస్టు వర్గాలు తెలిపాయి. ఆరోగ్యశ్రీ ట్రస్టు బోర్డు సమావేశం మంగళవారం వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ ఆధ్వర్యంలో జరిగింది. అధికారులు ఆయనకు ఆరోగ్యశ్రీ కార్యకలాపాలను గురించి వివరించారు. ఇక ఆరోగ్యశ్రీ నెటవర్క్ ఆసుపత్రుల జాబితాలో చేర్చాలని కొన్ని ప్రైవేటు ఆసుపత్రులు దరఖాస్తు చేసుకున్నాయి. వాటిపై కూడా ఒక కమిటీ వేసి నిర్ణయం తీసుకోవాలని బోర్డు అభిప్రాయపడింది. కాగా, ఆరోగ్యశ్రీ కింద ప్రైవేటు ఆసుపత్రులకు చెల్లించాల్సిన బకాయిలు రూ. 600 కోట్లు ఉన్నట్లు నిర్ధారించారు. వాటిని విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరాలని నిర్ణయించారు. ఆరోగ్యశ్రీ కింద లివర్, గుండె మార్పిడి చేయించుకున్న రోగులకు జీవితాంతం ఉచితంగా మందుల సరఫరా చేయాలని యోచిస్తున్నట్టు సమాచారం. అలాగే తలసేమియా, సికిల్‌సెల్ ఎనీమియా బాధితులకు ప్రస్తుతం ఉన్న రూ.2 లక్షల పరిమితిని ఎత్తివేయాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. అయితే సమావేశంలో ఎటువంటి కీలక నిర్ణయాలు కానీ, విధాన నిర్ణయాలు కానీ తీసుకోలేదని, సాధారణంగానే సమావేశం ముగిసిందని వైద్య ఆరోగ్యశాఖ వర్గాలు తెలిపాయి.

# హరితహారం సాధించిన జీపీలకు గుర్తింపు

### నిధుల మంజూరులో ప్రాధాన్యత • పంచాయతీరాజ్ మంత్రి ఎర్రబెల్లి



**సాక్షి, హైదరాబాద్:** హరితహారం లక్ష్యాలను సాధించిన పంచాయతీలకు నిధుల విడుదలతో పాటు పనుల మంజూరులో ప్రత్యేక ప్రాధాన్యతనిస్తామని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు. మంగళవారం పీఆర్ శాఖ సమీక్ష సందర్భంగా అన్ని శాఖలు సమన్వయంతో హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ 'హరితహారం విజయవంతం అవడానికి సమష్టిగా కృషి చేయాలి. నాటిన మొక్కల సంరక్షణ విషయంలో సర్పంచులు, అధికారులు చర్యలు తీసుకోవాలి. కార్యక్రమాన్ని విజయవంతం చేయడాన్ని బట్టే గ్రామపంచాయతీలకు ప్రత్యేక గుర్తింపు ఇస్తాం. జీపీ భవనాలు, సీసీ రోడ్లు వంటి అన్ని పనుల మంజూరులో ఈ గ్రామపంచాయతీలకు ప్రాధాన్యత ఉంటుంది. ఆర్థిక సంవత్సరం ముగింపులో హడావుడిగా కాకుండా పక్కా ప్రణాళికతో ఎక్కువ పనులు చేయాలి. గోదాముల నిర్మాణం, పంచాయతీ భవనాలు నిర్మించాలి. ప్రభుత్వ స్థలం లేదా దాతలు ఇచ్చిన స్థలం ఉండి త్వరగా నిర్మించేందుకు సర్పంచులు సిద్ధంగా ఉన్న పంచాయతీలకు భవనాలు మంజూరు చేయాలి. ప్రతి గ్రామంలో వైకుంఠ ధామాలను (శ్మశానవాటిక) నిర్మించాలి. అన్ని గ్రామపంచాయతీలకు డంపింగ్ యార్డు ఉండేలా చర్యలు తీసుకోవాలి. గ్రామపంచాయతీ ఆమోదంతోనే ఉపాధిహామీ పనులు జరగాలి. సర్పంచ్, ఉప సర్పంచ్‌ల చెక్‌పవర్ ఆదేశాలను అన్ని గ్రామపంచాయతీల్లో అమలు చేయాలి. అన్ని మండలాల్లో కంప్యూటర్ సెంటర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి. కేంద్రం నుంచి రావాల్సిన ఉపాధిహామీ బిల్లులు త్వరగా విడుదలయ్యేలా అక్కడి అధికారులతో సంప్రదింపులు జరపాలి. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి'అని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఆర్ కమిషనర్ నీతూకుమారీ ప్రసాద్, ఉపాధిహామీ జాయింట్ కమిషనర్ వెస్లీ, డిప్యూటీ కమిషనర్లు సుధాకర్, రామారావు పాల్గొన్నారు.

## కేటీఆర్‌కు వరల్డ్ వాటర్ కాంగ్రెస్ ఆహ్వానం

### వచ్చే ఏడాది మేలో అమెరికాలోని నెవెడాలో సదస్సు



**సాక్షి, హైదరాబాద్:** వచ్చే ఏడాది మేలో అమెరికాలోని నెవెడాలో జరగనున్న వరల్డ్ ఎన్విరాన్మెంటల్, వాటర్ కాంగ్రెస్ సదస్సుకు టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కి ఆహ్వానం అందింది. అమెరికన్ సొసైటీ ఆఫ్ సివిల్ ఇంజనీర్స్ సంస్థ నిర్వహించే ఈ సదస్సుకు రెండోసారి కేటీఆర్‌కి ఆహ్వానం లభించింది. 2017లో కాలిఫోర్నియా శాక్రమెంటోలో జరిగిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై కీనోట్ అడ్రస్ ఇచ్చారు. 2017లో కాళేశ్వరంతోపాటు ఇతర ప్రాజెక్టుల గురించి కేటీఆర్ తన ప్రసంగంలో వివరించారు. తెలంగాణ ప్రభుత్వం సాగు నీరు, పర్యావరణ సమతుల్యత, నీటి వనరుల అభివృద్ధి కోసం తీసుకున్న చర్యలను గురించి తెలియజేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కాళేశ్వరం ప్రారంభమైన విషయాన్ని తాము తెలుసుకున్నట్టు కేటీఆర్‌కి పంపిన ఆహ్వానంలో నిర్వాహకులు పేర్కొన్నారు. ఈసారి కూడా కీనోట్ స్పీకర్‌గా హాజరై తెలంగాణ సాగునీటి అనుభవాలను వివరించాలని కేటీఆర్‌ను నిర్వాహకులు కోరారు. 2020 మే 17 నుంచి 21 వరకు అమెరికాలోని నెవెడాలో జరగనున్న ఈ సదస్సుకి వివిధ దేశాల నుంచి సుమారు వెయ్యి మంది పర్యావరణ నిపుణులు హాజరవుతారని తెలిపారు. వివిధ దేశాల్లోని సాగునీటి వ్యవస్థలు, స్మార్ట్ వాటర్ కార్యక్రమాల గురించి ఈ సదస్సులో కూలంకషంగా చర్చించనున్నట్టు పేర్కొన్నారు.

## కాంగ్రెస్ తిరోగమన రాజకీయం: పొంగులేటి



**సాక్షి, హైదరాబాద్:** కర్ణాటకలో కుమారస్వామి ప్రభుత్వం కూలిపోవడం శుభపరిణామమని, కాంగ్రెస్ తిరోగమన రాజకీయానికి తాజా పరిణామాలు అద్దం పడుతున్నాయని మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ నేత పొంగులేటి సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. అవకాశవాద రాజకీయం ఎంతోకాలం నడవదని మరోసారి రుజువైందన్నారు. అసెంబ్లీలో మెజార్టీ ఎమ్మెల్యేలు బీజేపీ పక్షాన ఉంటే అనైతికంగా కుమారస్వామికి మద్దతిచ్చి కాంగ్రెస్ చారిత్రక తప్పిదం చేసిందని, ఇప్పుడు దానికి మూల్యం చెల్లించుకుందన్నారు. అసలే నాయకత్వ సంక్షోభం కొట్టుమిట్టాడుతున్న కాంగ్రెస్‌కు కర్ణాటక పరిణామాలు చెంపపెట్టుగా మారాయన్నారు. ఇకనైనా ఇలాంటి చిల్లర రాజకీయాలు మానుకుని నైతికంగా విజ యం సాధించడానికి కాంగ్రెస్ అధిష్టానం కృషి చేయడం మంచిదని సూచించారు.

## వారి సమస్యలు పరిష్కరించాలి: చెరుకు



**హైదరాబాద్:** తెలంగాణకు చెందిన ముంబై వలస జీవుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ఇంటిపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చెరుకు సుధాకర్‌గౌడ్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన మహారాష్ట్ర గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావును కలిసి వినతి పత్రం అందజేశారు. ముంబైలోని ఎస్సీ, ఎస్టీ, ఎంబీసీ వారికి కుల ధ్రువపత్రాలు సులభంగా అందేలా చూడాలని, తెలంగాణ శ్రామిక భవనం వంటి అంశాలను పరిశీలించాలని గవర్నర్‌ను కోరినట్లు సుధాకర్‌గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో చెరుకు సుధాకర్ సతీమణి లక్ష్మి, ముంబై తెలంగాణ బహుజన ఫోరమ్‌కు చెందిన ప్రతినిధి భీంవడి, భోగ సుదర్శన్ పద్మశాలి, సిరిమల్లె శ్రీనివాస్, కృష్ణయాదవ్ పాల్గొన్నారు.

## ఆర్టీఐ చట్టాన్ని రద్దు చేసే కుట్ర: పొన్నం



**సాక్షి, హైదరాబాద్:** సవరణల పేరుతో సమాచార హక్కు చట్టాన్ని రద్దు చేసేందుకు మోదీ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. దేశ పౌరులకు సమాచారం తెలుసుకునే హక్కును కల్పిస్తూ అప్పటి యూపీఏ ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ చట్టాన్ని రద్దు చేసే యోచనతోనే మోదీ ప్రభుత్వం పావులు కదుపుతోందని మంగళవారం ఓ ప్రకటనలో ఆయన విమర్శించారు. పారదర్శక పాలన, పాలకుల్లో జవాబుదారీతనాన్ని పెంచేందుకు లోతైన చర్చలు జరిపిన తర్వాతే ఈ చట్టాన్ని యూపీఏ అమల్లోకి తెచ్చిందని, ఇప్పుడు సవరించాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. మోదీ, స్మృతి ఇరానీ లాంటి నాయకు ల విద్యార్హతలు కూడా ఈ చట్టంతోనే బయటకు వచ్చాయని గుర్తు చేశారు.

## ఆ ప్రాంతాలను దత్తత తీసుకోవాలి: చాడ



**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో బాగా వెనుకబడిన గ్రామాలు, ఏజెన్సీ ప్రాంతాలను దత్తత తీసుకుని అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం ప్రత్యేక దృష్టిని సారించాలని సీఎం కేసీఆర్‌ను సీపీఐ కార్యదర్శి చాడ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. సొంత గ్రామానికి సీఎం హోదాలో వెళ్లి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించడం మంచి ఆలోచనేనని, అయితే సీఎం ఆ గ్రామంలో కురిపించిన వరాల జల్లులు ఊహకందకుండా ఉన్నాయని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి కుటుంబానికి రూ. 10 లక్షల లబ్ధి చేకూర్చే విధంగా ఆస్తులు సమకూర్చడం, అందుకు రూ. 200 కోట్లు కేటాయించడం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. రాజ్యాంగబద్ధంగా స్థానికసంస్థలకు నిధులు, విధులు బదలాయిస్తే, ఇలా సీఎం నేరుగా వచ్చి వరాలు ప్రకటించాల్సిన అవసరం ఉండదన్నారు.

## అన్ని గ్రామాలకూ నిధులివ్వాలి: మల్లు రవి



**సాక్షి, హైదరాబాద్:** ముఖ్యమంత్రి రాష్ట్రానికి పెద్ద దిక్కుగా వ్యవహరించాల్సి ఉంటుందని, రాష్ట్రానికి తండ్రి లాంటి పదవిలో ఉన్న కేసీఆర్ తన గ్రామానికి మాత్రమే నిధులు ఇచ్చుకుంటే రాష్ట్రంలోని మిగతా గ్రామాల పరిస్థితేంటని టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి ప్రశ్నించారు. పుట్టి పెరిగిన గ్రామంపై మమకారం ఉండడంలో తప్పు లేదని, అయితే కుటుంబానికి రూ.10 లక్షల చొప్పున ఒక్క గ్రామానికే రూ.200 కోట్లు కేటాయించారని మంగళవారం ఒక ప్రకటనలో ఆయన మండిపడ్డారు. ప్రతి గ్రామానికి రూ.2 కోట్ల అభివృద్ధి నిధులిస్తే కనీస సౌకర్యాలు కల్పించవచ్చని, కేవలం ఒక్క గ్రామానికి అన్ని నిధులు ఇచ్చి చేతులు దులుపుకోవడం వల్ల వేలాది గ్రామాలు నష్టపోతాయని ఆ ప్రకటనలో ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

## ఎస్ఎంఎస్ చాలు.. ముందుంటాం: డీజీపీ



**సాక్షి, హైదరాబాద్:** వేధింపులపై మహిళలు, యువతులు మౌనం వీడాలని, తమకు ఒక్క ఎస్ఎంఎస్ చేసినా సాయం చేయడానికి తెలంగాణ పోలీసులు క్షణాల్లో మీ ముందుంటారని డీజీపీ మహేందర్‌రెడ్డి అన్నారు. మీరు ఏ పరిస్థితుల్లో ఉన్నా, ఎవరు మిమ్మల్ని ఇబ్బంది పెడుతున్నా.. వారి వేధింపులను భరించాల్సిన అవసరం లేదని మంగళవారం ట్వీట్‌లో తెలిపారు. సోషల్ మీడియా, ఎస్ఎంఎస్ ద్వారా మహిళలు తమ ఇబ్బందులను పోలీసుల దృష్టికి తీసుకురావచ్చని సూచించారు. తమను సంప్రదించిన క్షణాల్లో చర్యలు తీసుకుంటామని మహిళలకు భరోసా నిచ్చారు.

## గెస్ట్ లెక్చరర్ల కొనసాగింపునకు ఆదేశాలు

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో గెస్ట్ లెక్చరర్లను కొనసాగించేందుకు ప్రభు త్వం ఓకే చెప్పింది. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి బి.జనార్దన్‌రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు గతేడాది పని చేసిన గెస్ట్ లెక్చరర్లను కొనసాగించాలని ఇంటర్మీడియట్ కమిషనర్ అశోక్‌ను ఆదేశించారు. ఉత్తర్వుల జారీ పట్ల విద్యాశాఖ కార్యదర్శి జనార్దన్‌రెడ్డి, ఇంటర్ విద్యా కమిషనర్ అశోక్, ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం అధ్యక్షుడు పి.మధుసూదన్‌రెడ్డికి గెస్ట్ లెక్చరర్ల సంఘం ధన్యవాదాలు తెలిపింది.

## ఆల్మట్టిలోకి 15వేల క్యూసెక్కులు

**సాక్షి, హైదరాబాద్:** ఎగువ కర్ణాటకలోని ఆల్మట్టికి ప్రవాహాలు తగ్గినా, ఒక టీఎంసీకి తగ్గకుండా ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 15,300 క్యూసెక్కుల మేర ప్రవాహం వస్తోంది. దీంతో ఆల్మట్టిలో ప్రస్తుతం 129 టీఎంసీలకు గానూ 119 టీఎంసీల మేర నిల్వలున్నాయి. మరో 10 టీఎంసీలు చేరితే ప్రాజెక్టు నిండనుంది. ఇక దిగువ నారాయణపూర్ ప్రాజెక్టులోకి పూర్తిగా ప్రవాహాలు తగ్గాయి. ప్రాజెక్టులో 37 టీఎంసీలకు గానూ 34 టీఎంసీల నిల్వలుండగా, 4,500 క్యూసెక్కుల నీటిని కాల్వలకు వదులుతున్నారు.

# హోంగార్డులు భారమయ్యారు!

- ఏడాదిలో 11 నెలలే జీతభత్యాలు, మరో నెల పస్తే..
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో హోంగార్డుల వెతలు
- నిధుల కొరతతో దాదాపు ఏడాదిగా ఇదే సమస్య
- పెరిగిన వేతనం భరించలేక వెనక్కి పంపిస్తోన్న ఇతర శాఖలు
- డీజీపీ పర్యటనతోనైనా పరిస్థితి మారుతుందని ఆశ



**సాక్షి, హైదరాబాద్:** దేవుడు వరమిచ్చినా.. పూజారి అడ్డుకున్నట్లుగా ఉంది తెలంగాణ హోంగార్డుల పరిస్థితి. కనీస వేతనం అమలులో భాగంగా ప్రభుత్వం హోంగార్డులకు రూ. 22,000లను అమలు చేస్తోంది. ప్రస్తుతం ఇదే వారికి ఇబ్బందికరంగా మారింది. ఎన్నో పోరాటాల తరువాత వీరికి కనీస వేతనం దక్కింది. ఇక్కడ వేతనం పెంచాక పొరుగున ఉన్న ఏపీ కూడా ఇదే వేతనాన్ని అమలు చేస్తుండటం గమనార్హం. వివిధ శాఖలకు డిప్యుటేషన్‌పై వెళ్లిన హోంగార్డులను మాతృశాఖకు పంపడం కొత్త సమస్యలకు కారణమవుతోంది.

**కారణం ఏంటి?**

తెలంగాణ వ్యాప్తంగా మొత్తం సుమారు 20 వేల మందికిపైగా హోంగార్డులు పనిచేస్తున్నారు. వీరిలో చాలామంది టీఎస్ ఆర్టీసీ, దేవాదాయ, జెన్‌కో, ఆర్టీఏ, ఆర్కియాలజీ తదితర శాఖలకు డిప్యుటేషన్‌పై వెళ్లారు. మొన్నటిదాకా వీరికి ఆయా శాఖలే వేతనాలు చెల్లించాయి. అయితే, పెరిగిన వేతనం భారంగా మారడంతో వీరి స్థానంలో ప్రైవేటు సెక్యూరిటీకే ఆయాశాఖలు మొగ్గుచూపుతున్నాయి. ఇటీవల టీఎస్ ఆర్టీసీ ఏకంగా 600 మంది హోంగార్డులను వారి మాతృ శాఖకు తిరిగి పంపింది. దీంతో వీరి వేతన భారం కూడా ఇపుడు పోలీసు శాఖపైనే పడింది. వాస్తవానికి ఒకప్పటితో పోలిస్తే హోంగార్డులకు ఇప్పుడు గుర్తింపు పెరిగింది. వారి కష్టాన్ని ప్రభుత్వం గుర్తించి రూ. 22 వేల వేతనం, మహిళా హోంగార్డులకు ప్రసూతి సెలవులు, పురుషులకు పితృత్వ సెలవులు కూడా మంజూరు చేసింది. ఇంకా ట్రాఫిక్‌లో పనిచేస్తోన్న హోంగార్డులకు 30 శాతం అదనంగా చెల్లిస్తోంది.

### ఉమ్మడి వరంగల్‌లో ఏం జరుగుతోంది?

వరంగల్‌లో ఏడాది కాలంగా వివిధ శాఖల నుంచి హోంగార్డులు మాతృ సంస్థకు తిరిగి వస్తున్నారు. వీరి వేతనాల కోసం కేటాయించిన నిధులు మాత్రం పాతవే ఉన్నాయి. దీంతో అందరికీ జీతాలు ఇవ్వలేక అధికారులు కొందరికి 'నో వర్క్ నో పే'విధానం అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఓ జాబితా రూపొందించారు. దానిప్రకారం ఎవరు ఏ నెల విధులకు రాకూడదో వారే నిర్ణయించుకుంటున్నారు. దీంతో వచ్చేదే రూ.22 వేల వేతనం. వీరికి క్యాజువల్, సిక్ లీవ్స్ ఉండవు కాబట్టి 30 రోజుల్లో ఎన్ని రోజులు విధులకు హాజరైతే అన్ని రోజులకే వేతనం కట్టి ఇస్తారు. అలాంటిది ఒక నెల పూర్తిగా వేతనం ఆపడం దారుణమని పలువురు హోంగార్డులు వాపోతున్నారు. పిల్లల స్కూలు ఫీజులు, ఇంటి అద్దె చెల్లించలేక నానా ఇబ్బందులు పడుతున్నారు. 'నో వర్క్ నో పే'సమయంలో విధులకు వెళ్లలేక, ఇంటి వద్ద ఉండలేక మానసిక వేదన అనుభవిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సమస్యపై దృష్టి సారించి పూర్తిస్థాయి సిబ్బందికి వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రస్తుతం వరంగల్ పర్యటనలో ఉన్న డీజీపీ ఈ విషయంపై దృష్టి సారించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# ట'మోత' తగ్గట్లే!

- కేజీ టమాటా రూ.50కి పైనే
- వర్షాభావ పరిస్థితులతో రాష్ట్రంలో తగ్గిన సాగు
- పొరుగు రాష్ట్రాల నుంచి దిగుబడి అంతంతే
- క్యాప్సికం, క్యారెట్, కాకర, క్యాలీఫ్లవర్ ధరలు కేజీ రూ. 50కి పైనే



**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో టమాటా ధరలు మోత మోగిస్తున్నాయి. వర్షాకాలంలోనూ ఏ మాత్రం దిగిరావడం లేదు. వర్షాభావ పరిస్థితులు, భూగర్భ జలాల్లో భారీ క్షీణత, బోర్ల కింద సాగు చతికిలబడటంతో జూలై నెలలో సాధారణంగా తగ్గాల్సిన ధరలు తగ్గడం లేదు. గతేడాది ఇదే నెలలో గరిష్టంగా కిలో రూ.30 నుంచి రూ.35 పలికిన ధర ఈ ఏడాది రూ.50కి పైనే పలుకుతోంది. రాష్ట్ర పరిధిలో సాగు పూర్తిగా పడిపోవడం, పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చే టమాటాపైనే ఆధారపడటంతో ధరలు ఏ మాత్రం దిగిరానంటున్నాయి. నిజానికి రాష్ట్రంలో టమాటా సాగు విస్తీర్ణం లక్ష ఎకరాలకు మించి ఉండదు. నిజామాబాద్, వికారాబాద్, గజ్వేల్, చేవెళ్ల, మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాల్లో టమాటా సాగు జరుగుతున్నా ఈ ఏడాది అది పూర్తిగా చతికిలబడింది. ఈ జిల్లాల్లో భూగర్భ జలాలు దారుణంగా పడిపోయాయి. ఈ జిల్లాలో సరాసరి మట్టాలు 10 మీటర్ల నుంచి 14 మీటర్ల వరకు తగ్గాయి. దీంతో బోర్ల కింద టమాటా సాగు పూర్తిగా తగ్గింది. సాగు చేసిన పంటల్లోనూ దిగుబడి తగ్గింది. రాష్ట్రం నుంచి వస్తున్న టమాటా కనీసం 10 శాతం అవసరాలను కూడా తీర్చలేకపోతోంది. దీంతో పూర్తిగా పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చే టమాటాపైనే ఆధారపడాల్సి వస్తోంది.

**దిగుమతులు తగ్గడంతో..**

ఆంధ్రప్రదేశ్‌లోని మదనపల్లి, కర్ణాటకలోని కొలార్, చిక్‌మంగళూర్, చింతమణిల నుంచి దిగుమతి అయ్యే టమాటాలపై రాష్ట్రం ఎక్కువగా ఆధారపడాల్సి వస్తుండగా, ప్రస్తుతం అక్కడి నుంచి దిగుమతులు కూడా తగ్గాయి. ముఖ్యంగా మదనపల్లిలోనూ వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో సాగు విస్తీర్ణం తగ్గింది. వస్తున్న కొద్దిపాటి టమాటా కూడా తమిళనాడుకు ఎక్కువగా సరఫరా అవుతుండటంతో రాష్ట్రంపై ప్రభావం చూపుతోంది. గతేడాది జూలై 23న 3 వేల క్వింటాళ్లు, 21న 3,095 క్వింటాళ్లు, 21న 3,490 క్వింటాళ్లు మేర బోయిన్‌పల్లి మార్కెట్‌కు పొరుగు రాష్ట్రాల నుంచి టమాటా రాగా ఈ ఏడాది 23న 2,664 క్వింటాళ్లు, 22న 2,239 క్వింటాళ్లు, 21న 1,800 క్వింటాళ్ల మేర సరఫరా అయినట్లు రికార్డులు చెబుతున్నాయి. ఏకంగా 1,200 క్వింటాళ్ల మేర ఒక్క బోయిన్‌పల్లి మార్కెట్‌కే సరఫరా తగ్గింది. దీంతో జూలైలో తగ్గాల్సిన ధర ఏమాత్రం తగ్గనంటోంది. ఈ పరిస్థితుల్లో మహారాష్ట్ర, రాజస్తాన్ రాష్ట్రాల నుంచి దిగుమతులు పెరగాల్సిన అవసరం ఉంది. దీనికి తోడు ఇప్పుడిప్పుడే పుంజుకుంటున్న వర్షాలతో దిగుబడులు పెరిగితే ధర దిగి వచ్చే అవకాశం ఉంది. లేని పక్షంలో సామాన్యుడికి ట'మోత'తప్పేలా లేదు.

### ఇతర కూరగాయలు రూ. 50 పైనే..

టమాటాతో పాటు క్యారెట్, క్యాప్సికం, క్యాలీఫ్లవర్, కాకర, బీన్స్, బీరకాయ ధరలు ఏ మాత్రం దిగిరావడం లేదు. వీటన్నింటి ధరలు కిలో రూ.50కి పైనే పలుకుతున్నాయి. తమిళనాడు, కర్ణాటక, గుజరాత్ నుంచి దిగుమతులు లేకపోవడంతో క్యాప్సికం ధర రూ.60కి పైనే ఉంది. క్యారెట్ సైతం రూ.70 వరకు ఉంది. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్, మహారాష్ట్ర నుంచి రావాల్సిన కాకర దిగుమతులు తగ్గడంతో దీని ధర కిలో రూ.50 నుంచి రూ. 60కి మధ్యలో ఉంది.



# ఎంపీ దత్తత నీడలో కీసర అడవి

- దత్తత తీసుకుంటున్నట్లు రాజ్యసభ ఎంపీ సంతోష్ కుమార్ ప్రకటన
- ఎంపీ నిధులతో ఎకో టూరిజం పార్కు, అటవీ పునరుజ్జీవన చర్యలు
- కేటీఆర్ బర్త్‌డే సందర్భంగా 'గిఫ్ట్ ఏ స్మైల్'కింద అర్బన్ లంగ్ స్పేస్ అభివృద్ధి

**సాక్షి, హైదరాబాద్:** టీఆర్ఎస్ రాజ్యసభ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ హైదరాబాద్ శివార్లలోని కీసరగుట్ట అటవీ ప్రాంతాన్ని దత్తత తీసుకున్నారు. తన పుట్టినరోజు (జూలై 24) సందర్భంగా దుబారా ఖర్చులు చేయకుండా సమాజహితం కోసం సాయం చేయాలంటూ టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విసిరిన 'గిఫ్ట్ ఏ స్మైల్'చాలెంజ్‌కు స్పందనగా ఎంపీ సంతోష్ కుమార్ ఈ నిర్ణయం తీసుకున్నారు. మొత్తం 2,042 ఎకరాల అడవిలోని కొంత భాగాన్ని ఎంపీ నిధులతో ఎకో టూరిజం ప్రాజెక్టుగా అభివృద్ధి చేసి, మిగతా ప్రాంతాన్ని అటవీ పునరుజ్జీవనం కింద రక్షిత అటవీ ప్రాంతంగా మారుస్తామని ఆయన తన ట్విట్టర్‌లో పేర్కొన్నారు. త్వరలోనే కీసరగుట్ట అటవీ ప్రాంతంలో పర్యటించి అభివృద్ధి ప్రతిపాదనలు సిద్ధం చేస్తామన్నారు. తెలంగాణ ప్రభుత్వం అభివృద్ధి చేస్తున్న అర్బన్ ఫారెస్ట్ పార్కులు అద్భుతంగా ఉన్నాయని, పట్టణ ప్రాంత వాసులు సేదతీరేందుకు, ఆరోగ్యకర జీవనవిధానం అలవర్చుకునేందుకు ఇవి తోడ్పాటునిస్తాయని ఆయన పేర్కొన్నారు. అటవీ ప్రాంతాలు, అర్బన్ లంగ్ స్పేస్‌ల అభివృద్ధి లో పాలుపంచుకోవాల్సిందిగా 'గిఫ్ట్ ఏ స్మైల్' చాలెంజ్ విసిరారు. తన ట్విట్టర్ ద్వారా మాజీ ఎంపీ కవిత, హీరోలు విజయ్ దేవరకొండ, నితిన్, దర్శకుడు వంశీ పైడిపల్లి, పారిశ్రామిక వేత్త ముత్తా గౌతమ్ లను ట్యాగ్ చేశారు. మంచి నిర్ణయంలో తనను కూడా భాగస్వామ్యం చేసినందుకు సంతోష్ కుమార్‌కు వంశీ పైడిపల్లి కృతజ్ఞతలు తెలిపారు.

# ఐపీఎస్ అధికారులు కావలెను!

- రాష్ట్రంలో ఐపీఎస్‌ల కొరత..
- 8 జిల్లాలకు ఎస్పీలుగా నాన్ ఐపీఎస్ ఆఫీసర్లు
- ఇటు కలవరపెడుతున్న సీనియర్ల పదవీ విరమణలు



**సాక్షి, హైదరాబాద్:** ఐపీఎస్ అధికారుల కొరత పోలీసు విభాగాన్ని తీవ్రంగా వేధిస్తోంది. అవసరమైన సంఖ్యలో ఉన్నతాధికారులు లేకపోవడం, మరికొందరిని అప్రాధాన్య విభాగాలకు బదిలీ చేయడంతో ఈ ఇబ్బంది తీవ్రమైంది. అవసరమైన సంఖ్యలో ఐపీఎస్‌లు లేని కారణంగానే ప్రస్తుతం 8 జిల్లాలకు నాన్ కేడర్, అదనపు ఎస్పీ స్థాయి అధికారులనే ఎస్పీలుగా నియమించారు. మరోవైపు రాష్ట్రంలో 23 మంది సీనియర్ ఐపీఎస్ ఆఫీసర్లకు పదోన్నతులు కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఆదేశాలిచ్చినా.. వారికి కొత్త పోస్టింగులు ఇవ్వలేదు. ఐజీలు, డీఐజీ వంటి కీలక పోస్టులకు సైతం ఐపీఎస్ అధికారులు లేకపోవడం పరిస్థితికి అద్దం పడుతోంది.

**10 నుంచి 33 కావడంతో...**

2016 వరకు తెలంగాణలో కేవలం 10 జిల్లాలు మాత్రమే ఉండేవి. రాష్ట్ర ప్రభుత్వం వాటి సంఖ్యను 33కు పెంచింది. వీటిలో కొత్త కమిషనరేట్లు కూడా ఏర్పాటు చేసింది. మొత్తమ్మీద ప్రస్తుతం 18 పోలీసు జిల్లాలు.. వీటికి అదనంగా 9 పోలీసు కమిషనరేట్లున్నాయి. ఒకేసారి ఈ స్థాయిలో పెరగడంతో ఐపీఎస్‌లకు డిమాండ్ ఏర్పడింది. కొరత కారణంగా 8 జిల్లాలకు నాన్ ఐపీఎస్ పోలీసు అధికారులను ఎస్పీలుగా నియమించారు. మరోవైపు డీసీపీ ర్యాంకుల్లోనూ వీరినే నియమించారు. మామూలుగా అయితే, ఉమ్మడి రాష్ట్రంలో పరిస్థితి వేరుగా ఉండేది. ఒక ఐపీఎస్ అధికారి జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టడానికి కనీసం ఆరేళ్ల సమయం పట్టేది. కానీ, కొత్త జిల్లాల ఆవిర్భావంతో అనివార్యంగా ఆ అనుభవం లేకపోయినా, అసలు ఎస్పీ కాకపోయినా ఎస్పీలుగా పని చేయాల్సి వస్తోంది.

**త్వరలో రిటైరయ్యేది వీరే..**

ప్రస్తుతం అడిషనల్ సీపీలుగా ఉన్న ఐపీఎస్ అధికారులు మురళీకృష్ణ, శివప్రసాద్ ఆగస్టులో రిటైర్ అవ్వనున్నారు. ప్రస్తుతం పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్‌కు ఎండీగా ఉన్న మల్లారెడ్డి, వరంగల్ సీపీగా ఉన్న రవీందర్, ఇంటెలిజెన్స్ చీఫ్‌గా ఉన్న నవీన్‌చంద్ వచ్చే ఏడాది జూన్, సెప్టెంబర్‌లలో రిటైర్ కానున్నారు. ఇంకా ఎస్ఐబీలో పనిచేస్తోన్న ప్రభాకర్‌రావు కూడా వచ్చే ఏడాదే పదవీ విరమణ చేయనున్నారు. వీరితోపాటు డీజీపీ ర్యాంకులో ఉన్న రోడ్ సేఫ్టీ అథారిటీ చైర్మన్ కృష్ణప్రసాద్, ప్రింటింగ్ విభాగం అడిషనల్ డీజీగా ఉన్న వీకే సింగ్‌లు వచ్చే ఏడాదే పదవీవిరమణ చేయనున్నారు.

**డిప్యుటేషన్లు సైతం..!**

సీనియర్ ఐపీఎస్ అధికారులు అడిషనల్ డీజీ సౌమ్య మిశ్రా (పోలీస్ వెల్ఫేర్), ఐజీ అకున్ సబర్వాల్ (పౌరసరఫరాల శాఖ, కమిషనర్)లు డిప్యుటేషన్‌కు అర్జీ పెట్టుకున్నారు. వీరిలో సౌమ్య మిశ్రా ఒడిశా కేడర్‌కు వెళ్లేందుకు కేంద్రం అనుమతించగా.. రాష్ట్రం రిలీవ్ చేయాల్సి ఉంది.

### అదనపు బాధ్యతలు..

మరోవైపు ఆకస్మిక బదిలీలు, పెరుగుతున్న రిటైర్మెంట్లు కూడా డిపార్ట్‌మెంట్‌లో కొత్త ఐపీఎస్ అవసరాన్ని నొక్కి చెబుతున్నాయి. ఇప్పటికే కీలకమైన కొన్ని పోస్టులు ఖాళీగా ఉండగా, మరికొన్నింటిని ఇతర అధికారులకు అదనపు బాధ్యతగా అప్పజెప్పారు. హైదరాబాద్ రేంజ్, వరంగల్ రేంజ్‌లకు డీఐజీ స్థానాలు ఖాళీగా ఉన్నాయి. మరోవైపు వెస్ట్‌జోన్ ఐజీగా ఉన్న స్టీఫెన్‌రవీంద్ర ఏపీకి డిప్యుటేషన్‌పై వెళ్తుండటంతో ఆ బాధ్యతలను వరంగల్ రేంజ్ ఐజీ నాగిరెడ్డికి అదనంగా అప్పగించారు. జైళ్ల శాఖ డీజీగా ఉన్న వీకే సింగ్‌ను ఇటీవల ప్రింటింగ్ విభాగానికి బదిలీ చేయడంతో ఆ బాధ్యతలను రోడ్ సేఫ్టీ అండ్ రైల్వేస్ అడిషనల్ డీజీ సందీప్ శాండిల్యకు అప్పగించారు. గత జూన్‌లో గద్వాల ఎస్పీ లక్ష్మీనాయక్, మల్కాజిగిరి డీసీపీ ఉమామహేశ్వరరావులు రిటైరయ్యారు. వనపర్తి ఎస్పీ అపూర్వారావుకు గద్వాల ఇన్‌చార్జి ఎస్పీగా బాధ్యతలు అప్పగించారు.

## కిషన్‌రెడ్డికి బెదిరింపు కాల్స్ చేసిన వ్యక్తి అరెస్టు

**సాక్షి, హైదరాబాద్:** బీజేపీ సీనియర్ నేత, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి జి.కిషన్‌రెడ్డిని ఫోన్ కాల్స్ ద్వారా బెదిరిస్తున్న షేక్ ఇస్మాయిల్‌ను సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఏపీలోని కడప జిల్లాకు చెందిన ఇస్మాయిల్ కొన్నేళ్లుగా కిషన్‌రెడ్డికి వాయిస్ ఓవర్ ఇంటర్‌నెట్ ప్రొటోకాల్ (వీఓఐపీ) ద్వారా కాల్స్ చేస్తూ బెదిరిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. 2017లో కువైట్ వెళ్లిన ఇస్మాయిల్ అక్కడ కారు డ్రైవర్‌గా పని చేశాడు. అక్కడ ఉండగానే ఇంటర్‌నెట్/యూట్యూబ్‌ల్లో కిషన్‌రెడ్డి ప్రసంగాలు విన్నాడు. అలాగే సోషల్‌మీడియాలో వచ్చిన వార్తలు, గాసిప్స్ పైనా దృష్టి పెట్టాడు. వీటి ప్రభావంతో కిషన్‌రెడ్డి ఓ వర్గానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నట్లు భావించిన ఇస్మాయిల్.. ఇంటర్‌నెట్ నుంచే ఆయన నెంబర్ పొందాడు. కువైట్ నుంచే వీఓఐపీ ద్వారా ఫోన్ చేసి బెదిరింపులకు పాల్పడ్డాడు. ఈ ఏడాది మే 20న ఆఖరిసారి బెదిరింపు ఫోన్ అందుకున్న కిషన్‌రెడ్డి సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. దీన్ని సాంకేతికంగా దర్యాప్తు చేసిన పోలీసులు ఇస్మాయిల్‌ను నిందితుడిగా తేల్చారు.

# ప్రభుత్వ సీట్లు వదిలేసి ప్రైవేటు సీట్లకు కౌన్సెలింగ్

- మెడికల్ కన్వీనర్ కోటా భర్తీ కాకముందే యాజమాన్య సీట్లకు కౌన్సెలింగ్
- ప్రభుత్వ సీటు వచ్చే అవకాశమున్న విద్యార్థుల్లో ఆందోళన
- అనవసరంగా బీ, సీ కేటగిరీలో డబ్బులు చెల్లించాల్సిన దుస్థితి
- బ్యాంకు గ్యారెంటీ కూడా ఉండటంతో విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆవేదన



**సాక్షి, హైదరాబాద్:** ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో ఎంబీబీఎస్, బీడీఎస్ కన్వీనర్ కోటా సీట్ల భర్తీ పూర్తికాకముందే ప్రైవేటు కాలేజీల్లోని బీ, సీ కేటగిరీ సీట్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తుండటంపై విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. సాధారణంగా ప్రభుత్వ కాలేజీల్లో సీట్ల భర్తీ అయిపోయాకగానీ ప్రైవేటు సీట్ల వైపు విద్యార్థులు వెళ్లరు. ఇంకా ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో మూడో విడత, ఆ తర్వాత నాలుగో విడత కౌన్సెలింగ్‌లు నిర్వహించాల్సి ఉంది. పైగా జాతీయస్థాయిలో నీట్ రెండో విడత కౌన్సెలింగ్ తర్వాత, నేషనల్ పూల్‌కు రాష్ట్రం నుంచి ఇచ్చిన 15 శాతం సీట్లల్లో భర్తీ కాకుండా మిగిలే సీట్లను తిరిగి వెనక్కి ఇచ్చేస్తారు. వాటిని కూడా మూడో విడత కన్వీనర్ కోటా సీట్లతోపాటు భర్తీ చేస్తారు. అగ్రవర్ణ పేదల (ఈడబ్ల్యూఎస్) కోటాలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో మరో 190 సీట్లు, ఎన్‌సీసీ సీట్లు ఉన్నాయి. వాటన్నింటికీ మూడో విడత కన్వీనర్ కోటా కౌన్సెలింగ్‌లో భర్తీ చేస్తారు. ఇవన్నీ ఉండగా.. వాటి కౌన్సెలింగ్ పూర్తికాకముందే ప్రైవేటు మెడికల్ కాలేజీల్లోని బీ, సీ కేటగిరీ మేనేజ్‌మెంట్ సీట్లను నింపడం కోసం ముందస్తుగానే కౌన్సెలింగ్ నిర్వహించడంపై విమర్శలు వస్తున్నాయి. ఇప్పటివరకు కన్వీనర్ కోటాలో రెండో విడత కౌన్సెలింగ్ మాత్రమే పూర్తయింది. రెండో విడతలో సీట్లు వచ్చిన విద్యార్థులు ఈ నెల 24 లోగా కాలేజీల్లో చేరాల్సి ఉంది. మూడో విడత ఆగస్టు తొలి వారంలో ప్రారంభం కానుంది. అయితే ప్రైవేటు మెడికల్ కాలేజీల్లోని బీ, సీ కేటగిరీలకు ఈ నెల 25 నుంచి 28 వరకు కౌన్సెలింగ్ తేదీలు ప్రకటించడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

**నష్టపోతామని ఆందోళన..**

మూడో విడతలో సీటు వస్తుందన్న ఆశ ఉన్నప్పటికీ, ఏదో భయంతో బీ, సీ కేటగిరీ కౌన్సెలింగ్‌కు విద్యార్థులు హాజరుకాక తప్పని పరిస్థితి. ఒకవేళ అందులో సీటు వస్తే చేరాలా? వద్దా? ఒకవేళ చేరితే కన్వీనర్ కోటాలో మూడో విడత కౌన్సెలింగ్‌లో ప్రభుత్వ సీటు వస్తే ఏమవుతుందనేది అందరినీ తొలుస్తున్న ప్రశ్న. ఏ కేటగిరీలో ప్రభుత్వ కాలేజీలో రూ.10 వేలు, ప్రైవేట్ కాలేజీల్లో రూ.60 వేలుగా ఫీజు ఉంది. అదే బీ కేటగిరీ అయితే ఏడాదికి రూ.12 లక్షలు, సీ కేటగిరీకి రూ.24 లక్షలకు పైగా ఫీజు చెల్లించాల్సి ఉంది. బీ కేటగిరీ కౌన్సెలింగ్‌కు హాజరుకావాలంటే రూ.40 వేలు డీడీనీ యూనివర్సిటీ ఫీజు కింద చెల్లించాలి. సీటు వచ్చిందంటే రూ.12 లక్షలు కాలేజీ ఫీజు, రెండో ఏడాదికి మరో రూ.12 లక్షల గ్యారంటీతో ఆగస్టు రెండో తేదీలోపు ఆయా ప్రైవేటు మెడికల్ కాలేజీలో చేరాలి. అప్పటివరకు ఏ కేటగిరీ మూడో విడత కౌన్సెలింగ్ జరగదు. ఒకవేళ బీ కేటగిరీలో చేరిన తర్వాత ఏ కేటగిరీలో సీటు వస్తే రూ.40 వేలు, కాలేజీకి సంబంధించిన ఇతరత్రా ఫీజులు దాదాపు రూ.50 వేలు వదులుకోవాల్సిందే. అలా అని వదిలేస్తే సీటు పోతుందేమోనని భయం. ఎటూ తేల్చుకోలేక తల్లిదండ్రులు మానసిక క్షోభను అనుభవిస్తున్నారు. ఒకవేళ వదులుకోవాలని ప్రయత్నిస్తే కొన్ని ప్రైవేటు మెడికల్ కాలేజీలు ఇబ్బంది పెట్టే అవకాశముంది. పైపెచ్చు బీ, సీ కేటగిరీ సీట్లకు డబ్బులు సమకూర్చుకోవడం, చెల్లించడం, బ్యాంకు గ్యారంటీ చూపడం తప్పదు. ఇదంతా కూడా మధ్యతరగతి ప్రజలకు అత్యంత భారం కానుంది. దీనిపై కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం అధికారులు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.

### బీ, సీ కేటగిరీ సీట్లు నింపకపోతే సమస్య..

వచ్చే నెల ఒకటో తేదీ నుంచి మెడికల్ కాలేజీ తరగతులు ప్రారంభించాలి. ఇది తప్పనిసరిగా చేపట్టాల్సిన ప్రక్రియ. అప్పటివరకు బీ, సీ కేటగిరీ సీట్లను భర్తీ చేయకపోతే ఏకంగా ప్రైవేటు కాలేజీల్లో 50 శాతం సీట్లు నిండే అవకాశం ఉండదు. అంత తక్కువతో కాలేజీలను ఎలా ప్రారంభించగలం? కన్వీనర్ కోటాలో సీటు వస్తుందా? రాదా? అన్నది విద్యార్థులు వారివారి ర్యాంకులను బట్టి అంచనాకు వచ్చే అవకాశముంది. ఆ ప్రకారం కన్వీనర్ కోటాలో వచ్చేట్లయితే బీ, సీ కే టగిరీలో చేరకుండా ఉండాలి. అంచనా వేయ లేని పరిస్థితుల్లో బీ కేటగిరీలో చేరి.. మూడో దశ కౌన్సెలింగ్‌లో కన్వీనర్ కోటా సీటొస్తే చెల్లించిన డొనేషన్‌ను ప్రైవేటు కాలేజీలు తిరిగి వెనక్కి ఇస్తాయి. అందులో ఎలాంటి ఇబ్బంది ఉండదు. *–కరుణాకర్‌రెడ్డి, వీసీ, కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం*


అసెంబ్లీలో విషణ్ణవదనంతో కుమారస్వామి

# కుమార 'మంగళం'

## విశ్వాస పరీక్షలో ఓడిన సంకీర్ణ ప్రభుత్వం

- కర్ణాటక అసెంబ్లీలో వాడివేడి చర్చ
- కుమారస్వామి రాజీనామాకు గవర్నర్ ఆమోదం
- బీజేపీలో ఆనందోత్సాహాలు; యెడ్డీకి సీఎం పగ్గాలు!

**సాక్షి బెంగళూరు:** దాదాపు మూడు వారాలపాటు కొనసాగిన హైడ్రామాకు తెరపడింది. కర్ణాటకలో 14 నెలలపాటు కొనసాగిన కుమారస్వామి సంకీర్ణ ప్రభుత్వం కుప్పకూలింది. నాటకీయ పరిస్థితుల మధ్య మంగళవారం అసెంబ్లీలో జరిగిన విశ్వాస పరీక్షలో ఓడిపోయింది. ప్రభుత్వంలోని కాంగ్రెస్, జేడీఎస్‌లకు చెందిన 16 మంది ఎమ్మెల్యేల రాజీనామాతో ఈ నెల మొదటి వారంలో రాజకీయ సంక్షోభం మొదలైన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఈ వ్యవహారం అనేక మలుపులు తిరుగుతూ వస్తోంది. గవర్నర్ విధించిన గడువులు కూడా ముగిశాయి. చివరి అంకంగా స్పీకర్ సూచన మేరకు తప్పనిసరి పరిస్థితుల్లో సాయంత్రం అసెంబ్లీలో సీఎం కుమారస్వామి విశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ తీర్మానానికి అనుకూలంగా కాంగ్రెస్ నుంచి 65 మంది, జేడీఎస్‌కు చెందిన 34 మంది కలిపి మొత్తం 99 మంది ప్రభుత్వానికి మద్దతు ఇచ్చారు. బీజేపీకి చెందిన 105 మంది వ్యతిరేకించారు. దీంతో స్పీకర్ రమేశ్ కుమార్ 'సీఎం పెట్టిన తీర్మానం వీగిపోయింది' అని ప్రకటించడంతో ప్రభుత్వ పతనం అనివార్యమైంది. బీజేపీ ప్రభుత్వం ఏర్పడేందుకు మార్గం సుగమమయింది. అంతకుముందు తీర్మానంపై జరిగిన చర్చలో అధికార, ప్రతిపక్ష సభ్యుల వాగ్వాదాలతో సభా వాతావరణం వేడెక్కింది.

ప్రభుత్వం ఏర్పాటైన నాటినుంచి కాంగ్రెస్, జేడీఎస్ నేతల మధ్య విభేదాలు పొడచూపుతూనే ఉన్నాయి. పరస్పర విమర్శలు, క్యాంపు రాజకీయాలతోనే ఏడాదంతా గడిచిపోయింది. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల ఫలితాల ప్రభావం సంకీర్ణంపైనా పడింది. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ రాష్ట్రంలోని స్థానాలన్నిటినీ దాదాపు కైవసం చేసుకోవడంతో కాంగ్రెస్–జేడీఎస్ నేతల మధ్య విభేదాలు మరింత ముదిరాయి. బీజేపీ పరోక్ష ప్రోద్బలంతో సంకీర్ణానికి చెందిన 16 మంది ఎమ్మెల్యేలు రాజీనామాలు సమర్పించారు. అయితే, వీరిని అసెంబ్లీకి హాజరుకావాలంటూ బలవంతం చేయరాదని సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం, అలాగే తీవ్ర హెచ్చరికలు చేసినా రాజీనామా చేసిన వారు తిరిగి వచ్చేందుకు నిరాకరించడంతో కుమారస్వామి సర్కారు పతనానికి దారులు పడ్డాయి. నాలుగు రోజులుగా చర్చలు, వాయిదాల అనంతరం మంగళవారం సభలో బల నిరూపణకు సిద్ధం కావాలని స్పీకర్ గడువు విధించారు. అయితే, తనకు బుధవారం వరకు సమయం ఇవ్వాలని సీఎం కుమారస్వామి కోరగా ఆయన నిరాకరించారు. దీంతో మంగళవారం యథావిధిగా అసెంబ్లీ సమావేశమయింది. సాయంత్రం సభలో కుమారస్వామి విశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు.

**తీర్మానం వీగిపోయిందిలా..**

ప్రత్యర్థి పార్టీల ఉచ్చులో పడకుండా ఇప్పటి దాకా ముంబై వంటి చోట్ల తమ ఎమ్మెల్యేలను రిసార్టులు, హోటళ్లలో బస ఏర్పాటు చేసిన అధికార, ప్రతిపక్షాలు మంగళవారం నాటి బలపరీక్షకు ప్రత్యేకంగా అసెంబ్లీకి బస్సుల్లో తరలించాయి. కాంగ్రెస్–జేడీఎస్‌లకు చెందిన 17 మంది, బీఎస్పీ సభ్యుడు ఒకరు, స్వతంత్రులు ఇద్దరు మొత్తం 20 మంది మంగళవారం సభకు గైర్హాజరయ్యారు. దీంతో సభలో సభ్యుల సంఖ్య 225 నుంచి 204(స్పీకర్ మినహా)కు తగ్గింది. మ్యాజిక్ ఫిగర్ 103 కాగా, తీర్మానానికి అనుకూలంగా 99 మంది, వ్యతిరేకంగా 105 మంది నిలిచారు. ఈ సందర్భంగా జరిగిన చర్చలో ఉద్వేగపూరితంగా ప్రసంగించిన అనంతరం ముఖ్యమంత్రి సభా కార్యకలాపాలను నిర్వేదంతో చూస్తూ తన స్థానంలో కూర్చుండిపోయారు. బీజేపీ సభ్యులు చర్చలో పాల్గొనలేదు. సర్కారు కూలిపోయినట్లు ప్రకటించగానే బీజేపీ ఎమ్మెల్యేల్లో ఆనందోత్సాహాలు పెల్లుబికాయి. బీజేపీ పక్ష నేత, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు యడ్యూరప్పను అభినందించారు.

**సంతోషంగా త్యజిస్తున్నా: కుమారస్వామి**

బలపరీక్షకు ముందు సీఎం కుమారస్వామి సుదీర్ఘంగా ప్రసంగించారు. రెబల్ ఎమ్మెల్యేల నియోజకవర్గాలకు కేటాయించిన నిధుల వివరాలను చదివి వినిపించారు. పలు అభివృద్ధి పనులు కేటాయించినా ప్రభుత్వంపై విశ్వాసం లేకుండా తిరుగుబాటు చేశారని వాపోయారు. అయితే కుమారస్వామి తనకు మూడు గంటల వ్యవధి ఇవ్వాలని కోరగా, త్వరగా ముగించాలని స్పీకర్ సూచించారు. సాయంత్రం 6 గంటలకు ఎట్టి పరిస్థితుల్లో బలపరీక్షను నిర్వహించాలని స్పీకర్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ.. సీఎం పదవి ఎవరికీ శాశ్వతం కాదని, తాను అధికారం కోసం పాకులాడలేదన్నారు. సీఎం కుర్చీని సంతోషంగా వదిలివేస్తున్నట్లు తెలిపారు. బల పరీక్షను వాయిదాలు వేసి స్పీకర్‌ను నొప్పించినందుకు క్షమించాలని కోరారు. సభాపతిని అవమానించాలనే ఉద్దేశం తనకు లేదన్నారు. 10 రోజులుగా జరిగిన పరిణామాల గురించి చర్చించాల్సిన అవసరం లేదన్నారు. 'మాకూ సిగ్గుంది. ఇంకా అధికారంలో కొనసాగలేం. అయినా మేం చేసిన తప్పేంటి? నిజాయతీతో ప్రజల అవసరాలు తీర్చేందుకు కృషిచేశాం. రాజీనామా తర్వాత నేను ఎక్కడికీ పారిపోను. నన్ను ఎందుకు తప్పించారో ప్రజలు కూడా తెలుసుకోవాలి. కుర్చీ శాశ్వతం కాదు' అని అన్నారు. 'మా ప్రభుత్వాన్ని కూలదోసేందుకు బీజేపీ పదేపదే ప్రయత్నించింది. ఆ పార్టీ ప్రభుత్వం కూడా ఎక్కువ కాలం ఉండదు. అదే జరిగితే, ఎన్నికలకు వెళ్లడం ఉత్తమం' అని అన్నారు.

**కుమారస్వామి రాజీనామా**

విశ్వాస పరీక్షలో ఓటమి అనంతరం సీఎం కుమారస్వామి రాజ్‌భవన్‌కు వెళ్లి గవర్నర్ వజూభాయ్ వాలాను కలిసి రాజీనామా సమర్పించారు. ఆయన రాజీనామాను వెంటనే ఆమోదించిన గవర్నర్.. మరో ప్రభుత్వం ఏర్పడేవరకు ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా కొనసాగాలని కోరారు. కాగా, బల పరీక్షలో కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వని బీఎస్పీ ఎమ్మెల్యే ఎన్.మహేశ్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు అధినేత్రి మాయావతి ప్రకటించారు.

**అపవిత్ర మైత్రికి చెల్లుచీటీ: యడ్యూరప్ప**

కర్ణాటకలో బీజేపీ నేతృత్వంలో ప్రజాప్రభుత్వం ఏర్పడనుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బీఎస్ యడ్యూరప్ప ధీమా వ్యక్తం చేశారు. అసెంబ్లీలో బల పరీక్ష అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. గత 14 నెలలుగా రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. కాంగ్రెస్–జేడీఎస్ నేతలు కమీషన్ల కోసం పని చేశారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ –జేడీఎస్ అపవిత్ర మైత్రికి కాలం చెల్లిపోయిందన్నారు.

2018 ఎన్నికల్లో 104 సీట్లు గెలుచుకున్న బీజేపీ ఏకైక అతిపెద్ద పార్టీగా అవతరించింది. అనంతరం ఉప ఎన్నికలో మరో సీటును గెలుచుకుని 105కు బలం పెంచుకుంది. గత ఏడాది మేలో విశ్వాస పరీక్ష ఎదుర్కోకుండానే యడ్యూరప్ప వైదొలగిన విషయం తెలిసిందే. అనంతరం కుమారస్వామి ఆధ్వర్యంలో కాంగ్రెస్–జేడీఎస్ ప్రభుత్వం ఏర్పాటయింది. స్పీకర్, నామినేటెడ్ సభ్యుడితో కలిపి 225 సభ్యులున్న అసెంబ్లీలో రెబెల్స్ రాజీనామాలకు ముందు కాంగ్రెస్, జేడీఎస్ ప్రభుత్వం బలం 117. ఇందులో స్పీకర్ కాకుండా కాంగ్రెస్ 78, జేడీఎస్ (37), బీఎస్పీ (1), నామినేటెడ్ (1)సభ్యులున్నారు.

**ప్రజాస్వామ్యం ఓడింది: రాహుల్**

'ప్రజాస్వామ్యం, నిజాయితీ, రాష్ట్ర ప్రజల తీర్పు' ఓడిపోయాయి అని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. 'సంక్షోభాలు సృష్టించిన వారి లక్ష్యం నేరు నెరవేరింది' అని బీజేపీనుద్దేశించి అన్నారు.

### సభలో బలాబలాలు

| | |
|---|---|
| మొత్తం సభ్యులు (1 నామినేటెడ్ సహా) | 225 |
| సభకు హాజరైనవారు (స్పీకర్‌తో) | 205 |
| మ్యాజిక్ ఫిగర్ | 103 |
| విశ్వాసానికి అనుకూలంగా | 99 |
| విశ్వాసానికి వ్యతిరేకంగా | 105 |
| హాజరుకాని వారు | 20 |

### తదుపరి సీఎం యడ్యూరప్ప!

**న్యూఢిల్లీ:** కర్ణాటకలో ప్రభుత్వం కూలిపోయిన నేపథ్యంలో తర్వాత ఏం చేయాలనేదానిపై బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా తమ పార్టీ నేతలతో సమావేశమై చర్చలు జరిపారు. బీజేపీ కర్ణాటక రాష్ట్ర అధ్యక్షుడు బీఎస్ యడ్యూరప్ప తదుపరి సీఎం అవుతారనే ఊహాగానాలు వెలువడుతున్న నేపథ్యంలో పార్టీ నాయకుడొకరు మాట్లాడుతూ, 'సీఎం పదవిని చేపట్టేది యడ్యూరప్పేనన్నది అందరికీ తెలిసిన విషయమే. అయితే ప్రధాని మోదీ, అమిత్ షా తదితరులతో కూడిన పార్టీ అగ్ర నాయకత్వం దీనిపై తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది' అని చెప్పారు. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి, కర్ణాటకకే చెందిన ప్రహ్లాద్ జోషి మాట్లాడుతూ యడ్యూరప్పకే సీఎం అవకాశాలు అత్యధికంగా ఉన్నప్పటికీ, పార్టీ జాతీయ నాయకత్వం దీనిపై ఇంకా నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు.

**మోదీ, షాతో మాట్లాడాక గవర్నర్‌ను కలుస్తాం: యడ్యూరప్ప**

పార్టీ కేంద్ర నాయకత్వంలోని మోదీ, అమిత్ షాతో సంప్రదింపులు జరిపిన అనంతరం తాము గవర్నర్‌ను కలుస్తామని యడ్యూరప్ప వెల్లడించారు. కుమారస్వామి ప్రభుత్వంతో ప్రజలు విసిగిపోయారనీ, వారి ప్రభుత్వం కూలిపోవడం ప్రజా విజయమని ఆయన అన్నారు. విశ్వాసపరీక్షలో బీజేపీ పక్షానే నిలిచిన 105 మంది బీజేపీ ఎమ్మెల్యేలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఇకనుంచి అభివృద్ధిలో నవశకం మొదలవుతుందని పేర్కొన్నారు.

### 4 రాష్ట్రాల్లోనే..

**న్యూఢిల్లీ:** కాంగ్రెస్‌కు గడ్డు రోజులు కొనసాగుతున్నాయి. లోక్‌సభ ఎన్నికల్లో ఘోర పరాజయం మూటగట్టుకుని, దేశవ్యాప్తంగా కేవలం 52 స్థానాల్లో గెలుపుతో చావుతప్పి కన్నులొట్టపోయిన చందంగా బయటపడిన ఆ పార్టీని కర్ణాటక పరిణామాలు మరో దెబ్బతీశాయి. సంకీర్ణ భాగస్వామి అయిన కుమారస్వామి ప్రభుత్వం కుప్పకూలడంతో కాంగ్రెస్ అధికారంలో ఉన్న మరో రాష్ట్రం 'చే'జారింది. 2018లో కాంగ్రెస్–జేడీఎస్ సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. కర్ణాటకలోనూ అధికారాన్ని కోల్పోవడంతో ప్రస్తుతం 'చేతి'లో నాలుగు రాష్ట్రాలు, ఓ కేంద్రపాలిత ప్రాంతం మాత్రమే ఉన్నాయి. పంజాబ్, మధ్యప్రదేశ్, రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్, పుదుచ్చేరిల్లో మాత్రమే ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వాలు ఉన్నాయి. దక్షిణాదిలో అధికారం పంచుకుంటున్న ఏకైక రాష్ట్రాన్ని కూడా కోల్పోవాల్సి రావడం పార్టీకి దెబ్బగానే కాంగ్రెస్ సీనియర్ నేతలు భావిస్తున్నారు.

### ముచ్చటగా ముగ్గురే!

**ఐదేళ్లు పూర్తి చేసుకున్న సీఎంలు వీరే**


నిజలింగప్ప


దేవరాజ్


సిద్ధ రామయ్య

**న్యూఢిల్లీ:** కర్ణాటక చరిత్రలో ఐదేళ్ల పూర్తి కాలం కొనసాగిన ముఖ్యమంత్రులు ముగ్గురే. వారు కూడా కాంగ్రెస్ పార్టీ వారే కావడం గమనార్హం. ఎస్.నిజలింగప్ప (1962–68), డీ దేవరాజ ఉర్స్ (1972–77), సిద్దరామయ్య (2013–18) మాత్రమే విజయవంతంగా తమ పదవీకాలాన్ని ముగించగలిగారు. బీజేపీ నుంచి కానీ జేడీఎస్ నుంచి కానీ ఎవరూ ఐదేళ్లు సీఎంగా నిలవలేకపోయారు. గతంలో బీజేపీ సంకీర్ణంలో భాగంగా సీఎం పదవి చేపట్టిన కుమారస్వామి రెండేళ్లలోపే గద్దె దిగారు. ఫిబ్రవరి 2006 నుంచి అక్టోబర్ 2007 వరకు మాత్రమే అప్పుడు ఆయన సీఎంగా ఉన్నారు. అనంతరం కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకుని మరోసారి 2018 మే నెలలో ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన కుమారస్వామి.. విశ్వాస పరీక్షలో ఓడిపోవడంతో 2019 జూలై 23న రాజీనామా చేశారు. బీజేపీ విషయానికి వస్తే.. 2007లో తొలిసారి సీఎం అయిన యడ్యూరప్ప జేడీఎస్ మద్దతు ఉపసంహరించుకోవడంతో వారం రోజులకే పదవీచ్యుతులయ్యారు. మరోసారి, 2018 మే 17 నుంచి 23 వరకే అధికారంలో కొనసాగి, మెజారిటీ లేకపోవడంతో రాజీనామా చేశారు. 1956లో కర్ణాటక రాష్ట్రం ఏర్పడింది. ఇప్పటివరకు 25 మంది ముఖ్యమంత్రులుగా పనిచేశారు.

### సంక్షోభం సాగిందిలా..



- **2019 జూలై 1:** కుమారస్వామి సర్కార్‌తో విభేదాలతో ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేల రాజీనామా.
- **జూలై 6:** రాజీనామా చేసిన మరో ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ముగ్గురు జేడీఎస్ ఎమ్మెల్యేలు. మొత్తంగా 11 మంది ఎమ్మెల్యేల రాజీనామాలు అందాయని స్పీకర్ ప్రకటన. రెబెల్స్ అంతా విమానంలో ముంబైకి వెళ్లారు.
- **జూలై 7:** అమెరికా నుంచి తిరిగొచ్చిన కుమారస్వామి
- **జూలై 8:** మంత్రి పదవులకు రాజీనామా చేసిన ఇద్దరు స్వతంత్ర ఎమ్మెల్యేలు నగేశ్, శంకర్. బీజేపీకి మద్దతు.
- **జూలై 9:** 8 మంది ఎమ్మెల్యేల రాజీనామాలు సక్రమంగా లేవన్న స్పీకర్. సరైన ఫార్మాట్‌లో పంపాలని సూచన. సీఎల్పీ భేటీ. 20 మంది ఎమ్మెల్యేల డుమ్మా. మరో ఎమ్మెల్యే రోషన్ బేగ్ రాజీనామా.
- **జూలై 10:** ముంబైలో ఒక ఫైవ్ స్టార్ హోటల్‌లోని ముగ్గురు అసంతృప్త నేతల్ని బుజ్జగించడానికి కాంగ్రెస్ నేత శివకుమార్ రంగంలోకి దిగారు. ఎమ్మెల్యేలు ఆయనను కలవడానికి నిరాకరించి పోలీసుల సాయాన్ని అభ్యర్థించారు. మరో ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఎంటీబీ నాగరాజ్, డాక్టర్ కె.సుధాకర్ రాజీనామా
- **జూలై 11:** స్పీకర్ తమ రాజీనామాలు చెల్లవని తోసిపుచ్చడాన్ని సవాల్ చేస్తూ సుప్రీం తలుపు తట్టిన రెబెల్ ఎమ్మెల్యేలు
- **జూలై 17:** రాజీనామాలపై తుది నిర్ణయం స్పీకర్‌దేనన్న సుప్రీంకోర్టు. దానికి నిర్దిష్ట సమయం అంటూ లేదని, సభకు హాజరు కావాలా వద్దా అన్నది రెబెల్ ఎమ్మెల్యేల ఇష్టమని స్పష్టీకరణ. తన రాజీనామాను వెనక్కి తీసుకున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే రామలింగారెడ్డి.
- **జూలై 18:** ఇదే రోజు కర్ణాటకలో సీఎం కుమారస్వామి తన బలాన్ని నిరూపించుకోవాల్సి ఉండేది. అయితే 15 మంది రెబెల్ ఎమ్మెల్యేలు సహా 21 మంది అసెంబ్లీకి గైర్హాజరయ్యారు. బీజేపీ తమ ఎమ్మెల్యేలను అపహరించిందంటూ సభలో కాంగ్రెస్–జేడీఎస్ కూటమి ఆరోపణలు. సభకు హాజరుకావడంపై ఎమ్మెల్యేలకు స్వేచ్ఛ ఇస్తే, విప్ జారీ చేసి ఉపయోగం ఉండదని, దీనిపై స్పష్టత కావాలంటూ వాదించిన కాంగ్రెస్. విశ్వాసపరీక్ష జరగకుండా సభ వాయిదా వేయడంతో సభలోనే రాత్రంతా కూర్చొని బీజేపీ ఎమ్మెల్యేల నిరసన ప్రదర్శన
- **జూలై 19:** శుక్రవారం సభలో విశ్వాస పరీక్ష జరపాలని గవర్నర్ వజూభాయ్ రెండుసార్లు సీఎం కుమారస్వామికి లేఖలు రాశారు. అయినా సీఎం, స్పీకర్ ఆయన ఆదేశాలను పట్టించుకోలేదు. గందరగోళ పరిస్థితుల మధ్య సభ వాయిదా
- **జూలై 22:** సభలో బలాన్ని నిరూపించుకోవడానికి బుధవారం వరకూ స్పీకర్‌ని గడువు కోరిన కుమారస్వామి. నిరాకరించిన స్పీకర్. విశ్వాస పరీక్షపై కాలయాపన ఎవరికీ మంచిది కాదని హితవు. విశ్వాస తీర్మానం చర్చకు సంబంధించి ఎమ్మెల్యేల ప్రసంగాన్ని తగ్గించాలంటూ స్పీకర్ అసహనం. అధికార, విపక్ష సభ్యుల గందరగోళం మధ్యే సభ వాయిదా.
- **జూలై 23:** ఎట్టకేలకు బలపరీక్ష నిర్వహణ. కుప్పకూలిన కుమారస్వామి సర్కార్. గైర్హాజరైన 21 మంది ఎమ్మెల్యేలు. కుమారస్వామి ప్రభుత్వానికి అనుకూలంగా 99 ఓట్లు, వ్యతిరేకంగా 105 ఓట్లు.

## చైనా మాజీ ప్రధాని లీపెంగ్ కన్నుమూత



**బీజింగ్:** చైనా మాజీ ప్రధాని, తియానన్మెన్ స్క్వేర్‌లో వేలాది మంది ఊచకోతకు కారకుడు లీపెంగ్(90) కన్నుమూశారు. నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్ లీపెంగ్ అనారోగ్యంతో సోమవారం బీజింగ్‌లో మృతి చెందినట్లు అధికార వార్తా సంస్థ జిన్హువా వెల్లడించింది. ఇంతకుముందు ఆయన మూత్రాశయ కేన్సర్‌తో బాధపడ్డారు. 1989లో దేశ రాజధాని బీజింగ్‌లోని తియానన్మెన్ స్క్వేర్‌లో ప్రజాస్వామ్యవాదులు కొన్ని వారాలపాటు శాంతియుత నిరసనలు తెలిపారు. ఆ సమయంలో ప్రధానిగా ఉన్న లీపెంగ్ బీజింగ్‌లో మార్షల్ లా విధించారు. అయినప్పటికీ ఉద్యమకారులు వెనక్కి తగ్గలేదు. దీంతో 1989 జూన్ 3, 4వ తేదీల్లో తియానన్మెన్ స్క్వేర్‌లో బైఠాయించిన నిరసనకారుల పైకి సైన్యాన్ని పంపారు. యుద్ధట్యాంకులతో వారిని నిర్దాక్షిణ్యంగా తొక్కించారు. దీంతో నిరాయుధులైన వెయ్యి మందికి పైగా యువకులు, కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. ప్రజాస్వామ్యం కోసం జరిగిన పోరాటాన్ని చైనా ఉక్కుపాదంతో అణచివేయడంపై అంతర్జాతీయంగా తీవ్ర ఆగ్రహం వ్యక్తమయింది. అప్పటి నుంచి లీ పెంగ్ ప్రపంచం దృష్టిలో అణచివేతకు ప్రతిరూపంగా, బీజింగ్ కసాయి (బుచర్ ఆఫ్ బీజింగ్)గా నిలిచిపోయారు. సైనిక చర్య చైనా అధికార కమ్యూనిస్టు పార్టీ ఏకగ్రీవ నిర్ణయమైనప్పటికీ, ఈ ఘటనకు లీపెంగ్‌నే బాధ్యుడిగా భావిస్తారు. ఆయన ఆ తర్వాత కూడా తన నిర్ణయాన్ని 'అవసరమైన చర్య'గా సమర్థించుకున్నారు. 'ఇలాంటి చర్యలు తీసుకోకుంటే ఒకప్పటి సోవియట్ యూనియన్, పశ్చిమ యూరప్‌ల్లోని కమ్యూనిస్టు ప్రభుత్వాలకు పట్టిన గతే చైనాకూ పట్టేది' అని 1994లో ఆస్ట్రేలియా పర్యటన సందర్భంగా లీపెంగ్ వ్యాఖ్యానించడం గమనార్హం.

## మరో పది రోజులు పార్లమెంట్!

**సాక్షి ప్రతినిధి, న్యూఢిల్లీ:** పార్లమెంట్ సమావేశాలు మరో 10 రోజులు కొనసాగే అవకాశం కనిపిస్తోంది. ఈ మేరకు ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఎంపీలకు తెలిపినట్లు విశ్వసనీయవర్గాలు తెలిపాయి. కీలకమైన పలు బిల్లులు పెండింగ్‌లో ఉన్నందునే సమావేశాలను పొడిగిస్తున్నట్లు సమాచారం. తదుపరి వివరాలను, తేదీలను పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి బుధవారం వెల్లడిస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి. సమావేశాలు ముగిసే వరకూ ఎలాంటి కార్యక్రమాలు పెట్టుకోవద్దని పార్టీ ఎంపీలకు అమిత్‌షా సూచించినట్లు సమాచారం. కేంద్రం సీరియస్‌గా తీసుకుంటున్న ట్రిపుల్ తలాక్ బిల్లు కూడా ఆమోదించాల్సిన బిల్లుల జాబితాలో ఉంది.

## అస్సాం ఎన్ఆర్సీ ప్రచురణ గడువు పెంపు

**న్యూఢిల్లీ:** అస్సాంలో జాతీయ పౌర జాబితా(ఎన్ఆర్సీ) తుది ప్రచురణ గడువును ఆగస్టు 31 వరకు సుప్రీంకోర్టు పొడిగించింది. అలాగే జాబితాలోని 20 శాతాన్ని పునఃపరిశీలించేందుకు అనుమతి కోరుతూ అస్సాం, కేంద్ర ప్రభుత్వాలు దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఈ మేరకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ ఆర్ఎఫ్ నారీమన్‌లతో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది.

## ఐఎస్ఐ సమాచారంతోనే లాడెన్ హతం

**వాషింగ్టన్:** కరుడుకట్టిన ఉగ్రవాది, ఆల్ ఖైదా చీఫ్ ఒసామా బిన్ లాడెన్‌ను అంతమొందించడంలో అమెరికాకు చెందిన సెంట్రల్ ఇన్ఫర్మేషన్ ఏజెన్సీకి (సీఐఏ) పాకిస్తాన్‌కు చెందిన ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్ (ఐఎస్ఐ) సాయం చేసిందని పాకిస్తాన్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ వెల్లడించారు. లాడెన్‌ను పట్టుకోవడంలో ఐఎస్ఐ కీలక పాత్ర పోషించిందని తెలిపారు. లాడెన్ ఎక్కడున్నాడనే సమాచారాన్ని ఫోన్ ద్వారా అందించిందన్నారు. ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న ఇమ్రాన్ వాషింగ్టన్‌లోని ఓ మీడియా సంస్థతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. అమెరికా లాడెన్‌ను చంపేంత వరకు ఆయన తమ దేశంలో ఉన్నాడనే విషయం తెలియదని ఇప్పటిదాకా పాక్ వాదించిన నేపథ్యంలో ఇమ్రాన్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అమెరికాను తామెప్పుడూ మిత్ర దేశంగానే భావించామని.. అందుకే లాడెన్‌కు సంబంధించిన సమాచారం అందించామని చెప్పారు. అమెరికా మాత్రం తమ దేశంపై నమ్మకం ఉంచలేకపోయిందని వ్యాఖ్యానించారు.

## మోటారు వాహనాల బిల్లుకు లోక్‌సభ ఓకే

**రాష్ట్రాలు దీన్ని అమలు చేయడం తప్పనిసరేం కాదు: గడ్కరీ**


లోక్‌సభలో మాట్లాడుతున్న గడ్కరీ

**న్యూఢిల్లీ:** రోడ్డు రవాణా వ్యవస్థలో కీలక మార్పులు తీసుకొచ్చేందుకు ఉద్దేశించిన మోటారు వాహనాల (సవరణ) బిల్లు–2019ని లోక్‌సభ మంగళవారం ఆమోదించింది. రవాణా వ్యవస్థలో అవినీతిని తొలగించడం, ప్రయాణికుల, వాహనదారుల భద్రతను మెరుగుపర్చడం, ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు సాంకేతికతను ఉపయోగించడం ఈ బిల్లు ముఖ్య ఉద్దేశాలు. బిల్లును మూజువాణి ఓటుతో లోక్‌సభ ఆమోదించింది. అలాగే ప్రతిపక్షాలు ప్రతిపాదించిన పలు సవరణలను కూడా లోక్‌సభ మూజువాణి ఓటుతోనే తిరస్కరించింది. రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ మాట్లాడుతూ, మరింత ఉత్తమమైన, సాఫీ ప్రయాణాన్ని అందించే రోడ్లను నిర్మిస్తామన్న తమ హామీని నిలబెట్టుకుంటామని తెలిపారు. పార్టీలకు అతీతంగా అనేక మంది సభ్యులు ఈ బిల్లులోని భద్రత, ట్రాఫిక్ ఉల్లంఘనలకు జరిమానాల నిబంధనలను ప్రశంసించారు. అయితే రాష్ట్రాల హక్కులకు ఈ చట్టం భంగం కలిగిస్తుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. గడ్కరీ దీనికి సమాధానిమిస్తూ, రాష్ట్రాలను సంప్రదించిన తర్వాతనే జాతీయ రవాణా విధానాన్ని రూపొందిస్తామని చెప్పారు. అలాగే ఇది తప్పనిసరి చట్టం కాదనీ, ఈ నిబంధనలను వద్దనుకునే రాష్ట్రాలు ఈ చట్టాన్ని అమలు చేయాల్సిన అవసరం లేదని గడ్కరీ స్పష్టం చేశారు.

**బడ్జెట్ బిల్లులకు పార్లమెంటు ఆమోదం**

మోదీ నేతృత్వంలోని రెండో ప్రభుత్వపు తొలి బడ్జెట్ బిల్లులను పార్లమెంటు మంగళవారం ఆమోదించింది. వినియోగాధికారం బిల్లు–2019, ఆర్థికబిల్లు–2019లను ఇప్పటికే లోక్‌సభ ఆమోదించగా, మంగళవారం రాజ్యసభ కూడా వాటిని ఆమోదించింది.

### • ఈమె నా స్పెషల్ ఫ్రెండ్: మోదీ



**ప్రత్యేక మిత్రురాల్ని కలిశానంటూ ప్రధాని మోదీ తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ పోస్ట్ పెట్టారు. మంగళవారం పార్లమెంటు హౌస్‌లోని తన కార్యాలయంలో ఓ పాపను ఎత్తుకొని ఉన్న ఫొటోలను ఆయన షేర్ చేశారు. ఫొటోల్లో పాప మోదీ ఒళ్లో కూర్చొని చాకొలేట్‌ను చూస్తున్న ఫొటోతో పాటు, చిన్న ఆటబొమ్మతో ఆడుకుంటున్న ఫొటో కూడా ఉంది. ఈ పాప మధ్యప్రదేశ్‌కు చెందిన బీజేపీ రాజ్యసభ ఎంపీ సత్యనారాయణ్ జతియా మనవరాలు. ఇన్‌స్టాగ్రామ్‌లో మోదీకి 2.53 కోట్ల మంది ఫాలోవర్లు ఉన్నారు.**

## బ్రిటన్ కొత్త ప్రధానిగా బోరిస్ జాన్సన్

- పార్టీ నాయకత్వ ఎన్నికలో విజయం
- నేడు దిగిపోనున్న థెరెసా మే
- కేబినెట్‌లో భారత సంతతి ఎంపీలు?


లండన్‌లో అభివాదం చేస్తున్న బోరిస్

**లండన్:** బ్రిటన్‌లోని అధికార కన్జర్వేటివ్ పార్టీ నేతగా బోరిస్ జాన్సన్ (55) ఘన విజయం సాధించారు. దీంతో బ్రిటన్‌కు తర్వాతి ప్రధానిగా ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు. బ్రెగ్జిట్‌ను ముందుకు తీసుకెళ్లలేకపోతుండటంతో పార్టీలో వ్యతిరేకత కారణంగా ప్రస్తుత ప్రధాని థెరెసా మే పార్టీ నాయకత్వ పదవికి, తద్వారా ప్రధాని పదవికి రాజీనామా చేయడం తెలిసిందే. దీంతో కన్జర్వేటివ్ పార్టీకి కొత్త నాయకుడిని నియమించేందుకు జరిపిన అంతర్గత ఎన్నికల్లో తన ప్రత్యర్థి జెరెమీ హంట్‌పై బోరిస్ జాన్సన్ 45 వేలకు పైగా ఓట్ల తేడాతో గెలుపొందారు. విలేకరిగా వృత్తి జీవితం ప్రారంభించి, రాజకీయాల్లోకి వచ్చి అనేక పదవులు చేపట్టిన, విదేశాంగ శాఖ మాజీ మంత్రి అయిన జాన్సన్‌కు 92,153 ఓట్లు పడగా, హంట్‌కు 46,656 ఓట్లు దక్కాయి. కొత్త ప్రధానిగా బాధ్యతలు చేపట్టనున్న బోరిస్ జాన్సన్ ముందున్న అతిపెద్ద సవాల్ బ్రెగ్జిట్ ప్రక్రియను పూర్తి చేయడమే. ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది అక్టోబర్ 31లోపు బ్రెగ్జిట్ ప్రక్రియను ముగిస్తానని చెప్పారు. మరోవైపు బ్రెగ్జిట్ విషయంలో జాన్సన్ విధానాలు నచ్చని కొందరు మంత్రులు ఆయన గెలుపు ఖాయమైన వెంటనే తమ పదవులకు రాజీనామా చేశారు. ప్రధాని బాధ్యతలు చేపట్టిన అనంతరం జాన్సన్ ప్రస్తుత మంత్రివర్గంలోనూ మార్పులు చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. తన మాజీ భార్యకు అమ్మ (అత్త) భారతీయురాలైనందున తాను ఇండియాకు అల్లుడినని గతంలో బోరిస్ జాన్సన్ చెప్పుకునేవారు. ఆయనకు సన్నిహితులైన భారత సంతతి ఎంపీలు ప్రీతీ పటేల్, రిషి సునక్‌లకు జాన్సన్ మంత్రివర్గంలో స్థానం కల్పిస్తారని తెలుస్తోంది. మరోవైపు బ్రిటన్ ప్రస్తుత ప్రధాని థెరెసా మే తన చివరి మంత్రివర్గ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. హౌస్ ఆఫ్ కామన్స్‌లో బుధవారం 'ప్రధానికి వచ్చిన ప్రశ్నలు'కు చివరిగా సమాధానం చెప్పిన అనంతరం నేరుగా బకింగ్‌హామ్ ప్యాలెస్‌కు వెళ్లి రాణి ఎలిజబెత్‌ను కలిసి తాను పదవి నుంచి దిగిపోతున్నట్లు చెప్తారు. అనంతరం కొత్త ప్రధానిగా బాధ్యతలు చేపట్టాల్సిందిగా జాన్సన్‌ను రాణి ఆహ్వానిస్తారు.

**భారత్‌పై ప్రత్యేక దృష్టి.:** భారత్–బ్రిటన్‌ల వాణిజ్య సంబంధాలను మరింత మెరుగుపరచడం కోసం భారత ప్రధాని మోదీతో తనకున్న వ్యక్తిగత అనుబం ధాన్ని జాన్సన్ వాడుకోవచ్చనే ఊహాగానాలు వస్తున్నాయి. ఎన్నికల ప్రచారం సమయంలోనూ పార్టీలోని భారత సంతతి ప్రజలపై ఆయన ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. తాను గెలిస్తే భారత్‌తో మంచి సంబంధాలను నెలకొల్పడమే కాకుండా, ఇండియా నుంచి విద్యార్థులు, ఉద్యోగులు బ్రిటన్‌కు వచ్చేందుకు సరళతర విధానాలను రూపొందిస్తానని ఆయన హామీనిచ్చారు. బ్రిటన్‌కు భారత్ అత్యంత ముఖ్యమైన భాగస్వామిగా ఉండా లని తాను కోరుకుంటున్నానని ఇటీవల జాన్సన్ చెప్పారు.

## పార్లమెంట్‌లో 'ట్రంప్' దుమారం

- కశ్మీర్‌పై ట్రంప్ ప్రకటనపై పార్లమెంటు ఉభయ సభల్లో విపక్షాల నిరసనలు
- ప్రధాని వచ్చి రెండు సభల్లోనూ సమాధానం చెప్పాలని డిమాండ్


రాజ్యసభలో మంత్రి జైశంకర్

**న్యూఢిల్లీ/వాషింగ్టన్:** పాకిస్తాన్‌తో కశ్మీర్ వివాదం పరిష్కారంలో మధ్యవర్తిగా వ్యవహరించాల్సిందిగా భారత ప్రధాని నరేంద్ర మోదీ తనను కోరారంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పడం దేశంలో రాజకీయంగా దుమారం రేపుతోంది. ట్రంప్‌ను మోదీ అలా కోరి ఉంటే ఆయన దేశానికి వెన్నుపోటు పొడిచినట్లేనని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ధ్వజమెత్తారు. ఈ విషయంలో ప్రతిపక్షాలన్నీ మోదీపై మండిపడుతున్నాయి. పార్లమెంటు ఉభయ సభల్లోనూ ఈ అంశంపై విపక్ష పార్టీల సభ్యులు నిరసనలకు దిగారు. అయితే కశ్మీర్ వివాదం పరిష్కారం కోసం ట్రంప్ సాయాన్ని మోదీ కోరలేదని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. ఆ శాఖ మంత్రి ఎస్.జై శంకర్ మంగళవారం రాజ్యసభలో మాట్లాడుతూ పాకిస్తాన్‌తో ఉన్న అన్ని సమస్యలనూ ద్వైపాక్షికంగా మాత్రమే పరిష్కరిస్తామనీ, అది కూడా ఆ దేశం సీమాంతర ఉగ్రవాదాన్ని నిలిపివేసిన తర్వాతనే జరుగుతుందని ఉద్ఘాటించారు. అటు అమెరికా కూడా నష్ట నివారణ చర్యలకు దిగి, కశ్మీర్ సమస్య భారత్–పాకిస్తాన్‌ల మధ్య ఉన్న ద్వైపాక్షిక విషయమనీ, దీనిని పరిష్కరించుకునేందుకు ఆ రెండు దేశాలూ కలిసి కూర్చొని మాట్లాడుకుంటే ట్రంప్ ప్రభుత్వం స్వాగతిస్తుందని అమెరికా విదేశాంగ శాఖ బుధవారం వెల్లడించింది. ఉగ్రవాదంపై పాకిస్తాన్ కఠిన చర్యలు తీసుకుంటే భారత్‌తో ఆ దేశం జరిపే చర్చలు విజయవంతం అవుతాయని పేర్కొంది. ప్రస్తుతం పాకిస్తాన్ ప్రధానమంత్రి ఇమ్రాన్ ఖాన్ అమెరికాలో పర్యటిస్తున్నారు. ఆయన సోమవారం ట్రంప్‌ను కలిశారు. ఇమ్రాన్ ఖాన్ సమక్షంలోనే ట్రంప్ మీడియాతో మాట్లాడుతూ, జూన్‌లో జపాన్‌లోని ఒసాకాలో జరిగిన జీ–20 సదస్సు సమయంలో తాను మోదీతో భేటీ అయినప్పుడు, కశ్మీర్ అంశంపై మధ్యవర్తిగా ఉండాలంటూ మోదీ తనను కోరారని చెప్పారు. ఇరు పక్షాలూ ఒప్పుకుంటే తాను మధ్యవర్తిత్వం చేస్తానని ట్రంప్ చెప్పడంతో ఇమ్రాన్ ఖాన్ దీన్ని స్వాగతించారు. తాజాగా ఆయన ఓ ట్వీట్ చేస్తూ, మధ్యవర్తిత్వం చేస్తానంటూ ట్రంప్ ప్రకటించడంపై భారత స్పందన తనను ఆశ్చర్యానికి గురిచేస్తోందని పేర్కొన్నారు. 70 ఏళ్లుగా కశ్మీర్ సమస్య నానుతోందనీ, కశ్మీరీలు తరతరాలుగా ఈ సమస్యను ఎదుర్కొంటున్నాయని ఇమ్రాన్ ఖాన్ అన్నారు.

**సభకు మోదీ వచ్చి సమాధానం చెప్పాలి**

ట్రంప్ ప్రకటనపై ఉభయసభల్లోనూ దుమారం రేగింది. ఈ అంశంపై నిరసనల కారణంగా రాజ్యసభ పలుమార్లు వాయిదా పడగా, లోక్‌సభ నుంచి విపక్షాలు బయటకు వెళ్లిపోయాయి. రాజ్యసభలో కాంగ్రెస్ ఉప నాయకుడు ఆనంద్ శర్మ మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన దేశానికి అధ్యక్షుడైన ట్రంప్ మన దేశ ప్రధాని గురించి ఈ మాటలన్నారు కాబట్టి, మోదీ సభకు వచ్చి ఈ విషయంపై సమాధానం చెప్పి స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

### ఒట్టి ఖండన సరిపోదు: రాహుల్

ట్రంప్ చెబుతున్నది నిజమైతే భారత ప్రయోజనాలకు మోదీ వెన్నుపోటు పొడిచినట్లేనని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ అన్నారు. ట్రంప్ ప్రకటనను ఖండిస్తూ భారత విదేశాంగ శాఖ సోమవారం రాత్రే ఓ ప్రకటన విడుదల చేసింది. అయితే ఇంత తీవ్రమైన అంశాన్ని కేవలం విదేశాంగ శాఖ ఖండిస్తే సరిపోదనీ, ట్రంప్‌తో భేటీ సమయంలో ఏం మాట్లాడారో మోదీ తన నోటితో దేశ ప్రజలకు చెప్పాలని రాహుల్ డిమాండ్ చేశారు.

రాజ్యసభలో కాంగ్రెస్ నాయకుడు గులాం నబీ ఆజాద్‌తో ఆయన చాంబర్‌లో ప్రతిపక్షలు సమావేశమై ఈ విషయంపై చర్చించాయి. ట్రంప్ ప్రకటనపై ఇరు సభల్లో మోదీ వివరణ ఇవ్వాల్సిందేననీ, అప్పటి వరకు సభా కార్యకలాపాలను సస్పెండ్ చేయాలని విపక్షాలు డిమాండ్ చేశాయి. సీపీఐ, ఎన్సీపీ, డీఎంకే, ఎస్పీ, ఆప్ తదితర విపక్ష పార్టీల సభ్యులు ఆజాద్‌తో భేటీ అయ్యారు.

సాక్షి
బుధవారం, జూలై, 24

# వినూత్నం... సృజనాత్మకం

ఆంధ్రప్రదేశ్ శాసనసభలో మంగళవారం సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ ఘట్టం ఆవిష్కృతమైంది. బడుగువర్గాల, మహిళల అభ్యున్నతిని కాంక్షించే అత్యంత కీలకమైన అయిదు బిల్లుల్ని శాసనసభ ఆమోదించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చెప్పినట్టు ఈ బిల్లులన్నీ చరిత్రాత్మకమైనవి, అసాధారణమైనవి. రాష్ట్రంలో శాశ్వత ప్రాతిపదికన బీసీ కమిషన్ ఏర్పాటు... బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు చెందినవారికి అన్ని నామినేటెడ్ పోస్టుల్లో 50 శాతం రిజర్వేషన్లు... నామినేషన్లపై ఇచ్చే పనుల్లో సైతం 50 శాతం రిజర్వేషన్లు... నామినేటెడ్ పోస్టుల్లో, నామినేషన్లపై ఇచ్చే పనుల్లో మహిళలకు 50 శాతం కోటా ఇవ్వడానికి ఈ బిల్లుల్ని ఉద్దేశించారు. స్వాతంత్ర్యం వచ్చి 72 ఏళ్లయినా అట్టడుగు వర్గాలు, మహిళల స్థితిగతులెలా ఉన్నాయో అందరికీ తెలుసు. డాక్టర్ అంబేడ్కర్ నాయకత్వంలో రూపొందిన రాజ్యాంగం చట్టసభల్లో, ఉద్యోగావకాశాల్లో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించింది. అనంతర కాలంలో కేంద్రంతోపాటు కొన్ని రాష్ట్రాలు బీసీలకు, మహిళలకు విద్య, ప్రభుత్వోద్యోగాల్లో కోటా కల్పించాయి. కానీ అంత మాత్రాన ఆ వర్గాలకు సంపూర్ణమైన ప్రయోజనం దక్కదు. ఇతర స్థాయిల్లో సైతం ఆ విధానం అమలైనప్పుడే ఆ వర్గాలకు మేలు కలుగుతుంది. వారికి కూడా అధికారంలో భాగస్వామ్యం కల్పించినట్టవుతుంది. మండల్ కమిషన్ సిఫార్సుల అమలు తర్వాత ఆ స్థాయిలో బీసీలకు లబ్ధి చేకూర్చడం ఇదే తొలిసారి.

మన నిచ్చెనమెట్ల కులవ్యవస్థలో కొన్ని ఉన్నతమైన కులాలుగా చలామణి అవుతున్నాయి. ఇతర కులాలను సామాజికంగా అణచివేస్తున్నాయి. ఇలా కొన్ని వర్గాలు మాత్రమే ఆర్థిక, రాజకీయ ఆధిపత్యం గుప్పెట్లో పెట్టుకున్నచోట ప్రజాస్వామ్యం నేతి బీర చందమే అవుతుంది. సామాజిక అసమానతలు చెక్కుచెదరకుండా నిలుస్తాయి. మన దేశంలో ఇన్ని దశాబ్దాలుగా జరిగింది అదే. వాస్తవానికి వీటిని సమూలంగా తుడిచిపెట్టాలని, ప్రజాస్వామ్య ప్రక్రియలో అన్ని వర్గాల భాగస్వామ్యం ఉండాలని రాజ్యాంగ నిర్మాతలు కోరుకున్నారు. చట్టసభలను దేశంలో జరగాల్సిన సామాజిక, ఆర్థిక మార్పులకు ఉపకరణాలుగా వారు భావించారు. ఇందులో విఫలమైతే దేశంలో అశాంతి ప్రబలుతుందని హెచ్చరించారు. దురదృష్టమేమంటే ఏ పార్టీ అధికారంలోకొచ్చినా అట్టడుగు వర్గాలను ఓటు బ్యాంకులుగానే చూశాయి. వారి అభ్యున్నతికి తీసుకోవాల్సిన నిజమైన చర్యల విషయంలో మౌనంగా ఉండిపోయాయి. ఆ వర్గాలను మభ్యపెట్టడంలోనే పొద్దుపుచ్చాయి. చిత్తశుద్ధి లేని నేతలు, సృజనాత్మకత కొరవడిన నేతలు రాజ్యమేలుతున్నప్పుడు పరిస్థితులు ఇలాగే ఉంటాయి. కానీ ఇచ్చిన మాట నిలబెట్టుకోవడంలో, చేసిన వాగ్దానాన్ని నెరవేర్చడంలో తనకెవరూ సాటిరారని ఇప్పటికే నిరూపించుకున్న జగన్ అటువంటి నేతలకు భిన్నం. 14 నెలలపాటు సాగించిన 'ప్రజా సంకల్ప యాత్ర'లో తాను స్వయంగా చూసిన జీవితాలను, లక్షలాదిమంది ప్రజలు తనతో పంచుకున్న అనుభవాలను గుండెల్లో పొదువుకొని వారి అభ్యున్నతికి అవసరమైన చర్యలను అమలు చేయడం ప్రారంభించారు. కేబినెట్‌లో దాదాపు 60 శాతం మంత్రి పదవులు, అత్యంత కీలకమైన శాఖలు ఎస్సీ, బీసీ, మైనారిటీ వర్గాలకు ఇవ్వడంతోపాటు స్పీకర్ పదవిని కూడా బీసీ వర్గానికే కేటాయించారు. కేబినెట్ సమావేశాల్లో స్వేచ్ఛగా సలహాలు, సూచనలు చేయొచ్చునని... అభ్యంతరాలున్నా తెలపాలని మంత్రివర్గ సహచరులకు సూచించారు. ఇప్పుడు అదే ప్రజాస్వామిక సంస్కృతిని ఆయన కింది స్థాయికి కూడా విస్తరింపజేయదల్చుకున్నారు. పై స్థాయిలో అమలవుతున్న ఈ విధానాన్ని సుస్థిరపరచాలంటే, బడుగువర్గాలు, మహిళల స్థితిగతులు మెరుగుపడాలంటే ఇదే మార్గమని ఆయన విశ్వసించారు. పర్యవసానంగానే ఈ కీలక బిల్లులు రూపొందాయి.

సమాజంలో బీసీ వర్గాలపట్ల అమలవుతున్న వివక్ష ఎవరికీ తెలియనిది కాదు. ఆ వర్గాలకు చిన్నచూపు ఎదురవుతున్నా, దౌర్జన్యాలు సాగుతున్నా, న్యాయబద్ధంగా దక్కాల్సినవాటిని తొక్కిపెడుతున్నా ఎవరికీ ఫిర్యాదు చేయలేని నిస్సహాయత వారిది. విద్య, ఉద్యోగాల్లో అమలు కావాల్సిన కోటా సంగతలా ఉంచి... చివరకు ధ్రువీకరణ పత్రాలు పొందడం కూడా కొన్ని సందర్భాల్లో వారికి కష్టమవుతోంది. అలాంటి సమస్యలకు శాశ్వత స్థాయి బీసీ కమిషన్ ఒక సమాధానం. నామినేటెడ్ పోస్టులనూ, నామినేషన్లపై ఇచ్చే పనులనూ ఆధిపత్య కులాలే తన్నుకుపోతున్న దశలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు అవి చట్టబద్ధంగా దక్కేందుకు 50 శాతం కోటా ఇచ్చే యోచన చేయడం... మహిళలకు సైతం ఈ లబ్ధి అందేలా చూడటం ఎంతో ప్రశంసనీయం. ఇది నిస్సందేహంగా ఆయా వర్గాల అభ్యున్నతికి తోడ్పడుతుంది. మహిళలు సామాజికంగా, ఆర్థికంగా స్వశక్తితో ఎదిగే స్థితి వచ్చినప్పుడే వారి ఉన్నతి సాధ్యమని జగన్ మొదటినుంచీ చెబుతున్నారు. దానికి అనుగుణంగానే వారికి కూడా నామినేటెడ్ పోస్టుల్లో, నామినేషన్లపై ఇచ్చే పనుల్లో సగభాగం కేటాయిస్తూ బిల్లు తీసుకొచ్చారు. ఇంతటి విప్లవాత్మక చర్యలకు సర్కారు శ్రీకారం చుట్టినప్పుడు ప్రతిపక్షం తన వంతు సహకారం అందజేయాలి. చర్చల్లో పాల్గొని, బిల్లుల్లో లోటుపాట్లుంటే తెలియజేయాలి. కానీ చంద్రబాబు, ఆయన అనుచరగణం అందుకు భిన్నంగా ప్రవర్తించారు. ఒక అవాస్తవమైన అంశాన్ని ఆసరా చేసుకుని సభలో గందరగోళం సృష్టించి ఈ బిల్లులపై చర్చ జరగనీయకుండా, అవి ఆమోదం పొందకుండా చూడాలని విఫలయత్నం చేశారు. అన్ని వర్గాలకు బండెడు వాగ్దానాలు చేస్తూ మేనిఫెస్టో నింపడం, అందలం ఎక్కిన తర్వాత విస్మరించడం అలవాటైనవారి నుంచి ఇంత కంటే మెరుగైన ప్రవర్తన ఆశించలేం. అట్టడుగు వర్గాల శ్రేయస్సును కాంక్షించి బిల్లులు రూపొందించినప్పుడు చర్చల ప్రక్రియలో పాలుపంచుకోవడం మానుకుని, వాకౌట్ చేసే దుస్థితికి తెలుగుదేశం దిగజారింది. ఈ విషయంలో ఆ పార్టీ ముమ్ముందు సంజాయిషీ ఇచ్చుకోక తప్పదు. ఇలాంటి వినూత్నమైన, సృజనాత్మకమైన బిల్లులు తీసుకొచ్చిన జగన్ అట్టడుగువర్గాల హృదయాల్లో చిరస్థాయిగా నిలుస్తారు.

## గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం, తిథి బ.సప్తమి ప.1.46 వరకు తదుపరి, అష్టమి, నక్షత్రం రేవతి ప.12.43 వరకు తదుపరి అశ్వని, వర్జ్యం... లేదు, దుర్ముహూర్తం ప.11.39 నుంచి 12.30 వరకు, అమృతఘడియలు... ఉ.10.04 నుంచి 11.51 వరకు.

సూర్యోదయం : 5.39
సూర్యాస్తమయం: 6.32
రాహుకాలం : ప. 12.00 నుంచి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుంచి 9.00 వరకు

# అదే బాబు.. అదే బాట.. అవే తప్పులు!

విశ్లేషణ



సి. రామచంద్రయ్య

ప్రజాస్వామ్య వ్యవస్థల్లో ఏ పార్టీ ఓటమి చెందినా సహజంగా ఓటమికి అధినాయకుడే బాధ్యత స్వీకరిస్తారు. అయితే, టీడీపీ అధినేత చంద్రబాబులో మాత్రం తాను తప్పు చేశాననిగానీ, పరిపాలనలో తప్పులు జరిగాయని ఒప్పుకొనే నిజాయితీగానీ కొరవడింది. ''ఏం తప్పులు చేశామని ప్రజలు ఇంత ఘోరంగా ఓడించారు?'' అంటూ నెపాన్ని ప్రజల మీదకు నెట్టేశారు. పాత తప్పులు సరేసరి.. ప్రతిపక్ష పాత్రలోకి మారిన ఈ 50 రోజుల వ్యవధిలోనే బాబు చేస్తున్న తప్పుల జాబితా ఆంజనేయుడి తోకలా అంతకంతకూ పెరిగిపోతోంది. స్పీకర్ వ్యవస్థను అగౌరవించడం, విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందాలపై అడ్డగోలు వాదనకు దిగి అడ్డంగా దొరికిపోవడం, కాపులకు రిజర్వేషన్ సమస్యలో సెల్ఫ్ గోల్ వేసుకోవడం, ఎస్సీ వర్గీకరణపై మంద కృష్ణమాదిగను ఎగదోయడం వంటి పలు సమస్యల్లో తన తీరును రాష్ట్ర ప్రజలు ఎండగడుతున్నా బాబు తన బాటను వీడట్లేదు.

ఎన్నికలలో ఘోర పరాజయాన్ని చవిచూసినా.. టీడీపీ అధినేత చంద్రబాబులో రాజకీయంగా కనీస పరివర్తన, గుణాత్మక మార్పు కనపడటం లేదు. ప్రజాస్వామ్య వ్యవస్థల్లో ఏ పార్టీ ఓటమి చెందినా సహజంగా ఓటమికి అధినాయకుడే బాధ్యత స్వీకరిస్తారు. ప్రజలు తమను ఎందుకు తిరస్కరించారో విశ్లేషణ చేసుకొంటామని, తిరిగి ప్రజలకు చేరువ కావడానికి కృషి చేస్తామని ఓటమి చెందిన నాయకులు వినమ్రంగా చెబుతారు. అయితే, టీడీపీ అధినేత చంద్రబాబులో మాత్రం తాను తప్పు చేశాననిగానీ, పరిపాలనలో తప్పులు జరిగాయని గానీ ఒప్పుకొనే నిజాయితీ కొరవడింది. ''ఏం తప్పులు చేశామని ప్రజలు ఇంత ఘోరంగా ఓడించారు?'' అంటూ నెపాన్ని ప్రజల మీదకు నెట్టేశారు. ఆయనలో ఓటమికి సంబంధించిన అపరాధ భావన ఏ కోశాన ఉన్నట్లు కనపడలేదు. తప్పులు జరిగాయని ఒప్పుకోవడానికి ధైర్యం కావాలి. చంద్రబాబులో ఈ లక్షణం భూతద్దం పెట్టి వెతికినా కనపడదు. టీడీపీ పగ్గాలు చేపట్టిన నాటి నుంచి చంద్రబాబు రాజకీయాల్ని ఏ తీరుగా నడుపుతున్నారో.. తిరిగి అదే బాటలో అడుగులు వేస్తున్నారు.

చంద్రబాబు ఐదేళ్ల పరిపాలనలో జరిగిన తప్పులు, వైఫల్యాలను పక్కన పెడితే.. ప్రతిపక్ష పాత్రలోకి మారిన ఈ 50 రోజుల వ్యవధిలోనే ఆయన చేసిన తప్పుల జాబితా ఆంజనేయుడి తోకలా అంతకంతకూ పెరిగిపోతోంది. బడ్జెట్‌పై అప్పుడో మాట.. ఇప్పుడో మాట.. ఎన్నికలకు ముందు ఫిబ్రవరిలో తెలుగుదేశం ప్రభుత్వం.. ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను రూ. 2,26,117 కోట్లతో ప్రవేశపెట్టింది. కేవలం 3 నెలల ప్రభుత్వ ఖర్చుల ఆమోదం కోసం ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టాల్సి ఉండగా.. తెలుగుదేశం ప్రభుత్వం 2019–20 సంవత్సరానికి పూర్తి బడ్జెట్‌నే ప్రవేశపెట్టింది. అయితే, ఎన్నికల్లో ఘనవిజయం సాధించి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన వైఎస్సార్‌సీపీ 2019–20 బడ్జెట్‌ను రూ. 2,27,975 కోట్లతో ప్రవేశపెట్టింది. ఈ రెండు బడ్జెట్‌లకు వ్యత్యాసం చాలా స్వల్పం. అయితే, ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ అంకెలను సమర్థించుకున్న టీడీపీ నేతలు.. ప్రస్తుత బడ్జెట్‌ను అంకెల గారడీ అంటూ ఎద్దేవా చేయడం వారి ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనంగా కనపడుతుంది. రాష్ట్ర సొంత ఆదాయం, ఆర్థిక సంఘం అందించే నిధులు, కేంద్ర గ్రాంట్లు, ఇతర ఆదాయాలను కలుపుకొని వాస్తవిక అంచనాలతో రూపొందించిన బడ్జెట్‌లో.. నవరత్నాలకు, ఇతర కీలక రంగాలకు జరిగిన కేటాయింపులను చూసి టీడీపీ ఓర్వలేని తనాన్ని బహిర్గతపర్చుకుని అభాసుపాలైంది.

### స్పీకర్ వ్యవస్థకు అగౌరవం

శాసనసభ స్పీకర్‌గా సీనియర్ నేత తమ్మినేని సీతారాం నిలపాలని వైఎస్సార్‌సీపీ నిర్ణయించిన తర్వాత ప్రొటెమ్ స్పీకర్ నేతృత్వంలో ఆయన ఎంపిక ప్రక్రియ ఏకగ్రీవంగా జరిగింది. ఎన్నిక తర్వాత స్పీకర్ 'చెయిర్' వద్దకు నూతన శాసన సభాపతి తమ్మినేని సీతారాంను తోడ్కొని రావాల్సిందిగా ప్రొటెమ్ స్పీకర్ అన్ని పార్టీల నేతలను ఆహ్వానించారు. అయితే, తనకు 40 సంవత్సరాల సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్నదని పదేపదే చెప్పుకొనే చంద్రబాబు ఒక ఉన్నత సంప్రదాయాన్ని కాలరాశారు. ఫ్లోర్ లీడర్‌గా ఉండి స్పీకర్‌ను చెయిర్ వద్దకు తీసుకువెళ్లే గౌరవాన్ని నిలుపుకోలేకపోయారు. తనకు బదులుగా డిప్యూటీ ఫ్లోర్ లీడర్‌గా ఉన్న అచ్చెన్నాయుడికి ఆ బాధ్యతను పురమాయించడాన్ని అసెంబ్లీ



ప్రత్యక్ష ప్రసారాల ద్వారా వీక్షించిన ప్రతి ఒక్కరూ నిర్ఘాంత పోయారు. తొలిరోజు నుంచే చంద్రబాబు తన వికృత రాజకీయ క్రీడను తిరిగి ప్రారంభించారన్నది అర్థం అయ్యింది. ఇక బడ్జెట్ సమావేశాల సందర్భంగా చంద్రబాబు సభలో తాను చెప్పిందే జరగాలన్నట్లు ప్రవర్తించిన తీరు ఆయనలోని నియంతృత్వానికి పరాకాష్టగా కనిపించింది. శాసనసభలో సభానాయకుడైన సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని, మంత్రులను.. చివరకు స్పీకర్‌ను కూడా నియంత్రించాలని ప్రయత్నించి పలు సందర్భాలలో చంద్రబాబు అభాసుపాలయ్యారు. తనకు 40 సంవత్సరాల రాజకీయ అనుభవం ఉన్నదని పదేపదే చెప్పుకొనే చంద్రబాబు.. సభాసంప్రదాయాలను గౌరవించకుండా పాలకపక్షం మీద, స్పీకర్ మీద తన అక్కసును, అప్రజాస్వామిక నైజాన్ని బయట పెట్టుకొన్నారు.

### అతని కంటే ఘనుడు..

చంద్రబాబు పుత్రరత్నం నారా లోకేశ్ కౌన్సిల్‌లో, ట్వీట్‌ల ద్వారా చేస్తున్న ప్రకటనల్లో హేతుబద్ధత, వాస్తవాలు లేకపోవడాన్ని అందరూ గమనిస్తున్నారు. లోకేశ్ తన అజ్ఞానాన్ని నిజాలుగా నమ్మించడానికి చేసే యత్నాన్ని మాత్రం ఎవరైనా ఖండించాల్సిందే! విద్యుత్ కొనుగోలు ఒప్పందాల (పీపీఏలు) విషయంలో కూడా నారా లోకేశ్ వాదన పప్పులో కాలేసిన చందంగా ఉంది. సీఎం వైఎస్ జగన్ శాసనసభలో పీపీఏలపై సభ్యులందరికీ అర్థమయ్యేటట్లు సుదీర్ఘ వివరణ ఇచ్చారు. ఎలక్ట్రికల్ రెగ్యులేటరీ అథారిటీ (ఈఆర్‌ఏ) అందించిన వివరాలు, విద్యుత్ లభ్యతకు సంబంధించిన వాస్తవాలను సభలోనే స్లైడ్స్ ద్వారా ప్రదర్శించారు. తక్కువ ధరకు థర్మల్ విద్యుత్ అందుబాటులో ఉన్నప్పటికీ.. కొన్ని కంపెనీలకు అనుచిత లాభం అందించడం కోసం ఏవిధంగా అధిక ధరలు చెల్లించి సౌర, పవన విద్యుత్‌ను కొనుగోలు చేశారో ముఖ్యమంత్రి తేటతెల్లం చేశారు. అయితే, టీడీపీ నాయకులు, ముఖ్యంగా.. నారా లోకేశ్ డొల్ల వాదనలను తెరపైకి తెచ్చిన తీరు వారి అజ్ఞానానికి పరాకాష్టగా నిలుస్తుంది. థర్మల్ విద్యుత్ తక్కువ ధరలో అందుబాటులో ఉన్నప్పటికీ.. పర్యావరణ హితం కోసమే అధికరేటుతో పవన, సౌర విద్యుత్‌ను తాము కొనుగోలు చేసినట్లు.. ఇంత గొప్ప పని తాము చేస్తే అభినందించాల్సిందిపోయి విమర్శిస్తారా? అంటూ లోకేశ్ ట్వీట్ చేశారు. పర్యావరణ హితాన్ని దృష్టిలో పెట్టుకొని.. రాష్ట్ర ఖజానాకు వేల కోట్ల రూపాయల మేర బొక్క పెట్టడాన్ని స్వాగతించాలంటున్న లోకేశ్‌ను ఏమనాలి? అదేవిధంగా.. అమరావతి నగరం కట్టడానికి అవసరమైన అప్పు మంజూరు చేయడానికి ప్రపంచ బ్యాంకు నిరాకరించిన ఉదంతాన్ని తమకు అనుకూలంగాను, వైఎస్సార్‌సీపీ మీద బురద జల్లడానికి లోకేశ్ ఎంత తాపత్రయపడినా చివరకు అది సెల్ఫ్ గోల్ వేసుకున్నట్లయింది. అమరావతిలో అనేక అక్రమాలు చోటుచేసుకున్న నేపథ్యంలో.. కేంద్రం సూచన మేరకే తాము రుణాన్ని మంజూరు చేయడం లేదని.. కొత్త ప్రభుత్వానికి తమ సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తామని ప్రపంచ బ్యాంకు చేసిన ప్రకటనతో లోకేశ్ తన పరువు పోగొట్టుకున్నారు.

### సెల్ఫ్ గోల్స్

అసెంబ్లీ సమావేశాలలో అధికార వైఎస్సార్‌సీపీని ఇరుకున పెట్టడానికి టీడీపీ నేతలు చేసిన ప్రయత్నాలన్నీ బెడిసికొట్టాయి. ''కాపులకు తెలుగుదేశం ప్రభుత్వం ఇచ్చిన 5% రిజర్వేషన్లపై మీ వైఖరి ఏమిటి?'' అంటూ టీడీపీ సభలో లేవనెత్తింది. దానిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సమర్థవంతంగా తిప్పికొట్టారు. కాపులను బీసీలుగా గుర్తించాలని తీర్మానం చేసి కేంద్రానికి పంపిన చంద్రబాబు.. అగ్రకులాల్లోని పేదలకు కేంద్రం కల్పించిన 10% రిజర్వేషన్లలో తనకులేని అధికారాన్ని ఆపాదించుకొని, న్యాయస్థానం ముందు నిలబడదని తెలిసి కూడా 5% రిజర్వేషన్లు కల్పించడంలో అర్థం ఏమిటి? కాపులు బీసీల కోటాలోకి వస్తారా? అగ్రకుల పేదల కోటాలోకి వస్తారా? అని సీఎం జగన్ నిండు సభలో నిలదీస్తే.. చంద్రబాబుకు మాటలు కరువయ్యాయి. అధికార పార్టీని ఇరుకున పెట్టాలని భావించిన తెలుగుదేశం తనకుతానే సెల్ఫ్ గోల్ కొట్టుకొంది.

### తెరపైకి మళ్లీ ఎస్సీ వర్గీకరణ అంశం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ వర్గీకరణ కోసం ఒకసారి తీర్మానం చేసి, ఆర్డినెన్స్ కూడా జారీ చేసిన చంద్రబాబు 2014–19 కాలంలో.. ఆ అంశాన్ని అటకెక్కించారు. ఎమ్మార్పీఎస్ నాయకుడు మంద కృష్ణ మంగళగిరిలో సభ నిర్వహణకు అనుమతి కోరితే నిరాకరించారు. ఎస్సీ వర్గీకరణ అంశంపై ఎన్డీఏతో కలిసి ఉన్న నాలుగేళ్లూ టీడీపీ కేంద్రానికి కనీసం విజ్ఞాపన పత్రం కూడా ఇవ్వలేదు. ప్రతిపక్షంలోకి రాగానే మళ్లీ చంద్రబాబుకు ఎస్సీ వర్గీకరణ అంశం గుర్తొచ్చింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎస్సీ వర్గీకరణపై తన వైఖరి స్పష్టం చేయాలంటూ.. టీడీపీ నేతలు డిమాండ్ చేస్తున్నారు.

### పరోక్ష యుద్ధం

తెలుగుదేశం అధినేత చంద్రబాబుకు ప్రత్యర్థులతో నేరుగా తలపడే ధైర్యం ఎన్నడూ లేదు. రాజకీయ ప్రత్యర్థులను దొంగ దెబ్బలు తీయడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. రాజకీయ ప్రత్యర్థుల మీద, పార్టీల మీద ప్రజల్లో అపోహలు సృష్టించడానికి తన అనుకూల మీడియా ద్వారా, తన సోషల్ మీడియా ద్వారా చంద్రబాబు అనేక నీలి వార్తలు సృష్టిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ మీద బురదజల్లే కార్యక్రమాన్ని చాప కింద నీరులా విస్తరింపజేస్తున్నారు. ఇప్పటికే.. బీజేపీలోకి పంపిన తన బినామీల ద్వారా.. బీజేపీ మీద పరోక్షంగా పట్టు సాధించి.. ఆ పార్టీని వైఎస్సార్‌సీపీ మీద ఎగదోయాలని కుట్రలు పన్నుతున్నారు. చంద్రబాబులో ఏమాత్రం మార్పు లేకపోవడాన్ని గ్రహించిన చాలా మంది నాయకులు ఇప్పటికే తమదారి తాము చూసుకుంటున్నారు. బాబును, ప్రత్యేకించి ఆయన పుత్రరత్నం నాయకత్వాన్ని భరించే స్థితిలో పార్టీ శ్రేణులు లేవు. ఉనికిని, అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి చంద్రబాబు ఎంతకైనా తెగిస్తారు. ఈ పరిణామాలపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

వ్యాసకర్త మాజీ ఎంపీ

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



## సోషల్ మీడియా

### వాచాలత



"తల్చుకుంటే అఫ్గానిస్తాన్‌లో గెలవడం తనకు పదిరోజుల పని అని, కానీ పది లక్షలమంది ప్రజలను హతమార్చడం తనకిష్టం లేదని డోనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటన అహంకారపూరితమైనది. ప్రపంచంలోనే తమది శక్తిమంతమైన ప్రజాస్వామిక దేశమని చెప్పుకునే అమెరికా అధినేత ఒక సార్వభౌమత్వ దేశం గురించి ఇలా మాట్లాడటం అత్యంత ఆశ్చర్యకరం"

– శేఖర్ గుప్తా, సీనియర్ పాత్రికేయుడు

### వివరణనివ్వండి



"భారత్–పాకిస్తాన్‌ల మధ్య కశ్మీర్ విషయంలో దౌత్యం నెరపమని ప్రధాని నరేంద్ర మోదీ తనను అడిగారని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటన విస్మయం కలిగించింది. ఇదే నిజమైతే మోదీ భారత ప్రయోజనాలనూ, 1972 నాటి సిమ్లా ఒప్పందాన్ని కాలరాసినట్టే. బలహీనమైన విదేశాంగ మంత్రిత్వ శాఖ ఇచ్చిన సంజాయిషీ సరిపోదు. ఏం జరిగిందో నరేంద్ర మోదీయే స్వయంగా దేశ ప్రజలకు వివరణనివ్వాలి"

– రాహుల్ గాంధీ, కాంగ్రెస్ నాయకుడు

### ఇంగ్లిష్ తిప్పలు!



"కశ్మీర్‌పై ట్రంప్ చేసిన ప్రకటన గురించి సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్న వ్యంగ్యాన్ని గురించి చెప్పుకోవాలి. 'కశ్మీర్‌కి రండి. అక్కడ ధ్యానం(మెడిటేట్) చేయండి' అని మోదీ ఆహ్వానిస్తే, దాన్ని కాస్తా ట్రంప్ దౌత్యం (మీడియేట్)గా అర్థం చేసుకున్నారన్నది దాని సారాంశం. ఇదంతా ఇంగ్లిష్‌తో వచ్చిన తిప్పలేనని భావించాలేమో!"

– రాజ్‌దీప్ సర్దేశాయ్, సీనియర్ జర్నలిస్ట్

### సూర్యమాలిక



"మన గ్రహాలన్నీ సూర్యుడి చుట్టూ తిరుగుతున్నాయని భారతీయులకు ఎప్పటినుంచో తెలుసు. సూర్యుడి చుట్టూ గ్రహాలు ఒక దండ మాదిరిగా ఉంటాయని మార్కండేయ పురాణంలో ఉంది. ఇప్పుడు మనం సౌర వ్యవస్థ అని చెబుతున్న దానిని ఆ పురాణం 'సూర్యమాలిక'గా అభివర్ణించింది"

– డీకే హరి–హేమ, రచయితలు

### సరికాదు...



"కొన్ని దేశాల జెండాలపై చందమామ ఉంటుంది. కానీ మన ప్రత్యేకత ఏమిటంటే... మన జెండా చందమామపై ఉంటుంది' అంటూ క్రికెటర్ హర్భజన్ సింగ్ పెట్టిన ట్వీట్ సరికాదు. భారత్‌ను ప్రశంసించడానికి ఇతర దేశాలను కించపరచవలసిన అవసరం లేదు. హర్భజన్ జీ...ఆ ట్వీట్‌ను దయచేసి తొలగించండి"

– సుమంత్ రామన్, రాజకీయ విశ్లేషకుడు

## విద్యారుణాలపై రాయితీ బకాయిలేవి?

పైచదువుల నిమిత్తం తీసుకున్న రుణాలపై కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఎస్సీ, ఎస్టీ, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు గత పదేళ్లుగా వడ్డీరాయితీ పథకాన్ని అమలు చేస్తోంది. ఏ కోర్సు చదవడానికి రుణం తీసుకున్నారో ఆ కోర్సు పూర్తి చేసే మారటోరియం పిరియడ్ వరకు ఆ రుణంపై ఎంత వడ్డీ అవుతుందో ఆ మొత్తాన్నీ ఏ యేడాదికి ఆ ఏడాది కేంద్ర ప్రభుత్వం బ్యాంకుకు చెల్లించాల్సి ఉంది. కోర్సు పూర్తయ్యి ఉద్యోగంలో చేరే నాటికి వడ్డీలేని రుణం మాత్రమే విద్యార్థి పేరున అప్పు ఉంటుంది. ఆ మేరకు వడ్డీ భారం తగ్గుతుంది కాబట్టి నెలవారీ రుణ చెల్లింపు సులభతరమవుతుంది.



అయితే, కేంద్ర మానవ వనరుల శాఖ నిర్లక్ష్యం వల్ల ఈ పథకం కింద ఆశించిన ప్రయోజనం నెరవేరడం లేదు. చదువు పూర్తి చేసి ఏళ్లు గడుస్తున్నప్పటికీ వారికి అందాల్సిన వడ్డీ రాయితీ రాక విద్యార్థులు తీవ్ర ఇక్కట్ల పాలవుతున్నారు. అన్ని బ్యాంకులలోనూ రూ. వందల కోట్ల మేరకు వడ్డీ రాయితీ బకాయిలు పేరుకుపోయాయి. రుణ కాల పరిమితి పూర్తవుతున్నప్పటికీ వడ్డీ రాయితీ సొమ్ము అందకపోవడం వల్ల ఆ మొత్తాన్ని కూడా బ్యాంకులు విద్యార్థుల నుంచే ముక్కుపిండి వసూలు చేస్తుండడం విడ్డూరంగా ఉంది.

తమకు ప్రభుత్వం నుంచి రావాల్సిన వడ్డీ రాయితీ కన్నా తమ విద్యా రుణం ఖాతాలో చెల్లించాల్సిన బకాయి మొత్తం తక్కువగా ఉన్నప్పటికీ విద్యార్థులు ఈ.ఎం.ఐ. చెల్లించక తప్పని పరిస్థితి నెలకొనడంతో తల్లిదండ్రులు గొల్లుమంటున్నారు. వరుసగా 3 నెలలు ఈ.ఎం.ఐ. చెల్లించకపోతే క్రెడిట్ రేటింగ్ దెబ్బ తింటుందన్న భయంతో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ఈ.ఎం.ఐ. చెల్లించక తప్పటం లేదని వాపోతున్నారు.

వడ్డీ రాయితీ బకాయిల్లో కేవలం 25% నిధులనుమాత్రమే వార్షిక బడ్జెట్లలో కేటాయించడం వల్ల బకాయిలు పేరుకుపోతున్నాయని బ్యాంకు అధికారులు చెబుతున్నారు. కేంద్ర ప్రభుత్వం అన్ని బ్యాంకులలోని విద్యారుణాల వడ్డీ రాయితీ బకాయిలు మొత్తాన్నీ ఒకేసారి తీర్చేసి తమకు న్యాయం చేయాల్సిందిగా తల్లిదండ్రులు కోరుతున్నారు.

– పి. సుబ్బారావు, హైదరాబాద్

# ఓబీసీ బిల్లు- సామాజిక న్యాయం

సందర్భం



ప్రొ. ఎస్. సుదర్శన్‌రావు

స్వాతంత్ర్యం వచ్చిన తరువాత 1951లో జరిగిన మొదటి ఎన్నికల నుంచి ఇటీవల జరిగిన ఎన్నికల వరకు పార్లమెంట్‌లో బీసీల ప్రాతినిధ్యం ఎన్నడూ కూడా పది నుంచి ఇరవై శాతానికి మించలేదు. ఇది బీసీలకు కరువైన సామాజిక న్యాయానికి ప్రతీక. ఇది తీర్చేందుకు చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని ఎన్నో ఏళ్ల నుంచి బీసీలు కోరుతున్నా, అది పట్టించుకున్న నాథుడే కరువయ్యారు. కానీ, బీసీల కల నెరవేరేందుకు జూన్ నెల 21న వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి ప్రవేశపెట్టిన ఓబీసీ ప్రైవేటు బిల్లుతో ఆస్కారం చిక్కింది. భారత ప్రజాస్వామ్యంలో దీనిని ఒక చారిత్రక మలుపుగా పరిగణించవచ్చు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆశించిన దానికంటే అధిక మెజారిటీతో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన నెలరోజులలోపే పార్లమెంట్‌లో ఓబీసీల బిల్లు ప్రవేశపెట్టడం ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ఓబీసీల అభివృద్ధిపై ఉన్న శ్రద్ధాసక్తులను ప్రతిబింబిస్తోంది. ఈ బిల్లుకు పది రాజకీయ పార్టీలు మద్దతివ్వడం హర్షణీయం. జూలై 12న ఓబీసీ ప్రైవేటు బిల్లును రాజ్యసభ మూజువాణి ఓటుతో తిరస్కరించడం విచారకరం. ఈ నేపథ్యంలో, రాష్ట్ర స్థాయిలో జూలై 23న ఏపీలో తొలి అసెంబ్లీ సమావేశాల్లోనే శాశ్వత ప్రాతిపదికన బీసీ కమిషన్ ఏర్పాటుకు చట్టం చేసి బిల్లును అసెంబ్లీ ముందుంచిన వైఎస్ జగన్ ప్రభుత్వం దేశ చరిత్రలోనే నవశకానికి నాంది పలికింది.

దేశ జనాభాలో దాదాపుగా 52 శాతంగా ఉన్న బీసీ కులాల్లోని అత్యధికులు సామాజికంగా, ఆర్థికంగా, విద్య, ఉపాధి రంగాలలో వెనుకబడినవారే. ఆర్థిక, సామాజిక వెనుకబాటుతనంతో బీసీలు స్వతహాగా అగ్రకులాల వారితో పోటీపడే సత్తా లేనివారు. అందువల్ల సామాజిక న్యాయం దృష్ట్యా ఎస్సీ, ఎస్టీలకు ఉన్నట్లు జనాభా ప్రాతిపదికన వారికి చట్టసభల్లో సరైన స్థానం లభించాల్సి ఉంది. బీసీలకు చట్టసభల్లో సరైన ప్రాతినిధ్యం లభిస్తే, వారు వారి సమస్యలు, వెనుకబాటుతనంపై తగు రీతిలో ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి, అభివృద్ధికై అడుగులు వేసే ప్రయత్నం జరిగే అవకాశం ఏర్పడుతుంది. దాంతోపాటు సమాజంలో ఇతర కులాలవలె వారికి సరైన గుర్తింపు, గౌరవప్రదమైన స్థానం లభిస్తుంది. ఎస్సీ, ఎస్టీలకు లభించిన రిజర్వేషన్ల వలన ఒకప్పుడు అతి దారుణమైన పరిస్థితులు ఎదుర్కొని సమాజంలో వివక్షకు గురైన వాళ్లు నేడు సమాజంలో విద్య, ఉపాధి రంగాల్లో, చట్టసభల్లో ప్రవేశం పొంది గౌరవప్రదమైన జీవితం గడిపేందుకు ఒక అవకాశం లభించింది. అట్టి అవకాశాన్నే నేడు బీసీలు కూడా కోరుకుంటున్నారు. 'మేమెంతో మాకంత' అనే సామాజిక న్యాయం అమలు చేసేందుకు దోహదపడేదిగా ఈ బిల్లును పరిగణించవచ్చు. బీసీల్లోని కొన్ని కులాలవాళ్లు ఉదాహరణకు కాటికాపరి, బుడబుక్కల, గంగిరెద్దుల, బుడగజంగాల తదితర కులాల వారికి సమాజంలో సగటు మనిషికి దక్కాల్సిన గౌరవం, ఆదరణ దక్కకపోవడం బాధాకరం.

ప్రస్తుత అధికారంలో ఉన్న ఎన్డీయే ప్రభుత్వం 123వ రాజ్యాంగ సవరణ ద్వారా జాతీయ బీసీ కమిషన్‌కు రాజ్యాంగబద్ధత కల్పించిన కీర్తి మూటగట్టుకుంది. అలాగే ఓబీసీ బిల్లుకు కూడా ఎలాగోలా పార్లమెంట్‌లో ఆమోద ముద్ర వేయించి బీసీల అభివృద్ధికి బాటలు వేస్తారని ఆశిద్దాం. 2019లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ఆశించిన దానికంటే అధిక మెజారిటీలో అధికారం కైవసం చేసుకున్న బీజేపీ (ఎన్డీయే) ఈ బిల్లును ప్రతిపాదించి ఉంటే ప్రజల్లో ఓబీసీ బిల్లుకు పార్లమెంట్ ఆమోదం పొందడంలో ఏ మాత్రం సంశయం ఉండేది కాదు.

వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత పార్లమెంట్‌లో ఆ పార్టీ తరఫున ప్రవేశపెట్టిన మొదటి బిల్లు ఇది. ప్రస్తుతానికి ఈ ప్రైవేటు బిల్లు వీగిపోయినప్పటికీ వైఎస్సార్‌సీపీకి ఎన్డీయేకి మధ్యగల సుహృద్భావ సంబంధాలు, పొరుగు రాష్ట్రాలతో ఉన్న మిత్ర సంబంధాలు అన్నింటినీ సమీకరించి, బిల్లు ఆమోదం పొందేలా జగన్ ఇకపై కూడా కృషి చేయాల్సి ఉంది. ఈ బిల్లు గెలుపోటములతో సంబంధం లేకుండా, దేశంలోని ఏ రాజకీయ పార్టీ ఎటువైపో నిర్ధారణ జరిగే గడియలు కూడా ఆసన్నమైనట్లేనని రాజకీయ విశ్లేషకులు, సామాజికవేత్తల భావన. అధికారంలో ఉన్న బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్ సహా అన్ని రాజకీయ పార్టీలు అదేపనిగా బీసీలు, వారి అభివృద్ధిపై ఒలకబోసే ప్రేమలోని సత్యాసత్యాలు బహిర్గతం కానున్నవి. పార్లమెంటులో వైఎస్సార్‌సీపీ ప్రవేశపెట్టిన ఈ బిల్లు వీగిపోయినంత మాత్రాన బీసీలలో చిగురించిన ఆశాజ్యోతి ఆరిపోయినట్లు భావించకుండా, భవిష్యత్తులో మరింత శక్తితో దీని ఆమోదం కోసం పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వ్యాసకర్త మాజీ ప్రిన్సిపల్, ఆర్ట్స్ కళాశాల, ఓయూ | yesyesrao@yahoo.com

## చెలియలి కట్ట

సముద్రం తన మీద తను విధించుకున్న హద్దు చెలియలి కట్ట. సముద్రం నుంచి భూమిని ముంచివేసేటట్టుగా ఎంతో వేగంగా వచ్చే కెరటాలు సముద్రాన్ని దాటవు. హద్దును మీరవు. ఈ హద్దే చెలియలి కట్ట. మనిషికీ, సముద్రానికీ చాలా దగ్గరి పోలికలు! ఎందరో కవులు మనిషి హృదయాన్ని సముద్రంతో పోల్చారు. బాధని, సంతోషాన్ని కూడా సముద్రంతోనే పోల్చారు. 'దుఃఖ సముద్రంలో మునిగిపోయారు. ఆనందాంబుధిలో తేలిపోయారు' అన్నారు. సముద్రంలాగానే మనిషికీ చెలి యలి కట్ట అవసరం. మనిషి ఒక్కొక్కసారి తనలోని అవధులు దాటే కోపాన్ని నియంత్రించుకోలేక సముద్రంలా ఉప్పొంగుతాడు. తోటివారిపై విజృంభిస్తాడు. ఈ కోపాన్ని నియంత్రించుకోకపోతే అనర్థాలు జరిగిపోతాయి. కుటుంబ బంధాలు, సమాజ సంబంధాలు ఛిన్నాభిన్నమైపోతాయి. సముద్రంలాగానే మనిషి తనను తాను నియంత్రించుకోవాలి. అయితే, ఇది అంత తేలిక కాదు. దీనికి ఎంతో ప్రయత్నం, సాధన అవసరం.

యవ్వనం అనేక ఉద్వేగాలకు, ఆవేశాలకు, ఆకర్షణలకు నెలవైన దశ. విపరీతమైన ఆత్మవిశ్వాసాన్ని ప్రతిఫలించే వయసది. ఎవరినీ లెక్కచేయని స్వభావం.





తను నమ్మిన సిద్ధాంతాలే సరైనవనే అత్యుత్సాహం ప్రస్ఫుటించే స్థితి అది. యవ్వనం ఉప్పొంగే సముద్రం లాంటిది. ఎగిసిపడే అలల లాంటి భావోద్వేగాలు యువతను ఎటువైపు తీసుకువెళతాయో తెలియని అగమ్యగోచర స్థితి. ఉచితానుచితాలు ఆలోచించకుండా దిద్దుకోలేని పొరపాట్లు చేసే వయసది. తల్లిదండ్రులు, పెద్దలు వారిపై ఓ చూపు సారిస్తూ చెలియలి కట్టలా రక్షణనివ్వాలి.

ఈ చెలియలి కట్ట అనే పదం మహాభారతంలో పలు సందర్భాల్లో వస్తుంది. పాండవులు అరణ్యవాసం చేస్తున్నప్పుడు శ్రీకృష్ణుడు సత్యభామతో కలిసి వారిని చూడటానికి వస్తాడు. అప్పుడు ధర్మజుని శాంతగుణాన్ని ప్రశంసిస్తూ కృష్ణుడు, 'నీ తమ్ముళ్లు సముద్రాల లాంటివారు. నీ ఆనతి అనే చెలియలి కట్ట వారికి మీరలేనిది' అంటాడు. నిజమే. ధర్మరాజు నియంత్రణ లేకపోతే అతని తమ్ముల ఆగ్రహావేశాలకు కురుక్షేత్ర సంగ్రామానికి ముందే ఎన్నో గొడవలు జరిగేవి. వారి భుజబల పరాక్రమ ప్రాభవం ఉవ్వెత్తున లేచి పొంగే కడలి కెరటాలలాంటిది. దానికి ఎప్పటికప్పుడు హద్దులు ఏర్పరిచే చెలియలి కట్ట ధర్మరాజు.

నదికి ఆనకట్ట, సముద్రానికి చెలియలి కట్ట ఎంత అవసరమో మనిషి సత్ప్రవర్తనకు ప్రశాంతమైన జీవితానికి వివేకమనే చెలియలి కట్ట అంత అవసరం. లేకపోతే, తన భావోద్వేగాలను ఇతరులమీద ప్రదర్శించి అందరికీ దూరమై మనిషి ఒంటరి అవుతాడు. తనకొరకు చెమ్మగిల్లు నయనమే లేదని తల్లడిల్లుతాడు.

– డాక్టర్ చెంగల్వ రామలక్ష్మి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 270 1083

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ ॥ బుధవారం
24-7-2019

చెట్టు నీడ

## ఇంత జరిగినా..!

కురుక్షేత్ర సంగ్రామం ముగిసింది. విజయం పాండవులను వరించింది. కౌరవులందరూ హతమైనారు. వాళ్ల మనసుల్లో పాండవులపై ఆక్రోశం గూడు కట్టుకుని ఉంది. తమ నూరు గురు కుమారులు చనిపోయారు. కాని పాండవులలో ఏ ఒక్కరూ చనిపోలేదు. ఇదే ధృతరాష్ట్రునికి పట్టలేని కోపం, ఆవేదన కలిగించింది. పాండవులను చీమను నలిపేసినట్లు నలిపేయాలని అనిపించిందతనికి. ఇలా ఉండగా యుద్ధంలో విజయం సాధించిన పాండవులు కృష్ణునితోపాటు ధృతరాష్ట్రుని ఆశీర్వాదం కోసం వచ్చారు. ద్వారపాలకుడు పాండవులు వచ్చారు అని ధృతరాష్ట్రునికి చెప్పాడు. పాండవుల అడుగుల సవ్వడి చూసి ధృతరాష్ట్రుడు ''రండి ... రండి..'' అని ఎక్కడలేని అభిమానం మాటలలో చూపుతున్నాడు.

ధర్మజుని ఉద్దేశించి ''ధర్మయుద్ధం గెలిచింది. యుద్ధంలో కీలకపాత్ర భీముడిదేనట గా... రా నాయనా... భీమా! నిన్ను మనస్ఫూర్తిగా ఆలింగనం చేసుకుని ఆశీర్వదిస్తాను.



రా... నా బాహువులలో ఒదిగిపో''అంటూ ప్రేమ పలుకులు పలికాడు. అది విని భీముడు పొంగిపోతూ మీసాలు మెలేస్తూ ఉత్సాహంగా ముందుకు వెళ్లబోతుంటే, కృష్ణుడు సంజ్ఞ చేసి వారించాడు. కృష్ణుడు ఓ కంచువిగ్రహాన్ని సృష్టించి ''ఇదిగో ఇక్కడ నీ ప్రియ భీముడు'' అంటూ ధృతరాష్ట్రునికి చెప్పాడు. కోపంతో రగిలి పోతున్న ధృతరాష్ట్రుడు ''హా భీమసేనా... భీమసేనా'' అంటూ ఆ కంచు విగ్రహాన్ని గట్టిగా ఆలింగనం చేసుకున్నాడు. అతని బాహువులలో ఆ విగ్రహం తుత్తునియలైంది. ఆశ్చర్యపోవడం పాండవుల వంతయింది. ముక్కలై పడిపోయిన ఆ విగ్రహ శకలాల సవ్వడి విని ''నన్ను మోసం చేశావా కృష్ణా! అవునులే, నీ అండ లేకపోతే వీరికి విజయం ఎక్కడిది?'' అంటూ నిట్టూర్చాడు.

''మామా! ఇంత జరిగినా నీలో పశ్చాత్తాపం లేదు. ఇంకా పాండవుల పట్ల నిలువెల్లా పగనే పెట్టుకున్నావు. ఆశీర్వాదం కోసం వస్తే ఇలా చేయడం...'' అంటూ ఆగాడు శ్రీకృష్ణుడు. దానికి ధృతరాష్ట్రుడు కన్నీళ్లు తుడుచుకుంటూ.. ''తప్పు నాదే ఈ రాజ్యం ఇక మీదే. మీరే ఏలుకోండి. మీకు ఎప్పుడూ విజయమే... ఇదే నా ఆశీర్వాదం'' అంటూ సిగ్గుతో తల దించుకున్నాడు. ''మంచిది'' అంటూ పాండవులు నమస్కరించి అక్కడినుంచి నిష్క్రమించారు.

– కనుమ ఎల్లారెడ్డి




**ఒక కుటుంబం ఎదగాలంటే.. ఆ కుటుంబంలోని మహిళకు చేయూతనివ్వాలి. పిల్లల ముఖాల్లో సంతోషం చూడాలంటే... తల్లి చేతిలో నాలుగు డబ్బులు ఉండాలి. అందుకే.. ఇంటికే పరిమితమైన మహిళల్లో దాగిన నైపుణ్యానికి ఒక వేదిక కల్పిస్తున్నారు సంగీత, మీనా. ఒకే ఆలోచన, ఒకే అభిరుచి ఉన్న వీళ్లిద్దరూ కలిసి ఊరూవాడకు తోడుగా ఉంటున్నారు.. బతుకు జాడ చూపిస్తున్నారు.**

# తోడు.. జాడ




● జీవన నైపుణ్యాలపై బాలికలకు, మహిళలకు వర్క్‌షాప్



● ఎగ్జిబిషన్‌లో గృహిణులు తయారుచేసిన వస్తువులు

''గురువారం ఉదయం పండ్లు కొందామని మొజాం జాహీ మార్కెట్‌కెళ్లాను. పండ్లు కొనుక్కుని డబ్బులిస్తుంటే ఆ షాపు కుర్రాడు డబ్బు తీసుకోకుండా 'మేడమ్ బాగున్నారా' అని పలకరించాడు. నేను ఇతడి షాపుకి రెగ్యులర్‌గా కస్టమర్‌ని కాదు, ఇంతకు ముందెప్పుడూ ఇతడిని చూసినట్లు కూడా లేదు' అనుకుంటూనే 'నీకు నేనెలా తెలుసు' అని అడిగాను. మీరు మా కాలనీలో పిల్లలకు ఆటల పోటీలు పెట్టి, గెలిచిన వాళ్లకు బహుమతిగా బియ్యం, చక్కెర ఇచ్చే వాళ్లు. చాలా ఏళ్ల కిందట పార్థీవాడాలో మీ చేతుల మీద ఐదు కేజీల బియ్యం తీసుకున్నాను' అని పదేళ్ల నాటి సంగతి గుర్తు చేశాడు. తన పేరు మాధేశ్ అని పరిచయం చేసుకున్నాడు. 'నా సంతోషం కోసం ఇస్తున్నాను పండ్లు పట్టుకెళ్లండి, డబ్బులు వద్దు' అన్నాడు. నేను కాదు కూడదంటే... అప్పుడు ధర తగ్గించి తాను కొన్న ధర మాత్రం తీసుకున్నాడు. 'నా ఫోన్ నంబరు తీసుకోండి మేడమ్. ఏమైనా కావాలంటే చెప్పండి' అని నంబర్ షేర్ చేశాడు. చెప్పలేనంత సంతోషం అది. మనం నాటిన మొక్క పెద్దదై పువ్వు పూచినప్పుడు కలిగే ఆనందం అది. ఇరవై ఏళ్లుగా అల్పాదాయ వర్గాలు నివసించే కాలనీల్లో సర్వీస్ చేస్తున్నాం. అప్పటి చిన్న పిల్లవాడు ఇప్పుడు ప్రయోజకుడై మమ్మల్ని గుర్తు పట్టి అభిమానంగా పలకరించాడు. ఇంతకంటే సంతృప్తి ఇంకేం కావాలి?'' అని ఎంతో ఉద్వేగంగా అన్నారు మీనా కస్లీవాల్.

ఆమెతోపాటే సంగీత మహేశ్వర్ ఉన్నారు. ''గౌలిగూడా, పార్థీవాడా, ఎంజీమార్కెట్, జుమ్మేరాత్ బజార్ కాలనీలకు, జగదీశ్ కన్యా పాఠశాల, మార్వాడీ హిందీ విద్యాలయలకు వెళ్లినప్పుడు పిల్లలు మా దగ్గరకొచ్చి 'మంచిగ చదువుకుంటున్నాం, పరీక్షలు బాగా రాశాం. వచ్చే ఏడాది కూడా మాకు పుస్తకాలు ఇస్తారా' అని ఆశగా అడుగుతుంటారు. చిన్న పిల్లలు వచ్చి 'మేము చదువుకుంటాం, పుస్తకాలిస్తారా' అని అడిగితే కాదనగలమా. మేము చిన్నగా మొదలు పెట్టిన సర్వీస్ విస్తరించడానికి కారణం కూడా పిల్లల అభిమానమే'' అన్నారు సంగీత. 'మహిళా జాగృతి' నిర్వాహకులు సంగీత, మీనా.

### పండుగ రోజు పరమాన్నం

సంగీత పుట్టి పెరిగింది హైదరాబాద్‌లోనే. వారిది హైదరాబాద్‌లో స్థిర పడిన రాజస్థాన్ కుటుంబం. మీనా పుట్టింది ఉత్తరప్రదేశ్‌లో. డిగ్రీ వరకు అక్కడే చదువుకున్నారు. పెళ్లితో హైదరాబాద్‌కి వచ్చారామె. ఇద్దరూ పాతికేళ్లుగా స్నేహితులు. ఇద్దరూ వేర్వేరు సంస్థలతో పని చేసేవారు. ''మా జైన్ కుటుంబాల్లో... మనిషి చనిపోయే లోపు సమాజానికి చేతనైన సహాయం ఏదయినా చేయాలని చెబుతారు. ఆ స్ఫూర్తితోనే ధార్మిక సేవా కార్యక్రమాల్లో పని చేశాం. సంగీత కూడా అలాగే చేస్తుండేది. అలా ఇద్దరం ఒకరికొకరం పరిచయమయ్యాం. మహిళల కోసం ఏదైనా చేయాలనే మా ఆలోచనలే ఇద్దర్నీ దగ్గర చేశాయి. 'మహిళా జాగృతి' పేరుతో సంస్థను స్థాపించాం. ఇంటికే పరిమితమైన మహిళలు బయటకు రావాలంటే వాళ్లకు పరిచయమైన వేదిక ఒకటి ఉండాలి. వాళ్లకు తెలిసిన పని అయితేనే ధైర్యంగా ముందుకు రాగలుగుతారు. అందుకే కుకింగ్ కాంపిటీషన్స్ పెట్టాం. ఇరవై ఏళ్ల కిందట మహిళల్లో ఆరోగ్యం పట్ల అవగాహన ఇప్పుడున్నంతగా ఉండేది కాదు. ముఖ్యంగా అల్పాదాయ వర్గాలు నివసించే కాలనీల్లో హెల్త్ క్యాంపుల అవసరం చాలా ఉండేది. ఆ కాలనీల్లో హెల్త్‌క్యాంపులతోపాటు పండుగ సమయాల్లో పిల్లలకు ఆటలపోటీలు పెట్టేవాళ్లం. గెలిచిన వాళ్లతోపాటు పోటీలో పాల్గొన్న అందరికీ బియ్యం, చక్కెర ఇచ్చేవాళ్లం. ఆ కుటుంబాల్లో నిజానికి వాటి అవసరం చాలా ఉండేది కూడా. పిల్లలకు తల్లులు పండగ రోజు మిఠాయిలు పెట్టలేకపోయినా కనీసం తియ్యటి అన్నమైనా పెట్టగలగాలనేది మా కోరిక. అలా పెట్టిన ఆటల పోటీల్లో పాల్గొన్న కుర్రాడే మాధేశ్'' అన్నారు మీనా.

### బంధువులే ముందుకొచ్చారు

''ఉద్యోగినులు వాళ్ల బిజీలో వాళ్లుంటారు. చదువుకుని కూడా గృహిణిగా ఇంటికే పరిమితమైన వాళ్లలో ఏదో తెలియని వెలితి కనిపిస్తుండేది. వాళ్లంతా మేము ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొనేవాళ్లు. మళ్లీ ఇలాంటి ప్రోగ్రామ్ ఎప్పుడు పెడతారా అన్నట్లు ఎదురు చూసేవాళ్లు. సోషల్ గ్యాదరింగ్స్ కూడా వాళ్లకు అందనివి అన్నట్లు ఉండేవి. చాలామంది నిరుత్సాహంగా రోజులు గడుపుతున్నట్లు కూడా అనిపించేది. వాళ్లలో స్కిల్ ఉంటుంది, దానిని ప్రదర్శించడానికి వేదిక లేకపోవడంతో టాలెంట్ మరుగున పడిపోతోంది. వేదిక ఒకటి ఉంటే వాళ్లలో హిడన్ టాలెంట్ బయటికొస్తుందనుకున్నాం. ఆ అనుకోవడమే... 2000లో ఒక ఎగ్జిబిషన్ రూపం సంతరించుకుంది. మేము మా ఆలోచన బయట పెట్టగానే బంధువుల్లోనే ఎక్కువ మంది మహిళలు ఉత్సాహంగా ముందుకొచ్చారు. అప్పటి నుంచి ఏటా మూడు రోజులు మహిళల కోసం ఎగ్జిబిషన్ పెడుతున్నాం. ఇది 19వ ఎగ్జిబిషన్ (జూలై 19, 20, 21 తేదీల్లో జరిగింది). ఇంట్లో ఖాళీ టైమ్‌లో వాళ్లకు చేత వచ్చిన హ్యాండీక్రాఫ్ట్స్ తయారు చేసుకుంటారు. మూడు రోజులు స్టాల్‌లో అమ్ముకుంటారు. టేబుల్ స్పేస్ నుంచి స్టాల్ వరకు వాళ్ల అవసరాన్ని బట్టి అద్దెకు తీసుకుంటారు. అలాగే ఏటా ఫ్రీ స్టాల్స్ కూడా ఉంటాయి. బేగంపేటలో దేవనార్ ఫౌండేషన్ ఫర్ బ్లైండ్‌లో ఉండే అంధ విద్యార్థులు క్యాండిల్స్, పేపర్ ప్లేట్లు, గ్లాసుల వంటివి తయారు చేస్తారు. ఆ స్టూడెంట్స్‌కి స్టాల్ ఉచితంగా ఇవ్వడంతోపాటు వాళ్లను హోమ్ నుంచి ఎగ్జిబిషన్‌కు తీసుకురావడం, భోజనాల వంటి ఏర్పాట్లు కూడా మేమే చూసుకుంటాం. అలాగే ఇతర దివ్యాంగులతోపాటు లంబాడీ మహిళలకు కూడా స్టాల్ ఉచితంగా ఇస్తున్నాం. ఈ ఏడాది 15 స్టాళ్లను ఉచితంగా ఇచ్చాం'' అన్నారు సంగీత మహేశ్వర్.

### ఒకేలా కనిపిస్తారు.. ఒకేలా అనిపిస్తారు

సంగీత, మీనా ఇద్దరూ ఒకేరకమైన వస్త్రధారణలో కనిపించారు. ఏడాదంతా కాదు, ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నప్పుడు, కాలనీల్లో ఇతర కార్యక్రమాలు నిర్వహించేటప్పుడు ఇలా ఒకేరకమైన చీరలు కట్టుకుంటారు. ఎందుకంటే.. ఎవరికైనా అక్కడ సహాయం అవసరమైతే ఎవర్ని సంప్రదించాలనే అయోమయం లేకుండా చూడగానే అర్థం కావడం కోసమేనంటారు ఈ స్నేహితులు. ''దీపం వెలిగించే వత్తుల నుంచి రత్నాలు, మరకతాల ఆభరణాల వరకు రకరకాల స్టాల్స్‌కు వేదిక ఇది. ఒక మహిళ తన చేత్తో పది రూపాయలు సంపాదించుకోవాలంటే ఎంతో చదువు అక్కర్లేదు. చిన్నప్పటి నుంచి నేర్చుకున్న పనులే డబ్బు సంపాదించి పెడతాయి. రుచిగా వండడం వస్తే అదే వాళ్ల పరిశ్రమకు పెట్టుబడి అవుతుంది. ఎగ్జిబిషన్‌లో ఎప్పుడూ ఫుడ్‌కోర్ట్‌లో చోళాబటూరా, వడాపావ్‌ల వంటి నార్త్ వంటకాలు ఎక్కువగా ఉండేవి. ఈ దఫా సౌత్ ఇండియన్ ఫుడ్ కూడా ఉన్నాయి.. దోశె కోసమే ఒక స్టాల్ పెట్టాం. సంపాదించే వాళ్లకు మాత్రమే గౌరవాలందుతున్న సమాజంలో న్యూనతకు లోనవుతున్న గృహిణులకు భరోసా కల్పించడమే 'మహిళా జాగృతి' ఉద్దేశం. మహిళ సమాజంలో సగౌరవంగా జీవించాలి. ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలి. అందుకు తోడ్పడునందించడంలో సంతృప్తి ఉంది. ఇన్నేళ్ల అనుభవంలో మహిళలకు మేము చెప్పేది ఒక్కటే... రోజుల్ని నిరుపయోగంగా గడిపేస్తే, జీవించడమే దుర్భరంగా ఉంటుంది. ప్రతి రోజునీ ఉపయుక్తంగా మలుచుకుంటే జీవితం మన విజయం వెంట పరుగులు తీస్తుంది. రోజును ఫలప్రదం చేసుకోండి'' అంటున్నారు సంగీత, మీనా. మనకోసం చేసిన పనిలో ఫలితం మన చేతుల్లోకే వస్తుంది. ఇతరుకు చేసిన పనికి ఫలితం అభిమానం రూపంలో ఆత్మసంతృప్తినిస్తుంది'' అన్నారిద్దరూ సంతోషంగా.

– వాకా మంజులారెడ్డి
ఫొటోలు: జి. అమర్

మరీ అన్యాయం

# బాధితురాలికే శిక్ష పోనీలెమ్మని క్షమాభిక్ష!

లైంగిక వేధింపులకు గురైనందుకు ఇప్పటికే నెల రోజుల పాటు జైలు శిక్ష అనుభవించిన ఆమె.. మరో ఆరు నెలల పాటు బందీఖానాలో ఉండబోతున్నారు. అవును... వేధింపులకు గురైనందుకే ఆమెకు కారాగారవాసం. నమ్మశక్యంగా లేదు కదా.. కానీ ఇదే వాస్తవం. ఆ దేశ సర్వోన్నత న్యాయస్థానమే ఈ తీర్పునిచ్చింది. అదే విధంగా జరిమానా రూపంలో అక్షరాలా 35వేల డాలర్లు చెల్లించాలని ఆదేశించింది. అలా జరగని పక్షంలో శిక్షను పొడగించాల్సి వస్తుందని హెచ్చరించింది కూడా. బాధితురాలే దోషిగా మారిన ఈ విచిత్ర ఘటన ఇది.



> "ఒక మహిళగా... కాదు కాదు ఒక మనిషిగా నేను రక్షింపబడాలి. కానీ ఈరోజు బాధితురాలినైన నేను దోషిగా ప్రపంచం ముందు నిలుచున్నాను. ఇంతటి అన్యాయం ఎక్కడైనా ఉంటుందా? నిజానికి వేధింపబడిన వారిని శరణార్థులుగా స్వీకరించే చోటు ఈ ప్రపంచంలో ఎక్కడా లేదు.." ఇండోనేషియాకు చెందిన ఓ మహిళా లైబ్రేరియన్ ఆవేదన ఇది!

శిక్ష అనుభవించిన నిర్దోషి : నురిల్

ఒక మహిళకు జరిగిన అన్యాయం మన దేశంలో ఏనాడైనా ఇంత పెద్ద విషయం అయిందా? ఇండోనేషియాలో ఇప్పుడు దేశం మొత్తం నురిల్ తరపున నిలబడింది.

ఆ బాధితురాలి (దోషిగా పేర్కొనేందుకు మనస్కరించనందున) పేరు నురిల్ మక్‌నున్. వయస్సు 41 సంవత్సరాలు. ఇండోనేషియాలోని లంబోక్ ద్వీపంలో ఉన్న ఓ ఉన్నత పాఠశాలలో లైబ్రేరియన్‌గా పనిచేసేవారు.అయితే ఉద్యోగం చేస్తూ... కుటుంబానికి ఆర్థికంగా చేదోడు వాదోడుగా ఉంటున్నానన్న సంతోషం ఆమెకు ఎంతోకాలం నిలవలేదు. తాను పనిచేస్తున్న పాఠశాల హెడ్‌మాస్టర్ రూపంలో ఉపద్రవం ముంచుకొచ్చింది. సహోద్యోగి అయిన నురిల్‌తో అతడు నెమ్మదిగా పరిచయం పెంచుకున్నాడు. ఈ క్రమంలో తరచుగా ఫోన్ చేసి వృత్తికి సంబంధించిన విషయాలను ఆమెతో చర్చించేవాడు. కానీ కొన్నాళ్ల తర్వాత అతడిలో దాగున్న 'ప్రకోపం' నిద్రలేచింది. ఈ క్రమంలో ఓరోజు నురిల్‌కు ఫోన్ చేసి.. తన పడకగదిలో జరిగే విషయాలను ఆమెతో చర్చించసాగాడు. ఊహించని పరిమాణానికి కంగుతిన్న ఆమె ఒక్కసారిగా ఫోన్ కట్ చేసి.. ఇక అతడితో మాట్లాడటం మానేసింది. అయితే అంతటితో సమస్య ముగియలేదు. అతడు నురిల్‌ను వదిలిపెట్టలేదు. వేర్వేరు నంబర్ల నుంచి ఫోన్ చేస్తూ జుగుప్సాకర విషయాలు చెబుతూనే... తనతో సంబంధం పెట్టుకోవాలంటూ వివేచన తప్పి మాట్లాడేవాడు. తన వాంఛ తీర్చాలంటూ ఎంతగా బతిమిలాడినా నురిల్ కరగకపోవడంతో చివరికి ఆమె పరువు తీయాలని భావించాడు.

ఈ క్రమంలో నురిల్‌తో తనకు అక్రమ సంబంధం ఉన్నట్లుగా స్కూల్ మొత్తం ప్రచారం చేయించాడు. దీంతో అక్కడ పనిచేసే వారంతా నురిల్‌ను ఓ వ్యక్తిత్వం లేని మహిళగా చూడటం మొదలుపెట్టారు. మనోవేదనను తట్టుకోలేని నురిల్ ఎలాగైనా తాను నిర్దోషినని నిరూపించుకునే ప్రయత్నం చేసింది. ఇందులో భాగంగా అతడి ఫోన్లకు స్పందించడం మొదలుపెట్టింది. ఫోన్ చేసిన ప్రతీసారి అతడి మాటలు వింటున్నట్టుగా నటిస్తూ... కాల్స్ రికార్డు చేసింది. అయితే అదే తన పాలిట శాపమవుతుందని నురిల్ ఊహించలేకపోయింది.

### నా 'పరువు' తీస్తావా?!

తనపై హెడ్‌మాస్టర్ వేసిన నిందలు చెరిపేసుకునే క్రమంలో కాల్ రికార్డులను తన భర్తతో పాటుగా సహోద్యోగులకు కూడా వినిపించింది నురిల్. ఈ విషయం ఈనోటా ఆనోటా పాకి చివరికి అతడి వరకు వెళ్లింది. దీంతో తాను పెద్ద మనిషిని, ఒక బాధ్యతాయుతమైన వృత్తిలో ఉన్నాననీ స్ఫురణకు వచ్చి తనకున్న పరువు గురించి బెంబేలెత్తిపోయాడు. అంతేకాదు నురిల్‌ను మరోసారి ఇబ్బందుల పాలు చేయాలని నిర్ణయించుకున్నాడు. అనుకున్నదే తడవుగా మరో టీచర్‌తో కలిసి కుట్ర పన్ని.. నురిల్‌పై పరువునష్టం దావా వేశాడు. తనవి కాని మాటలు తనకు ఆపాదిస్తూ.. అసభ్యతను వ్యాప్తి చేస్తుందంటూ ఆమెపై ఫిర్యాదు చేశాడు.

### ఆర్నెళ్ల జైలు.. జరిమానా!

2012లో మొదలైన వేధింపుల ఘటనకు సంబంధించిన ఈ కేసులో నురిల్‌ను దోషిగా తేలుస్తూ ఇటీవలే ఇండోనేషియా సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. ఈ కేసులో గతంలో ఇప్పటికే నెలరోజుల పాటు శిక్ష అనుభవించిన నురిల్‌కు ఆర్నెళ్ల జైలు శిక్ష విధించడంతో పాటుగా.. 35 వేల డాలర్లు జరిమానా వేసింది. బాధితురాలినైన తనను దోషిగా తేల్చవద్దని.. తన ఫోన్‌లోని రికార్డింగ్స్‌ను డౌన్‌లోడ్ చేసుకున్న మరో టీచర్ వాటిని సర్క్యులేట్ చేశారు కాబట్టి... తీర్పును సమీక్షించాలని ఆమె చేసిన అభ్యర్థనను తోసిపుచ్చింది. తీర్పు ప్రకారం జరిమానా చెల్లించని పక్షంలో మరో మూడు నెలల పాటు శిక్ష పొడిగించాల్సి వస్తుందని హెచ్చరించింది!

### నురిల్ ఒక్కరే కాదు

రోజూవారీ ఘటనలను పరిశీలిస్తే నిజానికి కేవలం నురిల్ ఒక్కరికి మాత్రమే ఇలాంటి చేదు అనుభవాలు ఎదురుకావడం లేదనే విషయం స్పష్టమవుతోంది. బాధితురాలిని నిందితురాలిగా చిత్రీకరించడం సమాజానికి పరిపాటిగా మారినా.. కోర్టుల్లోనైనా వారి సమస్యకు పరిష్కారం దొరుకుతుందనే ఆశ ఉండేది. అయితే నురిల్ విషయంలో ఆ అవకాశం కూడా లేకుండా పోయింది. ఇక మన దేశంలో ఏకంగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై లైంగిక వేధింపుల ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. ఆ ఆరోపణలతో కోర్టు మెట్లెక్కిన బాధిత మహిళ పరిస్థితి ఎలా ఉందో ఆమె దాఖలు చేసిన అఫిడవిట్ పూర్తిగా చదివితే అర్థమవుతుంది. పితృస్వామ్య వ్యవస్థలో ఓ మహిళ వ్యక్తిత్వాన్ని ఎంత హేయంగా చిత్రీకరించవచ్చో ఆ డాక్యుమెంట్ కళ్లకు కడుతుంది. అంతేకాదు బాధితురాలు.. క్యారెక్టర్‌లేని మనిషిగా ఎలా నిరూపించబడుతుందో తేటతెల్లం చేస్తుంది.

– సుష్మారెడ్డి యాళ్ల, సాక్షి వెబ్‌డెస్క్

### క్షమాభిక్ష పెట్టేందుకు సిద్ధమట!



ఇండోనేషియా అధ్యక్షుడు జోకో విడోడో : బాధితురాలికి క్షమాభిక్ష ప్రసాదిస్తానన్న పుణ్యాత్ముడు ఈయనే.

సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో నురిల్‌కు జరిగిన అన్యాయం ప్రపంచవ్యాప్తంగా కూడా చర్చనీయాంశమైంది. మానవ, మహిళా హక్కుల సంఘాలు ఈ తీర్పును తీవ్రంగా ఖండిస్తున్నాయి. ఈ క్రమంలో ఇండోనేషియా అధ్యక్షుడు జోకో విడోడో మాట్లాడుతూ...''ఈ కేసును నేను సునిశితంగా పరిశీలిస్తున్నాను. ఒకవేళ నురిల్‌కు న్యాయం జరగకపోయినట్లయితే తను క్షమాభిక్ష కోరవచ్చని గతంలో సూచించాను. ఇప్పుడు కూడా అదే చెబుతున్నాను. నాకున్న అధికార పరిమితులకు లోబడి నా వంతు కర్తవ్యం నెరవేరుస్తా' అని పేర్కొన్నారు. అయితే ఆయన వ్యాఖ్యలపై నురిల్ లాయర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. తన క్లైంట్ క్షమాభిక్ష కోరినట్లైతే తప్పు చేసిందని ఒప్పుకొన్నట్లే అవుతుంది కదా అని ప్రశ్నిస్తున్నారు. అదే విధంగా మానవ హక్కుల కార్యకర్తలు కూడా ఈ ఘటనపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నారు.



## లవ్ డాక్టర్ నన్నడగొద్దు ప్లీజ్


ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ అన్నయ్యా! నేనొక అబ్బాయిని లవ్ చేస్తున్నాను. తనంటే నాకు చాలా ఇష్టం. తనకి కూడా నేనంటే ప్రాణం. కానీ మా ఇంట్లో వాళ్లకి మా నేపథ్యాలే సమస్య. వాళ్లని ఎలా ఒప్పించాలో నాకు తెలియట్లేదు. తను నన్ను చాలా బాగా చూసుకుంటాడు. తనతో ఉంటే నేను హ్యాపీగా ఉంటానన్న నమ్మకం నాకు ఉంది. ఇంట్లో వాళ్లని ఎలా ఒప్పించాలో మీరే సలహా ఇవ్వండి అన్నయ్య ప్లీజ్.

– తన్మయి

నా బంగారు తల్లి!
నా వజ్రాల చెల్లి!
డోంట్ బీ సిల్లీ!

‘ఏంటి సార్ సడన్ గా..? లవ్లీ బ్రదర్లీ ఎమోషన్ నుంచి సిల్లీ దాకా వచ్చేశారు ఏంటి సార్..? తన్మయి బాధ పడదూ?

ఏం బాధపడదు.. అంత నమ్మకం ఆ కుర్రాడి మీద ఉంటే..

‘..ఉంటే ఏంటి సార్? ఇంట్లో పేరెంట్స్ ఒప్పుకుంటారా..? నువ్వు ఆ అబ్బాయిని చేసుకుంటానంటే నేను డింగ్ డాంగ్ బెల్.. పుస్సీ ఇన్ ది వెల్ చేసుకుంటామని భయపెట్టి ఇంకొకరికి ఫోర్సుడుగా పెళ్లి చేసెయ్యారా సార్? సినిమాలు చూడటం లేదా?’

మమ్మీ డాడీకి కరెక్ట్ టైమ్ లో కరెక్టుగా చెబితే ఒప్పుకుంటారు.

ఒప్పుకోకపోతే దాంట్లో ఒక గట్టి కారణమే ఉంటుంది.

‘అంటే సేమ్ కాస్ట్ కాదు కాబట్టి వద్దనడం గట్టి కారణం కాదా సార్?’

నువ్వూ తన్మయి సర్ప్రైజ్ అయ్యే విషయం చెబుతా..! కుర్రాడు కరెక్ట్ అయితే.. వర్త్ కాండిడేట్ అయితే.. తన్మయిని మంచిగా చూసుకుంటాడు అనిపిస్తే.. ఒప్పేసుకుంటారు.

‘మీ మంచి మనస్సు తో చెప్పారు కాబట్టి అలాగే జరగాలి సార్.. తన్మయీ.. కరెక్ట్ టైమ్ లో కరెక్ట్ గా చెప్పెయ్యి... ఆల్ ది బెస్ట్!!’


lovedoctorram@sakshi.com



• చిరంజీవి

# పలాసలో...

‘సైరా: నరసింహారెడ్డి’ ప్రయాణాన్ని విజయంతంగా ముగించిన చిరంజీవి తన తర్వాతి చిత్రంపై దృష్టి పెట్టారు. ఇందుకోసం ఆల్రెడీ బరువు తగ్గే ప్రయత్నంలో భాగంగా ప్రత్యేకమైన వర్కౌట్స్ కూడా స్టార్ట్ చేశారు. కొరటాల శివ దర్శకత్వంలో చేయబోయే సినిమాకే చిరు బరువు తగ్గుతున్నారు. కొణిదెల ప్రొడక్షన్స్, మ్యాట్నీ ఎంటర్టైన్మెంట్స్ పతాకాలపై ఈ సినిమా తెరకెక్కనుంది. ఇందులో చిరంజీవి రైతు పాత్రలో కనిపిస్తారని కొందరు అంటుంటే.. హాకీ కోచ్‌గా నటించబోతున్నారని మరి కొందరు అంటున్నారు. ఈ నవంబర్‌లో సినిమా ప్రారంభం అవుతుందన్నది తాజా టాక్. అలాగే ఈ సినిమా ఫస్ట్ షెడ్యూల్ శ్రీకాకుళంలోని పలాస పరిసర ప్రాంతాల్లో జరగబోతోందనే వార్త ప్రచారంలోకొచ్చింది. అంతే కాదు వచ్చే నెల 22న చిరంజీవి పుట్టినరోజు సదర్భంగా ఈ సినిమాను లాంఛనంగా ప్రారంభిస్తారట. వచ్చే ఏడాది ఉగాదికి విడుదల ప్లాన్ చేస్తున్నారని వినికిడి.


‘సాహో’లో ప్రభాస్ శ్రద్ధా కపూర్


రకుల్ ప్రీత్ సింగ్

# గన్స్ లోడ్ చేసుకోండి


• వరుణ్‌తేజ్

రిలీజ్ డేట్ విషయంలో వెండితెర కొత్త ‘వాల్మీకి’ మనసు మార్చుకున్నాడు. వరుణ్ తేజ్, అధర్వ హీరోలుగా హరీష్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం ‘వాల్మీకి’. పూజా హెగ్డే, మృణాళినీ రవి హీరోయిన్లుగా నటిస్తున్నారు. 14 రీల్స్ ఎల్ఎల్‌పీ పతాకంపై రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మిస్తున్నారు. ఇందులో వరుణ్ తేజ్ గ్యాంగ్‌స్టర్ పాత్రలో నటిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ 70 శాతానికి పైగా పూర్తయినట్లు తెలిసింది. ఇటీవల అనంతపురంలో ఈ సినిమా చిత్రీకరణ జరిగింది. అయితే ‘వాల్మీకి’ చిత్రాన్ని తొలుత ఈ ఏడాది సెప్టెంబరు 6న విడుదల చేద్దాం అనుకున్నారు. కానీ తాజాగా ఓ వారం ఆలస్యంగా 13న విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ‘‘సెప్టెంబర్ 13న ‘వాల్మీకి’ చిత్రాన్ని విడుదల చేస్తున్నాం. గన్స్ లోడ్ చేసుకోండి’’ అని వరుణ్ తేజ్ అన్నారు. ఈ సినిమాకు మిక్కీ జే మేయర్ సంగీతం అందిస్తున్నారు.

# సెట్‌లో పండగే


• రాశీఖన్నా, సాయిధరమ్ తేజ్

‘సుప్రీమ్’ వంటి హిట్ సినిమాలో నటించిన సాయి తేజ్, రాశీఖన్నా జంటగా నటిస్తున్న తాజా సినిమా ‘ప్రతిరోజు పండగే’. మారుతి దర్శకత్వంలో అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాసు నిర్మిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో జరుగుతోంది. సెట్‌లో సాయితేజ్‌తో దిగిన సెల్ఫీ పిక్‌ని రాశీఖన్నా ట్వీట్ చేసి, ప్రతి రోజూ షూటింగ్ పండగలా జరుగుతోందని చెప్పీ చెప్పక చెప్పారు. బన్నీ వాసు మాట్లాడుతూ– ‘‘సాయితేజ్, రాశీఖన్నా మరోసారి ప్రేక్షకులను అలరించనున్నారు. మా బ్యానర్‌లో మారుతి దర్శకత్వంలో వచ్చిన ‘భలే భలే మగాడివోయ్’ ఘనవిజయం సాధించింది. ఇలా.. ఇప్పుడు వీరంతా ఒకే సెట్‌లో ఉండటంతో ప్రతిరోజూ పండగలా షూటింగ్ జరుగుతోంది. త్వరలో రాజమండ్రి పరిసర ప్రాంతాల్లో చిత్రీకరణ జరపనున్నాం’’ అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: జైకుమార్ సంపత్, సహనిర్మాత: ఎస్.కె.ఎన్, సంగీతం: తమన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: బాబు.

# బంపర్ ఆఫర్

ఓ అద్భుతమైన అవకాశం కథానాయిక రకుల్‌ప్రీత్ సింగ్ తలుపు తట్టిందట. కమల్‌హాసన్ హీరోగా శంకర్ దర్శకత్వంలో లైకా ప్రొడక్షన్స్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ‘ఇండియన్ 2’లో నటించే చాన్స్ కొట్టేశారట రకుల్. ఇందులో కాజల్ అగర్వాల్ కథానాయికగా నటిస్తున్నారు. రకుల్‌ది సినిమాకి కీలకంగా నిలిచే పాత్ర అని సమాచారం. నటుడు సిద్ధార్థ్‌కు జోడీగా రకుల్ పాత్ర ఉంటుందట. అయితే ఈ విషయంపై అధికారిక సమాచారం అందాల్సి ఉంది. ఇంకా ఈ సినిమాలో కథానాయికలు ప్రియా భవానీ శంకర్, ఐశ్వర్యా రాజేష్‌లు కీలక పాత్రలు చేయనున్నారనే ప్రచారం జరుగుతోంది. ఇంత మంది కథానాయికలు ఉండటంతో ‘ఇండియన్ 2’ చిత్రం మహిళా సాధికారిత, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాల నేపథ్యంలో ఉంటుందా? అనే ఆలోచనలు ఇండస్ట్రీలో వినిపిస్తున్నాయి. కమల్ హాసనే హీరోగా శంకర్ దర్శకత్వంలో 1996లో వచ్చిన ఇండియన్ (తెలుగులో భారతీయుడు) చిత్రానికి ‘ఇండియన్ 2’ సీక్వెల్.


• రామ్‌చరణ్

# గాయపడలేదు

‘ఆర్ఆర్ఆర్’ చిత్రీకరణలో రామ్‌చరణ్ గాయపడ్డారనే వార్తకు అభిమానులు కంగారు పడ్డారు. అయితే ఆయన గాయపడలేదని చిత్రవర్గాలు చెప్పడంతో ఊపిరి పీల్చుకున్నారు. రాజమౌళి దర్శకత్వంలో ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా ‘ఆర్ఆర్ఆర్’ సినిమా తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. డీవీవీ దానయ్య నిర్మిస్తున్నారు. ఆ మధ్య జిమ్‌లో కసరత్తులు చేస్తూ చరణ్ గాయపడ్డారు. దీంతో మూడు వారాలు షూటింగ్‌కి బ్రేక్ పడింది. ఆ తర్వాత తిరిగి రామ్‌చరణ్


• ఎమ్మా రాబర్ట్స్

షూటింగ్‌లో జాయిన్ అయ్యారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ హైదరాబాద్‌లో జరుగుతోంది. ఈ షెడ్యూల్‌లో చరణ్ గాయపడ్డారంటూ వార్తలు వచ్చాయి. ‘రామ్‌చరణ్ గాయపడ్డారన్నది పుకార్లు మాత్రమే. ఆయన బాగున్నారు.. సోమవారం, మంగళవారం కూడా షూటింగ్‌లో పాల్గొన్నారు’ అని చిత్రబృందం పేర్కొంది. ఇదిలా ఉంటే.. ఇందులో రామ్‌చరణ్ అల్లూరి సీతారామరాజుగా, ఎన్టీఆర్ కొమరం భీమ్ పాత్రల్లో నటిస్తున్న విషయం తెలిసిందే. చరణ్‌కి జోడీగా బాలీవుడ్ బ్యూటీ ఆలియా భట్ నటిస్తున్నారు. ఎన్టీఆర్‌కు జోడీగా బ్రిటీష్ బ్యూటీ డైసీ ఎడ్గార్ జోన్స్ నటించనున్నట్లు రాజమౌళి స్వయంగా ప్రకటించారు. వ్యక్తిగత కారణాల వల్ల ఆమె ఈ సినిమా నుంచి తప్పుకున్నారు. ఆమె స్థానంలో అమెరికన్ నటి, గాయని ఎమ్మా రాబర్ట్స్‌ని తీసుకున్నారనే వార్త వినిపిస్తోంది. ఈ సినిమా 2020 జూలై 30న విడుదలకానుంది.

# ప్రతి రోజూ పరీక్షే!

**“బయట నుంచి చూసే కొందరికి నటన చాలా ఈజీ కదా అనుకుంటారు. కానీ అంత ఈజీ కాదు. యాక్టింగ్ అనేది చాలా స్ట్రెస్‌ఫుల్‌గా ఉంటుంది. సెట్‌కు వెళ్లిన ప్రతిరోజూ పరీక్షే” అన్నారు రష్మికా మండన్నా. విజయ్ దేవరకొండ, రష్మికా మండన్నా జంటగా భరత్ కమ్మ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం ‘డియర్ కామ్రేడ్’. నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్, మోహన్ చెరుకూరి (సి.వి.ఎం), యష్ రంగినేని కలిసి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 26న విడుదల కానుంది. ఈ సందర్భంగా రష్మికా మండన్నా చెప్పిన విశేషాలు.**

• బాబీ (సినిమాలో విజయ్ దేవరకొండ పాత్ర పేరు) అండ్ లిల్లీ (రష్మికా పాత్ర పేరు)ల జర్నీ ఈ సినిమా. ఇందులో జాతీయ క్రికెట్ జట్టులో స్థానం సంపాదించాలనే లక్ష్యం ఉన్న రాష్ట్ర స్థాయి క్రికెట్ క్రీడాకారిణి లిల్లీ పాత్రలో నటించాను. ఈ పాత్ర కోసం చాలా సాధన చేశా. గాయాలు కూడా అయ్యాయి. ముఖ్యంగా క్రికెటర్ల బాడీ లాంగ్వేజ్‌పై ఎక్కువగా దృష్టి పెట్టాల్సి వచ్చింది.

• ఈ సినిమాకు ముందు నా జీవితంలో క్రికెట్ ఆడలేదు. క్రికెట్ గురించి కూడా అంతగా తెలియదు. లిల్లీ పాత్ర వల్ల క్రికెట్ పట్ల అవగాహన కలిగింది. సిక్సులు తక్కువ, ఫోర్లు ఎక్కువగా కొట్టాను. ఇప్పుడు క్రికెట్ ఆడితే నా వికెట్‌ను నేను కాపాడుకోగలననే నమ్మకం కలిగింది. ఆన్‌డ్రైవ్, ఆన్‌సైడ్, ఆఫ్‌సైడ్.. ఇలా క్రికెట్ టెర్మినాలజీ గురించి కొన్ని బేసిక్స్ నేర్చుకున్నాను. తొలిసారి క్రికెట్ వరల్డ్ కప్ మ్యాచ్‌లను చూశాను. సెమీ ఫైనల్‌లో ధోనీ రనౌట్ నన్ను బాధించింది. చూస్తున్న మనకే ఇలా ఉంటే ఆ టైమ్‌లో గ్రౌండ్‌లో క్రికెట్ అడుతున్నవారికి ఇంకెంత ఆందోళనగా ఉంటుందో కదా అనిపించింది.

• ‘గీతగోవిందం’ సినిమా హిట్ సాధించింది కాబట్టి మళ్లీ విజయ్ దేవరకొండతో కలిసి నటించాలని ఈ సినిమా ఒప్పుకోలేదు. దర్శకుడు భరత్ చెప్పిన కథ నచ్చి ఈ చిత్రం చేయడానికి అంగీకరించాను. ఈ సినిమా స్క్రిప్ట్ చదువుతున్నప్పుడే ఆసక్తికరంగా అనిపించింది. లిల్లీ పాత్ర జ్ఞాపకశక్తి కోల్పోతుందా? అంటే ఆ విషయం గురించి ఇప్పుడు చెప్పను. సినిమా చూసి తెలుసుకోవాల్సిందే.

• మంచి స్క్రిప్ట్స్‌తో వస్తున్న కొత్త దర్శకులతో వర్క్ చేయడం చాలా హ్యాపీగా ఉంది. మైత్రీ బేనర్, భరత్‌సార్‌తో వర్క్ చేయడం సంతోషంగా ఉంది. ఈ సినిమా నాలుగు భాషల్లో ఒకేసారి విడుదల కావడం ఎగ్జైటింగ్‌గా ఉంది. కన్నడ, తెలుగు వెర్షన్స్‌కు నేనే డబ్బింగ్ చెప్పాను. ఎమోషనల్ సీన్స్ చేసేటప్పుడు ఆ క్యారెక్టర్‌లో పూర్తిగా లీనమైపోతాను. కానీ సెట్‌లో సీన్ అయిపోయిందని యూనిట్ సందడి చేయడం మొదలుపెడితే అప్పుడు ఆ మూడ్ నుంచి బయటకు వస్తాను. కానీ పర్సనల్‌గా కొన్ని క్యారెక్టర్స్‌కు మాత్రమే కనెక్ట్ అవుతాం.

• పెద్ద సినిమాల్లో హీరోయిన్‌గా నటించే అవకాశం రావడాన్ని నేను కేవలం లక్ అనుకోవడం లేదు. హార్డ్ వర్క్‌ని నమ్ముతాను. ఎవరైనా ఏదైనా నాకు రాదని చెబితే.. తిరిగి నేనేమీ అనను. చేసి చూపిస్తా. అందుకోసం ఎంతైనా కష్టపడతాను. కెరీర్‌లో ముందుకు వెళ్తూ, లాంగ్ రన్‌ను ఏర్పాటు చేసుకోవాలంటే కష్టపడాల్సిందే. ఇండస్ట్రీలోని ప్రతి హీరోయిన్‌కి వారి పర్సనల్ స్టేటస్ గురించిన ప్రశ్నలు ఎదురవుతూనే ఉంటాయి. నా వరకైతే లొకేషన్‌కు వెళ్లి షూటింగ్‌లో పాల్గొనడం, వర్కౌట్స్, షెడ్యూల్స్ ప్లానింగ్ వీటితోనే గడిచిపోతోంది. ఖాళీ సమయం లేదు. కొన్ని సార్లు తినడం కూడా మర్చిపోతున్నాను. భోజనం టైమ్ అయిపోయిన తర్వాత అనిపిస్తుంది.. అయ్యో.. ఈ రోజు నేను తినలేదు కదా అని. ఇక నా పర్సనల్ విషయానికి వస్తే నేను సింగిలే.

• కన్నడలో సినిమాలు చేయడాన్ని నేను తగ్గించలేదు. కరెక్ట్‌గా డేట్స్ ఇస్తే ఏడాదిలో నాలుగు సినిమాలు చేయవచ్చు. నేను చేయాల్సిన సినిమాలను స్క్రిప్ట్స్ పరంగా ఎంచుకుంటున్నాను. కన్నడలో ఈ ఏడాది రెండు సినిమాలు రిలీజ్ కానున్నాయి. షూటింగ్ ఆలస్యం కావడం, విడుదల తేదీ లాంటి విషయాలు నా చేతిలో ఉండవు.

• ‘సరిలేరు నీకెవ్వరు’ సినిమాలో మహేశ్‌బాబుగారితో వర్క్ చేయబోతున్నాను. ఇంకా నా పాత్ర షూటింగ్ ఆరంభం కాలేదు. దాని కోసం చాలా ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. నితిన్ ‘భీష్మ’ షూటింగ్ ఫుల్ మస్తీగా సాగుతోంది. అల్లు అర్జున్‌తో ఓ సినిమా చేయనున్నా. తమిళంలో కార్తీ సరసన ఓ సినిమా చేయబోతున్నాను. మరొక సినిమా గురించి చర్చలు జరుగుతున్నాయి.


• నవీన్, విజయ్ దేవరకొండ, కరణ్, చెర్రీ

ఇంకో రెండు రోజుల్లో ‘డియర్ కామ్రేడ్’ రిలీజ్ ఉందనగా ఈ చిత్రాన్ని హిందీలో రీమేక్ చేయనున్నట్లు బాలీవుడ్ దర్శక–నిర్మాత కరణ్ జోహార్ వెల్లడించారు. చిత్రకథానాయకుడు, నిర్మాతలతో కలిసి ఆయన ఈ చిత్రాన్ని చూసినట్లు తెలిసింది. “డియర్ కామ్రేడ్ మంచి పవర్‌ఫుల్ లవ్‌స్టోరీ. విజయ్, రష్మిక అద్భుతంగా నటించారు. దర్శకుడిగా తొలి సినిమాతోనే భరత్‌కమ్మ ప్రతిభ చాటుకున్నాడు. ఈ అందమైన ప్రేమకథను ధర్మ ప్రొడక్షన్స్‌పై హిందీలో రీమేక్ చేయబోతున్నాను” అని కరణ్ తెలిపారు. అయితే ఈ సినిమా హిందీ రీమేక్‌లో ఎవరు నటించబోతున్నారనే విషయం ఇంకా ఫైనలైజ్ కాలేదు.


• రష్మికా మండన్నా

# సినిమాకి ఆ పాయింటే ప్లస్

**– సురేందర్ రెడ్డి**


• సురేందర్ రెడ్డి, అశోక్, మణికంధన్, భావనారావు, సాయి రోనక్

సాయిరోనక్, భావనారావు జంటగా రూపొందిన చిత్రం ‘మథనం’. దివ్యాప్రసాద్, అశోక్ ప్రసాద్‌లు నిర్మాతలు. అజయ్ సాయి మణికంధన్ దర్శకునిగా పరిచయమవుతున్నారు. ఈ చిత్రం టీజర్‌ను దర్శకుడు సురేందర్ రెడ్డి దంపతులు విడుదల చేశారు. సురేందర్ రెడ్డి మాట్లాడుతూ– ‘‘నిర్మాత అశోక్ 15 ఏళ్లుగా నాకు స్నేహితుడు. నాతో పాటు కథా చర్చల్లో పాల్గొనేవాడు. సినిమాపై పట్టు ఉండటంతో ఏదైనా చేయాలని చాలా ప్రయత్నించారు. అన్నీ వదిలేసి మధ్యలో అమెరికా వెళ్లి బాగా డబ్బు సంపాదించారు. ఏడేళ్ల తర్వాత వచ్చి సినిమా తీస్తున్నా అన్నాడు. ఓ వాస్తవ సంఘటన ఆధారంగా తీసిన చిత్రమిది. సినిమాకిదే ప్లస్ అవుతుంది. సినిమా విజయం సాధించి అశోక్ పెద్ద నిర్మాతై నాతో సినిమా తీయాలని కోరుకుంటున్నా’’ అన్నారు. సాయిరోనక్ మాట్లాడుతూ– ‘‘మంచి మార్కెట్ ఉన్న హీరోకి పెట్టినంత డబ్బు పెట్టి సినిమా తీశారు. ఈ సినిమా విడుదల తర్వాత ‘మథనం’ సాయి అంటారు’’ అన్నారు. అజయ్ మాట్లాడుతూ– ‘‘జస్ట్ ఒక ఐడియా, సీన్ విని దర్శకునిగా అవకాశం ఇచ్చిన నిర్మాతలకు ధన్యవాదాలు. ‘యువత’ చిత్రం ద్వారా నన్ను కొరియోగ్రాఫర్‌గా పరిచయం చేసిన దర్శకుడు పరశురామ్‌ను ఈ సందర్భంగా గుర్తు చేసుకుంటున్నాను. డైరెక్టర్ సురేందర్ రెడ్డి నాకు గురువులాంటి వారు’’ అన్నారు. ‘‘ఒక జెన్యూన్ ఫిల్మ్‌ని నిజాయతీగా చేశాం’’ అన్నారు నిర్మాత అశోక్. ‘‘నన్ను నమ్మి నాలుగు పాటలు రాసే అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు థ్యాంక్స్’’ అన్నారు రచయిత పూర్ణాచారి.


• శ్రీపద్మ, హర్షిత్

# అందమైన ప్రేమకథ

హర్షిత్, వంశీకృష్ణ పాండ్య, శ్రీపద్మ, మాధవి, బిశ్వజిత్‌నాథ్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం ‘నేను లేను’. ‘లాస్ట్ ఇన్ లవ్’ అనేది ఉపశీర్షిక. రామ్‌కుమార్ దర్శకత్వం వహించారు. ఓ.యస్.యం విజన్– దివ్యాషిక క్రియేషన్స్ పతాకాలపై సుక్రి కుమార్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 26న విడుదలకానుంది. రామ్‌కుమార్ మాట్లాడుతూ– ‘‘అందమైన ప్రేమకథతో తెరకెక్కిన సైకలాజికల్ థ్రిల్లర్ చిత్రమిది. ఇందులోని న్యూ ఏజ్ లవ్ స్టోరీ ఆడియన్స్‌కి ఫ్రెష్ ఫీల్ ఇస్తుంది’’ అన్నారు. ‘‘ఇప్పటి వరకూ రాని సరికొత్త కథాంశంతో వస్తున్న చిత్రమిది. ఇప్పటి వరకు కోటీ ముప్పై లక్షల మంది మా ట్రైలర్‌ని చూశారు. దీంతో మా సినిమా ప్రేక్షకులను మెప్పిస్తుందనే నమ్మకం వచ్చింది’’ అని సుక్రికుమార్ అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: ఆశ్రిత్, కెమెరా: ఎ. శ్రీకాంత్ (బి.ఎఫ్.ఎ), సహనిర్మాత: యశిక.




సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
బుధవారం ॥ 24-7-2019

# షూటింగ్‌లో అలా చూస్తే ఫీలవుతాను

**'చంద్రముఖి'గా బుల్లితెర ప్రేక్షకులకు పరిచయమైన కన్నడ ఆడపడుచు మంజుల తెలుగింటి కోడలు అయింది. మా ఇంటి 'కృష్ణవేణి' అంటూ తన నటనతో అందరిచేత మెప్పు పొందుతోంది. తన సహనటుడు నిరుపమ్ పరిటాలను పెళ్లి చేసుకున్న మంజుల చెబుతున్న ముచ్చట్లివి.**

సీరియల్


భర్త నిరుపమ్, కుమారుడు అక్షజ్‌తో మంజుల



**చిన్నవయసులోనే తల్లిగా నటిస్తున్నారు..**

నేను ఇప్పుడు నటిస్తున్న 'కృష్ణవేణి' సీరియల్ 'స్టార్ మా' టీవీలో వస్తోంది. ఇందులో స్టోరీ దాదాపుగా నాతోనే ముడి పడి ఉంటుంది. తల్లి క్యారెక్టర్ అయినా స్వతంత్రభావాలు గల పాత్ర. అందుకే ఒప్పుకున్నాను.

**ఈ ఫీల్డ్‌కి ఎలా వచ్చారు?**

మాది బెంగుళూరు. మా నాన్నగారు పోలీసాఫీసర్. తను యాక్టర్ కూడా. నటన అంటే ఆయనకు పిచ్చి. మా నాన్నగారి ఫ్రెండ్ సలహాతో చిన్నప్పటి నుంచే అలా నేనూ యాక్టింగ్‌లోకి వచ్చాను. కన్నడలో పదికి పైగా సీరియల్స్‌లో నటించాను. ఇప్పుడు తెలుగుతో పాటు తమిళ్‌లో కూడా ఓ సీరియల్ చేస్తున్నాను. 'చంద్రముఖి' సీరియల్ చేస్తున్నప్పుడు ఇక్కడి భాష రాదు. తర్వాత మెల్లగా నేర్చుకున్నాను. తెలుగులోనూ పదికి పైగా సీరియల్స్ చేశాను.

**నలుగురు అక్కచెల్లెళ్లు అన్నారు..**

అవును, అక్క స్కూల్ టీచర్. నేను రెండవ అమ్మాయిని. మూడవ అమ్మాయి హౌజ్‌వైఫ్. చిన్నది కీర్తి. తనూ సీరియల్స్‌లో నటిస్తోంది. అమ్మ హౌజ్‌వైఫ్. మేమందరం కలిస్తే సందడే సందడి.

**నిరుపమ్‌తో మీ పరిచయం, ప్రేమ..**

'చంద్రముఖి' మా ఇద్దరికి మొదటి సీరియల్. మా ఇద్దరి లక్షణాలు ఒకేలా ఉంటాయి. నేను సైలెంట్‌గా నా పనేదో నేను అన్నట్టు ఉంటాను. నిరుపమ్ కూడా అలాగే సైలెంట్‌గా ఉంటారు. ఏడాది వరకు అలాగే ఉన్నాం. అనుకోకుండా మా మధ్య ఒక మేసేజ్ షేర్ అయ్యింది. అక్కణ్ణుంచి మెసేజ్‌లు, మాటలు పెరిగాయి. చంద్రముఖి సీరియల్ ఆరున్నరేళ్ల పాటు నడిచింది. ఆ టైమ్‌లోనే మా ప్రేమ, పెళ్లి, బాబు పుట్టడం అన్నీ జరిగాయి (నవ్వుతూ). మా ఇద్దరి కుటుంబాల వాళ్లు యాక్టింగ్ ఫీల్డ్‌లో ఉన్నవారే. మా మామగారు ఓమ్‌కార్ పరిటాల నటుడు, రచయితగా పేరున్నవారు.

**పుట్టినిల్లు - మెట్టినిల్లు**

అన్ని పండగలు, పద్ధతులు ఒకేలా ఉన్నాయి. పెద్దగా తేడా లేదు. కొన్ని మాత్రమే వేరు. పిల్లలకు అన్నప్రాసన చేయడం మా పుట్టింటివాళ్ల వైపు లేదు. ఇక్కడ మా బాబుకు ఆ వేడుక చేశాం. అలాగే అబ్బాయిలకు పంచెల ఫంక్షన్ అని లేదు. ఇక్కడ ఆ వేడుక చేయాల్సి ఉంది. అమ్మవాళ్ల వైపు ఉగాదికి వేపాకు–బెల్లం కలిపి తింటారు. ఇక్కడ షడ్రుచులతో పచ్చడి చేసుకుంటారు. అమ్మవాళ్లు శ్రావణమాసంలో ఇక్కడలా వ్రతం చేయరు. పూజలు చేస్తారు.

**వర్క్- ఫ్యామిలీ బ్యాలెన్స్**

నెలలో 15 రోజులు వర్క్. మిగతా 15 రోజులు ఫ్యామిలీతో కలిసేలా ప్లాన్ చేసుకుంటాను. మా బాబు అక్షజ్ ఓమ్‌కార్‌కి ఎనిమిదేళ్లు. మా కంపౌండ్‌లో మిగతా పిల్లల తల్లులను చూసి 'అమ్మా, నువ్వు కూడా టీచర్, డాక్టరయితే ఈవెనింగ్ నాతో ఉండేదానివి కదా!' అంటుంటాడు. అందుకే మిగతా రోజులన్నీ వాడితోనే స్పెండ్ చేసేలా జాగ్రత్త తీసుకుంటాను. ప్రతి వేసవిలోనూ, నవరాత్రి సెలవుల్లో అందరం అమ్మవాళ్లింట్లో కలుస్తాం.

**స్వీట్ మెమరీస్!**

నా జీవితంలో రెండు విషయాలు ఎప్పటికీ మరిచిపోలేను. మా పెళ్లికి పేరెంట్స్ నుంచి ఎలాంటి ప్రాబ్లమ్ రాలేదు. కానీ, తుపాన్ రూపంలో పెద్ద సమస్య వచ్చింది. మా పెళ్లి విజయవాడలో, రిసెప్షన్ బెంగుళూరులో అని డిసైడ్ అయ్యాం. అప్పుడు పెద్ద తుపాన్. నా పెళ్లికి నేను వెళ్లడానికి చాలా కష్టమైంది. నేను పెళ్లి మంటపం చేరుకునేంతవరకు అందరూ టెన్షన్ పడ్డారు. మొత్తానికి ఎలాగోలా చేరుకున్నాను. మా సిస్టర్స్ నా పెళ్లయ్యాక చేరుకున్నారు. ఇది ఎప్పటికీ మర్చిపోలేను.

ఇక రెండవది 'చంద్రముఖి' సీరియల్ టైమ్‌లోనే నేను, మా ఆయన దుబాయ్‌కి వెళ్లాం. మా ఇద్దరికీ అక్కడి లేక్ బోట్‌లో సాంగ్ షూటింగ్. బోట్ చివరలో ఇద్దరం టైటానిక్ పోజ్‌లో నిల్చున్నాం. మా చుట్టూ పడవల్లో కెమెరాలతో షూట్ చేస్తున్నారు. మేమున్న బోట్ కదులడంతో నీళ్లలో పడిపోయా. ఆ టైమ్‌లో నిరుపమ్ గట్టిగా పట్టుకున్నారు. అప్పుడే చచ్చిపోతాను అనుకున్నా.

**ఇద్దరిదీ ఒకే ఫీల్డ్ సమస్యలు వస్తే!**

చాలా త్వరగానే పరిష్కరించుకుంటాం. నాకు కొంచెం పొసిసెవ్ ఎక్కువ. ఆయనతో కంపేర్ చేస్తే నాకే కోపం ఎక్కువ. ఆయనే కూల్ చేస్తుంటారు. షూటింగ్‌లో ఆయన వేరే నటితో కలిసి యాక్ట్ చేయాల్సి ఉంటుంది. అలాంటి సందర్భాల్లో చూసినప్పుడు మాత్రం ఫీలవుతాను. కొద్దిసేపట్లోనే 'ఇదే మా జీవితం కదా!' అని నాకు నేను సర్దిచెప్పుకుంటాను.

**డ్రీమ్స్..**

బీకామ్ చేశాను కాబట్టి అకౌంటెంట్ అవాలనుకున్నా. యాక్టింగ్ ఫీల్డ్ నా కల కూడా కాదు. అనుకోకుండా వచ్చాను. ఇద్దరం వర్క్‌లో బిజీ. ఇద్దరం కలిసి ఉండేది తక్కువ సమయం. తనతో బయటకెళ్లాలి అని, నేనూ, బాబు, తనూ కలిసి ఎక్కువ సమయం గడపాలని కోరుకుంటాను.

– నిర్మలారెడ్డి


గ్రేట్ ఇండియన్ సీరియల్స్-26
● సురభి

# ఇదీ భారతం

**బహుముఖ సాంస్కృతిక భారతాన్ని.. ఆచారాల భారతాన్ని.. సహజీవన భారతాన్ని.. ఆధ్యాత్మిక భారతాన్ని.. బహుజనుల భారతాన్ని మొదటిసారి దూర్‌దర్శన్‌లో చూపిన షో 'సురభి'. సిద్ధార్థ్ కక్, రేణుకా సహాని యాంకర్లుగా ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నారు.**



**● భారతీయ సంగీత దర్శకుడు, వయొలినిస్ట్ డా.ఎల్ సుబ్రమణ్యమ్ సురభికి సంగీతాన్ని అందించారు ● ఈ కార్యక్రమాన్ని అమూల్ సంస్థ స్పాన్సర్ చేయడంతో 'అమూల్ సురభి' అని పేరు పడిపోయింది ● దీర్ఘకాలం ప్రసారమైన సాంస్కృతిక సీరీస్‌గా సురభి 'లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్'లో చోటు చేసుకుంది.**

ఇప్పుడంటే వంటకాలకో చానెల్, సంగీతానికో చానెల్, భక్తికి ఓ చానెల్, పర్యటనకు ఓ చానెల్.. ఇలా ప్రతీ అంశానికి సంబంధించిన చానెల్స్ విడివిడిగా ఉన్నాయి. కానీ, దాదాపు మూడు దశాబ్దాల క్రితం ఇవన్నింటినీ ఓ ప్రోగ్రామ్ ద్వారా అందించింది దూరదర్శన్. భారతీయ సంస్కృతిని వెలుగులోకి తెచ్చి కొత్తగా దేశభక్తిని ఆవిష్కరించింది. ఈ నేలలో పాదుకున్న నీతి, సామాజిక విలువలను కళ్లకు కట్టింది. ఈ థీమ్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఇండియన్ టెలివిజన్ షోలలో అత్యంత ప్రజాదరణ పొందిన, అద్భుతమైన సాంస్కృతిక కార్యక్రమంగా 'సురభి' అలా ఇండియన్ టెలివిజన్ చరిత్రలో సగౌరవంగా నిలిచిపోయింది. ఎంచుకున్న అంశాలు విభిన్న స్వభావాలతో కూడినవి కావడంతో దేశంలోని అన్ని రాష్ట్రాల్లోనూ 'సురభి' అపార ఖ్యాతిని పొందింది.

**ఎక్కువకాలం ప్రసారం**

ప్రతి ఆదివారం బుల్లితెర స్క్రీన్‌పై యాంకర్లుగా సిద్ధార్ద్ కక్, రేణుకా సహానీలు చిరునవ్వులు చిందిస్తూ 30 నిమిషాల సేపు కార్యక్రమాన్ని నిర్వహించేవారు. కొత్త కొత్త వ్యక్తులను, ప్రదేశాలను, సంప్రదాయాలను, మనిషి సృష్టించిన అద్భుతాలను చూపేవారు. ఆ సమయంలో సీరియల్సన్నీ సాధారణ కుటుంబ సంబంధాల నేపథ్యంతో వచ్చేవి. సురభి ఒక్కటే వీటికి భిన్నంగా వచ్చింది. 1990లో మొదలైన సురభి 2001 వరకు దాదాపు 415 ఎపిసోడ్లతో అత్యంత ఎక్కువ కాలం ప్రసారమైన షో గా రికార్డులను సొంతం చేసుకుంది.

**పోస్ట్.. పోస్ట్**

'సురభి' షో విపరీతమైన ప్రేక్షకాదరణ పొందడం వెనుక మరో కృషి ఉంది. షో చివరలో తామడిగిన ప్రశ్నలకు సమాధానాలు పంపమని ప్రేక్షకులను కోరడంతో పోస్టుకార్డు వ్యవస్థ కొత్త ఊపిరి పోసుకుంది. ప్రతీవారం ప్రేక్షకులను క్విజ్ కాంటెస్ట్‌లో పాల్గొనేలా చేయడంతో 'సురభి' రేటింగ్ అమాంతం రాకెట్‌లా దూసుకుపోవడం ఆరంభించింది. ఆ సమయంలో మొబైల్ ఫోన్లు, ఇంటర్‌నెట్ సదుపాయాలు లేకపోవడంతో జనం 15 పైసల పోస్టు కార్డును ఇలాంటివాటికి ఉపయోగించేవారు. వారానికి దాదాపు పదిన్నర లక్షల పోస్టుకార్డులు ప్రేక్షకుల నుంచి దూరదర్శన్‌కి అందేవి. ఈ పోటీలో పాల్గొనడానికి ఒక్కో కార్డ్‌కు 2 రూపాయల ధరతో 'కాంపిటిషన్ పోస్ట్‌కార్డ్స్'ను పోస్టల్ డిపార్ట్‌మెంట్ ప్రత్యేకంగా జారీచేయాల్సి వచ్చింది. అలా ఇండియన్ టెలివిజన్ చరిత్రలో ప్రజల నుంచి అత్యధిక ఆదరణ పొందిన కార్యక్రమంగా లిమ్కాబుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటుచేసుకుంది సురభి. 90ల కాలంలో ఒక బెంచ్ మార్క్ షోగా మారింది. ఈ షో తర్వాత కక్ ఫోర్డ్ ఫౌండేషన్ సహాయంతో సురభి ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసి, సాంస్కృతిక కళాఖండాలను పరిరక్షించే ప్రాజెక్ట్‌ను ప్రారంభించారు.

**చిరునవ్వుల సురభి**

ఆమె చిరునవ్వు సురభికి ఒక నక్షత్రంలా అమరింది. అప్పటికే ఆమె 1989లో టెలివిజన్ సీరియల్ సర్కస్‌లో నటించింది. ఆ సీరియల్ మంచి ప్రజాదరణ పొందింది. అటు తర్వాత సురభితో ప్రజాదరణను సుస్థిరం చేసుకుంది. సురభి మొదలైన రెండేళ్లకు ఆమె ఎంట్రీ ఇచ్చింది. మొత్తం 350 ఎపిసోడ్లను తన ఖాతాలో జమ చేసుకుంది. ఆమె.. నటి, దర్శకురాలు రేణుకా సహానీ. సురభి గురించి ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ సహానీ 'మళ్లీ అలాంటి రోజులను, అలాంటి షోను తిలకించలేం. దేశ సంస్కృతి, చరిత్రకి అసలు సిసలు భాష్యం చెప్పింది నాటి దూరదర్శన్. గతాన్ని చూపుతూ భవిష్యత్తుకు బంగారంగా నిలిచింది' అన్నారు.

**నిర్మాత, వ్యాఖ్యాత**

ఈ షో గురించి నిర్మాత, వ్యాఖ్యాత సిద్ధార్థ్ కక్ మాట్లాడుతూ 'నాటి రోజుల్లో ఎలాంటి జాగ్రత్తలు లేకుండా మాట్లాడే స్వేచ్ఛ మాకు ఉండేది. దీని వల్లే విస్తృతంగా ప్రేక్షకులతో సంభాషించాం. భారతీయ సంస్కృతి సమగ్ర దృక్పథాన్ని సరైన సందర్భంలో ప్రదర్శించాం. ఈ ప్రయాణంలో మాకున్నది తక్కువ కమ్యూనికేషన్ కానీ ప్రజలతో కలిసి ఎక్కువ కాలం ప్రయాణించాం. ముందే ఎంచుకున్న ప్రదేశానికి వెళ్లినప్పుడు అక్కడ చిన్న చిన్న వివరాలు సైతం జాగ్రత్తగా పరిశీలించి తెలుసుకుని చిత్రించేవాళ్లం. చివరికి మా కష్టం ప్రేక్షకులకు అర్థమైంది. దీంతో వారు మాకు సహకరించారు' అని ఆనందంగా గతాన్ని గుర్తు చేసుకుంటారు సిద్ధార్థ్.

**వారపత్రిక**

వారం వారం అనేక సాంస్కృతిక అంశాలతో అలరించే సురభిని ఒక వీక్లీ మ్యాగజైన్‌తో పోల్చుతారు. భారతీయ సంస్కతిలో భాగమైన సంగీతం, నృత్యం, శిల్పం, ప్రజల జీవనవిధానం, వంటకాలు, చేతిపనులు.. ప్రతీ అంశాన్ని ఈ షోలో కవర్ చేశారు. అవన్నీ ఇప్పుడు ఎన్నో చానెల్స్ అనుసరిస్తున్నాయి. ఆ కాన్సెప్ట్ ఇప్పటికీ రకరకాల చానెల్స్‌లో నడుస్తూనే ఉంది. ఇన్ని కార్యక్రమాలకు 'సురభి' ఒక్కటే సమాధానమైంది. అంతేకాదు, సురభిని సాధ్యం చేసిన మరో విషయం ఏమిటంటే సామాన్య ప్రజల నుండి ఈ షోకు లభించిన భారీ మద్దతు. పట్టణ కేంద్రాలకే కాదు మారుమూల ప్రాంతాలకు ప్రయాణించింది సురభి. అక్కడి ప్రజలు సహాయం చేయడానికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. సంస్కృతి, చరిత్ర మనకు వారసత్వంగా వచ్చింది. వాటిని మనం మార్చలేం. ప్రజలే స్వయంగా వచ్చి సంస్కృతిని అందించడానికి సహాయపడ్డారు. కొన్నింటిని ప్రజలే నేరుగా వచ్చి మార్పులు చేయడానికి సహకరించారు. తమ ఆలోచనలను షో నిర్వాహకులతో పంచుకున్నారు.

– ఎన్.ఆర్.

**ఒక్క చిరునవ్వు**



సురభి ప్రయాణంతో రేణుకా సహానీ 'హమ్ ఆప్ కే హై కౌన్, తున్ను కి టీనా.. వంటి సినిమాలోనూ నటించింది. 2009లో మరాఠీ చిత్రం 'రీటా'కు దర్శకత్వం వహించింది. రేణుకా సహానీ సినిమాలలో నటించినా, సామాజిక, రాజకీయ సమస్యలపై బలమైన అభిప్రాయాలను వినిపించినా ఇప్పటికీ సిసలైన గుర్తింపు అంటే అది 'సురభి' వల్లే. రేణుకా సహానీ మాట్లాడుతూ 'మొబైల్ ఫోన్లు, టెక్నాలజీ ఇప్పుడున్నంతగా అప్పుడు లేదు. ప్రజలు వినోదం, మంచి కథలు ఉన్న కార్యక్రమాలవైపు ఆసక్తిగా చూస్తున్నారు. మేం వాటికనుగుణంగా కంటెంట్‌లో సర్దుబాటు చేశారు. మొదట మా వ్యాఖ్యానం చాలా సాధారణంగా ఉండేది. సురభి మొదలైన రెండేళ్లకు నేను వచ్చాను. కొన్ని ఎపిసోడ్స్ పూర్తయ్యాక సిద్ధార్థ గారు, నేను షోను ప్లెజెంట్‌గా మార్చాలంటే ఏం చేయాలని ఆలోచించాం. అందుకు చిరునవ్వుతో యాంకరింగ్ చేయాలన్నారు. అలా మొదలైంది నా ప్రయాణం. ఒక్క చిరునవ్వు నా జీవితాన్నే మార్చేసింది. బాంబేలో పుట్టి పెరిగిన నేను విదేశాల్లో చదువుకున్నాను. ఈ షో ద్వారా నేను నా దేశం గొప్పతనాన్ని స్వీయ అన్వేషణతో తెలుసుకోగలిగాను. దేశమంతా తిరిగాను. నాగరికత ఆనవాళ్లు, తరాతరాల గొప్పతనం తెలుసుకున్నాను. ఈ ఉద్యమంలో నేనూ భాగమైనందుకు గర్వంగా ఉంది' అన్నారు.

పరి పరిశోధన

# మూర్ఛకు చెక్ పెట్టే కొత్తిమీర!



మనం నిత్యం వంటల్లో ఉపయోగించే కొత్తిమీరలో మూర్ఛ వ్యాధికి చికిత్స కల్పించే మందు ఉన్నట్లు గుర్తించారు కాలిఫోర్నియా యూనివర్సిటీ శాస్త్రవేత్తలు. మూర్ఛ లక్షణాలతోపాటు వాంతులు, వికారాలను తగ్గించేందుకు కొత్తిమీర ఉపయోగపడుతుందని చాలాకాలంగా తెలిసినప్పటికీ కచ్చితంగా ఏ మూలకం ద్వారా ఇది జరుగుతోందో మాత్రం తెలియదు. ఈ అంశాన్ని కనుక్కునేందుకు శాస్త్రవేత్తలు పరిశోధనలు మొదలుపెట్టారు. మూర్ఛ లక్షణాల్లో కొన్ని మెదడులోని కేసీఎన్‌క్యూ పొటాషియం ఛానళ్ల ద్వారా నియంత్రించబడుతున్నట్లు ఇప్పటికే తెలిసిన నేపథ్యంలో శాస్త్రవేత్తలు కొత్తిమీర ఆకులోని పదార్థాలను విశ్లేషించడం ద్వారా తమ అధ్యయనాన్ని ప్రారంభించారు. ఈ క్రమంలో కొన్ని రసాయనాలు పొటాషియం ఛానళ్లను చైతన్యపరుస్తున్నట్లు గుర్తించారు. డొడిసెనాల్ అనే పదార్థం పొటాషియం ఛానళ్లకు అతుక్కుపోవడం ద్వారా అవి పనిచేసేలా చేస్తున్నాయని ఈ పరిశోధనల్లో పాల్గొన్న శాస్త్రవేత్త జెఫ్ అబోట్ తెలిపారు. జంతువులపై జరిగిన ప్రయోగాల్లోనూ ఈ డొడిసెనాల్ మూర్ఛ లక్షణాలను తగ్గిస్తున్నట్లు స్పష్టమైందని తెలిపారు. వాంతులు వికారాలకు మరింత మెరుగైన మందును తయారు చేసేందుకు తమ పరిశోధన ఉపయోగపడుతుందని తెలిపారు. పరిశోధన వివరాలు ఫాసెబ్ జర్నల్ తాజా సంచికలో ప్రచురితమయ్యాయి.

# మంచి నిద్రకు... తలార స్నానం!



రాత్రిపూట నిద్ర సరిగ్గా పట్టడం లేదా? అటు ఇటు పొర్లిపొర్లి అలసిపోతున్నారా? ఈ చికాకులేవీ లేకుండా హాయిగా నిద్రపోవాలనుకుంటున్నారా? పడుకునేందుకు సుమారు 90 నిమిషాల ముందు అంటే గంటన్నర ముందు గోరువెచ్చటి నీటితో స్నానం చేస్తే.. మీ సమస్య తీరినట్లే అంటున్నారు యూనివర్శిటీ ఆఫ్ సదరన్ కాలిఫోర్నియా శాస్త్రవేత్తలు. ఇదేదో ఆషామాషీగా చెప్పేసిన విషయం ఏమీ కాదండోయ్! ఇప్పటికే జరిగిన దాదాపు 5322 అధ్యయనాలను పునఃపరిశీలించి, సమాచారాన్ని విశ్లేషించి మరీ నిగ్గుతేల్చిన విషయం. అంతేకాదు. స్నానం చేసేందుకు వాడే నీటి ఉష్ణోగ్రత 40 నుంచి 43 డిగ్రీ సెల్సియస్ మధ్య ఉన్నప్పుడు నడుం వాల్చిన కొద్ది సమయంలోనే నిద్రలోకి జారుకుంటారని ఈ పరిశోధనల్లో పాల్గొన్న శాస్త్రవేత్తలు తెలిపారు. పడుకునేందుకు గంట, రెండు గంటల ముందు శరీర ఉష్ణోగ్రత స్వల్పంగా తగ్గుతుందని ఆ సమయంలో నులివెచ్చటి నీటితో స్నానం చేస్తే రక్త ప్రసరణ మెరుగ్గా జరిగి సుఖ నిద్రకు సాయపడుతుందని వీరు అంటున్నారు. శరీర ఉష్ణోగ్రతల్లో మార్పులకు అనుగుణంగా ఉష్ణోగ్రతను మార్చుకునే పరుపులను తయారు చేయడం ద్వారా రాత్రంతా దీర్ఘనిద్రలో ఉండేలా చేసేందుకు ప్రస్తుతం తాము ప్రయత్నిస్తున్నామని తెలిపారు. స్లీప్ మెడిసిన్ రివ్యూ జర్నల్ తాజా సంచికలో ఈ పరిశోధన వివరాలు ప్రచురితమయ్యాయి.

# శాకాహారంతో మధుమేహ నివారణ?



మధుమేహాన్ని నివారించేందుకు శాకాహారం ఎంతో మేలైందని అంటున్నారు హార్వర్డ్ టి.హెచ్.చాన్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ శాస్త్రవేత్తలు. అయితే వీలైనంత ఎక్కువగా చెట్లు, మొక్కల ఆధారిత ఆహారం తీసుకోవడంతో పాటు చక్కెర, మైదా, ప్రాసెసింగ్ చేసిన ఆహారాలను అతి మితంగా తీసుకోవడం వల్ల మాత్రమే మంచి ఫలితాలు ఉంటాయని స్పష్టం చేస్తున్నారు. ఇటీవలి కాలంలో వీగనిజమ్ పేరుతో ప్రపంచవ్యాప్తంగా శాకాహారంపై మక్కువ పెరుగుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తాము దీనికి, మధుమేహానికి మధ్య ఉన్న లింకేమిటో తెలుసుకునే ప్రయత్నం చేశామని ఈ పరిశోధనల్లో పాల్గొన్న శాస్త్రవేత్త ఫ్రాంక్ క్వియాన్ తెలిపారు. దాదాపు మూడు లక్షల మందిపై ఇప్పటికే జరిగిన కొన్ని అధ్యయనాల సమాచారాన్ని సేకరించి విశ్లేషించడం ద్వారా తాము శాకాహారంతో మధుమేహం వచ్చే ప్రమాదాన్ని తగ్గించవచ్చునని గుర్తించామని చెప్పారు. మరీ ముఖ్యంగా సాధారణమైన శాకాహారం తీసుకునే వారితో పోలిస్తే కాయగూరలు, పండ్లు, గింజలు, నట్స్‌తో పాటు పిండి పట్టని ధాన్యాలను తీసుకునేవారికి మధుమేహం వచ్చే అవకాశం 23 శాతం వరకూ తక్కువని, వేర్వేరు శరీర ప్రక్రియలు ఇందుకు కారణమవుతున్నట్లు తెలిసిందని వివరించారు. మాంసం వంటి పశు సంబంధిత ఆహారం తగ్గడం, శాకాహారం ద్వారా శరీరానికి మేలు చేసే అంశాలు (పీచు, యాంటీయాక్సిడెంట్లు) చేరడం వల్ల ఊబకాయం వచ్చే అవకాశం తగ్గుతుందని.. ఇది మధుమేహం రిస్క్‌ను కూడా తగ్గిస్తోందని వివరించారు.

ఫ్యామిలీ డాక్టర్

ఐ కౌన్సెలింగ్

# నేత్రదానం చేయాలనుకుంటున్నా...

**నేను నా మరణానంతరం నేత్రదానం చేయాలనుకుంటున్నాను. ఎవరెవరు చేయవచ్చు, ఎవరు చేయకూడదు, కళ్లను ఎలా తొలగిస్తారు వంటి వివరాలు చెప్పండి. నాకు బీపీ, షుగర్ ఉన్నాయి. నేను నేత్రదానం చేయవచ్చా?**

**– ఎమ్. పరంధాములు, నకిరేకల్లు**



నేత్రదానం చేసిన వ్యక్తి కళ్లను సేకరించి వాటిని మరొకరికి అమర్చడం ద్వారా అంధులకు చూపు తెప్పిస్తారు. ఒక వ్యక్తి తాలూకు రెండు కళ్లను సేకరించడం ద్వారా ఇరువురికి చూపు రప్పించడం సాధ్యమవుతుంది. కాబట్టి ఒకరు నేత్రదానం చేయడం అంటే ఇద్దరికి చూపు ఇవ్వడమన్నమాట.

మన కంటిలో కార్నియా అనే పారదర్శకమైన పొర ఉంటుంది. ఇది బయటి దృశ్యాలను కంటి లోపలికి చేరవేస్తుంది. కార్నియాలో పారదర్శకత లోపించినప్పుడు అది రెటీనాకు సరైన సమాచారాన్ని చేరవేయలేదు. అలా వచ్చే అంధత్వాన్ని కార్నియల్ బ్లైండ్‌నెస్ అంటారు. ఈ సమస్య నుంచి బయటపడాలంటే... పాడైన కార్నియాను తొలగించి ఆరోగ్యకరమైన కార్నియాను అమర్చాలి. ప్రస్తుతానికి కార్నియల్ బ్లైండ్‌నెస్ ఉన్నవారికి మాత్రమే చూపు తెప్పించగలుగుతున్నారు. నేత్రదానం తర్వాత – దాత నుంచి సేకరించిన ఆరోగ్యకరమైన కార్నియాను... అది (కంటి మీద ఉండే పారదర్శకమైన పొర) దెబ్బతినడం వల్ల అంధులైన వారికి అమరుస్తారు. ఈ ప్రక్రియను కార్నియా రీప్లేస్‌మెంట్ లేదా కెరటోప్లాస్టీ, కార్నియల్ గ్రాఫ్టింగ్ అంటారు.

మన సమాజంలో కార్నియా దెబ్బతినడం కారణంగా దృష్టిలోపంతో బాధపడుతున్న వాళ్లు ఎక్కువ మందే ఉన్నారు. కానీ స్వచ్ఛందంగా నేత్రదానం చేయడానికి ముందుకు వచ్చేవారి సంఖ్య ఇప్పటికీ ఇంకా తక్కువే. చూపు అవసరమైన వారందరిలో ప్రస్తుతానికి కేవలం పది శాతం మందికి మాత్రమే కార్నియా లభ్యమవుతోంది.

ఇక మరికొంతమందిలో స్క్లీరా అనే తెల్లగుడ్డు భాగాన్ని కూడా అమర్చి అంధత్వాన్ని నివారిస్తున్నారు.

ఈ సర్జరీ చేయడానికి నేత్రదాత బ్లడ్‌గ్రూప్ – గ్రహీత బ్లడ్‌గ్రూప్ ఒకటే కావాల్సిన అవసరం లేదు. అంటే బ్లడ్‌గ్రూపులతో పనే లేదు.

**కార్నియా అమర్చడానికి ఎవరెవరు అర్హులు**

● సూడోపేకిక్ బుల్లస్ కెరటోపతి ● కెరటోకోనస్ ● కార్నియాకు గాయాలు (కార్నియల్ ఇంజ్యురీస్) ● కార్నియల్ డీ జనరేషన్ ● కార్నియల్ అల్సర్స్ ● ఎండోథీలియన్ డీ–కంపెన్సేషన్ ● పుట్టుకతోనే తెల్లటి కార్నియా ఉండటం (కంజెనిటల్ కార్నియల్ ఒపాసిటీ) ● కెమికల్ బర్న్స్ (అంటే రసాయనాల వల్ల కార్నియా దెబ్బతినడం) వంటి సమస్యలతో చూపు కోల్పోయిన వారికి కార్నియల్ ట్రాన్స్‌ప్లాంటేషన్ ద్వారా చూపు తెప్పించవచ్చు.

**నేత్రదానం... అపోహలు**

నేత్రదానం విషయంలో మన సమాజంలో ఎన్నో అపోహలు ఉన్నాయి. వాస్తవానికి ఈ అపోహల కారణంగానే చాలామంది నేత్రదానానికి ముందుకు రావడం లేదు. అలాంటి కొన్ని అపోహలూ – అసలు వాస్తవాలను చూద్దాం.

● కాటరాక్ట్ సర్జరీ చేయించుకున్న వాళ్ల కళ్లు నేత్రదానానికి పనికిరావన్నది కొందరు అపోహ. వాస్తవానికి కాటరాక్ట్ సర్జరీ చేయించుకున్నా సరే... వారు కళ్లను దానం చేయవచ్చు ● ఇక మరీ వృద్ధులైన వారి కళ్లు నేత్ర దానానికి పనికిరావనీ, వయసులో ఉన్న వాళ్ల కళ్లు మాత్రమే పనికివస్తాయని కొందరు అనుకుంటారు. ఇది కూడా అపోహే. ఏడాది వయసు నిండిన పిల్లల నుంచి పండు ముదుసలి వరకు ఎవరైనా సరే నేత్రదానం చేయవచ్చు ● కొన్ని సినిమాల్లో చూపినట్లుగా తమ ఆప్తుల కోసం... బతికి ఉన్న వాళ్లు కూడా తమ కళ్లు దానం చేయవచ్చని కొందరు అపోహ పడుతుంటారు. నిజానికి చనిపోయినవారి నుంచి మాత్రమే కళ్లను స్వీకరిస్తారు. ఒకవేళ తమ దగ్గరి వారికి ఏదైనా సమస్య వచ్చి వారు చూపు కోల్పోతే... తల్లిదండ్రులు గానీ లేదా దగ్గరి బంధువులు గానీ తీవ్రమైన భావోద్వేగాలతో ముందుకు వచ్చినా వారి కళ్లను స్వీకరించరు. ● ఇక మీరు చెప్పినట్లుగా మీకు బీపీ, షుగర్ ఉన్నా నేత్రదానం చేయవచ్చు. రక్తపోటు, డయాబెటిస్, ఉబ్బసం (ఆస్తమా), టీబీ వంటి వ్యాధులు ఉన్న వారు కూడా తమ కార్నియా ఆరోగ్యంగా ఉంటే తప్పక నేత్రదానం చేయవచ్చు. అలాగే రిఫ్రాక్టివ్ సమస్యల కారణంగా కళ్లజోడు ధరించేవారు కూడా నేత్రదానం చేయడానికి అర్హులే.

**ఎవరెవరు నేత్రదానం చేయకూడదంటే...**

● ఎయిడ్స్, హెపటైటిస్, రుబెల్లా, సిఫిలిస్ వంటి అంటువ్యాధులున్న వారు, బ్లడ్ క్యాన్సర్, ట్యూమర్లు ఉన్న వారు నేత్రదానానికి అర్హులు కారు. ఈ సమస్యలు ఉన్నాయా లేవా అని తెలుసుకునేందుకు చనిపోయిన వ్యక్తి నుంచి కంటితో పాటు, రక్తనమూనాలు సేకరిస్తారు. వైద్య పరీక్షల్లో అతడికి అనారోగ్యాలేవీ లేవని నిర్ధారణ చేసుకున్న తర్వాత మాత్రమే వాళ్ల కార్నియాను ఉపయోగిస్తారు. ఇక విషం తీసుకుని మరణించిన వారి కళ్లు కూడా నేత్రదానానికి పనికిరావు.

**ఎలా సేకరిస్తారంటే...**

- మరణానంతరం ఆరు గంటలలోపు కళ్లను సేకరించాలి.
- నేత్రదానం చేయదలచినప్పుడు మరణించిన వ్యక్తి కనురెప్పలను మూసి, కళ్ల మీద తడిగుడ్డ లేదా దూదిని లేదా ఐస్ ముక్కలను ఉంచాలి.
- తల ఎత్తులో ఉండేటట్లు, తల కింద రెండు తలగడలు ఉంచాలి.
- మృతదేహం ఉన్న గదిలో ఫ్యాన్ వేయకూడదు. దీనివల్ల కార్నియా బాగా పొడిగా మారి చెడిపోయే అవకాశం ఉంది. ఫ్యాన్ వేయకూడదుగానీ గది వీలైనంత వరకు చల్లగా (లో–టెంపరేచర్‌తో) ఉండేలా చూడాలి.
- ఇప్పుడున్న ఆధునిక పరిజ్ఞానంతో కేవలం కంటి నల్లగుడ్డు మీద ఉండే కార్నియాను మాత్రమే సేకరిస్తున్నారు. కాబట్టి నేత్రదానం చేసినా కంటి ఆకారంలో ఎలాంటి మార్పూ కనిపించదు. ఒకవేళ పాత పద్ధతిలో కంటిని మొత్తంగా తీసేసినా కూడా ఆ స్థానంలో కృత్రిమ కంటిని అమర్చుతారు. ఫలితంగా పార్థివ దేహం మామూలుగా కళ్లు మూసుకుని ఉన్నట్లే కనిపిస్తుంది.
- కార్నియాను సేకరించిన తర్వాత దాన్ని ఐ–బ్యాంకులో ఉంచుతారు. ఆ తర్వాత వీలైనంత త్వరగా మరొకరికి అమర్చుతారు.
- వీలైనంత త్వరగా కంటిని సేకరించేందుకు వీలుగా ఐ–బ్యాంక్ ప్రతినిధులు, వైద్యనిపుణులు వచ్చేలోపే... మరణించిన వ్యక్తి తాలూకు డెత్ సర్టిఫికేట్, మరణానికి కారణాలు తెలిపే (కాజ్ ఆఫ్ డెత్) ధ్రువీకరణ పత్రాలు, మెడికల్ రికార్డ్స్ కూడా సిద్ధంగా ఉంచడం మంచిది.
- మరణించిన వ్యక్తికి వారసులు ఉంటే వారి అనుమతితో మాత్రమే కళ్ల సేకరణ జరుగుతుంది.



**డాక్టర్ రవికుమార్ రెడ్డి**
కంటి వైద్య నిపుణులు,
మెడివిజన్ ఐ హాస్పిటల్, హైదరాబాద్.

సాక్షి భవిత
మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక, రోడ్ నంబరు-1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. ఈ-మెయిల్ sakshieducation@gmail.com
స్పర్ధయా వర్ధతే విద్య
బుధవారం 24-7-2019

# సైన్స్ పరిశోధనలకు ప్రోత్సాహం

# కేవీపీవై

- కేవీపీవై 2019కు నోటిఫికేషన్ విడుదల
- ఇంటర్ సైన్స్ విద్యార్థులకు సువర్ణావకాశం
- ఆన్‌లైన్ టెస్టు, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక
- ఎంపికైతే ఐదేళ్లపాటు స్కాలర్‌షిప్ సదుపాయం
- దరఖాస్తులకు చివరితేది: ఆగస్టు 20

**కిశోర్ వైజ్ఞానిక్ ప్రోత్సాహన్ యోజన (కేవీపీవై).. విద్యార్థులను సైన్స్ పరిశోధన వైపు ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకం. కేంద్ర శాస్త్ర, సాంకేతిక మంత్రిత్వ శాఖ 1999 నుంచి కేవీపీవై పథకం ద్వారా ప్రతిభావంతులకు ప్రోత్సాహకాలను అందిస్తోంది. కేవీపీవై ఫెలోషిప్స్‌కి దేశవ్యాప్త గుర్తింపు ఉంది. తాజాగా కేవీపీవై 2019కు దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో కేవీపీవైతో విద్యార్థులకు ప్రయోజనాలు... అర్హతలు... ఎంపిక విధానం గురించి తెలుసుకుందాం..**




### ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 20.
- **అడ్మిట్ కార్డుల జారీ:** అక్టోబర్ రెండోవారం.
- **పరీక్ష తేదీ:** 2019 నవంబర్ 3.
- **ఎస్ఏ స్ట్రీమ్:** ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు.
- **ఎస్ఎక్స్/ఎస్‌బీ స్ట్రీమ్స్:** మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు.
- ప్రశ్నపత్రం ఇంగ్లిష్, హిందీ మాధ్యమాల్లో ఉంటుంది.
- **వెబ్‌సైట్: www.kvpy.iisc.ernet.in**

### ఎంపిక విధానం

కేవీపీవై ఫెలోషిప్‌లకు ఆన్‌లైన్ టెస్టు, ఇంటర్వ్యూల ద్వారా ఎంపిక జరుగుతుంది. కేవీపీవై ఆప్టిట్యూడ్ టెస్టు సైన్స్, మ్యాథ్స్ సబ్జెక్టుల్లో ఆన్‌లైన్ విధానంలో ఉంటుంది. జాతీయ స్థాయిలో నిర్వహించే ఈ పరీక్షలో ప్రతిభ చూపిన వారికి ఇంటర్వ్యూలు నిర్వహించి ఫెలోషిప్ ఖరారు చేస్తారు.

### అర్హతలు

» **ఎస్ఏ స్ట్రీమ్:** ప్రస్తుత విద్యాసంవత్సరంలో(2019-20) సైన్స్ సబ్జెక్టుల్లో (ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్, బయాలజీ) ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు అర్హులు. పదో తరగతిలో మ్యాథ్స్, సైన్స్‌లో కనీసం 70 శాతం మార్కులు సాధించి ఉండాలి (ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూడీ విద్యార్థులకు 65 శాతం మార్కులు). వీరు స్కాలర్‌షిప్ పొందేందుకు ఇంటర్‌లో కనీసం 60 శాతం మార్కులతో (ఎస్సీ/ఎస్టీ/ పీడబ్ల్యూడీ విద్యార్థులకు 50 శాతం మార్కులు) ఉత్తీర్ణత సాధించాలి. అదేవిధంగా 2021-22 విద్యాసంవత్సరంలో బేసిక్ సైన్స్ కోర్సులు(బీఎస్సీ/బీఎస్/బీస్టాట్/బీ మ్యాథ్స్/ఇంటిగ్రేటెడ్ ఎంఎస్సీ/ఇంటిగ్రేటెడ్ ఎంఎస్)ల్లో ప్రవేశం పొందాలి.

» **ఎస్ఎక్స్ స్ట్రీమ్:** 2019-20 విద్యా సంవత్సరంలో సైన్స్ కోర్సుల్లో(ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్, బయాలజీ) ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఈ స్ట్రీమ్‌కు అర్హులు. వీరు పదో తరగతిలో మ్యాథ్స్, సైన్స సబ్జెక్టుల్లో కనీసం 75 శాతం(ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూడీలు 65 శాతం మార్కులు) మార్కులు పొందాలి. అలాగే సైన్స్ సబ్జెక్టుల్లో కనీసం 60 శాతం మార్కులతో(ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూడీలు 50 శాతం మార్కులు) ఇంటర్ పూర్తిచేయాలి. అదేవిధంగా 2020-21 విద్యాసంవత్సరంలో బీఎస్సీ/బీఎస్/బీస్టాట్/బీ మ్యాథ్స్/ఇంటిగ్రేటెడ్ ఎంఎస్సీ/ఇంటిగ్రేటెడ్ ఎంఎస్ కోర్సుల్లో చేరితేనే స్కాలర్‌షిప్ లభిస్తుంది.

» **ఎస్‌బీ స్ట్రీమ్:** 2019-20 విద్యా సంవత్సరంలో బీఎస్సీ/బీఎస్/బీస్టాట్/బీ మ్యాథ్స్/ఇంటిగ్రేటెడ్ ఎంఎస్సీ/ఇంటిగ్రేటెడ్ ఎంఎస్ కోర్సుల ప్రథమ సంవత్సరంలో చేరిన విద్యార్థులు ఎస్‌బీ స్ట్రీమ్‌కు అర్హులు. వీరు సైన్స్ సబ్జెక్టుల్లో కనీసం 60 శాతం (ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూడీ అభ్యర్థులు 50 శాతం మార్కులు) మార్కులతో ఇంటర్ ఉత్తీర్ణత సాధించాలి.

### కేవీపీవైతో ప్రయోజనాలు

» కేవీపీవై ఎంపిక ప్రక్రియలో విజయం సాధించిన విద్యార్థులకు సైన్స్ కోర్సులు అభ్యసించేందుకు ఐదేళ్లపాటు ఫెలోషిప్ సదుపాయం అందుబాటులో ఉంటుంది. దీంతోపాటు ఏడాదికోసారి కాంటింజెన్సీ గ్రాంట్ కూడా లభిస్తుంది.

» ఎస్ఏ, ఎస్ఎక్స్, ఎస్‌బీ స్ట్రీమ్స్‌లో బీఎస్సీ, బ్యాచిలర్ ఆఫ్ స్టాటిస్టిక్స్, బ్యాచిలర్ ఆఫ్ మ్యాథమెటిక్స్, ఇంటిగ్రేటెడ్ ఎంఎస్సీ, ఎంఎస్ కోర్సుల్లో ప్రవేశించిన విద్యార్థులకు మొదటి మూడేళ్లు నెలకు రూ.5వేలు చొప్పున ఫెలోషిప్ అందుతుంది. దీంతోపాటు ఏటా రూ.20 వేల కాంటింజెన్సీ గ్రాంట్ లభిస్తుంది.

» మూడు స్ట్రీమ్స్‌లోని చివరి రెండేళ్లు(పీజీ, ఇంటిగ్రేటెడ్ పీజీ స్థాయిలో) నెలకు రూ.7వేల ఫెలోషిప్ తోపాటు రూ.28వేల వార్షిక కాంటింజెన్సీ గ్రాంట్ అందుతుంది.

» పుస్తకాల కొనుగోలు; వర్క్‌షాప్‌లు, ఇతర సైన్స్ సదస్సులకు హాజరుకు సంబంధించిన రవాణా ఖర్చులకు కాంటింజెన్సీ గ్రాంట్‌ను ఉపయోగించాల్సి ఉంటుంది.

### విలువైన అర్హత

» కేవీపీవై ద్వారా ఫెలోషిప్ లభించడంతోపాటు విద్యార్థుల రెజ్యూమెలో అదనపు అర్హతగా చేరుతుంది. హార్వర్డ్; మిట్ వంటి ప్రముఖ విదేశీ యూనివర్సిటీలతోపాటు; పలు జాతీయ స్థాయి ఇన్‌స్టిట్యూట్స్‌ల్లోనూ ప్రవేశాల్లో కేవీపీవై విద్యార్థులకు ప్రాధాన్యత ఉంటుంది.

» కేవీపీవై స్కాలర్స్‌కి జాతీయ పరిశోధనా సంస్థల్లో జరిగే ప్రోగ్రామ్స్‌లో పాల్గొనే అవకాశం లభిస్తుంది. ఆ సమయంలో సైన్స్; రీసెర్చ్ రంగంలోని నిష్ణాతులైన అధ్యాపకుల లెక్చర్లు వినే వీలుంటుంది. దీంతోపాటు తరచూ సమీపంలోని సైన్స్, రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్స్‌ను సందర్శించడం వల్ల శాస్త్రవేత్తల పరిశోధనలు, పనితీరుపై అవగాహన ఏర్పడుతుంది. వారితో అభిప్రాయాలను పంచుకొనే అవకాశం దక్కుతుంది. కేవీపీవై ఫెలోషిప్‌కి ఎంపికైన వారికి ప్రత్యేక ఐడీ కార్డులు జారీ చేస్తారు. ఈ ఐడీ కార్డు ఆధారంగా జాతీయ స్థాయి లేబొరేటరీలు; విశ్వవిద్యాలయాలు; ఇన్‌స్టిట్యూట్స్ తమ ల్యాబ్స్, లైబ్రరీలను వినియోగించుకునే సౌలభ్యం కల్పిస్తున్నాయి. దీంతోపాటు కేవీపీవై ఫెలోషిప్ ద్వారా సైన్స్ పరిశోధనల్లో టాప్ ఇన్‌స్టిట్యూట్స్ ఐఐఎస్సీ; ఐఐఎస్ఈఆర్‌లలో నేరుగా ప్రవేశం పొందే అవకాశం సైతం ఉంది.

### ఆప్టిట్యూడ్ టెస్టు విధానం

» **ఎస్ఏ స్ట్రీమ్:** పేపర్ రెండు విభాగాలుగా (పార్ట్1, పార్ట్ 2) ఉంటుంది.

» పార్ట్ 1లో.. మ్యాథమెటిక్స్ 15 ప్రశ్నలు-15 మార్కులు; ఫిజిక్స్ 15 ప్రశ్నలు-15 మార్కులు; కెమిస్ట్రీ 15 ప్రశ్నలు-15 మార్కులు; బయాలజీ 15 ప్రశ్నలు-15 మార్కులు ఉంటాయి.

» పార్ట్ 2లో.. మ్యాథమెటిక్స్ 5 ప్రశ్నలు-10 మార్కులు; ఫిజిక్స్ 5 ప్రశ్నలు-10 మార్కులు; కెమిస్ట్రీ 5 ప్రశ్నలు-10 మార్కులు; బయాలజీ 5 ప్రశ్నలు-10 మార్కులు ఉంటాయి.

» ఎస్ఏ స్ట్రీమ్‌కి హాజరయ్యే వారు అన్ని విభాగాలను తప్పనిసరిగా అటెంప్ట్ చేయాల్సి ఉంటుంది. పార్ట్1లో ప్రతి ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. ప్రతి తప్పు సమాధానానికి 0.25 మార్కు కోత విధిస్తారు.

» **ఎస్ఎక్స్, ఎస్‌బీ స్ట్రీమ్:** ఈ స్ట్రీమ్స్‌లో పేపర్ రెండు విభాగాలు (పార్ట్ 1, పార్ట్ 2)గా ఉంటుంది. పార్ట్ 1లో మ్యాథ్స్; ఫిజిక్స్; కెమిస్ట్రీ; బయాలజీ నుంచి 20 ప్రశ్నల చొప్పున అడుగుతారు. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది.

» పార్ట్ 2లో ప్రతి విభాగం నుంచి 10 ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నకు రెండు మార్కులు కేటాయించారు. పార్ట్ 1లో ప్రతి తప్పు సమాధానానికి 0.25 మార్కుల చొప్పున; పార్ట్ 2లో ప్రతి తప్పు సమాధానానికి 0.50 మార్కుల చొప్పున కోత విధిస్తారు.

» ఎస్ఎక్స్, ఎస్‌బీ స్ట్రీమ్‌లో పార్ట్ 1 నుంచి ఏవైనా మూడు; పార్ట్ 2 నుంచి ఏవైనా రెండు సబ్జెక్టులను అటెంప్ట్ చేసే వెసులుబాటు ఉంది. అన్ని విభాగాలను అటెంప్ట్ చేస్తే బెస్ట్ ఆఫ్ 3ని; బెస్ట్ ఆఫ్ 2ను పరిగణలోకి తీసుకుంటారు.

## సన్నద్ధత

### ఎస్ఏ స్ట్రీమ్

» **మ్యాథ్స్:** స్టాటిస్టిక్స్ అండ్ ప్రాబబిలిటీ; లిమిట్స్ అండ్ డెరివేషన్స్; 3 డీ-జామెట్రీ; కోనిక్ సెక్షన్; పెర్ముటేషన్స్ అండ్ కాంబినేషన్స్; సీక్వెన్సెస్ అండ్ సిరీస్ చాప్టర్లకు అధిక వెయిటేజీ దక్కుతుంది. కాబట్టి మ్యాథ్స్ ప్రిపరేషన్ పరంగా ఈ చాప్టర్లకు ఎక్కువ సమయం కేటాయించాలి.

✦ స్ట్రైట్ లైన్స్; బైనామియల్ థీరమ్; కాంప్లెక్స్ నంబర్స్ అండ్ క్వాడ్రాటిక్స్; లీనియర్ ఇనీక్వాలిటీస్; రిలేషన్స్ అండ్ ఫంక్షన్స్ అంశాలను ఒక స్థాయిలో చదివితే సరిపోతుంది.

✦ ట్రిగనోమెట్రీ; మ్యాథమెటికల్ రీజనింగ్ చాప్టర్లను ప్రాథమిక స్థాయిలో ప్రిపేరవ్వాలి. ట్రిగనోమెట్రీ ప్రిపరేషన్‌కి ఎక్కువ సమయం పడుతుంది. కానీ, పరీక్షలో దాన్నుంచి తక్కువ ప్రశ్నలు వస్తున్నాయి.

» **ఫిజిక్స్:** ఆసిలేషన్స్ అండ్ వేవ్స్; థర్మోడైనమిక్స్; మెకానికల్ ప్రాపర్టీస్ ఆఫ్ ఫ్లూయిడ్స్; గ్రావిటేషన్; వర్క్, ఎనర్జీ అండ్ పవర్ చాప్టర్లకు ఎక్కువ వెయిటేజీ లభిస్తుంది.

✦ కైనటిక్ థియరీ; థర్మల్ ప్రాపర్టీస్; మెకానికల్ ప్రాపర్టీస్ ఆఫ్ సాలిడ్స్; రొటేషనల్ మోషన్; మోషన్ ఇన్ ప్లేన్ చాప్టర్లకు మధ్యస్థ ప్రాధాన్యం దక్కుతోంది.

✦ లా ఆఫ్ మోషన్; మోషన్ ఇన్ స్ట్రైట్ లైన్; యూనిట్స్ అండ్ మెజర్‌మెంట్స్; ఫిజికల్ వరల్డ్ చాప్టర్లకు తక్కువ వెయిటేజీ దక్కుతోంది. ఫిజికల్ వరల్డ్ చాప్టర్‌ను పూర్తిగా విస్మరించినా పర్వాలేదు.

» **కెమిస్ట్రీ:** హైడ్రోకార్బన్స్; ఆర్గానిక్ కెమిస్ట్రీ; ఎస్ అండ్ పీ బ్లాక్ ఎలిమెంట్స్; ఈక్విలిబ్రియమ్; కెమికల్ బాండింగ్ అంశాలకు అధిక వెయిటేజీ లభిస్తుంది. కాబట్టి ఈ చాప్టర్లకు అధిక సమయం వెచ్చించాలి.

✦ ఎన్విరాన్‌మెంటల్ కెమిస్ట్రీ; హైడ్రోజన్; స్ట్రక్చర్ ఆఫ్ ఆటమ్స్; థర్మోడైనమిక్స్; క్లాసిఫికేషన్ ఆఫ్ ఎలిమెంట్స్ చాప్టర్ల నుంచి చెప్పుకోదగ్గ స్థాయిలో ప్రశ్నలు వస్తున్నాయి. కానీ, స్టేట్ ఆఫ్ మేటర్; బేసిక్ కాన్సెప్ట్స్ ఆఫ్ కెమిస్ట్రీ; రిడాక్స్ రియాక్షన్స్ టాపిక్స్ నుంచి చాలా తక్కువ స్థాయిలో ప్రశ్నలు అడుగుతున్నారు.

» **బయాలజీ:** కంట్రోల్ అండ్ కోఆర్డినేషన్ ఇన్ యానిమల్స్ అండ్ ప్లాంట్స్; హెరిడిటీ అండ్ ఎవల్యూషన్; రీప్రొడక్షన్; లైఫ్ ప్రాసెస్; అవర్ ఎనన్విరాన్‌మెంట్ చాప్టర్లను సమగ్రంగా చదవాలి. బయాలజీ ప్రిపరేషన్ పరంగా ఎస్ఎస్‌సీ బయాలజీలోని ప్రాథమిక కాన్సెప్ట్‌లపై పట్టు సాధిస్తే మెరుగైన ఫలితాల సాధించొచ్చు.




### ఎస్ఎక్స్, ఎస్‌బీ స్ట్రీమ్స్

ఈ రెండు స్ట్రీమ్స్‌లో విజయం సాధించాలంటే... ఎస్ఏ స్ట్రీమ్‌లోని అంశాలకు అదనంగా కింది అంశాలను చదవాల్సి ఉంటుది.

» **మ్యాథ్స్:** ప్రాబబిలిటీ; వెక్టార్ ఆల్జీబ్రా అండ్ 3డీ; కంటిన్యూటీ అండ్ డిఫ్రెన్షియబిలిటీ; అప్లికేషన్స్ ఆఫ్ డెరివేషన్స్; అప్లికేషన్స్ ఆఫ్ ఇంటెగ్రల్స్; డిఫరెన్షియల్ ఈక్వేషన్స్ అంశాల నుంచి ఎక్కువ ప్రశ్నలు వస్తుజున్నాయి.

✦ ఇన్వెర్స్ ట్రిగనోమెట్రి; మాట్రిసెస్ అండ్ డిటర్మినెంట్స్; ఇంటెగ్రల్స్; రిలేషన్స్ అండ్ ఫంక్షన్స్ నుంచి ప్రశ్నలు మోస్తరుగా వస్తున్నాయి. లీనియర్ ప్రోగ్రామింగ్ నుంచి తక్కువ ప్రశ్నలు వస్తున్నాయి.

» **ఫిజిక్స్:** సెమీ కండక్టర్స్; డ్యూయల్ నేచుర్ ఆఫ్ మ్యాటర్ అండ్ రేడియేషన్; ఈఎంఐ అండ్ ఏసీ; మూవింగ్ ఛార్జెస్; మాగ్నటిజం అండ్ మేటర్; రే ఆప్టిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంట్స్ చాప్టర్ల నుంచి ఎక్కువ ప్రశ్నలు వస్తున్నాయి. కాబట్టి ఈ చాప్టర్లలోని ప్రతి అంశాన్ని లోతుగా అధ్యయనం చేయాలి.

✦ వేవ్ ఆప్టిక్స్; ఆటమ్స్ అండ్ న్యూక్లియై; ఈఎండబ్ల్యూ; ఎలక్ట్రోస్టాటిస్టిక్స్ చాప్టర్లకు మధ్యస్థ ప్రాధాన్యం దక్కుతుంది. ఆటమ్స్ అండ్ న్యూక్లియై చాప్టర్ నుంచి డైరెక్ట్ ప్రశ్నలు అడుగుతున్నారు. కమ్యూనికేషన్ సిస్టమ్స్ చాప్టర్‌ను ప్రాథమిక స్థాయిలో ప్రిపేరయితే సరిపోతుంది.

» **కెమిస్ట్రీ:** బయోమాలిక్యూల్స్ అండ్ పాలిమర్స్ చాప్టర్ నుంచి ఏటా క్రమం తప్పకుండా ప్రశ్నలు అడుగుతున్నారు. కాబట్టి ఈ చాప్టర్‌పై అధిక దృష్టి పెట్టాలి. దీంతోపాటు అమైన్స్ ఆల్కహాల్స్; ఫీనాల్స్ అండ్ ఈథర్స్; కోఆర్డినేషన్ కాంపౌండ్స్; పీ బ్లాక్; సర్ఫేస్ కెమిస్ట్రీ చాప్టర్లకు అధిక వెయిటేజీ దక్కుతుంది.

✦ ఆల్కలైడ్స్; కీటోన్స్ అండ్ యాసిడ్స్; డీ అండ్ ఎఫ్ బ్లాక్ ఎలిమెంట్స్; ఎలక్ట్రోకెమిస్ట్రీ, కెమికల్ కైనటిక్స్; సాలిడ్ స్టేట్ అండ్ సొల్యూషన్ అంశాల నుంచి చెప్పుకోదగ్గ స్థాయిలో ప్రశ్నలు వస్తున్నాయి.

✦ ఐసోలేషన్ ఆఫ్ ఎలిమెంట్స్; హాలోఆల్కేన్స్; హాలోఎరీన్స్; కెమిస్ట్రీ ఇన్ ఎవ్రీడే లైఫ్ చాప్టర్లకు తక్కువ వెయిటేజీ లభిస్తోంది.

» **బయాలజీ:** డైవర్సిటీ ఆఫ్ లివింగ్ ఆర్గానిజమ్స్; జెనిటిక్స్ అండ్ ఎవల్యూషన్; కంట్రోల్ అండ్ కోఆర్డినేషన్ ఇన్ యానిమల్ అండ్ ప్లాంట్స్ చాప్టర్లకు అధిక వెయిటేజీ లభిస్తుంది. సెల్ స్ట్రక్చర్ అండ్ ఫంక్షన్స్; జెనిటిక్స్; ఎకాలజీ అండ్ ఎన్విరాన్‌మెంట్; బయాలజీ అండ్ హ్యూమన్ వెల్ఫేర్ చాప్టర్ల ప్రిపరేషన్‌కు అధిక సమయం కేటాయించాలి.




## బీపీసీఎల్

**ఖాళీలు 18**

ప్రభుత్వ రంగ సంస్థ.. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్(బీపీసీఎల్).. కోచి రిఫైనరీలో కెమిస్ట్రీ ట్రైనీ, జనరల్ వర్క్‌మెన్ -బీ(పెట్రోకెమికల్) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

**పోస్టుల వివరాలు:**
- కెమిస్ట్రీ ట్రైనీ-6.
- జనరల్ వర్క్‌మెన్-బీ(పెట్రోకెమికల్)-12.

**విద్యార్హతలు:**
- కెమిస్ట్రీ ట్రైనీ పోస్టులకు ప్రథమ శ్రేణి మార్కులతో ఎంఎస్సీ కెమిస్ట్రీ ఉత్తీర్ణత. కనీసం ఒక సంవత్సరం సంబంధిత అనుభవం ఉండాలి.
- జనరల్ వర్క్‌మెన్-బీ (పెట్రోకెమికల్) పోస్టులకు కెమికల్ ఇంజనీరింగ్/పెట్రోకెమికల్ ఇంజనీరింగ్‌లో డిప్లొమా ప్రథమ శ్రేణి మార్కులతో ఉత్తీర్ణత. కనీసం ఒక ఏడాది సంబంధిత అనుభవం ఉండాలి.
- **వయసు:** 01.07.2019 నాటికి 18-30 ఏళ్ల మధ్య ఉండాలి. రిజర్వేషన్ వర్గాలకు వయో సడలింపు లభిస్తుంది.
- **ఎంపిక:** రాత పరీక్ష, స్కిల్ టెస్టు, ప్రీ ఎంప్లాయ్‌మెంట్ మెడికల్ టెస్టు ద్వారా ఉద్యోగాలకు ఎంపిక జరుగుతుంది.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్లో.
- **దరఖాస్తుకు చివరి తేదీ:** 05.08.2019.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.bharatpetroleum.com >Careers.

## కొచ్చిన్ షిప్‌యార్డ్

**ఖాళీలు 9**

కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ, మినీ రత్న కంపెనీ కొచ్చిన్ షిప్‌యార్డ్ పలు పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

Cochin Shipyard Ltd.

**పోస్టుల వివరాలు:**
- అసిస్టెంట్ జనరల్ మేనేజర్ (మెకానికల్)-1, డిప్యూటీ జనరల్ మేనేజర్ (మెకానికల్, ఎలక్ట్రికల్, వెపన్స్)-8.
- **అర్హతలు:** సంబంధిత సబ్జెక్టుల్లో ఇంజనీరింగ్ డిగ్రీ కోర్సు ఉత్తీర్ణతతోపాటు అనుభవం ఉండాలి.
- **వయసు:** అసిస్టెంట్ జనరల్ మేనేజర్ (మెకానికల్) పోస్టుకు 55 ఏళ్ల లోపు ఉండాలి; అలాగే డిప్యూటీ జనరల్ మేనేజర్ (మెకానికల్, ఎలక్ట్రికల్, వెపన్స్) పోస్టులకు 35 ఏళ్ల లోపు ఉండాలి.
- **ఎంపిక:** అకడెమిక్ మార్కులు, పని అనుభవం, పవర్ పాయింట్ ప్రజెంటేషన్, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక జరుగుతుంది.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** రూ.1000 (ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూ వర్గాలకు ఫీజు మినహాయింపు ఉంది).
- **దరఖాస్తులకు చివరితేదీ:** 14.08.2019.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.cochinshipyard.com

## టీసీఎస్‌లో ఉద్యోగ పరీక్ష

ప్రముఖ ఐటీ సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్)లో ఫ్రెషర్ ఉద్యోగాల భర్తీకి నిర్వహించే 'టీసీఎస్ నేషనల్ క్వాలిఫైర్ టెస్ట్ (టీఎన్‌క్యూటీ)'కు నమోదు జూలై 24తో ముగియనుంది. గతేడాది నుంచి జాతీయ స్థాయి ఉమ్మడి పరీక్ష ద్వారా ఉద్యోగులను ఎంపిక చేస్తున్న టీసీఎస్... 2020లో ఇంజనీరింగ్, ఎంసీఏ, ఎంటెక్, ఎంఎస్సీ పూర్తిచేయబోయే విద్యార్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు కోరుతుంది. అన్ని బ్రాంచుల ఇంజనీరింగ్ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంఎస్సీ కంప్యూటర్ సైన్స్, ఐటీ లేదా సంబంధిత కోర్సులు చదివిన వారు అర్హులు. అకడమిక్స్ పరంగా కనీసం 60 శాతం మార్కులు ఉండాలి. పరీక్ష సమయానికి గరిష్ఠంగా ఒక బ్యాక్‌లాగ్ సబ్జెక్టు వరకు అనమతిస్తారు. అకడమిక్‌గా రెండేళ్ల గ్యాప్ ఉన్న విద్యార్థులూ కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. పరీక్ష గంటన్నర పాటు ఉంటుంది. ఇంగ్లిష్ నుంచి 15 ప్రశ్నలు, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ నుంచి 15 ప్రశ్నలు, ప్రోగ్రామింగ్ లాజిక్ విభాగం నుంచి 10 ప్రశ్నలు, ఒక ప్రాబ్లమ్ స్టేట్‌మెంట్ కోడింగ్ విభాగాలు ఉంటాయి.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** 2019, జూలై 24
- **హాల్‌టిక్కెట్ల డౌన్‌లోడింగ్:** 2019 జూలై 31
- **ఆన్‌లైన్ పరీక్ష తేదీ:** 2019 ఆగస్టు 3, 4 తేదీల్లో
- **ఇంటర్వ్యూలు:** 2019 ఆగస్టు 9 నుంచి
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://careers.tcs.com

## ఇండియన్ ఆర్మీ

**ఖాళీలు 34**

భారత ఆర్మీ తూర్పు దళం(ఈస్టర్న్ కమాండ్) గ్రూప్ సీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

**పోస్టుల వివరాలు:**
- **మొత్తం ఖాళీలు:** 34 (ఫైర్ ఇంజన్ డ్రైవర్-2, ఫైర్ మ్యాన్-13, ట్రేడ్స్‌మెన్ మేట్-10, చౌకీదార్-1, కుక్-1, వాషర్ మ్యాన్-1, సివిల్ మోటార్ డ్రైవర్-5, ఫైర్ ఫిట్టర్-1).
- **అర్హతలు:** పదో తరగతి, ఐటీఐ, డిప్లొమా, డ్రైవింగ్ లైసెన్స్‌తోపాటు తగిన అనుభవం ఉండాలి. నిర్దేశించిన శారీరక ప్రమాణాలు తప్పనిసరి.
- **వయసు:** 18-25 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక:** రాత పరీక్ష, ట్రేడ్ టెస్ట్, మెడికల్ టెస్టుల ఆధారంగా ఎంపిక జరుగుతుంది.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌లో.
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఎంప్లాయ్‌మెంట్ న్యూస్‌లో (20-26 జూలై 2019) ప్రకటన వెలువడిన తేదీ నుంచి 30 రోజుల్లోపు దరఖాస్తు చేసుకోవాలి.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://indianarmy.nic.in/home

## జిప్‌మర్-పుదుచ్చేరి

**ఖాళీలు 43**

కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖకు చెందిన పుదుచ్చేరిలోని జవహర్‌లాల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పోస్ట్‌గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(జిప్‌మర్) ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

- **పోస్టుల వివరాలు:** 43 (ప్రొఫెసర్-19, అసిస్టెంట్ ప్రొఫెసర్-24).
- **విభాగాలు:** అనాటమీ, అనస్తీషియాలజీ, కార్డియాలజీ, ఎమర్జెన్సీ మెడికల్ సర్వీస్, మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ టెలీ మెడిసిన్, నెఫ్రాలజీ, అబ్‌స్ట్రిక్స్ అండ్ గైనకాలజీ, ఆర్థోపెడిక్ సర్జరీ, ఫార్మకాలజీ, సర్జరీ, యూరాలజీ, ఎండోక్రైనాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్, న్యూరోసర్జరీ తదితరాలు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరి తేదీ:** 30.08.2019.
- **వెబ్‌సైట్: www.jipmer.edu.in**

## ఐఎంఏ-డెహ్రాడూన్

**ఖాళీలు 7**

డెహ్రాడూన్‌లోని ఇండియన్ మిలిటరీ అకాడెమీ (ఐఎంఏ) ఒప్పంద ప్రాతిపదికన అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

- **పోస్టుల వివరాలు:** 7(అసిస్టెంట్ ప్రొఫెసర్-4, అసోసియేట్ ప్రొఫెసర్ 3).
- **సబ్జెక్టులు:** కెమిస్ట్రీ, జాగ్రఫీ, హిందీ, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, ఇంగ్లిష్.
- **అర్హత:** యూజీసీ నిబంధనల ప్రకారం.
- **వయసు:** అసిస్టెంట్ ప్రొఫెసర్లకు 40 ఏళ్లు, అసోసియేట్ ప్రొఫెసర్లకు 50 ఏళ్ల గరిష్ఠ వయోపరిమితి.
- **దరఖాస్తు విధానం:** ఎంప్లాయ్‌మెంట్ న్యూస్ (జూలై 20-26)లో ఈ ప్రకటన వెలువడిన తేదీ నుంచి 21 రోజుల్లోపు దరఖాస్తు చేసుకోవాలి. పూర్తిచేసిన దరఖాస్తును ప్రిన్సిపల్, ఏసీసీ వింగ్ ఇండియన్ మిలిటరీ అకాడెమీ, డెహ్రాడూన్-24 8007 చిరునామాకు పంపించాలి.

# ప్రో కబడ్డీ లీగ్‌లో నేడు

యూపీ యోధ X బెంగాల్ వారియర్స్
రాత్రి గం. 7.30 నుంచి

తెలుగు టైటాన్స్ X దబంగ్ ఢిల్లీ
రాత్రి గం. 8.30 నుంచి

వేదిక: గచ్చిబౌలి ఇండోర్ స్టేడియం, హైదరాబాద్
స్టార్ స్పోర్ట్స్-1లో ప్రత్యక్ష ప్రసారం


# ‘టాప్’లోనే కోహ్లి

**ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లో నంబర్‌వన్ ర్యాంక్ నిలబెట్టుకున్న భారత కెప్టెన్**



**దుబాయ్:** అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ర్యాంకుల్లో భారత కెప్టెన్ విరాట్ కోహ్లి అగ్రస్థానంలోనే కొనసాగుతున్నాడు. తాజాగా విడుదల చేసిన టెస్టు బ్యాట్స్‌మెన్ ర్యాంకింగ్స్‌లో టీమిండియా సారథి 922 రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్నాడు. ఈ జాబితాలో న్యూజిలాండ్ కెప్టెన్ కేన్ విలియమ్సన్ (913), భారత బ్యాట్స్‌మన్ చతేశ్వర్ పుజారా (881) వరుసగా రెండు, మూడో స్థానాల్లో ఉన్నారు. టెస్టు బౌలర్ల టాప్–10 ర్యాంకుల్లో ఇద్దరు భారత స్పిన్నర్లు చోటు దక్కించుకున్నారు. రవీంద్ర జడేజా ఆరు, అశ్విన్ పదో ర్యాంకులో కొనసాగుతున్నారు. ఇందులో ఆస్ట్రేలియా పేసర్ కమిన్స్ టాప్ ర్యాంకులో ఉన్నాడు. ఆల్‌రౌండర్ల జాబితాలో జడేజా మూడో స్థానంలో ఉండగా... టెస్టు జట్ల ర్యాంకుల్లో భారత్ అగ్రస్థానంలో ఏ మార్పూ లేదు. తర్వాతి స్థానాల్లో వరుసగా న్యూజిలాండ్ (2), దక్షిణాఫ్రికా (3), ఇంగ్లండ్ (4), ఆస్ట్రేలియా (5) కొనసాగుతున్నాయి.

# భారత క్రికెటర్ల సంఘం కూడా...

**బీసీసీఐ ఆమోద ముద్ర**

**న్యూఢిల్లీ:** ఎట్టకేలకు భారత క్రికెట్‌లోనూ ఆటగాళ్ల కోసం ప్రత్యేక సంఘం సిద్ధమైంది. బీసీసీఐ కొత్త నియమావళి ప్రకారం భారత క్రికెటర్ల సంఘం (ఐసీఏ)ను ఏర్పాటు చేశారు. దీనికి బోర్డు అధికారికంగా ఆమోద ముద్ర వేసింది. ‘కంపెనీల చట్టం 2013లోని సెక్షన్ 8 ప్రకారం భారత మాజీ క్రికెటర్ల కోసం ఏర్పాటైన ఇండియన్ క్రికెటర్ల అసోసియేషన్‌ను బీసీసీఐ అధికారికంగా గుర్తిస్తోంది. ఇది మినహా మరే సంఘానికి కూడా బోర్డు గుర్తింపు ఉండదు’ అని బీసీసీఐ ప్రకటించింది. ఈ సంఘానికి బోర్డు ఆరంభంలో కొంత మొత్తం నిధులు అందజేస్తుందని... అయితే ఆ తర్వాత మాత్రం సొంత ఆదాయమార్గాలు చూసుకోవాలని కూడా బోర్డు సూచించింది. ఐసీఏకు ఎన్నికలు నిర్వహించే వరకు కపిల్ దేవ్, అజిత్ అగార్కర్, శాంత రంగస్వామి డైరెక్టర్లుగా వ్యవహరిస్తారు. ఈ సంఘంలో మాజీ క్రికెటర్లకు మాత్రమే సభ్యత్వం ఇస్తారు. ప్రస్తుతం జాతీయ జట్లకు ఆడుతున్న వారు సభ్యత్వానికి అనర్హులు. ఇతర దేశాల్లో మాత్రం ప్రస్తుతం క్రికెట్ ఆడుతున్న వారికి కూడా సభ్యత్వం కల్పిస్తున్నారు.

# సాయిప్రణీత్ శుభారంభం



- తొలి రౌండ్‌లో ప్రపంచ 11వ ర్యాంకర్‌పై విజయం
- సాత్విక్–అశ్విని జంట ముందంజ
- జపాన్ ఓపెన్ టోర్నీ

**టోక్యో:** తనకంటే మెరుగైన ర్యాంకర్ ప్రత్యర్థిగా ఉన్నా... ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా సహజశైలిలో ఆడిన భారత బ్యాడ్మింటన్ యువతార భమిడిపాటి సాయిప్రణీత్ జపాన్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–750 టోర్నమెంట్‌లో శుభారంభం చేశాడు. ప్రపంచ 11వ ర్యాంకర్ కెంటో నిషిమోటో (జపాన్)తో మంగళవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 23వ ర్యాంకర్ సాయిప్రణీత్ 21–17, 21–13తో విజయం సాధించి ప్రిక్వార్టర్ ఫైనల్‌కు చేరాడు. 41 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సాయిప్రణీత్‌కు గట్టిపోటీ ఎదురైనా... కీలక దశలో వరుస పాయింట్లతో విజృంభించి విజయాన్ని దక్కించుకున్నాడు. ఈ ఏడాది ఎనిమిది టోర్నీల్లో ఆడిన సాయిప్రణీత్ స్విస్ ఓపెన్‌లో ఫైనల్‌కు చేరుకొని రన్నరప్‌గా నిలిచాడు. ఇండోనేసియా ఓపెన్, సింగపూర్ ఓపెన్, ఇండోనేసియా మాస్టర్స్ టోర్నీల్లో తొలిరౌండ్‌లో నిష్క్రమించాడు. ఆల్ ఇంగ్లండ్ ఓపెన్, న్యూజిలాండ్ ఓపెన్, ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ప్రిక్వార్టర్ ఫైనల్‌కు చేరిన అతను ఇండియా ఓపెన్‌లో క్వార్టర్ ఫైనల్లో వెనుదిరిగాడు. రెండేళ్ల తర్వాత నిషిమోటోతో మరోసారి ఆడిన సాయిప్రణీత్ రెండు గేముల్లోనూ తొలుత వెనుకబడ్డాడు. కానీ వెంటనే తేరుకొని ఆధిక్యంలోకి వచ్చాడు. రెండో గేమ్‌లో 2–7తో వెనుకంజలో ఉన్న సాయిప్రణీత్ వరుసగా ఐదు పాయింట్లు గెలిచి స్కోరును సమం చేశాడు. ఆ తర్వాత స్కోరు 12–12 వద్ద ఉన్నపుడు ఒక్కసారిగా చెలరేగి వరుసగా ఎనిమిది పాయింట్లు నెగ్గి 20–12తో తిరుగులేని ఆధిక్యాన్ని సంపాదించాడు. అదే జోరులో రెండో గేమ్‌తోపాటు మ్యాచ్‌ను కైవసం చేసుకున్నాడు. గురువారం జరిగే ప్రిక్వార్టర్ ఫైనల్లో జపాన్‌కు చెందిన కాంటా సునెయామతో సాయిప్రణీత్ ఆడతాడు. తొలి రౌండ్‌లో సునెయామ 21–14, 21–17తో ప్రపంచ నాలుగో ర్యాంకర్, రియో ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేత చెన్ లాంగ్ (చైనా)ను ఓడించడం విశేషం.

మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో సాత్విక్ సాయిరాజ్–అశ్విని పొన్నప్ప (భారత్) జంట ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగుపెట్టింది. తొలి రౌండ్‌లో సాత్విక్–అశ్విని ద్వయం 21–14, 21–19తో మార్విన్ సీడెల్–లిండా ఎఫ్లెర్ (జర్మనీ) జోడీపై గెలిచింది. పురుషుల డబుల్స్‌లో సుమీత్ రెడ్డి–మను అత్రి జంట పోరాటం తొలి రౌండ్‌లోనే ముగిసింది. సుమీత్–మను అత్రి జోడీ 12–21, 16–21తో గో సె ఫె–నూర్ ఇజుద్దీన్ (మలేసియా) ద్వయం చేతిలో పరాజయం పాలైంది.

బుధవారం జరిగే మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో హాన్ యుయె (చైనా)తో పీవీ సింధు; హెచ్‌ఎస్ ప్రణయ్‌తో కిడాంబి శ్రీకాంత్; ఆంటోన్సెన్ (డెన్మార్క్)తో సమీర్ వర్మ ఆడతారు. మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్‌లో టాప్ సీడ్ జెంగ్ సి వె–హువాంగ్ యా కియోంగ్ (చైనా)లతో సిక్కి రెడ్డి–ప్రణవ్ చోప్రా; మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో కిమ్ సో యోంగ్–కాంగ్ హీ యోంగ్ (దక్షిణ కొరియా)లతో సిక్కి రెడ్డి–అశ్విని పొన్నప్ప; పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో మార్కస్ ఇలిస్–క్రిస్ లాంగ్‌రిడ్జ్ (ఇంగ్లండ్)లతో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి పోటీపడతారు.

# క్వార్టర్స్‌లో హుసాముద్దీన్



**బ్యాంకాక్:** థాయ్‌లాండ్ ఓపెన్ అంతర్జాతీయ బాక్సింగ్ టోర్నమెంట్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న తెలంగాణ బాక్సర్ మొహమ్మద్ హుసాముద్దీన్ క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు. మంగళవారం జరిగిన పురుషుల 56 కేజీల విభాగం ప్రిక్వార్టర్ ఫైనల్లో హుసాముద్దీన్ 5–0తో జార్జి మొల్వాంట్వా (బోట్స్‌వానా)పై గెలుపొందాడు. 69 కేజీల విభాగంలో ఆశిష్ కుమార్ 5–0తో పీటర్ సెటినిక్ (క్రొయేషియా)పై నెగ్గి క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టాడు. మహిళల 75 కేజీల విభాగంలో భాగ్యబతి కచారి సెమీఫైనల్ చేరి కనీసం కాంస్య పతకాన్ని ఖాయం చేసుకుంది. క్వార్టర్ ఫైనల్లో భాగ్యబతి 5–0తో ఎన్గుయెన్ హోంగ్ (వియత్నాం)పై నెగ్గింది.

# సుమీత్ నాగల్ ఓటమి

**న్యూఢిల్లీ:** హంబర్గ్ ఓపెన్ ఏటీపీ–500 టెన్నిస్ టోర్నమెంట్‌లో భారత ప్లేయర్ సుమీత్ నాగల్ తొలి రౌండ్‌లో నిష్క్రమించాడు. క్వాలిఫయర్ హోదాలో మెయిన్ ‘డ్రా’లోకి అడుగు పెట్టిన సుమీత్ నాగల్... మంగళవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో 2–6, 6–7 (2/7)తో రిచర్డ్ గాస్కే (ఫ్రాన్స్) చేతిలో ఓడాడు. మొదటి రౌండ్‌లో ఓడిన సుమీత్‌కు 13,065 యూరోలు (రూ. 10 లక్షలు) ప్రైజ్‌మనీగా లభించాయి.

# నరైన్, పొలార్డ్‌లకు పిలుపు

**భారత్‌తో టి20 సిరీస్‌కు విండీస్ జట్టు ప్రకటన**

**సెయింట్‌జాన్స్:** చాలాకాలం తర్వాత ‘మిస్టరీ స్పిన్నర్’ సునీల్ నరైన్ వెస్టిండీస్ టి20 జట్టుకు ఎంపికయ్యాడు. భారత్‌తో మూడు మ్యాచ్‌ల సిరీస్‌కుగాను తొలి రెండు మ్యాచ్‌లకు మంగళవారం ప్రకటించిన జట్టులో అతడితో పాటు ఆల్‌రౌండర్ కీరన్ పొలార్డ్‌కు చోటుదక్కింది. నరైన్ విండీస్ తరపున రెండేళ్ల క్రితం చివరి టి20 ఆడాడు. మొత్తం 14 మంది సభ్యుల జట్టులో వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్ ఆంథోని బ్రాంబెల్ ఒక్కడే కొత్తముఖం. ఆల్‌రౌండర్ కార్లోస్ బ్రాత్‌వైట్ సారథ్యం వహిస్తాడు. గాయంతో ప్రపంచ కప్ మధ్యలో తప్పుకొన్న మరో స్టార్ ఆల్‌రౌండర్ ఆండ్రీ రసెల్ అందుబాటులోకి రాగా... విధ్వంసక బ్యాట్స్‌మన్ క్రిస్ గేల్ అందుబాటులో ఉండనని ప్రకటించాడు. అతడి స్థానంలో ఎడంచేతి వాటం ఓపెనర్ జాన్ క్యాంప్‌బెల్ ఇన్నింగ్స్ ప్రారంభిస్తాడు. వచ్చే ఏడాది జరుగనున్న టి20 ప్రపంచ కప్‌ను నిలబెట్టుకునే ప్రణాళికల్లో భాగంగా సమతూకమైన జట్టును ఎంపిక చేసినట్లు వెస్టిండీస్ సెలక్షన్ కమిటీ చైర్మన్ రాబర్ట్ హేన్స్ తెలిపారు. సిరీస్‌లో భాగంగా తొలి రెండు టి20లు ఆగస్ట్ 3, 4 తేదీల్లో ఫ్లోరిడా (అమెరికా)లోని లాడర్‌హిల్‌లో జరుగుతాయి. ఆగస్ట్ 6న మూడో టి20కి గయానా ఆతిథ్యం ఇవ్వనుంది.





**తొలి రెండు టి20లకు విండీస్ జట్టు:** కార్లోస్ బ్రాత్‌వైట్ (కెప్టెన్), సునీల్ నరైన్, కీమో పాల్, ఖారీ పియర్, కీరన్ పొలార్డ్, నికోలస్ పూరన్, అంథోని బ్రాంబెల్ (వికెట్ కీపర్లు), రోవ్‌మన్ పావెల్, ఆండ్రీ రసెల్, ఒషాన్ థామస్, జాన్ క్యాంప్‌బెల్, షెల్డన్ కాట్రెల్, షిమ్రన్ హెట్‌మైర్, ఎవిన్ లూయిస్.

# అది చీకటి వెలుగుల రోజు

**ప్రపంచ కప్ ఫైనల్‌పై గప్టిల్**

**ఆక్లాండ్:** వివాదాస్పద ‘ఆరు పరుగుల ఓవర్ త్రో’లో భాగమై... ఆపై సూపర్ ఓవర్ చివరి బంతికి రెండు పరుగులు చేయలేక ప్రపంచ కప్ ఫైనల్లో న్యూజిలాండ్ పరాజయానికి ప్రధాన సాక్షిగా నిలిచిన ఓపెనర్ మార్టిన్ గప్టిల్ నాటి అనుభవంపై స్పందించాడు. ‘లార్డ్స్‌లో జరిగిన ఫైనల్ వారం దాటినా ఇంకా నమ్మశక్యంగా లేదు. నా క్రికెట్ కెరీర్‌లో అది ఉత్తమ, అధ్వానమైన రోజు. ఎన్నో రకాల ఉద్వేగాలు. కానీ, దేశానికి ప్రాతినిధ్యం వహించడం, గొప్ప సహచరులతో ఆడటం పట్ల గర్వంగా ఉంది. సహకారం అందించిన అందరికీ ధన్యవాదాలు’ అంటూ గప్టిల్ మంగళవారం ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశాడు. ఫైనల్ అనంతరం న్యూజిలాండ్, ఇంగ్లండ్ ఆటగాళ్లతో కలిసి ఉన్న ఫొటోను దీనికి జత చేశాడు.



# మిఠాయిలు, మసాలాలు వద్దే వద్దు..

**‘మిషన్ టోక్యో’లో భాగంగా భారత హాకీ క్రీడాకారిణిల డైట్‌పై ఆంక్షలు**

**న్యూఢిల్లీ:** భారత హాకీ క్రీడాకారిణిలు తమకిష్టమైన అభిరుచులకు దూరం కావాల్సిన పరిస్థితి వచ్చింది. టోక్యో ఒలింపిక్స్ (2020) అర్హతే లక్ష్యంగా క్రీడాకారిణిలు తీసుకునే ఆహారంలో జట్టు సైంటిఫిక్ అడ్వైజర్ వేన్ లాంబర్డ్ కాస్త కఠినమైన ఆంక్షలు విధించారు. క్వాలిఫయింగ్ పోటీలు ముగిసేదాకా స్వీట్లు, మసాలా వంటకాలకు దూరంగా ఉండాలని లాంబర్డ్ సూచించారు. దీనిపై భారత హాకీ కెప్టెన్ రాణి రాంపాల్ మాట్లాడుతూ ‘నా దృష్టిలో మెరుగైన ఫిట్‌నెస్ ఉన్న జట్టు మాది. ఫిట్‌నెస్‌పై లాంబర్డ్ చాలా శ్రద్ధ కనుబరుస్తున్నారు. వ్యక్తిగతంగా ప్రతి ఒక్కరు ఫిట్‌గా ఉండేందుకు కష్టపడుతున్నారు. మేమంతా ఆయన సూచించిన ఆహార నియమాల్ని పాటిస్తున్నాం కాబట్టే మాలో ప్రతి ఒక్కరు అసాధారణ ఫిట్‌నెస్‌తో ఉన్నారు. మేమిప్పుడు స్వీట్లు, చాక్లెట్లు, మసాలా, నూనె పదార్థాలు తినటం మానేశాం. ఆరోగ్యాన్ని, శారీరక సత్తా పెంచే ఆహారాన్ని మాత్రమే తీసుకుంటున్నాం. మైదానంలో శ్రమించేందుకు అవసరమైన సమతుల, పోషకాహారాన్ని తీసుకుంటున్నాం’ అని చెప్పింది. రాణి సేన ఇటీవల జపాన్‌లో జరిగిన ఎఫ్ఐహెచ్ హాకీ సిరీస్‌లో టైటిల్ నెగ్గింది. ఈ నేపథ్యంలో టోక్యో బెర్తుపైనే ప్రధానంగా దృష్టిపెట్టింది. నవంబర్‌లో ఒలింపిక్స్ క్వాలిఫయింగ్ పోటీలు జరుగునున్న నేపథ్యంలో క్రీడాకారిణిల డైట్‌పై ఈ విధమైన ఆంక్షలు విధించారు. భారత మహిళల జట్టు వచ్చే నెలలో టోక్యోలో జరిగే నాలుగు దేశాల హాకీ టోర్నీలో తలపడనుంది. ఇందులో ఆతిథ్య దేశం జపాన్‌తో పాటు ఆస్ట్రేలియా తలపడనుంది.



# విలియమ్సనే అర్హుడు

**‘న్యూజిలాండర్ ఆఫ్ ద ఇయర్’ పురస్కారంపై స్టోక్స్**



**లండన్:** ప్రపంచ కప్ ఫైనల్ హీరో, ఇంగ్లండ్ జట్టు ఆల్‌రౌండర్ బెన్ స్టోక్స్ క్రీడా స్ఫూర్తిని చాటాడు. న్యూజిలాండ్‌లో పుట్టి పెరిగి, 12 ఏళ్ల వయసులో ఇంగ్లండ్‌కు వలస వచ్చిన స్టోక్స్ సొంతగడ్డపై జరిగిన ప్రపంచకప్‌లో తమ జట్టు తొలిసారి విశ్వవిజేతగా నిలవడంలో కీలక పాత్ర పోషించాడు. దీంతో అతడిని న్యూజిలాండ్ ప్రభుత్వం... ‘న్యూజిలాండర్ ఆఫ్ ద ఇయర్’ పురస్కారానికి నామినేట్ చేసింది. అయితే, ఈ అవార్డుకు తన కంటే న్యూజిలాండ్ కెప్టెన్ కేన్ విలియమ్సనే తగినవాడని స్టోక్స్ పేర్కొన్నాడు. ‘ఈ అవార్డుకు నామినేట్ అయ్యానని తెలిసి సంతోషించా. మా న్యూజిలాండ్ సంస్కృతిని చూసి గర్విస్తా. కానీ, నాకంటే దేశానికి సేవ చేసిన వారు ఇంకా చాలామంది ఉన్నారు. వారే దీనికి అర్హులు. విలియమ్సన్‌కు దేశమంతా ఇలానే మద్దతు కొనసాగించాలి. స్ఫూర్తిదాయక నాయకుడైన అతడిని ఓ దిగ్గజంగా గౌరవించాలి. అవార్డుకు అతడే అర్హుడు’ అంటూ సోషల్ మీడియాలో స్టోక్స్ పోస్ట్ చేశాడు.

# ఐర్లాండ్‌కు సువర్ణావకాశం

- నేటి నుంచి లార్డ్స్‌లో ఇంగ్లండ్‌తో నాలుగు రోజుల టెస్టు
- తొలిసారి టెస్టు మ్యాచ్‌లో జెర్సీ నంబర్లతో ఆటగాళ్లు బరిలోకి

**లండన్:** వన్డేల్లో తగిన గుర్తింపు తెచ్చుకున్న ఐర్లాండ్‌కు... సంప్రదాయ టెస్టు క్రికెట్‌లోనూ ఉనికి చాటుకునే అవకాశం. ప్రఖ్యాత లార్డ్స్ మైదానం వేదికగా ఆ జట్టు బుధవారం నుంచి ఇంగ్లండ్‌తో నాలుగు రోజుల టెస్టులో తలపడనుంది. గతేడాది టెస్టు అరంగేట్రం చేసిన ఐర్లాండ్ ఇప్పటివరకు రెండు మ్యాచ్‌లు ఆడింది. తొలి టెస్టులోనే పెద్ద జట్టయిన పాకిస్తాన్‌కు గట్టి పోటీ ఇచ్చి ఓడింది. ఈ ఏడాది మార్చిలో డెహ్రాడూన్‌లో అఫ్గానిస్తాన్‌తో జరిగిన రెండో టెస్టులోనూ పరాజయం పాలైనా ఫర్వాలేదనే ప్రదర్శన చేసింది. తాజాగా వన్డే ప్రపంచ చాంపియన్ ఇంగ్లండ్‌తో పోరుకు సిద్ధమైంది. పోర్టర్‌ఫీల్డ్ నేతృత్వంలోని ఐర్లాండ్ జట్టులో కౌంటీల్లో ఆడిన అనుభవం ఉన్న ఆటగాళ్లున్నారు.




వీరిలో పేసర్ టిమ్ ముర్టాగ్ ఒకడు. ఇటీవలే అతడు ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో 800 వికెట్ల మైలు రాయిని చేరుకున్నాడు. మరోవైపు ఇంగ్లండ్ విధ్వంసక ఓపెనర్ జాసన్ రాయ్, పేసర్ స్టోన్ ఈ మ్యాచ్ ద్వారా టెస్టుల్లో అడుగు పెట్టనున్నారు. ఇంగ్లండ్ ప్రధాన పేసర్ అండర్సన్ గాయంతో దూరమయ్యాడు. ఈ మ్యాచ్ ద్వారా టెస్టుల్లో తొలిసారి ఆటగాళ్లు నంబర్లతో కూడిన జెర్సీలు ధరించి బరిలోకి దిగనున్నారు.




సాక్షి బిజినెస్
బుధవారం
24-7-2019
WWW.SAKSHIBUSINESS.COM

**స్టాక్ మార్కెట్లు**

| దేశీ సూచీలు | | |
|---|---|---|
| సెన్సెక్స్ | 48 ▼ | 37,983 |
| నిఫ్టీ | 15 ▼ | 11,331 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

| విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30గం.లకు) | | |
|---|---|---|
| నాస్‌డాక్ | 8,218 | ▲ 14 |
| డోజోన్స్ | 27,246 | ▲ 74 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,557 | ▲ 42 |
| డాక్స్ | 12,491 | ▲ 201 |
| షాంఘై | 2,899 | ▲ 13 |
| నికాయ్ | 21,621 | ▲ 204 |

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

**ఫారెక్స్ రేట్లు** రూ. లలో

| | | | ● కొనుగోలు | ● అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 68.25 | 69.89 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 84.46 | 87.54 |
| € | యూరో | ఎస్‌బీఐ | 75.93 | 78.80 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 62.73 | 65.14 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 47.60 | 49.80 |
| S$ | సింగపూర్ డాలర్ | ఎస్‌బీఐ | 49.82 | 51.58 |
| SAR | సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 17.66 | 19.37 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 18.08 | 19.59 |
| ¥ | చైనా యువాన్ | థామస్‌కుక్ | 9.40 | 10.76 |

# ‘ఇల్లు’ గెలిచింది..!




## ఆమ్రపాలికి సుప్రీంకోర్టు షాక్!

- రిజిస్ట్రేషన్ రద్దు ; పెండింగ్ ప్రాజెక్టుల బాధ్యత ఎన్‌బీసీసీకి
- ప్రమోటర్లపై విచారణకు ఈడీకి ఆదేశం
- 42 వేల మంది గృహ కొనుగోలుదారులకు ఊరట




**న్యూఢిల్లీ:** గృహాల కొనుగోలుదారులకు సకాలంలో ఇళ్లు అందించకుండా సతాయించే బిల్డర్లకు షాకిచ్చేలా రియల్టీ దిగ్గజం ఆమ్రపాలి గ్రూప్ కేసులో సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (రెరా) కింద ఉన్న సంస్థ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసింది. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసే బాధ్యతను నేషనల్ బిల్డింగ్స్ కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్ (ఎన్‌బీసీసీ)కి అప్పగిస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో ఆమ్రపాలి ప్రాజెక్టుల్లో గృహాలు బుక్ చేసుకున్న 42,000 మంది పైచిలుకు కొనుగోలుదారులకు ఊరట లభించనుంది. గ్రూప్ సీఎండీ అనిల్ శర్మతో పాటు ఇతర డైరెక్టర్లు, సీనియర్ అధికారులపై ఉన్న మనీల్యాండరింగ్ అభియోగాలపై విచారణ జరపాల్సిందిగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)ని సుప్రీంకోర్టు మంగళవారం ఆదేశించింది. కోర్టు రిసీవర్‌గా సీనియర్ అడ్వొకేట్ ఆర్ వెంకటరమణిని నియమిస్తున్నట్లు జస్టిస్ అరుణ్ మిశ్రా, జస్టిస్ యు.యు. లలిత్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. లీజుల రద్దు తర్వాత నుంచి ప్రాపర్టీలపై పూర్తి అధికారాలు కోర్టు రిసీవర్‌కు దఖలుపడతాయని తెలిపింది. బకాయిలను రాబట్టే క్రమంలో గ్రూప్ ప్రాపర్టీల విక్రయానికి సంబంధించి ఒప్పందాలు కుదుర్చుకునేందుకు ఆయనకు పూర్తి అధికారాలు ఉంటాయని తెలిపింది. ఆర్థిక అవకతవకల ఆరోపణలపై ఆమ్రపాలి గ్రూప్ ప్రమోటర్లు, డైరెక్టర్లు, ఇతర అధికారులు విచారణ ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే.

**ఇతర బిల్డర్లకు హెచ్చరిక..**

తాజా ఆదేశాలు కేవలం ఆమ్రపాలి గ్రూప్‌నకు మాత్రమే సుప్రీంకోర్టు పరిమితం చేయలేదు. మిగతా రియల్ ఎస్టేట్ సంస్థలన్నీ కూడా ముందుగా చెప్పిన గడువులోగా కచ్చితంగా ప్రాజెక్టులు పూర్తి చేసి, గృహాల కొనుగోలుదారులకు అందించాల్సిందేనని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. సొంతింటి కల సాకారం చేసుకునేందుకు కష్టార్జితాన్ని ధారపోసే కొనుగోలుదారులు .. నానా అవస్థలు పడాల్సిన పరిస్థితి ఉండకూడదని పేర్కొంది. ‘తప్పుడు బిల్డర్ల కారణంగా లక్షల మంది గృహాల కొనుగోలుదారులు మోసపోతున్నారు. కొనుగోలుదారుల డబ్బుతోనే రియల్ ఎస్టేట్ వ్యాపారం అభివృద్ధి చెందుతోంది. కాబట్టి కొనుగోలుదారులకు తమ ఇంటిని దక్కించుకునేందుకు పూర్తి హక్కులు ఉంటాయి‘ అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. సమయానికి గ్రూప్ ప్రాజెక్టులను పూర్తి చేసి అందించని బిల్డర్లపై తగు చర్యలు తీసుకోవాలంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు సూచించింది. ఆమ్రపాలి గ్రూప్ పెండింగ్ ప్రాజెక్టులను సత్వరం పూర్తి చేసి, కొనుగోలుదారులకు అందించాలని ఎన్‌బీసీసీని ఆదేశించింది. వారి దగ్గర్నుంచి అదనంగా నిధులు వసూలు చేయరాదని స్పష్టం చేసింది. ప్రమోటర్లతో కుదుర్చుకున్న ఒప్పందాల ప్రకారం గృహాల కొనుగోలుదారులు మిగతా మొత్తాన్ని మూడు నెలల్లోగా ఎస్క్రో ఖాతాలో జమ చేయాలని సూచించింది. దశలవారీగా ఎన్‌బీసీసీ పనులు పూర్తి చేసే కొద్దీ ఈ నిధులను విడుదల చేయడం జరుగుతుందని పేర్కొంది.

**అధికారులపైనా తీవ్ర వ్యాఖ్యలు..**

అటు అధికారుల తీరుపై కూడా సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ‘అధికారులు, సంపన్న బిల్డర్లు కుమ్మక్కై సామాన్య మధ్య తరగతి కొనుగోలుదారుల కష్టార్జితాన్ని ఎలా దోచుకుంటున్నారో చెప్పడానికి ఇదే పెద్ద నిదర్శనం. అనేక ప్రాజెక్టులు పూర్తి కాకుండా పెండింగ్‌లో ఉండటం ఆశ్చర్యం కలిగిస్తోంది. షాక్ కలిగిస్తోంది. ఇలాంటి మోసాలకు పాల్పడే వారందరిపైనా కచ్చితంగా చట్టపరమైన చర్యలు ఉండాలి‘ అని వ్యాఖ్యానించింది. నోయిడా, గ్రేటర్ నోయిడా అధికారులు తమకు రావాల్సిన బకాయిలను రాబట్టుకునేందుకు గృహ కొనుగోలుదారుల ఫ్లాట్స్‌ను విక్రయించడం కుదరదని తేల్చి చెప్పింది. ‘ఇప్పటికే జప్తు చేసిన ఆమ్రపాలి ప్రమోటర్లు, ఇతర అధికారుల ఆస్తులను విక్రయించి బకాయిలను రాబట్టుకోవచ్చు‘ అని సుప్రీం కోర్టు తెలిపింది. బ్యాంకులు, అధికారుల నిష్క్రియాపరత్వం కారణంగానే ఆమ్రపాలి ప్రమోటర్లు నిధులను మళ్లించగలిగారని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. ‘ఈ నేపథ్యంలో బాకీలు రాబట్టుకునేందుకు కొనుగోలుదారులపై కేసులు పెట్టడం గానీ లేదా వారి ఫ్లాట్లను విక్రయించడం గానీ చేయరాదు. గృహాల కొనుగోలుదారులు ఇప్పటికే ఒకసారి మోసపోయారు. బాకీల రికవరీ పేరిట ఆ ప్రాజెక్టులను అమ్మేసి మళ్లీ మోసగించడం సరికాదు. నోయిడా, గ్రేటర్ నోయిడా అధికారులు ఆయా సందర్భాలను బట్టి కొనుగోలుదారులకు నెల రోజుల్లోగా రిజిస్టర్డ్ డీడ్స్ ఇవ్వాలి‘ అని సుప్రీంకోర్టు పేర్కొంది.

**ఈడీ కేసు నమోదు..**

గృహ కొనుగోలుదారులు కట్టిన సొమ్మును మళ్లించిన ఆమ్రపాలి గ్రూప్.. విదేశీ మారక నిర్వహణ చట్టం (ఫెమా), విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) నిబంధనలను యథేచ్ఛగా ఉల్లంఘించిందని అత్యున్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. చట్టాలను పక్కన పెట్టి నోయిడా, గ్రేటర్ నోయిడా అధికారులు కూడా ఆమ్రపాలి గ్రూప్‌తో కుమ్మక్కై పూర్తి సహకారం అందించారని పేర్కొంది. బాకీలను రాబట్టుకునే క్రమంలో ఆమ్రపాలి గ్రూప్ ప్రాపర్టీలను విక్రయించేందుకు నోయిడా, గ్రేటర్ నోయిడాకు ఎలాంటి అధికారాలు ఉండవని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. మరోవైపు, ఆమ్రపాలి గ్రూప్, దాని ప్రమోటర్ల మీద మనీలాండరింగ్ ఆరోపణలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) క్రిమినల్ కేసును నమోదు చేసింది. మనీల్యాండరింగ్ నిరోధక చట్ట నిబంధనల ఉల్లంఘన కింద ఆమ్రపాలి గ్రూప్ ప్రమోటర్లను విచారణ చేయడంతో పాటు వారి అసెట్స్‌ను ఈడీ జప్తు చేయనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

### ధోనీ కూడా బాధితుడే..




ఇళ్ల కొనుగోలుదారులే కాదు క్రికెటర్ మహేంద్రసింగ్ ధోనీ కూడా ఆమ్రపాలి గ్రూప్ బాధితుడే. 2011లో ప్రపంచ కప్ గెల్చిన భారత క్రికెట్ టీమ్ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోనీతో పాటు ఇతర ఆటగాళ్లకు నోయిడాలోని ప్రాజెక్టులో రూ. 9 కోట్ల విలువ చేసే విల్లాలు ఇస్తామంటూ ఆమ్రపాలి ప్రకటించింది. వాటిని కట్టనూ లేదు. ఇవ్వనూ లేదు. అంతే కాదు.. ఆమ్రపాలికి సుమారు 6–7 ఏళ్ల పాటు ధోనీ బ్రాండ్ అంబాసిడర్‌గా కూడా పనిచేశాడు. కానీ దానికి కూడా ఆమ్రపాలి గ్రూప్ డబ్బులు చెల్లించలేదు. చివరికి, ఆమ్రపాలి బాధిత గృహాల కొనుగోలుదారుల నుంచి నిరసనలు వ్యక్తం కావడంతో ధోనీ కాంట్రాక్టు నుంచి వైదొలిగాడు. రూ. 150 కోట్ల బకాయిలు రాట్టుకోవడం కోసం ఆమ్రపాలిపై కేసు వేశాడు.

## హెచ్‌యూఎల్ లాభం రూ.1,795 కోట్లు

**14% వృద్ధి ● 6% వృద్ధితో రూ.10,197 కోట్లకు ఆదాయం**




**న్యూఢిల్లీ:** ఎఫ్‌ఎంసీజీ దిగ్గజం హిందుస్తాన్ యూనిలీవర్(హెచ్‌యూఎల్) ఈ ఆర్థిక సంవత్సరం జూన్ క్వార్టర్‌లో రూ.1,795 కోట్ల నికర లాభం సాధించింది. అంతకు ముందటి ఆర్థిక సంవత్సరం ఇదే క్వార్టర్‌లో ఆర్జించిన నికర లాభం, రూ.1,569 కోట్లతో పోల్చితే 14 శాతం వృద్ధి సాధించామని హెచ్‌యూఎల్ తెలిపింది. అమ్మకాలు పెరగడం, మార్జిన్ల మెరుగుదల కారణంగా నికర లాభం ఈ స్థాయిలో పెరిగిందని హెచ్‌యూఎల్ సీఎండీ సంజీవ్ మెహతా తెలిపారు. నికర అమ్మకాలు రూ.9,616 కోట్ల నుంచి 6 శాతం వృద్ధితో రూ.10,197 కోట్లకు పెరిగాయని పేర్కొంది.విభాగాల వారీగా చూస్తే, హోమ్ కేర్ సెగ్మెంట్ ఆదాయం 10 శాతం వృద్ధితో రూ.3,464 కోట్లకు, బ్యూటీ, పర్సనల్ కేర్ విభాగం ఆదాయం 4 శాతం వృద్ధివతో రూ.4,626 కోట్లకు, ఫుడ్స్ అండ్ రిఫ్రెష్‌మెంట్ విభాగం 9 శాతం లాభంతో రూ.1,950 కోట్లకు పెరిగాయని రామన్ వివరించారు.

**మెరుగుపడిన మార్జిన్లు....**

కొత్త ఉత్పత్తులను అందుబాటులోకి తెచ్చామని, పటిష్టమైన నియంత్రణ పద్ధతుల కారణంగా మార్జిన్లు పెరిగాయని హెచ్‌యూఎల్ సీఎండీ సంజీవ్ మెహతా పేర్కొన్నారు. జీఎస్‌కే కన్స్యూమర్స్ హెల్త్‌కేర్‌ను హెచ్‌యూఎల్‌లో విలీనం చేయడానికి వాటాదారులు ఆమోదం తెలిపారని, ఈ ఏడాది చివరికల్లా ఈ విలీనం పూర్తవ్వగలదని పేర్కొన్నారు.

ఆర్థిక ఫలితాల నేపథ్యంలో బీఎస్‌ఈలో హిందుస్తాన్ యూనిలివర్ షేర్ 0.8 శాతం లాభంతో రూ.1,693 వద్ద ముగిసింది.

## హైదరాబాద్‌లో పేపాల్ టెక్ సెంటర్



టెక్ సెంటర్ ప్రారంభోత్సవంలో జయేశ్, కంపెనీ ప్రతినిధులు

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** డిజిటల్ పేమెంట్స్ రంగంలో ఉన్న యూఎస్ కంపెనీ పేపాల్ హైదరాబాద్‌లో టెక్నాలజీ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. 100 సీట్ల సామర్థ్యమున్న ఈ కేంద్రంలో ప్రస్తుతం 60 మంది పనిచేస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్ రంజన్ మంగళవారం ఈ టెక్ సెంటర్‌ను ప్రారంభించారు. ఇప్పటికే సంస్థకు చెన్నై, బెంగళూరులో ఇటువంటి కేంద్రాలున్నాయి. భారత్‌లో 3,500 మంది వరకు ఉద్యోగులున్నారు. భాగ్యనగరికి చెందిన ఫ్రాడ్ ప్రివెన్షన్ సేవల కంపెనీ సిమిలిటీని 2018లో పేపాల్ సుమారు రూ.810 కోట్లు వెచ్చించి కొనుగోలు చేసింది.

## జగన్! మీరు యువతకు స్ఫూర్తి

### షావోమి ఎండీ మను జైన్ ట్వీట్

‘‘జగన్ గారూ!! నేటి యువతకు మీరో స్ఫూర్తి. రాష్ట్రానికి సంబంధించి మీ విజన్‌ను పూర్తిగా విన్నాక నాలో చాలా ఉత్తేజం కలిగింది. ఇదో అద్భుతమైన సమావేశం’’ అంటూ మొబైల్ దిగ్గజం షావోమి గ్లోబల్ వైస్ ప్రెసిడెంట్, కంపెనీ ఇండియా ఎండీ మనుకుమార్ జైన్ మంగళవారం ట్వీట్ చేశారు. సోమవారం ఏపీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి ఏపీలో మరో ప్లాంటు ఏర్పాటు చేయడానికి ఆసక్తి కనబరిచిన మను జైన్... ఆ భేటీ తాలూకు వివరాలు, ఫొటోలతో మంగళవారం కొన్ని ట్వీట్లు చేశారు. ‘‘ఆయన చాలా సింపుల్‌గా, సాదాసీదాగా కనిపిస్తారు. కానీ అద్భుతమైన ఆత్మవిశ్వాసం ఉంది. ఆయన్నుంచి మేం చాలా నేర్చుకున్నాం. ఉత్తేజం పొందాం’’ అంటూ మరో ట్వీట్ కూడా చేశారు. సోమవారం నాటి చర్చల్లో మేకిన్ ఇండియాలో భాగంగా పలు ఉపకరణాలు ఇక్కడే తయారు చెయ్యడానికి ఉన్న అవకాశాలను ముఖ్యమంత్రితో షావోమి బృందం చర్చించింది.

– హైదరాబాద్, బిజినెస్ బ్యూరో

ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డితో షావోమి బృందం




## ఎల్ అండ్ టీ లాభం రూ.1,473 కోట్లు

- క్యూ1లో 21 శాతం వృద్ధి
- ఆదాయం రూ. 29,636 కోట్లు..




**న్యూఢిల్లీ:** ఇంజినీరింగ్ దిగ్గజం, ఎల్ అండ్ టీ ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసిక కాలంలో రూ.1,473 కోట్ల నికర లాభం(కన్సాలిటేడెట్) సాధించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే క్వార్టర్‌లో ఆర్జించిన నికర లాభం, రూ.1,215 కోట్లతో పోల్చితే 21% వృద్ధి సాధించామని ఎల్ అండ్ టీ తెలిపింది. నికర అమ్మకాలు 27,005 కోట్ల నుంచి కోట్ల నుంచి 10% వృద్ధితో రూ.29,636 కోట్లకు పెరిగాయని ఎల్‌అండ్‌టీ సీఈఓ ఆర్.శంకర్ రామన్ చెప్పారు. వ్యయాలు రూ.25,216 కోట్ల నుంచి రూ.27,365 కోట్లకు పెరిగాయని తెలిపారు.

**నిర్వహణ లాభం 20 శాతం అప్...**

మొత్తం ఆదాయంలో దాదాపు సగం ఉండే మౌలిక రంగ సెగ్మెంట్ ఆదాయం 14% ఎగసి రూ.14,038 కోట్లకు పెరిగిందని రామన్ తెలిపారు. నిర్వహణ లాభం 20 శాతం వృద్ధితో రూ.3,319 కోట్లకు పెరిగిందని, నిర్వహణ లాభ మార్జిన్ 1% పెరిగి 11.2 శాతానికి చేరిందని పేర్కొన్నారు.

**11 శాతం పెరిగిన ఆర్డర్లు....**

ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసిక కాలంలో తమ గ్రూప్ కంపెనీలన్నీ కలసి రూ.38,700 కోట్ల ఆర్డర్లు సాధించాయని రామన్ వెల్లడించారు. ఆర్డర్లు 11 శాతం వృద్ధి చెందాయని పేర్కొన్నారు. ఇక ఈ ఏడాది జూన్ 30 నాటికి మొత్తం ఆర్డర్లు రూ.2,94,014 కోట్లకు చేరాయని, వీటిల్లో అంతర్జాతీయ ఆర్డర్ల వాటా 21 శాతమని పేర్కొన్నారు.

**క్యూ2 నుంచి మైండ్‌ట్రీ.....**

ఈ ఏడాది జూన్ నాటికి మైండ్‌ట్రీ కంపెనీలో తమకు 28.86 శాతం వాటా ఉందని, ఈ క్వార్టర్ పూర్తయిన తర్వాత ఆ కంపెనీలో తమ వాటా 60.59 శాతానికి చేరిందని రామన్ తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం రెండో క్వార్టర్ నుంచి తమ అనుబంధ సంస్థగా మైండ్‌ట్రీ కొనసాగుతుందని వివరించారు.

మార్కెట్ ముగిసిన తర్వాత ఫలితాలు వెలువడ్డాయి. ఫలితాలు బాగానే ఉంటాయనే అంచనాలతో బీఎస్‌ఈలో ఎల్ అండ్ టీ షేర్ 0.4% లాభంతో రూ.1,410 వద్ద ముగిసింది.

## 2018-2019కు ఐటీఆర్ ఫైలింగ్ గడువు పొడిగింపు




న్యూఢిల్లీ: 2018–19 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి (2019–2020 అసెస్‌మెంట్ ఇయర్) వ్యక్తిగత ఆదాయపు పన్ను రిటర్న్స్ (ఐటీఆర్) దాఖలుకు గడవును కేంద్రం నెలపాటు పొడిగించింది. నిజానికి అకౌంట్ల ఆడిటింగ్ అవసరంలేని వేతన జీవులు, సంస్థలుసహా వ్యక్తిగత ఐటీఆర్ దాఖలుకు గడువు 2019 జూలై 31తో పూర్తి కావాల్సి ఉంది. అయితే ఆయా వర్గాలకు కొంత వెసులుబాటు లక్ష్యంగా సీబీడీటీ (ప్రత్యక్ష పన్నుల కేంద్ర బోర్డ్) రిటర్న్ దాఖలు గడువును ఆగస్టు 31 వరకూ పొడిగించినట్లు ఆర్థికమంత్రిత్వశాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

## హ్యుందాయ్ కార్ల ధరలు మరింత ప్రియం




**న్యూఢిల్లీ:** హ్యుందాయ్ మోటార్స్ ఇండియా తన వాహన ధరల పెంపు నిర్ణయాన్ని ప్రకటించింది. కంపెనీ నూతనంగా విడుదల చేసిన వెన్యూ, కోనా ఎలక్ట్రిక్ ఎస్‌యూవీలు మినహాయించి మిగిలిన అన్ని మోడళ్లపై ధరలను పెంచనున్నట్లు మంగళవారం వెల్లడించింది. నూతన భద్రతా నిబంధనలను పాటించాల్సి రావడం వల్ల ముడి పదార్థాల వ్యయం పెరిగినందున ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు తెలియజేసింది. మోడల్ ఆధారంగా రూ.9,200 వరకు పెంపు ఉండనుండగా.. కొత్త ధరలు ఆగస్టు 1 నుంచి అమల్లోకి వస్తాయని పేర్కొంది. కంపెనీ శాంత్రో హ్యాచ్‌బ్యాక్ నుంచి టక్సన్ ఎస్‌యూవీ వరకు విక్రయిస్తోంది.

## జీడీపీ వృద్ధి రేటు ‘కట్’కట!

- భారత్ ఆర్థిక వ్యవస్థపై ఐఎంఎఫ్ విశ్లేషణ
- 2019, 2020 వృద్ధి రేట్ల అంచనాలు 0.3 శాతం కోత
- ఈ రెండేళ్లలో వృద్ధి 7, 7.2 శాతాలు మాత్రమే
- అంతర్జాతీయంగానూ వృద్ధి అంతంతే




**వాషింగ్టన్:** భారత్ దేశీయ వినియోగ డిమాండ్ అవుట్‌లుక్‌అంచనాలకన్నా బలహీనంగా ఉందని అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) విశ్లేషించింది. భారత స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)పై ఈ ప్రభావం పడుతుందని పేర్కొంది. ఈ కారణంగా 2019, 2020కి సంబంధించి జీడీపీ వృద్ధి రేటు అంచనాలను 0.3 శాతం (30 బేసిస్ పాయింట్లు) తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. 2019లో 7 శాతం, 2020లో 7.2 శాతం వృద్ధి రేట్లు మాత్రమే నమోదవుతాయన్నది తమ తాజా అంచనా అని తెలిపింది. అయితే ఈ స్థాయి వృద్ధి నమోదయినా, ప్రపంచంలో వేగవంతంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలుస్తుందని, చైనా తరువాతి స్థానంలోనే ఉంటుందని వాషింగ్టన్ కేంద్రంగా పనిచేసే అంతర్జాతీయ దిగ్గజ ద్రవ్య సంస్థ పేర్కొంది. తన తాజా వరల్డ్ ఎకనమిక్ అప్‌డేట్ నివేదికలో భాగంగా భారత్‌కు సంబంధించి ఐఎంఎఫ్ ఈ అంశాలను పేర్కొంది. భారత్ సంతతికి చెందిన ఐఎంఎఫ్ ప్రధాన ఆర్థికవేత్త గీతా గోపీనాథ్ ఆవిష్కరించిన నివేదికలో కొన్ని ముఖ్యాంశాలు చూస్తే...

- పన్నుల భారాలు పెరగడం, అంతర్జాతీయ డిమాండ్ బలహీనపడ్డం, అమెరికాతో వాణిజ్య ఉద్రిక్తతల వంటి అంశాలతో చైనా ఆర్థిక వ్యవస్థ తీవ్ర ప్రతికూలతలు ఎదుర్కొంటోంది. మందగమనంలో ఉన్న ఆర్థిక వ్యవస్థకు ఊతం ఇవ్వడానికి చైనా పలు విధానపరమైన ఉద్దీపన చర్యలు తీసుకుంటోంది. ఆయా చర్యల ఫలితంగా చైనా 2019లో 6.2 శాతం 2020లో 6 శాతం వృద్ధి రేట్లను నమోదుచేసుకునే అవకాశం ఉంది. (ఏప్రిల్‌లో వెలువడిన వరల్డ్ ఎకనమిక్ అవుట్‌లుక్ అంచనాల కన్నా 10 బేసిస్ పాయింట్లు తక్కువ)
- అంతర్జాతీయంగా తీవ్ర ఆర్థిక అనిశ్చితి ఉంది. తీవ్ర ఒత్తిడిలో ఉన్న అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల పనితీరుమీద మొత్తం ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మెరుగుదల ఆధారపడి ఉంటుంది.
- ఈ ఏడాది జనవరి నుంచి మార్చి మధ్య ప్రపంచ వాణిజ్యం కూడా నెమ్మదించింది. ప్రపంచ వాణిజ్యం ఈ కాలంలో కేవలం 0.5 శాతం మాత్రమే పురోగమించింది. ఇంత తక్కువ స్థాయి వృద్ధి రేటు 2012 తర్వాత ఇదే తొలిసారి.
- అమెరికా–చైనాల మధ్య సుంకాల పోరు, ఆటో టారిఫ్‌లు, యూరోపియన్ యూనియన్ నుంచి బ్రిటన్ వెలుపలికి రావడానికి సంబంధించిన బ్రెగ్జిట్ అంశాలు అసలే అంతంతమాత్రంగా ఉన్న ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై మరింత ప్రతికూల ప్రభావం చూపుతాయి. పెట్టుబడులు, సరఫరా చైన్లను ఈ పరిస్థితి దెబ్బతీసే అవకాశం ఉంది.
- అయితే ఈ పరిస్థితిని ‘అంతర్జాతీయ మాంద్యంగా’ మాత్రం ఐఎంఎఫ్ పరిగణించబోవడం లేదు. ప్రపంచ వృద్ధికి ‘కీలక అవరోధాలు’గా మాత్రమే దీనిని ఐఎంఎఫ్ చూస్తోంది.
- అమెరికా–చైనా మధ్య వాణిజ్య సవాళ్లు 2020లో ప్రపంచ జీడీపీని 0.5 శాతం మేర తగ్గించే అవకాశం ఉంది.
- ద్వైపాక్షిక వాణిజ్య సమతౌల్యతలు, వాణిజ్య లోటు సమస్యల పరిష్కారానికి సుంకాలే మార్గమని భావించడం సరికాదు. ఆయా సవాళ్ల పరిష్కారానికి నిబంధనల ఆధారిత బహుళజాతి వాణిజ్య వ్యవస్థ మరింత పటిష్టం కావాలి.

### ఏడుకు అటుఇటుగానే అంచనాలు!

2019-2020 ఆర్థిక సంవత్సరం (ఏప్రిల్-మార్చి)లో భారత్ ఆర్థిక వ్యవస్థ స్పీడు అంచనాలను తగ్గించడానికే పలు ఆర్థిక సంస్థలు మొగ్గుచూపిస్తుండడం గమనార్హం. ఆయా అంశాలను క్లుప్తంగా చూస్తే...

| సంస్థ | అంచనా (శాతాల్లో) |
|---|---|
| ఆర్‌బీఐ | 7.2 నుంచి 7 |
| ఎకనమిక్ సర్వే | 7 |
| ఏడీబీ | 7.2 నుంచి 7 |
| ఫిచ్ | 6.8 నుంచి 6.6 |
| గోల్డ్‌మన్ శాక్స్ | 7.2 |
| డీబీఎస్ | 7 నుంచి 6.8 |

## ఫార్చ్యూన్ ఇండియా 500లో ఆర్‌ఐఎల్ టాప్




**న్యూఢిల్లీ:** ఫార్చ్యూన్ 500 జాబితాలో భారత్ నుంచి అత్యంత విలువైన కంపెనీగా (ఆదాయం పరంగా) రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్‌ఐఎల్) ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ జాబితాలో ఇన్నాళ్లు భారత్‌లోని టాప్ కంపెనీగా కొనసాగుతూ వచ్చిన ప్రభుత్వ రంగ సంస్థ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ)ని వెనక్కినెట్టింది. తాజా ఫార్చ్యూన్ గ్లోబల్ 500లో భారతదేశ సంపన్న పారిశ్రామికవేత్త ముకేశ్ అంబానీకి చెందిన ఆర్‌ఐఎల్ 106వ స్థానానికి ఎగబాకింది. ఆ తరువాత స్థానంలో ఉన్న దేశీయ కంపెనీ ఐఓసీ 117వ స్థానంలో నిలిచింది. 2018లో 62.3 బిలియన్ డాలర్లుగా ఉన్న ఆర్‌ఐఎల్ ఆదాయం 2019లో 32.1 శాతం వృద్ధి చెంది 82.3 బిలియన్ డాలర్లకు చేరుకుంది. ఇదే సమయంలో ఐఓసీ ఆదాయం 17.7 శాతం వృద్ధి చెంది 77.6 బిలియన్ డాలర్లుగా ఉన్నట్లు వెల్లడైంది. గడిచిన పదేళ్లలో ఆర్‌ఐఎల్ ఆదాయం 7.2 శాతం చొప్పున చక్రగతి వృద్ధి రేటును నమోదుచేయగా.. ఐఓసీ ఆదాయం 3.64 శాతం వృద్ధితో కొనసాగుతోంది. ఇక ఫార్చ్యూన్ 500లో స్థానం సంపాదించిన ఇతర భారత కంపెనీల జాబితాలో.. ఓఎన్‌జీసీ(160), ఎస్‌బీఐ(236), టాటా మోటార్స్(265), బీపీసీఎల్(275), రాజేష్ ఎక్స్‌పోర్ట్ (495) స్థానాల్లో నిలిచాయి. జాబితాలోని మొదటి స్థానంలో అమెరికాకు చెందిన వాల్‌మార్ట్ ఉంది.

## నిఫ్టీ 50

**టాప్ 10 గెయినర్స్** (రూపాయిల్లో)

| Symbol | LTP | (%)Change |
|---|---|---|
| POWERGRID | 210 | 2.89 |
| KOTAKBANK | 1,494.15 | 2.74 |
| HEROMOTOCO | 2,465.00 | 2.55 |
| ITC | 270.95 | 2.48 |
| ASIANPAINT | 1,430.30 | 1.86 |
| NTPC | 132.9 | 1.57 |
| BPCL | 359 | 1.56 |
| TITAN | 1,101.00 | 1.42 |
| UPL | 645.95 | 1.11 |
| BAJFINANCE | 3,274.00 | 0.84 |

**టాప్ 10 లూజర్స్** (రూపాయిల్లో)

| Symbol | LTP | (%)Change |
|---|---|---|
| SBIN | 342.1 | -2.49 |
| IBULHSGFIN | 641.5 | -2.2 |
| HDFC | 2,140.00 | -2.14 |
| ADANIPORTS | 400.3 | -1.69 |
| BAJAJ-AUTO | 2,520.05 | -1.67 |
| ZEEL | 359 | -1.39 |
| HDFCBANK | 2,265.50 | -1.38 |
| COALINDIA | 218.4 | -1.36 |
| GRASIM | 880 | -1.36 |
| DRREDDY | 2,598.00 | -1.31 |

# 38,000 దిగువకు సెన్సెక్స్

- నాలుగో రోజూ నష్టాలే..!
- ఉత్సాహాన్నివ్వని క్యూ1 ఫలితాలు
- 48 పాయింట్ల నష్టంతో 37,983కు సెన్సెక్స్
- 15 పాయింట్లు తగ్గి 11,331కు నిఫ్టీ




కంపెనీల ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసిక ఫలితాలు నిస్తేజంగా ఉండటంతో స్టాక్ మార్కెట్ మంగళవారం నష్టపోయింది.ప్రపంచ మార్కెట్లు పెరిగినప్పటికీ, సెన్సెక్స్, నిఫ్టీలు వరుసగా నాలుగో రోజూ నష్టాల్లోనే ముగిశాయి. సెన్సెక్స్ కీలకమైన 38,000 పాయింట్ల దిగువకు పడిపోగా, నిఫ్టీ మాత్రం 11,300 పాయింట్లపైన ముగియగలిగింది. రోజులో ఎక్కువ భాగం లాభాల్లోనే ట్రేడైన సెన్సెక్స్, నిఫ్టీలు చివరి గంటలో నష్టపోయాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 48 పాయింట్లు పతనమై 37,983 పాయింట్ల వద్ద, ఎన్ఎస్ఈ నిఫ్టీ 15 పాయింట్లు నష్టపోయి 11,331 పాయింట్ల వద్ద ముగిశాయి. బ్యాంక్, లోహ, ఫార్మా షేర్లు నష్టపోయాయి. ఎఫ్ఎమ్సీజీ, రియల్టీ, విద్యుత్తు, కన్సూమర్ డ్యూరబుల్స్ షేర్లు పెరగడంతో నష్టాలు తగ్గాయి.

**319 పాయింట్ల రేంజ్‌లో సెన్సెక్స్...**

సెన్సెక్స్ లాభాల్లోనే ఆరంభమైంది. ఆ తర్వాత నష్టాల్లోకి జారిపోయింది. మళ్లీ పుంజుకొని లాభాల్లోకి వచ్చింది. చివరి గంటలో అమ్మకాలు జోరందుకోవడంతో నష్టాల్లోకి జారిపోయింది. ఒక దశలో 187 పాయింట్లు లాభపడిన సెన్సెక్స్ మరో దశలో 132 పాయింట్ల మేర పడిపోయింది. మొత్తం మీద రోజంతా 319 పాయింట్ల రేంజ్‌లో కదలాడింది. బడ్జెట్ నిరాశపరచడం, కంపెనీల క్యూ1 ఫలితాలు అంతంతమాత్రంగానే ఉండటంతో విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడుల ఉపసంహరణ కొనసాగుతోందని శాంక్టమ్ వెల్త్ మేనేజ్‌మెంట్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ సునీల్ శర్మ పేర్కొన్నారు. సమీప భవిష్యత్తులో మార్కెట్‌పై ఒత్తిడి కొనసాగుతుందని ఆయన అంచనా వేస్తున్నారు.

- ప్రధాన ఆసియా మార్కెట్లు లాభపడ్డాయి. ఆర్థిక వృద్ధి జోరును పెంచడానికి యూరోప్ కేంద్ర బ్యాంక్ వడ్డీరేట్లను 10 బేసిస్ పాయింట్ల మేర తగ్గించగలదన్న అంచనాలతో యూరప్ మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. డాలర్‌తో రూపాయి మారకం విలువ స్వల్పంగా తగ్గి 68.94 వద్ద ముగిసింది. ముడి చమురు ధరలు స్వల్పంగా తగ్గాయి.
- స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 3 శాతం నష్టపోయి రూ.342 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లో బాగా నష్టపోయిన షేర్ ఇదే.

## స్టాక్ మార్కెట్ డేటా

| | టర్నోవర్ (రూ. కోట్లలో) |
|---|---|
| బీఎస్ఈ | 1,851 |
| ఎన్ఎస్ఈ | 32,335 |
| ఎన్ఎస్ఈ (డెరివేటివ్స్) | 12,25,916 |
| ఎఫ్ఐఐ | -2,608 |
| డీఐఐ | 2,625 |

## నేటి బోర్డ్ సమావేశాలు

కెనరా బ్యాంక్, ఏషియన్ పెయింట్స్, భారతీ ఇన్‌ఫ్రాటెల్, రిలయన్స్ నిప్పన్ లైఫ్ అసెట్ మేనేజ్‌మెంట్, ఒబెరాయ్ రియల్టీ, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్, సిండికేట్ బ్యాంక్, కరూర్ వైశ్యా బ్యాంక్, శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ, లిబర్టీ షూస్, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ, వీ–గార్డ్ ఇండస్ట్రీస్, సింజీన్ ఇంటర్నేషనల్

## ఆర్‌బీఐ 'ఉత్కర్ష్ 2022'




రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) గవర్నర్ శక్తికాంత్‌దాస్ మంగళవారం సెంట్రల్ బ్యాంక్ అంతర్గత మధ్య కాలిక వ్యూహాత్మక విధానం (ఫ్రేమ్‌వర్క్) 'ఉత్కర్ష్ 2022'ను ఆవిష్కరించారు. ద్రవ్యోల్బణం వంటి స్థూల ఆర్థిక అంశాలకు సంబంధించి తన అత్యుత్తమ నిర్వహణ, నియంత్రణ, పర్యవేక్షణ, ద్రవ్య వ్యవస్థ పట్ల ప్రజల్లో విశ్వసనీయత పెంపొందించడం వంటి లక్ష్యాలతో మూడేళ్ల కాలపరిమితికిగాను ఈ ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించడం జరిగింది. ఫ్రేమ్‌వర్క్ అమలు అంశాలను సెంట్రల్ బోర్డ్ సబ్ కమిటీ ద్వారా కాలానుగుణంగా పర్యవేక్షించడం జరుగుతుంది. నియంత్రణ, పర్యవేక్షణ యంత్రాంగం పటిష్టతకు అంతర్జాతీయంగా పలు దేశాల సెంట్రల్ బ్యాంక్‌లు ఈ తరహా ఫ్రేమ్‌వర్క్‌లను రూపొందించి, అమలు జరుపుతున్నాయని సంబంధిత వర్గాలు తెలిపాయి.

## కీజెన్, మహీంద్రా అగ్రీ అవగాహన

నెథర్లాండ్స్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న వినూత్న వ్యవసాయ ఉత్పత్తుల కంపెనీ కీజెన్, మహీంద్రా అగ్రీ సొల్యూషన్స్ ఒక వ్యూహాత్మక పరిశోధానా భాగస్వామ్య ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. వినూత్న రీతిలో అత్యధిక ఉత్పాదక పంట సాగు విస్తరణ ఈ అవగాహన ఉద్దేశం.

## విజనెట్ సిస్టమ్స్ 800 ఉద్యోగాలు

టెక్నాలజీ సొల్యూషన్స్, బిజినెస్ ప్రాసెస్ మేనేజ్‌మెంట్ కంపెనీ విజనెట్ సిస్టమ్స్ ఈ ఏడాది చివరినాటికి 800 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ప్రణాళికలు రూపొందించింది. ఇదే జరిగితే ఈ అమెరికా కంపెనీకి భారత్‌లో ఉద్యోగుల సంఖ్య 2,500కు పెరుగుతుంది.

## అనిల్ అంబానీపై ధిక్కార పిటిషన్ కొట్టివేత



ఆర్‌కామ్ చెల్లింపుల వైఫల్యానికి సంబంధించి రిలయన్స్ గ్రూప్ చైర్మన్ అనిల్ అంబానీ, ఇతర అధికారులపై దాఖలైన ఒక ధిక్కార పిటిషన్‌ను ఎన్‌సీఎల్‌ఏటీ కొట్టివేసింది. రిలయన్స్ ఇన్‌ఫ్రాటెల్ బకాయిలు చెల్లించడంలేదంటూ మైనారిటీ షేర్‌హోల్డర్లు ఈ పిటిషన్ దాఖలు చేశారు. ఆర్‌కామ్, మైనారిటీ షేర్‌హోల్డర్ల (హెచ్ఎస్‌బీసీ డైజీ ఇన్వెస్ట్‌మెంట్స్–మారిషస్‌సహా) మధ్య కుదిరిన ఒప్పందం నియమ నిబంధనల ఆధారంగా ధిక్కార చర్యలు ప్రారంభించలేమని ఎన్‌సీఎల్‌ఏటీ చైర్మన్ జస్టిస్ ఎస్‌జే ముఖోపాధ్యాయ నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం రూలింగ్ ఇచ్చింది.

## నిలిచిపోయిన ఆర్‌ఐఎల్, అరామ్‌కో డీల్..!



ముకేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన రిఫైనింగ్, పెట్రోకెమికల్స్ వ్యాపారంలో 25 శాతం వాటాను కొనుగోలు చేసేందుకు సౌదీకి చెందిన అరామ్‌కో ఆసక్తి చూపుతుందన్న విషయం తెలిసిందే. కాగా, ఈ డీల్ నిలిచిపోయినట్లు సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. ప్రపంచంలోనే అతిపెద్ద చమురు ఉత్పాదక కంపెనీల్లో ఒకటైన సౌదీ అరామ్‌కో లెక్కించిన విలువకు.. ఆర్‌ఐఎల్ వాల్యుయేషన్‌కు అంతరం అధికంగా ఉన్న కారణంగానే ఈ డీల్ నిలిచిపోయినట్లు చెబుతున్నాయి. అయితే ఊహాగానాలపై మాట్లాడలేమని ఆర్‌ఐఎల్ అధికార ప్రతినిధి పేర్కొన్నారు.

## మైక్రోమ్యాక్స్‌తో హువావే జట్టు




**న్యూఢిల్లీ:** చైనాకు చెందిన ప్రముఖ మొబైల్ హ్యాండ్‌సెట్స్ తయారీ కంపెనీ 'హువావే'.. దేశీ ఎలక్ట్రానిక్స్ ఉపకరణాల తయారీ సంస్థ 'మైక్రోమ్యాక్స్'తో డిస్ట్రిబ్యూషన్ భాగస్వామ్యాన్ని ఏర్పాటుచేసుకుంది. భారత రిటైల్ మార్కెట్లో మరింత బలపడడంలో భాగంగా ఈ తాజా ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు హువావే ఇండియా కన్స్యూమర్ బిజినెస్ గ్రూప్ వైస్ ప్రెసిడెంట్ (హువావే బ్రాండ్) రిషి కిషోర్ గుప్తా వెల్లడించారు. ఈ అంశంపై మాట్లాడిన ఆయన.. 'ఆన్‌లైన్ అమ్మకాల్లో ఇక్కడి మార్కెట్లో మంచి పట్టు ఉండగా.. ఆఫ్‌లైన్‌లో కూడా బలపడడం కోసం ఈ నిర్ణయం తీసుకున్నాం. క్రోమా, పూర్వికాల ద్వారా 200 సేల్ పాయింట్లను కలిగి ఉన్నాం. ఇక మైక్రోమ్యాక్స్ జట్టుతో మా సంస్థ రిటైల్ అవుట్‌లెట్స్ నెట్‌వర్క్ 1.25 లక్షలకు చేరుకుంది' అని అన్నారు.

## స్నాప్‌డీల్‌లో ఆనంద్ పిరమల్ పెట్టుబడి




**న్యూఢిల్లీ:** ఈ–కామర్స్ సంస్థ స్నాప్‌డీల్‌లో పిరమల్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆనంద్ పిరమల్ పెట్టుబడి పెట్టినట్లు ఆ సంస్థ ప్రకటించింది. అయితే, ఎంత మొత్తంలో ఇన్వెస్ట్ చేశారన్న విషయం మాత్రం వెల్లడించలేదు. ఈ అంశంపై స్నాప్‌డీల్ సహ వ్యవస్థాపకుడు, సీఈఓ కునాల్ మాట్లాడుతూ.. 'ఆనంద్ పిరమల్ తన వ్యక్తిగత స్థానంలో పెట్టుబడి పెట్టారు. నూతన తరానికి తగినట్లుగా మార్పులు చెందుతున్న సంస్థ వృద్ధికి పెట్టుబడి దోహదపడనుంది' అని అన్నారు.

## యాప్ డెవలపర్ల కోసం పైన్ ల్యాబ్స్ ఏపీఐ

**న్యూఢిల్లీ:** పైన్ ల్యాబ్స్ తన ఆండ్రాయిడ్ ఆధారిత అప్లికేషన్ ప్రోగ్రామ్ ఇంటర్‌ఫేస్ (ఏపీఐ/యాప్స్ అభివృద్ధికి ఉద్దేశించిన ఇంటర్‌ఫేస్)ను డెవలపర్ల కోసం అందుబాటులో ఉంచుతున్నట్టు ప్రకటించింది. డెవలపర్లు తమ ఏపీఐను వినియోగించడం ద్వారా చిన్న, మధ్య స్థాయి వ్యాపారుల కోసం ఉద్దేశించిన విలువ ఆధారిత సొల్యూషన్లు, అప్లికేషన్లను అభివృద్ధి చేసుకోవచ్చని సూచించింది. ఆండ్రాయిడ్ ఆధారిత ఏపీఐను పైన్ ల్యాబ్స్ డెవలపర్ పోర్టల్‌లో అందుబాటులో ఉంటుందని తెలిపింది. అప్లికేషన్ల డెవలపర్ల కోసం ప్రత్యేకంగా అప్లికేషన్ స్టోర్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించింది. సంబంధిత యాప్స్‌ను వ్యాపారుల సమూహానికి చేరువగా తీసుకెళ్లే విషయంలో పైన్ ల్యాబ్స్ మద్దతుగా నిలుస్తుందని పేర్కొంది.

**పైన్ ల్యాబ్స్‌తో బీఓబీ జట్టు**

మర్చెంట్ ప్లాట్‌ఫామ్ పైన్ ల్యాబ్స్‌తో ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా కీలక అవగాహన కుదుర్చుకుంది. బ్యాంక్ డెబిట్, క్రెడిట్ కార్డ్ హోల్డర్లకు డిజిటల్ పేమెంట్ సొల్యూషన్స్ అందించడం ఈ అవగాహన లక్ష్యం. రిటైల్ అమ్మకాల ప్రస్తుత మార్కెట్ పరిమాణం రూ.2,30,000 కోట్లు. వీటిలో రూ.50,000 కోట్లు ఫైనాన్స్‌తోనే ముడివడి ఉంది. సంబంధిత ఫైనాన్స్ అవకాశాలను అత్యున్నత స్థాయి సాంకేతికతతో అందిపుచ్చుకోవడం ఈ భాగస్వామ్య లక్ష్యమని ఉన్నత స్థాయి వర్గాలు పేర్కొన్నాయి.

## హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ప్రీమియమ్ ఆదాయం రూ.6,536 కోట్లు




**న్యూఢిల్లీ:** హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ కంపెనీ నికర లాభం ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసిక కాలంలో 12 శాతం పెరిగింది. గత క్యూ1లో రూ.320 కోట్లుగా ఉన్న నికర లాభం ఈ క్యూ1లో రూ.425 కోట్లకు పెరిగిందని హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ తెలిపింది. మొత్తం ప్రీమియమ్ రూ.5,058 కోట్ల నుంచి 29 శాతం వృద్ధితో రూ.6,536 కోట్లకు పెరిగిందని పేర్కొంది. కొత్త వ్యాపార ప్రీమియమ్ 47 శాతం వృద్ధితో రూ.3,926 కోట్లకు, రెన్యూవల్ ప్రీమియమ్ 29 శాతం వృద్ధితో రూ.2,610 కోట్లకు పెరిగిందని తెలిపింది. కొత్త వ్యాపార విలువ (వేల్యూ ఆఫ్ న్యూ బిజినెస్) రూ.249 కోట్ల నుంచి 104 శాతం వృద్ధితో రూ.509 కోట్లకు పెరిగిందని పేర్కొంది. ఈ క్యూ1లో మొత్తం జీవిత బీమా పాలసీలు 26 శాతం వృద్ధితో 1.3 కోట్లుగా ఉన్నాయని వివరించింది.

**రూ.1.29 లక్షల కోట్లకు నిర్వహణ ఆస్తులు.....**

ఆదాయంలో మంచి వృద్ధి సాధించామని హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ సీఈఓ, ఎమ్‌డీ, విభా పాదల్కర్ సంతృప్తి వ్యక్తం చేశారు. రక్షణ, రిటైర్మెంట్ సెగ్మెంట్ పాలసీలపై దృష్టి పెడుతున్నామని, తమ కంపెనీ భవిష్యత్తు వృద్ధికి ఇవే కీలకమని ఆమె పేర్కొన్నారు. గత క్యూ1లో రూ.1.09 లక్షల కోట్లుగా ఉన్న నిర్వహణ ఆస్తులు ఈ క్యూ1లో రూ.1.29 లక్షల కోట్లకు పెరిగాయని తెలిపారు. ఆర్థిక ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ షేర్ 3.6 శాతం లాభంతో రూ. 509 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఈ షేర్ ఏడాది గరిష్ట స్థాయి, రూ.511ను తాకింది.

## ఎస్‌బీఐ లైఫ్ నికర లాభం రూ. 372కోట్లు

**న్యూఢిల్లీ:** ఎస్‌బీఐ లైఫ్ నికర లాభం ఈ ఆర్థిక సంవత్సరం జూన్ క్వార్టర్‌లో 5 శాతం పెరిగింది. గత క్యూ1లో రూ.354 కోట్లుగా ఉన్న నికర లాభం ఈ క్యూ1లో రూ.372 కోట్లకు పెరిగిందని ఎస్‌బీఐ లైఫ్ తెలిపింది. స్థూల ప్రీమియమ్ ఆదాయం రూ.4,760 కోట్ల నుంచి 41 శాతం వృద్ధితో రూ.6,690 కోట్లకు పెరిగిందని పేర్కొంది. దీంట్లో కొత్త వ్యాపార ప్రీమియమ్(ఎన్‌బీపీ) 52 శాతం వృద్ధితో రూ.3,150 కోట్లకు, రెన్యూవల్ ప్రీమియమ్ ఆదాయం 32 శాతం వృద్ధితో రూ.3,540 కోట్లకు చేరాయని వివరించింది. ఈ ఏడాది జూన్ చివరి నాటికి నిర్వహణ ఆస్తులు 22 శాతం వృద్ధితో రూ.1.47 లక్షల కోట్లకు పెరిగాయని పేర్కొంది.

## జీ లాభం 63 శాతం అప్

**న్యూఢిల్లీ:** జీ ఎంటర్‌టైన్మెంట్ ఎంటర్‌ప్రైజెస్ ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసిక కాలంలో రూ.530 కోట్ల నికర లాభం సాధించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే క్వార్టర్‌లో ఆర్జించిన నికర లాభం, రూ.326 కోట్లతో పోల్చితే 63 శాతం వృద్ధి సాధించామని జీ ఎంటర్‌టైన్మెంట్ ఎంటర్‌ప్రైజెస్ తెలిపింది. మొత్తం ఆదాయం రూ.1,822 కోట్ల నుంచి 16 శాతం వృద్ధితో రూ.2,112 కోట్లకు పెరిగిందని పేర్కొంది.ట్రాయ్ టారిఫ్ ఆర్డర్ల అమలు కారణంగా పరిశ్రమలో సమస్యాత్మక పరిస్థితులు నెలకొన్నప్పటికీ, మంచి ఫలితాలు సాధించామని కంపెనీ ఎమ్‌డీ, సీఈఓ పునీత్ గోయెంకా తెలిపారు. ఆర్థిక ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో జీ ఎంటర్‌టైన్మెంట్ షేర్ 0.6 శాతం నష్టంతో రూ. 361 వద్ద ముగిసింది.

## డీహెచ్‌ఎఫ్‌ఎల్ ఖాతాల్లో అవకతవకలు!




**న్యూఢిల్లీ:** హౌసింగ్ ఫైనాన్స్ సంస్థ డీహెచ్‌ఎఫ్‌ఎల్ ఖాతాల్లో లొసుగులు ఉన్నాయంటూ ఆడిటింగ్ సంస్థలు వెల్లడించాయి. అలాగే కొన్ని రుణాల మంజూరులోనూ అవకతవకలు జరిగాయని పేర్కొన్నాయి. 2019 మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికం ఆర్థిక ఫలితాలను ఆడిట్ చేసిన డెలాయిట్ హాస్కిన్ అండ్ సెల్స్, చతుర్వేది అండ్ షా సంస్థలు ఈ మేరకు నివేదికలను స్టాక్ ఎక్స్ఛేంజీలకు సమర్పించాయి. 'ఆర్థిక ఫలితాలపై అభిప్రాయాలు తెలపడానికి ఆడిట్‌పరంగా తగిన ఆధారాలేమీ లభించలేదు' అని పేర్కొన్నాయి. డీహెచ్‌ఎఫ్‌ఎల్ అన్‌సెక్యూర్డ్ రుణాలను జారీ చేసిన తీరు, వాటిని రోలోవర్ చేసిన తీరులో చాలా లోపాలు ఉన్నాయని రెండు ఆడిట్ సంస్థలు తెలిపాయి. కొన్ని రుణాల మంజూరులో అవకతవకలు కూడా జరిగాయని పేర్కొన్నాయి. కంపెనీ కార్యకలాపాలు యథాప్రకారం సాగలేకపోవచ్చనే సందేహాలు రేకెత్తించేవిగా ఈ పరిణామాలు ఉన్నాయని వివరించాయి. తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన డీహెచ్‌ఎఫ్‌ఎల్ ప్రస్తుతం దాదాపు రూ. 6,900 కోట్ల మేర నిధుల సమీకరణ ప్రయత్నాల్లో ఉంది. ప్రమోటర్ల వాటాలో దాదాపు 50 శాతం వాటాల కొనుగోలు కోసం లోన్ స్టార్, కేకేఆర్ వంటి పీఈ సంస్థలు చర్చలు జరుపుతున్నాయి. ప్రస్తుతం ప్రమోటర్లకు డీహెచ్‌ఎఫ్‌ఎల్‌లో 40 శాతం వాటాలు ఉన్నాయి.

## తగ్గిన ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ నష్టాలు

- మొండి బకాయిలు తగ్గాయ్
- అయినా అధిక స్థాయిల్లోనే
- కేటాయింపులూ తగ్గాయ్
- రూ.5,006 కోట్లకు మొత్తం ఆదాయం




**న్యూఢిల్లీ:** ప్రభుత్వ రంగ ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ నష్టాలు ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసిక కాలంలో మరింతగా తగ్గాయి. గత క్యూ1లో రూ.919 కోట్లుగా ఉన్న నికర నష్టాలు ఈ క్యూ1లో రూ.342 కోట్లకు తగ్గాయని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ (ఐఓబీ) తెలిపింది. రుణాల రికవరీ బావుండటం, కేటాయింపులు తగ్గడంతో నష్టాలు కూడా తగ్గాయని పేర్కొంది. మొత్తం ఆదాయం రూ.5,327 కోట్ల నుంచి 6 శాతం తగ్గి రూ.5,006 కోట్లకు చేరిందని తెలిపింది. వడ్డీ ఆదాయం 2 శాతం వృద్ధితో రూ.4,336 కోట్లకు పెరగ్గా, ఇతర ఆదాయం మాత్రం 38 శాతం తగ్గి రూ.670 కోట్లకు పరిమితమైందని పేర్కొంది.

**తగ్గినా, అధికంగానే మొండి బకాయిలు....**

మొండి బకాయిలు గణనీయంగానే తగ్గినా, అధిక స్థాయిల్లోనే ఉన్నాయి. గత క్యూ1లో 25.64 శాతం(రూ.38,146 కోట్లు)గా ఉన్న స్థూల మొండి బకాయిలు ఈ క్యూ1లో 22.53 శాతాని(రూ.33,262 కోట్ల)కి తగ్గాయని ఐఓబీ తెలిపింది. నికర మొండి బకాయిలు 15.10 శాతం(రూ.19,642 కోట్లు) నుంచి 11.04 శాతాని(రూ.14,174 కోట్లు)కి తగ్గాయని పేర్కొంది. మొండి బకాయిలు తగ్గడంతో మొండి బకాయిలకు కేటాయింపులు రూ.2,051 కోట్ల నుంచి రూ.1,170 కోట్లకు తగ్గాయని వివరించింది. రుణ రికవరీలు రూ.3,389 కోట్ల నుంచి రూ.2,238 కోట్లకు తగ్గాయని తెలిపింది. ఇక తాజా మొండి బకాయిలు రూ.2,050 కోట్లకు పరిమితమయ్యాయని వివరించింది. తాజా మొండి బకాయిలు కన్నా రికవరీలు అధికంగా ఉన్నాయని తెలిపింది. ఈ ఏడాది జూన్ 30 నాటికి మొత్తం డిపాజిట్లు రూ.2.21 లక్షల కోట్లకు, రుణాలు రూ.1.47 లక్షల కోట్లకు, మొత్తం వ్యాపారం రూ.3.69 లక్షల కోట్లకు చేరాయని ఐఓబీ తెలిపింది. ఆర్థిక ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ 0.7 శాతం లాభంతో రూ.11.80 వద్ద ముగిసింది.

## బేయర్ క్రాప్ సైన్స్‌కు అకాల వర్షాల దెబ్బ




**న్యూఢిల్లీ:** బేయర్ క్రాప్‌సైన్స్ కంపెనీ నికర లాభం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్–జూన్ క్వార్టర్‌లో 60 శాతం తగ్గింది. గత క్యూ1లో రూ..147 కోట్లుగా ఉన్న నికర లాభం ఈ క్యూ1లో రూ.59 కోట్లకు తగ్గిందని బేయర్ క్రాప్ సైన్స్ తెలిపింది. మొత్తం ఆదాయం రూ.843 కోట్ల నుంచి రూ.671 కోట్లకు తగ్గిందని పేర్కొంది. మొత్తం వ్యయాలు రూ.613 కోట్ల నుంచి రూ.553 కోట్లకు తగ్గాయని వివరించింది. వర్షాలు ఆలస్యంగా రావడం, ఖరీఫ్ సీజన్‌లో విత్తనాలు విత్తడం ఆలస్యం కావడం... తమ ఆర్థిక ఫలితాలపై తీవ్రంగానే ప్రభావం చూపించిందని కంపెనీ వైస్ చైర్మన్, ఎమ్‌డీ, సీఈఓ డి. నరైన్ పేర్కొన్నారు. మోన్‌శాంటో ఇండియాను తమ కంపెనీలో విలీనం చేసుకునేందుకు వాటాదారులు ఆమోదం తెలిపారని వెల్లడించారు. నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్(ఎన్‌సీఎల్‌టీ) తుది ఆమోదం రావాల్సి ఉందని పేర్కొన్నారు. ఈ విలీనంతో రైతులకు మరిన్ని ఉత్పత్తులను అందించగలమని తెలిపారు.

## బులియన్ రూ.లలో

| | | |
|---|---|---|
| **ముంబై** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 35,700 | 0 |
| బంగారం (22 క్యారెట్లు) | 34,000 | 0 |
| వెండి (కిలో) | 44,500 | 0 |
| **చెన్నై** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 34,990 | ▼ 160 |
| బంగారం (22 క్యారెట్లు) | 33,320 | ▼ 160 |
| వెండి (కిలో) | 44,500 | 0 |
| **హైదరాబాద్** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 34,990 | ▼ 160 |
| బంగారం (22 క్యారెట్లు) | 33,320 | ▼ 160 |
| వెండి (కిలో) | 44,500 | 0 |
| **ప్రొద్దుటూరు** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 34,600 | ▼ 100 |
| బంగారం (22 క్యారెట్లు) | 31,990 | ▼ 80 |
| వెండి (కిలో) | 40,800 | ▼ 300 |
| **విశాఖపట్నం** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 35,780 | ▼ 120 |
| బంగారం (22 క్యారెట్లు) | 33,280 | ▼ 100 |
| వెండి (కిలో) | 42,500 | 0 |
| **ఏపీ బులియన్ అసోసియేషన్** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 36,010 | ▼ 180 |
| బంగారం (22 క్యారెట్లు) | 33,320 | ▼ 160 |
| వెండి (కిలో) | 44,500 | 0 |

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

## ముడిచమురు... (బ్యారెల్)

| | | |
|---|---|---|
| నైమెక్స్ లైట్ స్వీట్ | 56.49 (రాత్రి 11.30కు) | $56.22 (సోమవారం ముగింపు) |
| బ్రెంట్ | 63.38 (రాత్రి 11.30కు) | $63.26 (సోమవారం ముగింపు) |

## కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 24-07-2019

| | |
|---|---|
| విశాఖ | 340-00 |
| చిత్తూరు | 358-00 |
| వరంగల్ | 308-00 |
| చెన్నై | 365-00 |
| ముంబై | 370-00 |
| విజయవాడ | 320-00 |
| నమక్కల్ | 355-00 |
| గోదావరి | 320-00 |
| **23-07-2019 ఫామ్ ధర...** | |
| హైదరాబాద్ | 305-00 |
| రిటైల్ (ఒక గుడ్డుకు) | 3.65 |
| బెంగళూరు | 345-00 |
| కోల్‌కత్త | 360-00 |
| ఢిల్లీ | 320-00 |

## ఎన్ఎస్ఈ నగదు విభాగంలో ట్రేడైన షేర్లు

| కంపెనీ పేరు | ముగింపు ధర | క్రితం ముగింపు |
|---|---|---|
| ADANI PORT | 399.75 | 407.2 |
| ASIAN PAINT | 1429.35 | 1404.2 |
| AXIS BANK | 728 | 727.45 |
| BAJAJ AUTO | 2523.85 | 2562.9 |
| BAJAJ FINSE | 7170.35 | 7162.45 |
| BAJAJ FINAN | 3276.9 | 3246.6 |
| BHARTI AIRTEL | 343.6 | 342.55 |
| BPCL | 359.05 | 353.5 |
| BRITANNIA I | 2730.2 | 2734.5 |
| CIPLA LTD | 528.9 | 530.95 |
| COAL INDIA | 218.05 | 221.4 |
| EICHER MOTO | 17098.45 | 17072 |
| GAIL (INDIA) | 138.6 | 138 |
| GRASIM INDU | 883.5 | 892.15 |
| HCL TECHNOL | 1010.95 | 1018.95 |
| HDFC LTD | 2138.5 | 2186.9 |
| HDFC BANK | 2263.5 | 2297.25 |
| HERO MOTOCO | 2469.3 | 2403.7 |
| HINDALCO | 203.1 | 202.4 |
| HUL | 1693.35 | 1680.7 |
| INDIABULLS | 640.55 | 655.9 |
| ICICI BANK | 411.95 | 411.5 |
| INDUSIND BANK | 1416.75 | 1418.4 |
| BHARTI INFR | 261.8 | 264.05 |
| INFOSYS LIM | 790.05 | 784.4 |
| INDIAN OIL | 147.35 | 147.95 |
| ITC LTD | 270.65 | 264.4 |
| JSW STEEL L | 263.3 | 264.4 |
| KOTAK MAHIN | 1494 | 1454.3 |
| LARSEN & T | 1409.5 | 1403.7 |
| MAHINDRA &M | 559.1 | 564.9 |
| MARUTI SUZU | 5873.75 | 5912.5 |
| NTPC LTD | 133.05 | 130.85 |
| ONGC | 144.6 | 146.65 |
| POWER GRID | 210.45 | 204.1 |
| RIL | 1273.55 | 1280.5 |
| SBI | 342.2 | 350.85 |
| SUN PHARMA | 430.25 | 430.25 |
| TATA MOTORS | 156.2 | 156.75 |
| TATA STEEL | 459.85 | 465.55 |
| TCS | 2112.45 | 2109.9 |
| TECH MAHIND | 671.2 | 671.95 |
| TITAN COMPA | 1099.15 | 1085.55 |
| ULTRATECH C | 4539.45 | 4584.1 |
| UPL LIMITED | 645.15 | 638.85 |
| VEDANTA LIM | 168.1 | 167.25 |
| WIPRO LTD | 264.5 | 264.8 |
| YES BANK LI | 90.65 | 91.15 |
| ZEE ENTERTA | 360.8 | 364.05 |

## నిఫ్టీ నెక్స్ట్ ఫిఫ్టీ

| | | |
|---|---|---|
| ABB INDIA L | 1374.95 | 1403.9 |
| ACC LIMITED | 1584.85 | 1581.3 |
| AMBUJA CEME | 217.65 | 215.8 |
| ASHOK LEYLA | 75 | 79.35 |
| BAJAJ HOLDI | 3367.35 | 3431 |
| BANDHAN BAN | 469.05 | 501.3 |
| BANK OF BAR | 112.5 | 118.35 |
| BHEL | 63.9 | 64.1 |
| BIOCON LIMI | 241.95 | 246.5 |
| BOSCH LIMIT | 15011.1 | 15146.95 |
| CADILA HEAL | 235.75 | 235.9 |
| COLGATE PAL | 1165.55 | 1164.35 |
| CONTAINER C | 538.3 | 537.75 |
| DABUR INDIA | 423.75 | 421.4 |
| DLF LIMITED | 180.2 | 179.5 |
| AVENUE SUPE | 1402.35 | 1417.55 |
| GENERAL INS | 220.55 | 221.3 |
| GODREJ CONS | 618.3 | 621.2 |
| HAVELLS IND | 713.85 | 722.7 |
| HDFC AMC LI | 2144.25 | 2204.7 |
| HDFC LIFE I | 508.55 | 490.65 |
| HINDUSTAN P | 290.3 | 293.7 |
| HINDUSTAN Z | 222.95 | 224.6 |
| ICICI LOMBA | 1075.45 | 1054.85 |
| ICICI PRU L | 383.1 | 375.85 |
| VODAFONE ID | 10.55 | 10.75 |
| INTERGLOBE | 1523.4 | 1519.2 |
| L&T FINANCE | 107.55 | 108.05 |
| LUPIN LIMIT | 756.45 | 756.5 |
| MARICO LIMI | 361.25 | 361.85 |
| UNITED SPIR | 590.35 | 599.55 |
| MOTHERSON S | 113.05 | 111.6 |
| MRF LTD | 53941.8 | 54144.1 |
| NHPC LTD | 23.15 | 23.1 |
| THE NEW IND | 129.05 | 127.55 |
| NMDC LTD. | 114.4 | 113.55 |
| ORACLE FIN | 3353.25 | 3336 |
| PAGE INDUST | 19394.3 | 19451.4 |
| PIRAMAL ENT | 1872.85 | 1903.25 |
| PETRONET LN | 240.8 | 241.7 |
| P&G HYGIENE | 10503.2 | 10506.7 |
| PIDILITE IN | 1206.45 | 1198.2 |
| STEEL AUTHO | 46.05 | 46.25 |
| SBI LIFE IN | 775.95 | 762.15 |
| SHREE CEMEN | 20758.7 | 20939.95 |
| SIEMENS LTD | 1204.7 | 1187.4 |
| SHRIRAM TRA | 980.8 | 1038.25 |
| UNITED BREW | 1392.4 | 1379.05 |

## బీఎస్ఈలో ఏపీ,టీఎస్ స్టాక్స్

| కంపెనీ పేరు | ముగింపు ధర | క్రితం ముగింపు |
|---|---|---|
| AditSpin | 4.3 | 4.45 |
| Alphageo | 345.1 | 335.4 |
| Alu Flouride | 117.95 | 112.2 |
| Amar Raja Bat | 629.6 | 621.1 |
| And Bank | 21.45 | 21.8 |
| And Cemen | 3.18 | 3.34 |
| And Paper | 436.05 | 430.7 |
| And Petro | 44.05 | 45.6 |
| Anjani Portl | 157.15 | 148 |
| Aries Agro Ltd | 50.5 | 50.95 |
| Aurobindo Ph | 561.75 | 570.3 |
| Avantel Soft | 222.3 | 230 |
| Avanti Feeds | 328.4 | 335.75 |
| AvonOrg | 2.6 | 2.6 |
| BN Rathi Sec | 19.8 | 20.05 |
| Balaji Amin | 271.1 | 263.05 |
| Bambino Agro | 148 | 141.05 |
| Baron Info | 0.19 | 0.19 |
| Bartronics | 3.12 | 3.21 |
| Bhagira Chem | 455 | 455.5 |
| Bhagya Nag | 21.2 | 21.6 |
| Bhagya Wood | 15.05 | 15.6 |
| Bhaskar Agro | 18.25 | 18.25 |
| Brilliant Sec | 0.71 | 0.73 |
| CIL Securi | 13.22 | 12.1 |
| Cont Coffee | 248.15 | 245.65 |
| CoroFert | 382.05 | 378.95 |
| Country Club | 4.42 | 4.38 |
| Cubex Tub | 11.93 | 11.21 |
| Cybermate | 1.85 | 1.8 |
| DR Reddy | 2600 | 2631.95 |
| Danlaw Tec | 81.85 | 75.7 |
| DecCement | 355 | 359.2 |
| Divi's Lab | 1610 | 1626.45 |
| Dolphin Medi | 1.12 | 1.12 |
| Dredgin Corp | 353.85 | 350.5 |
| Everest Org | 143.1 | 150 |
| FinePlast | 6.7 | 6.39 |
| Fortune Info | 27 | 28 |
| Four Soft | 23.6 | 24.35 |
| GMR Ferro | 0.41 | 0.43 |
| GMR Infra | 14.82 | 14.73 |
| GVK Power | 5.24 | 5.19 |
| Gati Corpn | 57.95 | 60.05 |
| Gayatri Bio | 1.55 | 1.55 |
| Gayatri Proj | 138.45 | 136.15 |
| Gayatri Sugrs | 2.4 | 2.5 |
| Gennex Lab | 3.4 | 3.49 |
| GodavDru | 19.45 | 18.75 |
| Goldstn Tele | 186 | 186.1 |
| Goldstone Tech | 9.61 | 9.94 |
| Granules (I) | 86 | 85.35 |
| HBL Nife Pow | 21.55 | 21.55 |
| HYDIndus | 1324.15 | 1250.8 |
| Heritage Food | 359.5 | 356.25 |
| HindFlurocarb | 11.29 | 11.88 |
| ICSA Ltd | 0.98 | 0.94 |
| IDL Industrs | 232 | 220.75 |
| IVRCL Infras | 0.6 | 0.6 |
| Incap | 28.35 | 28.35 |
| IndoNationl | 441 | 441 |
| Infotech En | 475 | 460.55 |
| Innaredy Com | 0.98 | 0.94 |
| Invinex Lab | 74 | 70.9 |
| JSTL | 21.1 | 22.55 |
| KCP LTD | 77.9 | 75.6 |
| KNR Constructio | 277.1 | 263.6 |
| KakatiCem | 171.5 | 168.9 |
| Kallam Spg | 11.8 | 11.21 |
| Kernex Micro | 23.45 | 23.65 |
| Krebs Bio | 73.95 | 71.55 |
| LGS Global | 3.37 | 3.35 |
| LancoIndus | 185.05 | 179.2 |
| Lokesh Mach | 40.85 | 42 |
| Lotus Choc | 17.2 | 15.2 |
| MIC Elec | 0.61 | 0.64 |
| Madhucon Proje | 4.7 | 4.94 |
| Maytas Infra | 5 | 5.25 |
| Medinova Dia | 13.15 | 13.65 |
| Mold-tek | 51 | 51.8 |
| Moldtek Plastic | 245.8 | 250.3 |
| Moschip Semi | 16.15 | 15.85 |
| NCLInd | 115.65 | 117.45 |
| NETTLINX | 28.8 | 29.15 |
| NMDC Ltd | 114.35 | 113.6 |
| NagarAgrich | 28.4 | 28.25 |
| NagarConst | 78.9 | 79.95 |
| Natco Pharma | 506.45 | 503.05 |
| Nava Bh Ventur | 97 | 91.2 |
| Neha Inter | 1.22 | 1.27 |
| Neocure Ther | 2.25 | 2.24 |
| Neuland Lab | 507.5 | 506.15 |
| Nihar Info Glo | 10.83 | 11.4 |
| Nile | 230 | 233.45 |
| Oil Country | 7.66 | 7.33 |
| Ortin Lab | 11.03 | 11.11 |
| Padmalaya Tele | 1.43 | 1.43 |
| PennInd | 28.65 | 28.6 |
| Phytochem I | 26 | 27.15 |
| Pitti Lamin | 45.5 | 45.25 |
| Pokarna | 138 | 134.35 |
| Prajay Engs | 7.3 | 6.8 |
| PremiExpl | 181.5 | 173 |
| Prism Cement | 91.6 | 91.5 |
| Ragsan Petro | 81.85 | 82.05 |
| Rain Industries | 90.2 | 88.2 |
| Raj Packagin | 18.5 | 18.25 |
| Ram Informat | 35 | 35.25 |
| Range Aparel | 49.35 | 51.9 |
| RavilFin | 6.3 | 6 |
| SS Organics | 7.04 | 7.41 |
| Sagar Cem | 615.6 | 620.35 |
| Samkrg Pist | 111.3 | 117.9 |
| Sampre Nutri | 19 | 18.3 |
| SangInd | 62.25 | 62.05 |
| Saven Techno | 16.7 | 18 |
| Sibar Auto | 16.11 | 16.95 |
| Softsol | 22.95 | 24.15 |
| SrRayAlk | 23.55 | 22 |
| Starchik Sp | 59 | 56.9 |
| Sujana Metal | 0.31 | 0.32 |
| Sujana Univers | 0.19 | 0.2 |
| Surana Tele | 3.9 | 4.37 |
| Suryachakra Pow | 0.19 | 0.19 |
| Suryalata Sp | 141.25 | 141.25 |
| SuvarCem | 45.7 | 48 |
| Suven Pharma | 237.9 | 239.8 |
| TCI Finance | 11.3 | 11.65 |
| Taj Gvk Hotel | 184.6 | 185.3 |
| Tanla Solutions | 64.3 | 61.25 |
| Tirumala Seu | 0.61 | 0.64 |
| Trans Biotek | 2.85 | 2.79 |
| Transport Co | 279.55 | 281.55 |
| Trendy Knit | 0.22 | 0.21 |
| VBC Ferro | 27.55 | 29 |
| VST Indus | 3247.85 | 3200.95 |
| Viceroy Hotels | 1.39 | 1.4 |
| VijayTextil | 24 | 23 |
| Vimta Labs | 141.9 | 143.15 |
| Virat Crane | 23.4 | 23.15 |
| Virinchi Con | 55.85 | 55.85 |
| VisakaInd | 295.75 | 295.35 |
| Vision Tech | 1.05 | 1 |
| Vista Pharma | 12.59 | 12.36 |
| Vivimed Labs | 15.3 | 13.8 |
| Vjil Consult | 41.9 | 41 |
| ZenoTech Lab | 16 | 16 |

# కంపెనీలకు డేటా చోరీ కష్టాలు

**సగటున రూ. 12.8 కోట్ల నష్టం • ఐబీఎం నివేదిక**



**న్యూఢిల్లీ:** డేటా చోరీ, ఉల్లంఘనలు వ్యాపార సంస్థలకు పెద్ద సమస్యగా మారుతున్నాయి. గతేడాది జూలై నుంచి ఈ ఏడాది ఏప్రిల్ మధ్యకాలంలో డేటా ఉల్లంఘనల కారణంగా దేశీ సంస్థలు సగటున రూ. 12.8 కోట్ల మేర నష్టపోయాయి. టెక్ దిగ్గజం ఐబీఎం కోసం పోనిమాన్ ఇన్‌స్టిట్యూట్ రూపొందించిన నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. 2018 జూలై నుంచి 2019 ఏప్రిల్ మధ్య కాలంలో 500 పైగా సంస్థల నుంచి సేకరించిన వివరాలతో ఈ నివేదిక రూపొందింది. దీని ప్రకారం అంతర్జాతీయంగా డేటా చౌర్య నష్టాలు సగటున 3.92 మిలియన్ డాలర్లు (సుమారు రూ. 27.03 కోట్లు)గా ఉన్నాయి. సగటున దేశీయంగా 35,636 రికార్డుల డేటా ఉల్లంఘన జరుగుతోంది. అంతర్జాతీయంగా ఈ సగటు 25,575 రికార్డులుగా ఉంది. డేటా ఉల్లంఘన వల్ల చట్టపరమైన, నియంత్రణ నిబంధనలపరమైన వ్యయాలు మొదలుకుని బ్రాండ్ పేరు దెబ్బతినడం, కస్టమర్లు ఇతర సంస్థలకు మళ్లడం, ఉద్యోగుల ఉత్పాదకత తగ్గిపోవడం దాకా వివిధ రూపాల్లో ఉండే నష్టాలను ఈ నివేదికలో పరిగణనలోకి తీసుకున్నారు. 'భారత్‌లో సైబర్ నేరాల తీరుతెన్నుల్లో పెను మార్పులు వస్తున్నాయి. నేరగాళ్లు కూడబలుక్కుని ఒక పద్ధతిలో చేసే ధోరణులు పెరుగుతున్నాయి. దీంతో డేటా చౌర్యం కారణంగా వాటిల్లే నష్టాలు మరింతగా పెరుగుతున్నాయి' అని ఐబీఎం ఇండియా/దక్షిణాసియా సెక్యూరిటీ సాఫ్ట్‌వేర్ లీడర్ వైద్యనాథన్ అయ్యర్ పేర్కొన్నారు.

**మూడింటిపై దృష్టి పెట్టాలి..**

డేటా చౌర్య ముప్పు నేపథ్యంలో వ్యాపార సంస్థలు సైబర్ సెక్యూరిటీపరంగా ప్రధానంగా మూడు అంశాలపై దృష్టి పెట్టాల్సి ఉంటుందని అయ్యర్ చెప్పారు. వ్యాపార లక్ష్యాలకు పొంచి ఉండే రిస్కులను మదింపు చేసుకోవడం, ముప్పులను సమర్ధంగా ఎదుర్కొనే వ్యవస్థను రూపొందించుకోవడం, డిజిటల్ విశ్వాసాన్ని పెంపొందించే చర్యలు తీసుకోవడంపై మరింత శ్రద్ధ పెట్టాల్సి ఉంటుందని వివరించారు. డేటా ఉల్లంఘనలకు ఎక్కువగా క్రిమినల్ దాడులు (51 శాతం), సిస్టమ్‌లో లోపాలు (27 శాతం), మానవ తప్పిదాలు (22 శాతం) కారణంగా ఉంటున్నాయని నివేదికలో వెల్లడైంది. డేటా ఉల్లంఘనలను గుర్తించేందుకు పట్టే సమయం సగటున 188 రోజుల నుంచి 221 రోజులకు పెరిగింది. అయితే ఉల్లంఘనలను నియంత్రించేందుకు పట్టే సమయం 78 రోజుల నుంచి 77 రోజులకు తగ్గింది. డేటా ఉల్లంఘనల కారణంగా అత్యధికంగా నష్టపోయిన సంస్థల్లో వరుసగా తొమ్మిదో ఏడాది కూడా హెల్త్‌కేర్ సంస్థలే నిల్చాయి. డేటా చౌర్య ప్రభావాలు కొన్ని సందర్భాల్లో అనేక సంవత్సరాల పాటు కొనసాగుతున్నాయని నివేదిక పేర్కొంది.

## '59 మినిట్స్'తో రూ. 5 కోట్లు!




'పీఎస్‌బీ లోన్స్ ఇన్ 59 మినిట్స్' వేదిక ద్వారా చిన్న మధ్య తరహా పరిశ్రమలకు(ఎంఎస్ఎంఈ) రూ.5 కోట్ల వరకూ రుణాలను ఆఫర్ చేయాలని ఐదు ప్రభుత్వ రంగ బ్యాంకులు నిర్ణయించాయి. వీటిలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఓరియెంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్, కార్పొరేషన్ బ్యాంక్, ఆంధ్రాబ్యాంక్‌లు ఉన్నాయి. 2018 నవంబర్‌లో ఈ పథకానికి సంబంధించిన పోర్టల్‌ను ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించారు. రూ.కోటి వరకూ ఆఫర్‌తో ఈ పథకం ప్రారంభమైంది.



ట్రక్కు బొమ్మతో ఆటలాడుకుంటున్న మగ బబూన్ కోతి పిల్ల

# అదంతే.. అనాదిగా ఇంతే!

బొమ్మలతో ఆడుకోవడమంటే చిన్న పిల్లలకు సరదా.. వాటిని చూడగానే ఎంత మారాం చేసే వారైనా నిమిషంలో అట్టే సైలెంట్ అయిపోతారు. సంవత్సరం లోపు వయసున్న పిల్లలకు దాదాపు గిలక్కాయ వంటి చప్పుడు చేసే వస్తువులు ఇస్తుంటాం. ఆ వస్తువుల్లో పెద్ద తేడా ఉండదు. కానీ వాళ్లు పెరుగుతున్న కొద్దీ వారు ఆడుకునే బొమ్మల్లో తేడా వస్తుంటుంది. ఆడ పిల్లలైతే బార్బీ బొమ్మలు, టెడ్డీ బేర్, కిచెన్ సెట్లు, పెళ్లి కూతురు బొమ్మలను 'ఇస్తుంటాం'. అదే మగ పిల్లలయితే కార్లు, బైకులు, ట్రక్కులను 'ఇస్తుంటాం'.. అంతేనా..? మనమే ఇస్తుంటామా.. లేదా వారే అలా కోరుకుంటారా..? ఇలా బొమ్మలను ఎంచుకోవడం, ఆడ, మగ పిల్లలు వేర్వేరుగా పెరగడంలో సమాజం పాత్ర ఏమైనా ఉందా.. లేదా సహజంగానే ఆ ఎంపిక జరుగుతోందా..? ఇదే విషయాన్ని తెలుసుకునేందుకు కొన్ని జంతువులపై బీబీసీ ప్రయోగం జరిపింది. ఎంపికలో తేడా అనేది అనాదిగానే ఉందని, మనుషుల్లోనే కాదు జంతువుల్లో కూడా ఇలాంటి ప్రవర్తనే ఉంటుందని ఈ పరిశోధనల్లో తేలింది.

**జెండర్ న్యూట్రల్ బొమ్మలు**

లింగ వివక్ష చూపుతూ బొమ్మలు తయారు చేస్తున్నారంటూ ప్రపంచవ్యాప్తంగా అభ్యంతరాలు వస్తున్నాయి. 'కిండర్ జాయ్'కూడా మగ పిల్లలకు, ఆడ పిల్లలకు వేర్వేరు బొమ్మలు తయారు చేస్తుండటంపై ఈ మధ్య వివాదం చెలరేగిన విషయం తెలిసిందే. లింగ వివక్ష చూపే బొమ్మలు ఉండొద్దని.. అందరు పిల్లలకూ ఒకే రకమైన బొమ్మలు తయారు చేయాలని (జెండర్ న్యూట్రల్ టాయ్స్) ప్రపంచవ్యాప్తంగా డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి.



టెడ్డీ బేర్ బొమ్మతో ఆడుకుంటున్న ఆడ కోతి పిల్ల

### కోతులేం చెబుతున్నాయి..?

జంతువులు ఎక్కువగా ఉండే ప్రదేశాల్లో బార్బీ బొమ్మలు, టెడ్డీ బేర్స్, కార్లు, బైకులు, ట్రక్కులు ఇలా చాలా బొమ్మలను పరిశోధకులు ఉంచారు. ముఖ్యంగా బబూన్ కోతి పిల్లలను పరిశీలించినప్పుడు ఆడ కోతి పిల్లలేమో టెడ్డీ బేర్ వంటి బొమ్మలతో ఆడుకున్నట్లు, మగ కోతి పిల్లలేమో కార్లు, ట్రక్కులతో ఆడుకున్నట్లు గమనించారు. మిగతా జంతువుల్లో కూడా దాదాపు ఇలాంటి ప్రవర్తనే గుర్తించారు. 'జంతువులు ఇలా చేస్తున్నాయంటే వాటికి ఎవరైనా నేర్పుతున్నారా..? కాదు కదా సహజంగానే అవి ఎంచుకుంటున్నాయి. ఇలాంటి ప్రవర్తనే మానవుల్లో కూడా అనాదిగా ఉంది. ఎవరూ నేర్పించట్లేదు. ఇది సహజమైన ప్రక్రియే'అని జీవ పరిణామ శాస్త్రవేత్త ప్రొఫెసర్ బెన్ గారడ్ పేర్కొన్నారు.

# 'సహాయ నిరాకరణ చేస్తాం'

**సాక్షి, హైదరాబాద్:** గ్రామపంచాయతీ కార్మికుల వేతనంరూ.8,500కు పెంచుతామని ఇచ్చిన వాగ్దానంపై ప్రభుత్వం వెంటనే జీవో జారీచేయాలని, ఇతర డిమాండ్లను పరిష్కరించాలని రాష్ట్ర గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టకపోతే తమ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించింది. తమ సమస్యల పరిష్కారం విషయంలో స్పష్టత ఇచ్చే వరకు రాష్ట్రవ్యాప్తంగా సహాయ నిరాకరణ ఉద్యమం చేపట్టాలని ఈ సంఘ రాష్ట్ర కమిటీ పంచాయతీ ఉద్యోగ కార్మికులకు పిలుపునిచ్చింది. భవిష్యత్ కార్యాచరణ కోసం ఈ నెల 26న విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రకటించింది. గత రెండు రోజులుగా పోలీసు నిర్బంధాన్ని ప్రయోగించినా మంగళవారం చేపట్టిన ప్రగతి భవన్ ముట్టడి విజయవంతమైందని సంఘ గౌరవాధ్యక్షుడు పాలడుగు భాస్కర్ తెలిపారు. ప్రగతిభవన్ ముట్టడి కార్యక్రమంలో పాల్గొన్న పాలడుగు భాస్కర్, చాగంటి వెంకటయ్య, గడ్డం ఈశ్వర్, రమేశ్, శ్రీకాంత్, పి.సుధాకర్ తదితరులను అరెస్ట్ చేశారు.

# రికార్డులను ట్యాంపరింగ్ చేశారు..

- ఈఎస్ఐ కుంభకోణంలో కొత్త కోణం
- ఆధారాలను తారుమారు చేసేందుకు యత్నించారు
- శశాంక్ గోయల్, దేవికా రాణిలపై సంచలన ఆరోపణలు
- మీడియాకు లేఖలు రాసిన ఓ యూనియన్ నేత

**సాక్షి, హైదరాబాద్:** మందుల కొనుగోలులో భారీ అవకతవకలు జరగడం ద్వారా వెలుగులోకి వచ్చిన ఈఎస్ఐ కుంభకోణంలో మరో కొత్త కోణం తెరపైకి వచ్చింది. రూ.300 కోట్ల విలువైన ఈ స్కామ్‌లో ముఖ్య పాత్రధారులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ఐఏఎస్ అధికారి శశాంక్ గోయల్, ఈఎస్ఐ డైరెక్టర్ దేవికా రాణిలపై సంచలన ఆరోపణలు చేస్తూ బి.గురవయ్య అనే యూనియన్ నేత పేరిట మంగళవారం పత్రికా కార్యాలయాలకు లేఖలు వచ్చాయి. ఈ లేఖలో పేర్కొన్న మేరకు శశాంక్ గోయల్, దేవికారాణి, నాగలక్ష్మిలు కలసి శనివారం సాయంత్రం 6 నుంచి 9 గంటల వరకు సనత్‌నగర్‌లోని సెంట్రల్ డ్రగ్స్ స్టోర్స్‌లో సీడీఎస్ సెక్షన్‌కు వెళ్లి రికార్డుల ట్యాంపరింగ్‌కు పాల్పడ్డారని, వారు ఆధారాలు తారుమారు చేసేందుకు అక్కడకు వెళ్లడం నిజమో కాదో అక్కడి సీసీ కెమెరాల ఫుటేజీ పరిశీలిస్తే తేలుతుందని వెల్లడించారు. నాన్‌ఆర్‌సీ కంపెనీలను బినామీలుగా ఏర్పాటు చేసి దాదాపు 40కి పైగా కంపెనీలకు చెల్లింపులు చేసుకున్నారని తెలిపారు. విజిలెన్స్ నివేదికలో ఉన్న కంపెనీల పేర్లను పరిశీలించి నాన్ ఆర్‌సీ కంపెనీల లిస్టులో ఉన్న ఎన్ని కంపెనీలకు రెండేళ్లుగా డబ్బులు పంపారో పరిశీలిస్తే అసలు విషయాలు వెలుగులోకి వస్తాయని పేర్కొన్నారు. నాన్ ఆర్‌సీ కంపెనీలను బినామీలుగా సృష్టించినట్లు విజిలెన్స్ నివేదిక చెబుతుంటే ఆర్‌సీ కంపెనీల వైపు ఏసీబీ అధికారుల దృష్టి మరల్చేలా తప్పుడు లేఖలు రాసి తప్పుదారి పట్టిస్తున్నారని పేర్కొన్నారు.

**కోట్లలో ముడుపులు..**

ప్రధాన సూత్రధారులకు బినామీగా వ్యవహరించిన సుధాకర్‌రెడ్డి పేరిట చాలా ఫర్మ్‌లున్నాయని, గత రెండేళ్లలో సుధాకర్‌రెడ్డి మొబైల్ ఫోన్ నుంచి శశాంక్ గోయల్, దేవికారాణిలకు వచ్చిన ఫోన్ కాల్స్‌ను పరిశీలిస్తే వీరి అక్రమాలు బయటపడతాయని ఆ లేఖలో గురవయ్య వెల్లడించారు. సచివాలయం వేదికగానే సుధాకర్‌రెడ్డి, కమల్ అనే వ్యక్తుల నుంచి శశాంక్ గోయల్ రూ.కోట్లలో ముడుపులు తీసుకున్నారని తెలిపారు. ఇప్పటికే రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఈ కుంభకోణంలో కార్మిక శాఖ కార్మికుల యూనియన్ కార్యదర్శి పేరుతో లేఖలో పేర్కొన్న అంశాలు మరింత చర్చనీయాంశం అవుతున్నాయి.

# పరిష్కరించుకుందాం!

- దక్షిణ మధ్య రైల్వే–రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం
- దీర్ఘకాలంగా పెండింగులో ఉన్న ప్రాజెక్టుల ప్రతిష్టంభనకు తెర
- 25న సీఎస్‌తో రైల్వే జీఎం గజానన్ మాల్యా భేటీ
- హాజరుకానున్న రెండు పక్షాల ఉన్నతాధికారులు

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి సంయుక్తంగా చేపట్టే రైల్వే ప్రాజెక్టుల్లో నెలకొన్న ప్రతిష్టంభన తొలగించుకునేందుకు దక్షిణ మధ్య రైల్వే– రాష్ట్ర ప్రభుత్వం ఓ అడుగు ముందుకేశాయి. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యల వల్ల ప్రాజెక్టులు పడకేస్తున్నాయి. దీంతో చర్చల ద్వారా వాటిని పరిష్కరించుకొని పనుల్లో వేగం పెంచాలని నిర్ణయించాయి. దక్షిణ మధ్య రైల్వే జీఎం గజానన్ మాల్యా నుంచి వచ్చిన చర్చల ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి అంగీకరించటంతో ఈనెల 25న చర్చలు జరగబోతున్నాయి. సచివాలయంలోని సీఎస్ కార్యాలయంలో ఈ సమావేశం జరగనుంది. రైల్వే, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు కూడా పాల్గొననున్నారు. నిధులు, భూసేకరణ, రక్షణ శాఖ అభ్యంతరాలతో నిలిచిపోయిన ప్రాజెక్టులపై ఇందులో చర్చించనున్నారు. ఈ సమావేశంలో చర్చకు వచ్చే ప్రాజెక్టుల వివరాలు ఇలా ఉన్నాయి.

- ఎంఎంటీఎస్ రెండో దశకు సంబంధించి మొత్తం రూ.816.55 కోట్ల వ్యయంలో ప్రభుత్వం రూ.544.36 కోట్లు భరించాల్సి ఉంది. ఇందులో రైల్వే వాటా రూ.272.19 కోట్లు. ఇప్పటికి రూ.663 కోట్ల పనులు జరిగితే ప్రభుత్వం రూ.129.02 కోట్లను మాత్రమే విడుదల చేసింది. మిగతా మొత్తం చెల్లించాల్సి ఉంది.
- మౌలాలి–సనత్‌నగర్ మధ్య 4 కి.మీ. పనిని స్థానిక రక్షణ శాఖ అధికారులు ఆపివేయించారు. ఢిల్లీలోని ఉన్నతాధికారులు అనుమతించినా అధికారులు ససేమిరా అంటుండటంతో పని నిలిచిపోయింది. స్థానిక రక్షణ శాఖ అధికారులను ఒప్పించేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలి.
- యాదాద్రి (రాయగిరి) వరకు ఎంఎంటీఎస్ ప్రాజెక్టును పొడిగించే పనులకు గతంలో రైల్వే అధికారులు టెండర్లు పిలిచినా.. ప్రభుత్వం ఇవ్వాల్సిన నిధులు అందకపోవటంతో అవి రద్దయ్యాయి. ఇప్పుడు ప్రభుత్వం తన వంతు వాటా చెల్లిస్తే మళ్లీ టెండర్లు పిలిచి పనులు మొదలుపెట్టాలి.
- కాజీపేటకు మంజూరైన వ్యాగన్ పీరియాడికల్ ఓవర్‌హాలింగ్ వర్క్‌షాప్ ఏర్పాటుకు వీలుగా ప్రభుత్వం సంబంధిత భూమి రైల్వేకు అప్పగించాలి.
- అక్కన్నపేట– మెదక్ కొత్త లైన్ పనులకు సంబంధించి ప్రభుత్వం నుంచి బకాయిపడ్డ రూ.37.13 కోట్లు రైల్వేకు చెల్లించాలి.
- మనోహరాబాద్–కొత్తపల్లి ప్రాజెక్టులో ప్రభుత్వం చెల్లించాల్సిన మొత్తంలో మిగిలిన రూ.71.61 కోట్లు అందించాలి.
- భద్రాచలం–సత్తుపల్లి రైల్వేలైన్ ప్రాజెక్టు అంచనా వ్యయంలో పెరిగిన మొత్తంలో సింగరేణి సంస్థ భరించాల్సిన మొత్తాన్ని రైల్వేకు సమకూర్చాలి.
- మణుగూరు–రామగుండం, గద్వాల–మాచర్ల, బోధన్–బీదర్, ఆదిలాబాద్–ఘడ్చందూర్, సికింద్రాబాద్–జహీరాబాద్, ఆర్మూర్–ఆదిలాబాద్ ప్రాజెక్టులకు సంబంధించి ఒప్పందం చేసుకోవాలి.
- దేవరకద్ర–కౌకుంట్ల, రవీంద్రఖని–మంచిర్యాల, ఘట్‌కేసర్–బీబీనగర్, చర్లపల్లి–ఘట్‌కేసర్, యాకుత్‌పురా–ఉప్పుగూడ, శ్రీరామ్‌నగర్–గద్వాల, సనత్‌నగర్–మౌలాలిల మధ్య ఏడు ఆర్‌ఓబీ, ఆర్‌యూబీలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ అధీనంలోని పనులు పూర్తి చేయాలి.
- జంటనగరాలలోని రైల్వే స్టేషన్లు, రైల్వే కాలనీల అవసరాలకు దక్షిణ మధ్య రైల్వే జలమండలి నుంచి 11 వేల కిలోలీటర్ల నీరు విక్రయిస్తోంది. కిలోలీటరుకు జలమండలి ఇండస్ట్రియల్ కేటగిరీ కింద రూ.120 వసూలు చేస్తోంది. దీన్ని కమర్షియల్ కేటగిరీ కింద రూ.60కి మార్చాలని రైల్వే కోరుతోంది.

# నేడు ఇంటర్ ఫస్టియర్ సప్లిమెంటరీ ఫలితాలు

**సాక్షి, హైదరాబాద్:** ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ప్రథమ సంవత్సర ఫలితాలు బుధవారం విడుదల కానున్నాయి. ఉదయం 11:30 గంటలకు బోర్డు కార్యదర్శి అశోక్ ఫలితాలను విడుదల చేయనున్నారు. ఫలితాలను https://tsbie.cgg.gov.in, www.bie.telangana.gov.in వెబ్‌సైట్లలో చూడొచ్చన్నారు.

# గందరగోళంగా వారసత్వ కట్టడాల చట్టం

- హైకోర్టు వ్యాఖ్య
- ఎర్రమంజిల్ భవనం కూల్చివేతపై పిల్‌లో వాదనలు

**సాక్షి, హైదరాబాద్:** వారసత్వ కట్టడాల పరిరక్షణ చట్టం–2017 లోపభూయిష్టంగా ఉందని, గందరగోళంగా రూపొందించారని హైకోర్టు అభిప్రాయపడింది. ఒక చోట ఒకలా మరోచోట ఇంకోలా చట్టాన్ని ఎలా రూపొందించారో అర్థం కావట్లేదని వ్యాఖ్యానించింది. ఇంత కీలకమైన చట్టాన్ని రూపొందించేటప్పుడు అన్ని కోణాల్లో అధ్యయనం ఎందుకు జరగలేదనే సందేహం వ్యక్తం చేసింది. 1995 హుడా చట్టంలోని నిబంధన 13ను 2015లో తొలగించామని చెబుతున్న ప్రభుత్వం, ఆ నిబంధనలోని నిర్ణయాలకు అనుగుణంగా కొత్త చట్టంలో ఎక్కడ ఉందో వివరించాలని ధర్మాసనం ఆదేశించింది. ఎర్రమంజిల్ భవనం ఉన్న ప్రదేశంలో రాష్ట్ర చట్టసభల సముదాయాన్ని నిర్మించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన వ్యాజ్యాలను హైకోర్టు మంగళవారం కూడా విచారించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, న్యాయమూర్తి జస్టిస్ షమీమ్ అక్తర్‌లతో కూడిన ధర్మాసనం చట్టం గందరగోళంగా ఉండటంపై విస్మయం వ్యక్తం చేసింది. 'హెచ్ఎండీఏ పరిధిలో చట్టం అమల్లో ఉన్నందున తెలంగాణ రాష్ట్రం మొత్తానికి వర్తించేలా 2017 చట్టాన్ని రూపొందిస్తున్నట్లు చెప్పినప్పుడు.. హెచ్ఎండీఏ పరిధిలో పురాతన భవనాల పరిరక్షణ చట్టం అమల్లో ఉన్నట్లే అవుతుంది కదా'అని ధర్మాసనం ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. సెక్షన్ 13 రద్దయినప్పటికీ హెచ్ఎండీఏ జోన్ నిబంధనల్లో ఆ సెక్షన్ వర్తిస్తుందన్న పిటిషనర్ల వాదనపై ప్రభుత్వం వివరణ ఇవ్వాలని కోరింది. 2017 చట్టంలోని సెక్షన్ 6 వర్తించదన్న పిటిషనర్ల వాదనకు బదులివ్వాలని కూడా కోరింది. అదనపు అడ్వకేట్ జనరల్ జె.రామచంద్రరావు వాదిస్తూ.. కొత్త చట్టం వచ్చాక పాత చట్టంలోని నిబంధనలేవీ అమల్లో లేవన్నారు. సాధారణ నిబంధన చట్టంలోని 6వ సెక్షన్ వర్తింపు ఉండదన్నారు. వారసత్వ కట్టడాల పరిరక్షణ కమిటీ కొన్ని కట్టడాల్ని గుర్తించిందన్నారు. 183 జీవో, 13వ నిబంధన ద్వారా ఎలాంటి హక్కులు అమల్లో ఉండవన్నారు. సుప్రీంకోర్టు పలు కేసులను ఉదహరిస్తూ పిల్స్‌ను కొట్టేయాలని కోరారు. దీనిపై బుధవారం కూడా వాదనలు కొనసాగనున్నాయి.











Regd. Office: Hero MotoCorp Ltd., 34, Community Centre, Basant Lok, Vasant Vihar, New Delhi - 110057,India. CIN: L35911DL1984PLC017354. Phone No.: 011 - 46044100. For further information, contact nearest Hero MotoCorp authorised outlet or call our toll free no.: 1800 - 266 - 0018 or visit us on www.heromotocorp.com. Accessories and features shown may not be part of standard fitment. Always wear a helmet while riding a two wheeler. 'Terms & Conditons apply.
HeroMotoCorpIndia @HeroMotoCorp HeroMotoCorpLimited TheHeroMotoCorp heromotocorp.com

AUTHORISED DEALERS: HYDERABAD: Sri Lakshmi Hero, Malakpet: Ph: 7799766408. Saroornagar: Ph: 9246223479. Vanasthalipuram: Ph: 9246223423. Lakshmi Hero, Somajiguda: Ph: 7799766412. Masab Tank: Ph. 9246223413. Venkateshwara Hero, Narayanguda: Ph: 7799766345. Mody Hero, R.P. Road: Ph: 7799766325. Bowenpally: Ph: 27844854. 9885100442. Phoenix Hero, Habsiguda: Ph: 7799766415. Ramanthapur: Ph: 27030336. Nagole: Ph: 24034335. Phoenix Hero - Kushaiguda - 9246824193,Bhongir – 9246394481 Bhanu Hero, Erragadda: Ph: 7799766400. Kukatpally: Ph: 23706999. Phoenix Hero, Hi-tech City: Ph: 7799766355. Hafeezpet: Ph: 7799017976. Dealwel Hero, Nampally: Ph: 7799766416. Asifnagar: Ph: 23536264/65. Krishna Sai Hero, Malkajgiri: Ph: 7799766379. MAREDPALLY - 9849362062Sri Venkanna Hero, Serilingampally: Ph: 9640515185. MEDAK: Sri Venkanna Hero, Patancheru: Ph: 7799766387. Geetha Hero, Suchitra Circle: 9346205550.Delight Hero, Sangareddy: Ph: 7799766365. Sowjanya Hero, Baha-durpura: 9248747804/05 Karimnagar: Bharadwaj Hero, Ph: 7799766341. Devesh Hero, Ph: 7799766346. Ramagundam: Siddhi Sree Vinayaka Hero - Ph: 9817009247. Warangal: Sri Sri Sri Hero, Ph: 7799766330. Sree Vaishnavi Hero, Ph: 7799766351. Nizamabad: Venkateshwara Hero, Ph: 7799766420. Sri Sai Durga Hero, Ph: 7799766405. Adilabad: Chandra Hero, Ph: 7799766397. Mancherial: Balaji Hero, Ph: 7799766326. Delight Hero, Sangareddy: Ph: 7799766365. Khammam: Sri Sri Sri Hero, Ph: 7799766384. Kothagudem: Rajyalakshmi Hero, Ph: 7799766390. Bhadrachalam: Sri Ram Hero, Ph: 7799766409. Nalgonda: Venkataramana Hero, Ph: 7799766404. Miryalguda: Sree Krishna Hero, Ph: 7799766371. Suryapet: Sri Venkata Lakshmi Hero - Ph: 7799766429. DEALERS: Mahabubnagar: Ashvini Hero, Ph: 7799766361, Ashvini Hero (Ext) , Ph: 99491 11933 Gadwal: Meghanath Hero, Ph: 7799766392.

JWT.5421.2019TEL


Published and Printed by K. Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., Editor: V. Murali, Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792